అప్పు తీర్చేందుకు తాళిబొట్టు కూడా అమ్ముకున్నా!

కుమారుడు చూస్తుండగానే కట్టేసి కొట్టారు

- దివ్యాంగురాలైన కుమార్తె పింఛన్ సైతం వాళ్లే లాక్కుంటున్నారు
- బట్టలు చించేందుకు ప్రయత్నించారు
- కుప్పం ఘటనలో బాధితురాలు శిరీష



కుప్పం రూరల్: 'అప్పు తీర్చేందుకు తాళిబొట్టు కూడా అమ్ముకున్నాను. చివరకు నా కుమార్తెకు వచ్చే రూ.6 వేల పింఛన్ సైతం వాళ్లే లాక్కుంటున్నారు. అయినా వాళ్ల ధనదాహం తీరలేదు. చివరకు నన్ను నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లి చెట్టుకు కట్టేసి బాకీ తీర్చాలంటూ దాడి చేశారు' అని చిత్తూరు జిల్లా కుప్పం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బాధితురాలు శిరీష కన్నీటి పర్యంతమయ్యారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మునికన్నప్ప, అతడి కుటుంబ సభ్యులు శిరీష అనే మహిళను భర్త చేసిన అప్పులు తీర్చాలంటూ చెట్టుకు కట్టేసి దాడికి పాల్పడిన ఘటన విదితమే. తీవ్రంగా గాయపడిన శిరీష ప్రస్తుతం కుప్పం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 'నా భర్త పేరు తిమ్మరాయప్ప. మాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మేం బాగా బతికినోళ్లమే. మాకు జేసీబీ కూడా ఉండేది. తమ్ముడు చేసిన అప్పులు తీర్చేందుకు నా భర్త రూ.16 లక్షలు అప్పులు చేశాడు. జేసీబీని అమ్మేసి కొంతవరకు అప్పులు తీర్చాం. మిగిలిన అప్పులు తీర్చేందుకు నారాయణపురానికి చెందిన మునికన్నప్ప కుటుంబం వద్ద రెండేళ్ల క్రితం రూ.80 వేలు అప్పులు తీసుకున్నాం. వారికి ప్రతినెలా నూటికి రూ.5 నుంచి రూ.30 వరకు వడ్డీలు చెల్లించాం. వడ్డీలు అయితే కట్టాం కానీ అసలు మాత్రం అలాగే మిగిలిపోయింది. అసలు మొత్తం చెల్లించాలని 6 నెలల క్రితం నా భర్త తిమ్మరాయప్పను చెట్టుకు కట్టేసి గ్రామస్తుల మధ్య తీవ్రంగా అవమానించారు. దీన్ని తట్టుకోలేక నా భర్త గ్రామం నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి వికలాంగురాలైన నా పెద్ద కుమార్తె, కుమారుడు, మరో కుమార్తెను మా అమ్మ వద్ద వదిలి నేను బెంగళూరు వెళ్లాను. అక్కడ కూలీ పనులు చేసి కొద్దికొద్దిగా అప్పు తీరుస్తున్నాను. వారి ఒత్తిడి ఎక్కువ కావడంతో నా తాళిబొట్టును కూడా అమ్మి అప్పు కట్టాను. అయినా వారి ధనదాహం తీరలేదు. మా పెద్ద కుమార్తెకు నెలనెలా వచ్చే వికలాంగ పెన్షన్ రూ.6 వేలను కూడా మూడు నెలల నుంచి మునికన్నప్ప కుటుంబమే తీసుకుంటోంది. దీంతో నా పిల్లలు తినేందుకు తిండి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పిల్లల్ని కూడా నా వెంట తీసుకెళ్లేందుకు బెంగళూరు నుంచి తిరిగొచ్చాను. స్కూలు నుంచి టీసీలు తీసుకుని పిల్లల్ని వెంటబెట్టుకుని వస్తుంటే మునికన్నప్ప కుటుంబ సభ్యులు నన్ను చెట్టుకు కట్టేసి కొట్టారు. బట్టలు చించేందుకు ప్రయత్నించారు. నా కొడుకు పక్కనే ఏడుస్తున్నా వాళ్లు కనికరించలేదు. పోలీసులు రాకపోతే నా గతి ఏమయ్యేదో' అంటూ తీవ్రంగా విలపించింది.

నలుగురికి రిమాండ్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు శిరీషను హోంమంత్రి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలును ఆదేశించారు. కాగా.. శిరీషపై దాడిచేసిన మునికన్నప్ప, అతడి కుటుంబ సభ్యులు రాజా, వెంకటమ్మ, జగదీశ్వరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మీ పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మ గౌరవం ఇదేనా?

సీఎం చంద్రబాబుపై మండిపడిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నారాయణపురం గ్రామంలో భర్త అప్పు చెల్లించలేదనే కారణంతో ఒక మహిళను టీడీపీ కార్యకర్త చెట్టుకు కట్టేసి హింసించిన ఘటనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో మహిళలకు లభిస్తున్న ఆత్మగౌరవం ఇదేనా.. అని ప్రశ్నించారు. చంద్రబాబు, ఆయన పార్టీ నాయకుల దుర్మార్గాలకు మహిళలు, యువతులు, బాలికలు బలైపోతున్నారని మండిపడ్డారు. మహిళను టీడీపీ కార్యకర్త చెట్టుకు కట్టేసి, హింసించిన ఫొటోను ట్యాగ్ చేస్తూ మంగళవారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే.. 'చంద్రబాబూ.. రాష్ట్రంలో మహిళలకు మీరు కల్పిస్తున్న రక్షణ ఇదేనా? మీ పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మ గౌరవం ఇదేనా? సాక్షాత్తు మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని నారాయణపురం గ్రామంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి, హింసించిన ఘటన.. మీ దుర్మార్గపు పరిపాలన ఫలితమే. తిమ్మరాయప్ప అనే కూలీ అప్పు చెల్లించలేదనే కారణంతో అతని భార్య శిరీషను మీ పార్టీ కార్యకర్త చెట్టుకు కట్టేసి, హింసించాడు. ఆమె బిడ్డలు రోదిస్తున్నా సరే కనికరం చూపి విడిచి పెట్టలేదు. మీ హయాంలో జరిగిన అనేక క్రూరమైన ఘటనల్లో ఇదొకటి. పొలిటికల్ గవర్నెన్స్, రెడ్‌బుక్ పేరిట మీరు నెలకొల్పిన దుష్ట సంప్రదాయంలో భాగంగా మీరు, మీ పార్టీ నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా చెలరేగిపోయి చేస్తున్న దుర్మార్గాలకు మహిళలు, యువతులు, బాలికలు ఇలా ఎందరో బలైపోతున్నారు. ఈ ఘటనతోపాటు, ఏడాది కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరిగిన అన్యాయాలు, అఘాయిత్యాలను సీరియస్‌గా తీసుకోవాలని, చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాను' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి చాంపియన్ ఆఫ్ ది తెలంగాణ ఫార్మర్స్

9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు: కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసే సాహసోపేతమైన నిర్ణయంతో సీఎం రేవంత్‌రెడ్డి చాంపియన్ ఆఫ్ తెలంగాణ ఫార్మర్స్ అయ్యారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి (టీఆర్ఆర్)తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు భరోసాపైన సీఎం గొప్ప నిర్ణయం తీసుకున్నారని, రైతుల తరపున సీఎంకు ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. రైతు భరోసాతో ప్రతిపక్ష నాయకులకు నిద్ర లేకుండా పోయిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ వడ్డీకే సరిపోయేదని వారు విమర్శించారు. టీఆర్ఆర్ మాట్లాడుతూ, రైతుల కోసం లక్ష కోట్లకుపైగా ఖర్చు చేశామన్నారు. నియోజకవర్గాని కి 3,500 ఇళ్లు మంజూరు చేశామని, మరో విడత ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేస్తామన్నారు. కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు నమ్మడం లేదని చెప్పారు.

రాష్ట్రంలో నాలుగు అత్యాధునిక గోశాలలు

- వేములవాడలో 100 ఎకరాల్లో గోశాల నిర్మాణం
- గోసంరక్షణపై అధ్యయనానికి త్రిసభ్య కమిటీ
- ఐఏఎస్‌లు సవ్యసాచిఘోష్, శైలజా రామయ్యర్, రఘునందన్‌రావుతో ఏర్పాటు
- గోసంరక్షణపై సమీక్షలో సీఎం రేవంత్ నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గోసంరక్షణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని, ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేసేందుకు త్రిసభ్య కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు సవ్యసాచి ఘోష్, శైలజా రామయ్యర్, రఘునందన్‌రావుతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల్లో గోసంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను మరింత లోతుగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించారు. రేవంత్‌రెడ్డి మంగళవారం తన నివాసంలో గోసంరక్షణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యంతో పాటు భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని గోసంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. భక్తులు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నా స్థలాభావం, ఇతర సమస్యలతో ఇబ్బందులు వస్తున్నాయని, కొన్నిసార్లు గోవులు మృత్యువాత పడుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు గోవుల సంరక్షణే ప్రధాన ఎజెండాగా రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సూచించారు. ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలోని విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని చెప్పారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని, గో సంరక్షణ విషయంలో ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సీఎంకు అందజేశారు. ఈ సమీక్షలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సీఎం ముఖ్యకార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులు సవ్యసాచి ఘోష్, రఘునందన్‌రావు, శైలజా రామయ్యర్ తదితరులు

ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వాల్సిన అవసరం లేదు

ప్రభుత్వ లావాదేవీలకు సంబంధించి ఎలాంటి కోర్టు తీర్పులు లేవు

- గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కేటీఆర్‌కు వివరించిన న్యాయవాదులు
- ఫార్ములా–ఈ కేసు విచారణ తీరుపై న్యాయవాదులతో చర్చించిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కేసు విచారణ సందర్భంగా మొబైల్ ఫోన్లతోపాటు ల్యాప్‌టాప్ ఇవ్వాలని ఏసీబీ కోరడంపై తన న్యాయవాదులతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భావిస్తున్నారు. మంగళవారం తన న్యాయవాదులతో విచారణ తీరు తెన్నులపై చర్చించారు. 'ఏసీబీ విచారణ ప్రభుత్వ నిర్ణయంతో నిర్వహించిన క్రీడా కార్యక్రమానికి సంబంధించినది. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత రేసు నిర్వహణ పూర్తిగా అధికార యంత్రాంగం ద్వారా సాగింది. ఇందులో కేటీఆర్ వ్యక్తిగతంగా పరిమిత పాత్ర మాత్రమే వహించారు. ఫార్ములా–ఈ కేసు ప్రభుత్వ లావాదేవీకి సంబంధించినదే తప్ప, వ్యక్తిగత సంభాషణకు సంబంధించి కాదు' అని కేటీఆర్ న్యాయవాదులు స్పష్టం చేశారు. 'ఈ అంశానికి సంబంధించి ఆయా సంస్థలతో జరిగిన ఒప్పందాలన్నీ ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయి. అప్పట్లో మంత్రిగా ఉన్న కేటీఆర్‌ను వ్యక్తిగత సమాచారం అడిగే హక్కు ఏసీబీకి లేదు. సమాచారం అంతా ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నా కేవలం రాజకీయ వేధింపుల కోణంలో కేటీఆర్ మొబైల్ ఫోన్‌ను అడగడం వెనుక న్యాయ సమ్మతమైన కారణాలు లేవు' అని న్యాయవాదులు కేటీఆర్‌కు చెప్పినట్లు సమాచారం. 'విచారణ సంస్థలు ఒక పౌరుడి నుంచి సేకరించిన సమాచారాన్ని తిరిగి అదే పౌరునిపై వాడే కుట్ర చేయడం అన్యాయమని గతంలో కోర్టులు పలు తీర్పులు ఇచ్చాయి. వ్యక్తిగతంగా వాడే ఫోన్లను కోర్టు తీర్పు లేకుండా ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ఐటీ చట్టం ప్రకారం ఏసీబీ తీరు వ్యక్తిగత హక్కులకు విఘాతం కలిగిస్తుంది. ఈ చట్ట ప్రకారం కేవలం కోర్టు తీర్పుతోనే విచారణ సంస్థలు మొబైల్, ల్యాప్‌టాప్ లాంటి వ్యక్తిగత ఉపకరణాలు అడగవచ్చు. ఎలాంటి ప్రజాప్రయోజనం లేని సందర్భంలో విచారణ సంస్థలు ఇలాంటి ఆదేశాలు ఇవ్వలేవన్నారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ వేధింపుల కోణంలో జరుగుతోంది' అని కేటీఆర్‌కు న్యాయవాదులు వివరించారు.

క్లుప్తంగా...

నేడు 'మంత్రితో ముఖాముఖి'కి మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో నిర్వహిస్తోన్న 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమానికి నేడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారు. ప్రతి బుధవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆయన గాంధీభవన్‌లో అందుబాటులో ఉంటారని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి.

ఏడుగురు కానిస్టేబుళ్లపై బదిలీ వేటు

'ఒక్కో లారీకి రూ.3 వేలు' కథనానికి స్పందించిన ఎస్పీ

సాక్షి ఎఫెక్ట్

కోదాడ: ఆంధ్రప్రదేశ్ నుంచి కోదాడ మీదుగా హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక్కో లారీకి రూ.3 వేలు వసూలు చేస్తున్నారనే అంశంపై 'సాక్షి' మెయిన్‌లో ఈనెల 14న ప్రచురితమైన కథనానికి పోలీసు అధికారులు స్పందించి ఏడుగురు కానిస్టేబుళ్లపై బదిలీ వేటు వేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల నుంచి ఇసుకను రాత్రి సమయాల్లో అక్రమంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం దొండపాడు మీదుగా కోదాడ బైపాస్ చేరుకొని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మూడు లారీలను ఇటీవల పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఈ అక్రమ రవాణాలో పోలీసుల పాత్ర కూడా ఉందని వార్తలు రావడంతో పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో.. కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆరుగురు కానిస్టేబుళ్లు, చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక కానిస్టేబుల్ పాత్ర ఉందని తేలడంతో జిల్లా ఎస్పీ నర్సింహ వారిని బదిలీ చేశారు.

13 మంది వీడీసీ సభ్యులకు ఐదేళ్ల జైలు

ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు తీర్పు

నిజామాబాద్ లీగల్: నాయక్‌పోడ్ కులస్తులపై సామాజిక బహిష్కరణ విధించిన 13 మంది వీడీసీ సభ్యులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టు జడ్జి టి.శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామంలో శివాలయానికి వెళ్లే దారి కబ్జాకు గురికావడంతో తమకు దారి చూపాలని కోరిన నాయక్‌పోడ్ కులస్తులకు 2021 నవంబర్‌లో సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలోని గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) సామాజిక బహిష్కరణ విధించింది. దీంతో నాయక్‌పోడ్ కులస్తులు జక్రాన్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. విచారణ నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు 13 మంది వీడీసీ సభ్యులకు జైలు శిక్ష విధించింది. మరో ఇద్దరికి రూ.200 జరిమానా విధించింది.

కాళేశ్వరంపై బీఆర్ఎస్ పోరుబాట

- 21న బరాజ్‌లు, రిజర్వాయర్ల వద్ద నిరసన
- హరీశ్‌రావు నేతృత్వంలో ఆందోళన
- గోదావరి–బనకచర్ల లింక్‌పైనా ఆందోళనకు యోచన
- వచ్చే నెలలో రాష్ట్ర బంద్, సడక్ బంద్‌కు సన్నాహాలు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌ను మరమ్మతు చేసి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్.. ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని ఎండగట్టాలని నిర్ణయించింది. కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవ స్థితిగతులను ప్రజలకు వివరించేందుకు ఈ నెల 21న పోరుబాట చేపట్టనుంది. మేడిగడ్డలోని రెండు పిల్లర్ల కుంగుబాటును చూపుతూ మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగమైందంటూ వస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు సన్నద్ధమవుతోంది. పోరుబాట కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు స్థానిక రైతులతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న బరాజ్‌లు, పంపింగ్ స్టేషన్లు, రిజర్వాయర్లను సందర్శిస్తారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లండన్ పర్యటన నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించే అవకాశాలు ఉన్నాయి. గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టును అడ్డుకోవడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఆ పార్టీల వైఖరిని ఎండగట్టేందుకు మరో నిరసన కార్యక్రమాన్ని కూడా చేపట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది. వచ్చే నెలలో బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాష్ట్ర బంద్ లేదా సడక్ బంద్ చేపట్టాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. దీనిపై ఈ నెలాఖరులోగా కార్యాచరణ ప్రకటించే అవకాశమున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

నేడు లండన్‌కు కేటీఆర్

ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే రెండు రోజుల సదస్సులో కేటీఆర్ పాల్గొంటారు. ఈ సదస్సులో 'ఫ్రాంటియర్ టెక్నాలజీస్ ఫర్ డెవలప్‌మెంట్ ఇన్ ఇండియా' అనే అంశంపై కేటీఆర్ కీలకోపన్యాసం చేస్తారు. దేశ ప్రగతి, తెలంగాణలో అమలు చేసిన వినూత్న విధానాలు, టెక్నాలజీ తదితరాలపై చర్చిస్తారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు బుధవారం రాత్రి కేటీఆర్ లండన్‌కు బయలుదేరనున్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌కు తిరిగి వస్తారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. కాగా వైద్య పరీక్షల కోసం నందినగర్ నివాసానికి వచ్చిన పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ మరో రెండు రోజులపాటు ఇక్కడే బస చేయనున్నారు. ఇక్కడే పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అయ్యి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రాజకీయ పరిణామాలపై చర్చిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల అమెరికాలోని డాలస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణలో క్రియాశీలంగా పనిచేసిన బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం సమన్వయకర్త మహేశ్ బిగాలా మంగళవారం కేసీఆర్‌ను కలిశారు. డాలస్ సభను విజయవంతంగా నిర్వహించిన పార్టీ ఎన్ఆర్ఐ విభాగం నేతలను కేసీఆర్ అభినందించారు.

రైతుల కష్టాలకు విముక్తి కల్పించండి

కొత్త కలెక్టర్లకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో రైతులు అనుభవించిన కష్టాలు, బాధలకు విముక్తి కలిగేలా భూభారతి చట్టాన్ని అమలు చేసి భూసమస్యలకు పరిష్కారం చూపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను కోరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాలకు కలెక్టర్లుగా నియమితులైనవారు, ఇతర ఐఏఎస్ అధికారులు మంగళవారం మంత్రిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, కలెక్టర్లు ప్రావీణ్య (సంగారెడ్డి), హైమావతి (సిద్దిపేట), హరిచందన (హైదరాబాద్), వినయ్‌కృష్ణారెడ్డి (నిజామాబాద్)లు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమన్న విషయాన్ని గుర్తించాలని, రానున్న రెండు నెలల కాలం రెవెన్యూ శాఖకు అత్యంత కీలకమైనదని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజల అవసరాలను తీరుస్తూనే భూసంబంధిత సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15లోపు భూభారతి చట్టం ద్వారా న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని చెప్పారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని మంత్రి పొంగులేటి దిశానిర్దేశం చేశారు.

ప్రమాదకర స్థితిలో కాళేశ్వరం ప్రాజెక్టు

- డిజైన్‌కు, నిర్మాణానికి పొంతన లేదని ఎన్డీఎస్ఏ తేల్చింది
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు

భూపాలపల్లి: 'కాళేశ్వరం ప్రాజెక్టు అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉందని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది. ప్రాజెక్టు డిజైన్‌కు, నిర్మాణానికి పొంతన లేదని వెల్లడించింది. కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్ల ప్రజా సొమ్ము దోపిడీ చేసి, బీఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంగళవారం ఆయన భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటించి విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రారంభించారు. కొన్నింటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సింగరేణి భూపాలపల్లి ఓపెన్‌కాస్ట్ 2ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రజాసభలో భట్టి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోతున్న విషయాన్ని బయటపెట్టింది జర్నలిస్టులేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఒక్క అంగుళం కూడా కదలలేదని తెలిపారు. ఇంజనీర్లను తమ పని చేయనీయకుండా బీఆర్ఎస్ నేతలు డిజైన్ చేయడం మూలంగానే ఇబ్బందులు తలెత్తాయని ఆరోపించారు. ఒక్క నిమిషం కూడా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు రంగంలో వచ్చిన మార్పులను తట్టుకొని సింగరేణి నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ కడియం కావ్య, సింగరేణి సీఎండీ బలరాంనాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి చర్చలతోనే సమస్యలకు పరిష్కారం

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

- 17 నెలల్లో 540 మందిని చంపారు
- మావోయిస్టుల శవాలకు ఖర్మకాండలు చేసే అవకాశం కూడా ఇవ్వలేదు
- ఈ హింసపై సుప్రీంకోర్టు స్పందించాలి.. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- శాంతి చర్చల కమిటీ మహాధర్నాలో వక్తలు



మాట్లాడుతున్న హరగోపాల్. చిత్రంలో జస్టిస్ చంద్రకుమార్, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే కూనంనేని, విమలక్క, మల్లు లక్ష్మి, పశ్య పద్మ, గోవర్ధన్, తమ్మినేని తదితరులు

సాక్షి, హైదరాబాద్/కవాడిగూడ: శాంతి చర్చల ద్వారానే అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని శాంతి చర్చల కమిటీ మహాధర్నాలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ కగార్ పేరిట గత 17 నెలల్లో 540 మందిని భద్రత బలగాలు చంపాయన్నారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేసి, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ఈ హింసపై సుప్రీంకోర్టు స్పందించి సుమోటోగా తీసుకోవాలని, సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక తీర్మానం చేశారు. ఆపరేషన్ కగార్ ఆపివేయాలి..మావోయిస్టులతో శాంతి చర్చలు వెంటనే ప్రారంభించాలన్న నినాదంతో శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్క్‌లోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు పలు హక్కుల సంఘాల నాయకులు, కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు హాజరై మద్దతు ప్రకటించారు.

- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయడంతోపాటు, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతిచర్చలు జరపాలని మహాధర్నాకు అధ్యక్షత వహించిన జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. అన్ని పార్టీలు, సంఘాల నాయకులతో కలిసి ఢిల్లీ స్థాయిలోనూ ధర్నా చేస్తామన్నారు.
- ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కార్పొరేట్‌ల కోసం ఆదివాసీల మీద యుద్ధం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ సంస్థల లాభాల కోసం కగార్‌ను ఆపడం లేదని విమర్శించారు. పదేళ్ల క్రితం బీజేపీ లక్ష్యం కాంగ్రెస్ లేని భారత్ అని, ప్రస్తుతం కమ్యూనిస్టులు, మావోయిస్టులు ప్రజాస్వామ్యం, ప్రతిపక్షాలు లేని భారతదేశమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందని చెప్పారు.
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలు తుంగలో తొక్కుతూ వ్యవహరిస్తోందన్నారు. కేంద్రం కళ్లు తెరిచి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలన్నారు.
- ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ ఎందుకు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తున్నామో ఆ కారణాలు ప్రజలకు వివరించినప్పుడే రాజకీయ పార్టీల ధోరణి మారుతుందన్నారు.
- ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలన్న డిమాండ్‌కు కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు పలుకుతున్నామన్నారు.
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ కేంద్రం, మావోయిస్టుల మధ్య జరుగుతుందని అనుకుంటే పొరపాటే అన్నారు. మోదీ అమిత్‌షాలు అంతం చేయాలని అనుకుంటున్నది కేవలం మావోయిస్టులనే కాదని, ప్రశ్నించే గొంతుకలను అని చెప్పారు.
- సినీనటుడు నారాయణమూర్తి మాట్లాడుతూ హిందుత్వం అని చెప్పుకునే బీజేపీ, ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాలు..నంబాల కేశవరావు సహా ఇతర మావోయిస్టుల మృతదేహాలకు హిందూధర్మం ప్రకారం ఖర్మకాండలు చేసేందుకు సైతం అవకాశం ఇవ్వలేదని, ఇదెక్కడి హిందూ ధర్మం అని ఆవేదన వ్యక్తం చేశారు.
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ శాంతి చర్చలకు వరంగల్ సభలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మద్దతు ప్రకటించారన్నారు.
- నంబాల కేశవరావు మృతదేహం కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడిని కోరినా స్పందించలేదని, మావోయిస్టుల శవాలను ఇచ్చేందుకు కూడా భయపడే పరిస్థితి ఉందని సీపీఐ నేత కె.నారాయణ అన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం శాంతిచర్చలకు మద్దతు పలికారు. మహాధర్నాలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, టీపీసీసీ జనరల్ సెక్రటరీ చెనగాని దయాకర్, విమలక్క, వెన్నెల గద్దర్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో 'హెల్ప్‌లైన్'

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఏర్పాటు

సాక్షి, న్యూఢిల్లీ: ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. ఆ దేశాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు, విద్యార్థులకు సహాయం అందించేందుకు ఈ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు మంగళవారం ఢిల్లీ తెలంగాణ భవన్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రెండు దేశాల భారత రాయబార కార్యాలయాల నుంచి లభించిన తాజా సమాచారం ప్రకారం, ఇప్పటివరకు తెలంగాణకు చెందిన ఎవరూ ప్రభావితమైనట్లు సమాచారం లేదని పేర్కొంది. అయినప్పటికీ, భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైతే తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. సహాయం కోసం వందన, పి.ఎస్, రెసిడెంట్ కమిషనర్ 9871999044, జి.రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ 9643723157, జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్ 9910014749, సీహెచ్.చక్రవర్తి, పౌర సంబంధాల అధికారి 9949351270 నంబర్లను సంప్రదించాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతపై విద్యాశాఖ తనిఖీలకు సిద్ధమైంది. ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో తనిఖీ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక బృందాలను సంసిద్ధం చేస్తోంది. ఇవి ఆకస్మిక తనిఖీలు చేపడతాయి. మధ్యాహ్న భోజన నాణ్యత, అందిస్తున్న తీరు, గతంలో ఎదురైన అనుభవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులు దీనిపై సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో భోజన నాణ్యతకు పాఠశాల ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయాలని ప్రభుత్వం సూచించింది. భోజనం వంట దగ్గర్నుంచి, భోజన శాలల్లో పరిశుభ్రత పాటించడం వరకు హెచ్ఎంలే కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఎక్కడైనా తేడా వస్తే ఈ విద్యా సంవత్సరంలో హెచ్ఎంలకు చర్యలు తప్పవని విద్యాశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆహారం కలుషితమైనా, నాణ్యత తగ్గినట్టు తేలినా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై త్వరలో ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. - సాక్షి, హైదరాబాద్

మధ్యాహ్న భోజనం బాగుందా?

భోజనశాలలు పరిశుభ్రంగానే ఉన్నాయా?



- స్కూళ్లలో భోజన తనిఖీలకు రంగం సిద్ధం
- జిల్లా స్థాయిల్లో కమిటీలు.. రాష్ట్ర స్థాయిలో బృందాలు
- ప్రతిరోజూ ఉన్నతాధికారులకు నివేదిక అందించాలి
- జిల్లా అధికారులకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు

నాణ్యత ఎలా?

గత సంవత్సరం అనేక చోట్ల ఆహారం కలుషితమై, విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలు రాజకీయ దుమారం రేపాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే మధ్యాహ్నం భోజనంలో నాణ్యత, శుభ్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అయితే, అవసరమైన బడ్జెట్ లేకుండా ఆశించిన పురోగతి ఎలా సాధ్యమని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ మెనూ మార్చాలి. ఏ వారం ఏం పెట్టాలనే మెనూను పాఠశాల విద్య ఖరారు చేసింది. అన్నం, పప్పుచారు, బిర్యానీ, అరటి పండ్లు, గుడ్లు ఇలా రోజుకొకటి అందించాలి. 1–5 తరగతుల విద్యార్థులకు గుడ్డుతో కలిపి ఒక్కొక్కరికి రూ.8.69.. 6–8 తరగతుల వారికి రూ.11.79.. 9–10 తరగతుల విద్యార్థులకు రూ.11.79 చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ప్రస్తుతం మధ్యాహ్న భోజనానికి రూ.99,22,56,492.5 బడ్జెట్ ఇస్తున్నారు. ఇంకా రూ. 38,10,38,935 అదనంగా ఇస్తే తప్ప నాణ్యమైన భోజనం అందించడం సాధ్యం కాదని రాష్ట్ర విద్యా కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. దీనిపై ప్రభుత్వం ఇంత వరకూ స్పష్టత ఇవ్వలేదు. ఒకవైపున నిత్యావసరాలు పెరుగుతుంటే సరిపుచ్చడం ఎలా అని హెచ్ఎంలు అంటున్నారు. ఏం జరిగినా తమనే బలి చేయడం సరికాదని విన్నవిస్తున్నారు.

ప్రతి రోజూ నివేదిక

రాష్ట్రవ్యాప్తంగా 26 వేలకుపైగా ప్రభుత్వ స్కూళ్లున్నాయి. వీటిల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉంటుంది. ఏ రోజు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారు? మధ్యాహ్న భోజనంలో ఏయే పదార్థాలు వినియోగించారు? వాటిని ఎక్కడ? ఎప్పుడు కొనుగోలు చేశారు? అనే వివరాలను హెచ్ఎంలు ఆన్లైన్‌లో పొందుపర్చేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. వీటిని మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షిస్తారు. హెచ్ఎంలు పంపే వివరాలను ఎంఈవో పరిశీలించి, జిల్లా విద్యాశాఖాధికారి, అక్కడి నుంచి పాఠశాల విద్య డైరెక్టరేట్‌కు పంపుతారు. ఇందులోనే బియ్యం, నిత్యావసరాల నిల్వలను పేర్కొనాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఎంఈవోలు వారానికి కనీసం మూడు స్కూళ్లను పరిశీలిస్తారు. మధ్యాహ్న భోజనం అందించేటప్పుడు నేరుగా నాణ్యతను పరిశీలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర స్థాయిలోని ప్రత్యేక బృందాలు స్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తాయి. ఎక్కడున్నా లోపాలుంటే తక్షణమే చర్యలు తీసుకునే వీలుందని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా...

పీఈసెట్‌లో 94.96 శాతం అర్హత

సాక్షి, హైదరాబాద్: బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ), డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ) ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పీఈసెట్) ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. బీపీఈడీ పరీక్షకు 1,833 మంది దరఖాస్తు చేశారు. 1,307 మంది పరీక్ష రాశారు. వీరిలో 1,252 మంది అర్హత సాధించారు. డీపీఈడీకి 724 మంది దరఖాస్తు చేస్తే, 460 మంది పరీక్షకు హాజరయ్యారు. 426 మంది అర్హత సాధించారు. రెండు విభాగాలకు కలిపి మొత్తంగా 1,678 (94.96 శాతం) అర్హత సాధించినట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్ తెలిపారు.

కరెంట్ సమస్యలపై తక్షణమే స్పందించాలి

విద్యుత్ అధికారులకు ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి మిత్తల్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ అంతరాయాలపై వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని విద్యుత్ అధికారులను ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఇంధనశాఖ బాధ్యతలు చేపట్టిన మిత్తల్ మంగళవారం విద్యుత్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భాస్కర్‌తో కలిసి స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్, ఇతర విభాగాలను సందర్శించారు. అనంతరం మింట్ కాంపౌండ్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో డిస్కమ్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీతో సమీక్ష జరిపారు. అక్కడ డేటా సెంటర్, ఇతర విభాగాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యుత్ శాఖకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని అధికారులకు మిత్తల్ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే ఫ్యూచర్ సిటీ, పరిశ్రమల విస్తరణ మూలంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని చెప్పారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధి ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా ఉండటంతో ఇక్కడ వార్షిక విద్యుత్ డిమాండ్ మరింత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా పటిష్టమైన సరఫరా, పంపిణీ వ్యవస్థ ఏర్పాటుచేయాలని సూచించారు.

ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద ఈ శిక్షణ ఇస్తారు. మూడున్నర నెలల కాల వ్యవధి గల డీటీపీకి ఇంటర్మీడియట్, అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత ఉండాలని పేర్కొన్నారు. ఆటోమొబైల్ టూ వీలర్ కోర్సుకు పదో తరగతి, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత ఉండాలని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించబడుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు ఉద్యోగం కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 23న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మన మెడికల్ కాలేజీలు మెరుగే



- ఎన్ఎంసీ నిబంధనల మేరకు సౌకర్యాలు
- ఒకటి రెండు మినహా అన్నిచోట్లా సకల వసతులు
- కొత్తగా చేపట్టిన చర్యలపై సవివరమైన నివేదిక
- నేడు ఢిల్లీకి వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి, డీఎంఈ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు క్లినికల్ ట్రైనింగ్ వంటి సౌకర్యాలను మెరుగుపర్చేందుకు చేపట్టిన చర్యలను జాతీయ వైద్యకమిషన్ (ఎన్ఎంసీ)కు తెలియజేయాలని రాష్ట్ర వైద్యాధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలోని 34 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకుగాను 26 కళాశాలలు 'మినిమం స్టాండర్డ్ రిక్వైర్‌మెంట్స్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్ (ఎంఎస్ఎంఈఆర్) – 2023' నిబంధనలకు అనుగుణంగా లేవని ఎన్ఎంసీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై గత శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ, డీఎంఈ నరేంద్రకుమార్‌కు నోటీసులు జారీచేస్తూ బుధవారం ఢిల్లీలో విచారణకు రావాలని సూచించింది. 26 కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్‌లు తమ కళాశాలల నుంచి వర్చువల్‌గా విచారణలో పాల్గొనాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఎందరున్నారు? ఇంకెంత మంది అవసరం? కళాశాలల్లో విద్యార్థుల క్లినికల్ ట్రైనింగ్ ఎలా ఉంది? కొత్తగా కల్పించిన సౌకర్యాలు వంటి అంశాలపై పూర్తిస్థాయి నివేదికను రూపొందించారు. ఎన్ఎంసీ నిబంధనలు పాటించడం లేదని పేర్కొన్న 26 కళాశాలల్లో కొత్తగా ఏర్పాటైన 8 కళాశాలల్లో ములుగు, జనగాం వంటి కొన్ని చోట్ల మినహా మిగతా అన్ని చోట్ల మౌలిక వసతులు కల్పించినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఎన్ఎంసీ అధికారులకు వివరించి, ఏ ఒక్క కళాశాలలో కూడా సీట్ల సంఖ్య తగ్గకుండా, అవసరమైన చోట్ల పెంచుకునేందుకు అవకాశం పొందేలా ఒప్పించాలని నిర్ణయించారు.

నోటీసులు రొటీన్ ప్రక్రియే: ఎన్ఎంసీ నోటీసు నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంఎస్ఎంఈఆర్ మార్గదర్శకాల విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా ఎన్ఎంసీ కొర్రీలు పెడుతుందని అధికారులు సీఎంకు వివరించారు. పశ్చిమబెంగాల్‌లో ఉన్న మొత్తం 27 ప్రభుత్వ కళాశాలలు ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా లేవని పేర్కొన్నారని గుర్తుచేశారు. ఏపీలో మొత్తం 17, కర్ణాటకలో మొత్తం 22 కాలేజీలు, తమిళనాడులో 36కు 34 కాలేజీలు, యూపీలో 45 కాలేజీలకుగాను 24, కేరళలో 11కు 9 కళాశాలల్లో నిబంధనలు అమలు కాలేదని తేల్చి ఢిల్లీకి పిలిచినవిషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఏటా రొటీన్‌గా జరిగే ఈ కార్యక్రమం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో ఒకటిరెండు చోట్ల మినహా అంతటా మెరుగైన సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. 1,323 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను తీసుకోవడంతో పాటు ఇప్పటికే 1,500కు పైగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లలో అర్హులను బట్టి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించి ఎన్ఎంసీ నిబంధనల మేరకు నియామకాలు చేపట్టవచ్చని సీఎంకు వివరించినట్లు తెలిసింది. జిల్లా, ఏరియా ఆస్పత్రులను బోధనా ఆస్పత్రులుగా మార్చిన నేపథ్యంలో వాటిని 300 పడకల ఆసుపత్రులుగా మార్చే ప్రక్రియ కూడా జరుగుతుందని సీఎంకు తెలిపినట్లు సమాచారం. బుధవారం వైద్య అధికారులు ఢిల్లీకి వెళ్లి ఈ వివరాలన్నీ ఎన్ఎంసీ అధికారులకు వివరిస్తారు. ఎన్ఎంసీ తనిఖీలు జరిపి వెళ్లిన ఆరునెలల్లో ఫ్యాకల్టీ, వసతులు మెరుగయ్యాయని డీఎంఈ నరేంద్ర కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

విద్యా సంవత్సరం ప్రారంభంలో ఎన్ఎంసీ తనిఖీలు సహజం: డీఎంఈ నరేంద్రకుమార్

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు, మెడికల్ కాలేజీలలో ఎన్ఎంసీ తనిఖీలు చేయడం, నోటీసులు ఇవ్వడం సహజంగా జరిగే ప్రక్రియ అని వైద్య విద్య సంచాలకులు నరేంద్రకుమార్ తెలిపారు. గత 4 సంవత్సరాలుగా నోటీసులు వస్తూనే ఉన్నాయని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఈ సంవత్సరం అనేక రాష్ట్రాల్లోని కాలేజీలకూ నోటీసులు వచ్చాయని, మన రాష్ట్రంలోని కాలేజీలకు మాత్రమే నోటీసులు వచ్చినట్టుగా, నోటీసులు రావడం ఇదే మొదటిసారి అన్నట్టుగా అపోహలు సృష్టించి, తప్పుడు ప్రచారం చేయడం సరి కాదని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలకూ అనుమతులు వస్తాయని, ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు



- హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్ రీజియన్ల పరిధిలో నియామకానికి త్వరలో నోటిఫికేషన్
- రెండు నెలల క్రితం 1,000 మంది డ్రైవర్లు, ఇప్పుడు 800 మంది కండక్టర్ల రిక్రూట్‌మెంట్

సాక్షి, హైదరాబాద్: రెండు నెలల క్రితం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్లను నియమించుకున్న ఆర్టీసీ, ఇప్పుడు అదే పద్ధతిలో కండక్టర్లను కూడా తీసుకునేందుకు సిద్ధమైంది. దాదాపు 800 మంది కండక్టర్లను తాత్కాలిక పద్ధతిలో ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసుకోవాలని నిర్ణయించింది. హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్ రీజియన్ల పరిధిలో ప్రస్తుతానికి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్లను నియమించుకోనుంది. దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనుంది.

పూర్తి స్థాయి నియామకాల్లో ఎడతెగని జాప్యంతో...

ప్రస్తుతం ఆర్టీసీలో 2 వేల మంది కండక్టర్ల అవసరముంది. రెగ్యులర్ కండక్టర్లలో దాదాపు 500 మంది ఆర్టీసీ కార్గో సర్వీసు, ఆర్టీసీ పెట్రోల్ బంకులు, సహా ఇతర పలు అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్నారు. గడచిన కొన్ని నెలల్లో 1,500 మంది కండక్టర్లు ఉద్యోగ విరమణ చేయగా భారీ కొరత ఎదురైంది. ప్రస్తుతం సరిపోను కండక్టర్లు విధుల్లో లేకపోవటంతో ఉన్న వారితోనే అదనపు డ్యూటీలు చేయిస్తున్నారు. ఇది కండక్టర్లకు ఇబ్బందిగా మారింది. అదనపు డ్యూటీకి అదనపు చెల్లింపులు ఉంటున్నా, రోజుల్లో 10 నుంచి 12 గంటల పాటు పనిచేయాల్సి రావటంతో వారు తీవ్రంగా అలసిపోతున్నారు. బలవంతపు అదనపు డ్యూటీలు వద్దని చాలా రోజులుగా గగ్గోలు పెడుతున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సహా పలు ఇతర పోస్టులు కలిపి దాదాపు 4 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయా పోస్టులను టీఎస్‌పీఎస్సీ, వైద్యారోగ్య శాఖ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుల ఆధ్వర్యంలో భర్తీ చేయాల్సి ఉంది. కానీ, కొంతకాలం ఆయా బోర్డుల నియామక కేలండర్ పేరుతో, ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ రోస్టర్ ఖరారు పేరుతో జాప్యం జరుగుతూ వస్తోంది. నెలలు గడుస్తున్నా ఆ భర్తీ ప్రక్రియ లేకపోవటంతో క్రమంగా ఆర్టీసీలో ఖాళీల సంఖ్య కూడా పెరుగుతూ వచ్చి సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో రెగ్యులర్ ఉద్యోగుల భర్తీ జరిగే వరకు తాత్కాలిక పద్ధతిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునేందుకు సంస్థ నిర్ణయించింది. రెండు నెలల క్రితం 1,000 మంది డ్రైవర్లను ఇదే పద్ధతిలో నియమించుకుంది. శిక్షణ పూర్తి చేసుకొని వారు విధుల్లో ఉన్నారు. ఆ తర్వాత కండక్టర్లను కూడా అదే పద్ధతిలో నియమించుకునేందుకు కసరత్తు చేసినా, సచివాలయం నుంచి అనుమతి రాలేదు. మరోసారి విన్నవించగా, రవాణా మంత్రి కార్యాలయం తాజాగా అనుమతించింది. దీంతో నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు ప్రారంభించింది. హైదరాబాద్ నగరంలో దాదాపు 600 మంది కండక్టర్లు, వరంగల్ రీజియన్ పరిధిలో 200 మందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించుకునేందుకు చర్యలు ప్రారంభించింది.

- ఇలా నియమితులయ్యే వారికి నెలవారీ కన్సాలిడేటెడ్ పేమెంట్ రూ.17,969గా నిర్ధారించారు. ✦ ప్రతి అదనపు గంట ఓటీకి రూ.100, గంట మించితే రూ.200 చొప్పున చెల్లిస్తారు.
- ప్రతి 6 మస్టర్ల తర్వాత వీక్లీఆఫ్ వసతి ఉంటుంది.

తల్లిదండ్రులు ఉన్నంత వరకు వాటాలు కోరకుండా చేయాలి

- తోబుట్టువుల ఆస్తి వివాదాల కేసులో జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: నిత్యం పెరిగిపోతున్న తోబుట్టువుల ఆస్తి తగాదాలు, వివాహ వివాదాలపై ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉన్నత చదువులు చదువుకుని.. మంచి ఉద్యోగం చేస్తూ.. ఆర్థికంగా బాగానే ఉన్నా.. స్వల్ప ఆస్తి కోసం కొందరు సోదరులు, సోదరీమణులతో కొట్లాడుతుంటారన్నారు. ఒకరిపై ఒకరు కేసులు, పిటిషన్లు వేసుకుంటూ న్యాయస్థానాలను పెద్ద ఎత్తున ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేటలోని అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని గతంలో ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాలను మునిసిపల్ అధికారులు అమలు చేయడం లేదంటూ హైదరాబాద్ నివాసి చార్టర్డ్ అకౌంటెంట్ రాహుల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కూల్చిన తర్వాత స్థలాన్ని సమానంగా పంచేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. 2024, ఫిబ్రవరిలో జారీ చేసిన స్పీకింగ్ ఆర్డర్ ప్రకారం చర్యలు చేపట్టి.. స్టేటస్ రిపోర్టును తమకు తెలియజేయాలని సూర్యాపేట మునిసిపాలిటీని ఆదేశించారు. తదుపరి విచారణ జూలై 28కి వాయిదా వేశారు. కేసు విచారణ సందర్భంగా పిటిషన్ వేసిన వ్యక్తి ఆ భవనంలో ఉంటున్న వారికి సోదరుడు అని.. నలుగురి మధ్య ఆస్తి వివాదం ఉందని తెలుసుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్య ఇలాంటి పిటిషన్లు న్యాయస్థానాల్లో పెరిగిపోతున్నాయని, కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అహంకారంతోనే కేసులు..: 'హైకోర్టుకు అధికారం ఉండి ఉంటే ఆస్తి తగదాలు, వివాహ వివాదాల్లో ఆస్తులన్నింటినీ న్యాయస్థానం కస్టడీలోకి తీసుకునేవాళ్లం. అప్పుడు అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి. ఆస్తి కోసం కొట్లాటలు పెట్టుకుని ఏం సాధిస్తారు? కోర్టు చుట్టూ తిరిగి చివరికి ఆ ఆస్తి పొందిన వాళ్లు కూడా సంతోషంగా ఉండలేరు. ఇక్కడ 264 గజాలు ఆరుగురు (తల్లిదండ్రులతో కలిపి) పంచుకోవాలి. దాదాపు 44 గజాల స్థలం కోసం కొట్లాడుతున్నారు. అందులో ఇళ్లు కట్టుకునేందుకు అధికారులు అనుమతి కూడా ఇవ్వరు. దాంతో ధనవంతులూ కాలేరు. చివరకు ఏం సాధించినట్లు.. అతి పెద్ద సమస్య ఏంటంటే అహంకారం. కంపెనీ లా ట్రిబ్యునల్‌లో దివాలా పరిష్కార నిపుణుడిని పెట్టినట్లు ఇక్కడ కూడా అలాంటి వ్యక్తిని ఏర్పాటుచేసి ఆస్తులను కస్టడీలోకి తీసుకుని.. పార్టిషన్ సూట్‌లో ఆస్తుల పరిష్కార ప్రక్రియ చేపడితే సరిపోతుంది. అసలు.. తల్లిదండ్రులు బతికి ఉన్నంత వరకు కుమారుడు, కుమార్తె ఆస్తుల్లో వాటాను కోరకుండా చర్యలు తీసుకుంటే తెలిసొస్తుంది. ఉన్నత చదువులు చదువుకుంటారు.. మంచి ఉద్యోగం చేస్తుంటారు.. ఆర్థికంగా బాగానే ఉంటారు.. అయినా స్వల్ప ఆస్తి కోసం కూడా కొట్లాడుతుంటారు. కుటుంబ సభ్యులతో కొట్లాడి వెయ్యి గజాలు సాధించుకున్నా అది భవిష్యత్‌లో సంతృప్తినివ్వదు. అహంకారం వీడితే సమస్యలకు కుటుంబ స్థాయిలోనే పరిష్కారం దొరుకుతుంది'అని పేర్కొన్నారు.



ప్రకృతి వేసే దెబ్బలకు బలికాకుండా ఉండటం సాధన చెయ్యాలి.
ప్రకృతికి మాధ్యమంగా మారి ఎవరి పట్ల కూడా అప్రియంగా ప్రవర్తించకుండా ఉండాలి.
అప్రమత్తంగా ధమ్మ స్మృతితో జీవితం గడపాలి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 18 జూన్ 2025

వలసలే వర్తమాన వాస్తవం

ఆకలి నుంచి, అగడ్తల నుంచి, వేధింపుల నుంచి, ఘర్షణల నుంచి, మృత్యువు నుంచి సుదూరంగా వెళ్లిపోవడానికీ, సురక్షితంగా బతకడానికీ సాధారణ ప్రజానీకం చేస్తున్న ప్రయత్నాలు ప్రపంచంలో అంతకంతకూ ఎక్కువవుతున్నాయి. ప్రతి దేశంలోనూ జాతీయవాద ధోరణులు పెరిగి, మెజారిటీ వాదం ముదిరి సరిహద్దులు మూసుకుపోతున్నా బతుకుపోరులో పరాజితులవుతున్న సాధారణ జనం ఎప్పటిలా 'వలస గీతం' పాడుతూనే ఉన్నారు. నిరుడంతా ఒక దేశం నుంచి మరో దేశానికి కోట్లాదిమంది ప్రజానీకం వలసపోయారని లాన్సెట్ నివేదిక ప్రకటించింది. ఒక్క మాటలో– ప్రతి ఎనిమిది మందిలో ఒకరు స్వస్థలాలను వదిలిపోతున్నారు. ఒక్కో దేశంలో ఒక్కో సమస్య. నియంత పోకడలతో ఉండే పాలకులు కావొచ్చు... సాయుధ ముఠాల బెదిరింపుల వల్ల కావొచ్చు, కళ్లముందు జరుగుతున్న ఘర్షణలు ముదిరి తమను కూడా కబళిస్తాయన్న భయం కావొచ్చు– ఎందరెందరో సురక్షిత ప్రదేశాలను అన్వేషిస్తూ తెలియని తీరాలకు పయనమవుతున్నారు. వీటికి తోడు ఈ 21వ శతాబ్దంలో వాతావరణ మార్పుల కారణంగా వచ్చిపడుతున్న సమస్యలు కూడా వలసలను పెంచుతున్నాయని లాన్సెట్ నివేదిక సూచిస్తోంది. భారీ ఆనకట్టల నిర్మాణం, మైనింగ్, పరిశ్రమల స్థాపన వంటివాటికి అభివృద్ధి పేరిట అనుమతులిస్తున్నారు. ప్రభుత్వాలు నామమాత్రంగా ఇచ్చే పరిహారం ఏ మూలకూ చాలక, చేసేందుకు పనులేమీ లేక వలసలు తప్పటం లేదు. ఇలాంటి 'అభివృద్ధి' పర్యవసానంగా కరువు, వరదలు, ఇతరేతర ప్రకృతి వైపరీత్యాలు కాటేస్తున్నాయి. ఆహారం, మంచినీరు సంగతలా ఉంచి కనీసం తలదాచుకోవటానికి కూడా ఏమీ మిగలక పోవటం సమస్యాత్మకం అవుతోంది. ఇలాంటివారిని స్వదేశంలోనే సంశయంతో చూస్తారు. తమ వనరులు కాజేస్తారని, జీవికకు ముప్పు తెస్తారని ఆందోళన పడతారు. పరాయి దేశాలకు పోతే చెప్పేదేముంది? మన దేశం వరకూ చూస్తే వలసల్లో దాదాపు 99 శాతం అంతర్గతమైనవేనన్నది నిపుణుల మాట. ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వలసలు అధికంగా ఉంటుండగా, వారికి ఆశ్రయమిచ్చే రాష్ట్రాల్లో ఢిల్లీ, మహారాష్ట్రలది అగ్రస్థానం.

వలసపోయే వారిలో ఇతరేతర సమస్యలకు తోడు ఆరోగ్య సమస్యలు కూడా తక్కువేమీ కాదు. ఎండనక, వాననక, తిండితిప్పలు లేక గత్యంతరం లేక కాలినడకన వెళ్లేవారుంటారు. ఎగిసిపడుతున్న అలలు కలవరపరుస్తున్నా, ఏ క్షణమైనా మింగేస్తాయన్న భయాందోళనలున్నా నాటుపడవలపై సముద్రాలను దాటాలని చూసేవారూ ఉంటున్నారు. ఇలాంటివారంతా వ్యాధుల బారినపడి ఆదరించేవారు లేక, వైద్యసాయం అందక మృత్యుముఖంలోకి పోతున్నారు. తొలుత 2008లో, ఆ తర్వాత 2017లో ఐక్యరాజ్యసమితి ఈ సమస్యపై తీర్మానాలు చేసింది. ప్రత్యేకించి వలసదారుల ఆరోగ్యావసరాలను చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సభ్యదేశాలకు సూచించింది. అయిదేళ్ల క్రితం ప్రపంచ ఆరోగ్యసంస్థ ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. కానీ ఆ సంస్థలో దీనిపై శ్రద్ధపెట్టి పనిచేసే విభాగాలు ఆర్థిక సమస్యలతో మూతబడ్డాయి. వలసదారుల్ని చూసి భయపడే సాధారణ ప్రజానీకం, దీన్ని తమకనుకూలంగా మార్చుకుని అధికారం అందుకోవాలనుకునే రాజకీయ పక్షాల నాయకులు సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో వలసదారుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన చర్యలు కూడా ఉన్నాయి. కానీ పట్టించుకునే వారేరి? సక్రమంగా ఆలోచించి వినియోగించుకుంటే వలసదారులు ఏ సమాజాభివృద్ధికైనా తోడ్పడతారు. చాలా రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే నిర్మాణరంగ, వ్యవసాయరంగ కార్మికులకు పనులు లభిస్తున్నాయి. కానీ వారి యోగక్షేమాలు పట్టక పోవటం, వారి నైపుణ్యాభివృద్ధికి అవసరమైన పథకాలు లేకపోవటం సమస్యలకు దారి తీస్తోంది.

దురదృష్టవశాత్తూ హింసనుంచీ, వేధింపులనుంచీ తప్పించుకుని వస్తున్న వలసదారుల్ని అనుమాన దృక్కులతో చూసే వైఖరి పెరుగుతోంది. ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించిన మొదట్లోనే ప్రపంచ మానవ హక్కుల డిక్లరేషన్ వెలువరించింది. దానికి అనుగుణంగా 1951లో శరణార్థుల ఒడంబడిక అమల్లోకొచ్చింది. మన దేశంతోపాటు ఇండొనేసియా, క్యూబా, ఎరిత్రియా, లిబియా వంటి దేశాలు దానిపై సంతకం చేయలేదు. అలా సంతకం చేయకపోయినా శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ వంటి దేశాలనుంచి వచ్చిన శరణార్థులను భారత్ ఆదుకుంది. టిబెట్ నుంచి వచ్చిన 80,000 మంది గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. కానీ ఆ ఒడంబడికను గుర్తించి సంతకం చేస్తే దానికింద శరణార్థులకు కల్పించాల్సిన తప్పనిసరి సదుపాయాలు వగైరా వుంటాయి. ఇక్కడికొచ్చినవారు వాటిని కోల్పోవాల్సి వస్తోంది.

ఎంతో సంపన్నవంతమైన అమెరికాయే వలసలను అడ్డుకోవటానికి వేలాది మందిని జైళ్లపాలు చేస్తోంది. వెనక్కి పంపుతోంది. చాలా యూరప్ దేశాలు ఆ మార్గాన్నే అనుసరిస్తున్నాయి. ఇక అంతంత మాత్రం ఆర్థిక వ్యవస్థలతో సతమతమయ్యే దేశాల్లో శరణార్థులను, వలసదారులను ఆదరిస్తారని ఆశించటం దురాశే. ఎవరెంత వ్యతిరేకిస్తున్నా, ద్వేషిస్తున్నా వలసలు మున్ముందు మరింత పెరుగుతాయని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. ఎందుకంటే వారు తమ ఇష్టానుసారం రావటం లేదు. తప్పనిసరై, గత్యంతరం లేక స్వస్థలాలను వదల వలసి వస్తోంది. వలసలను వ్యతిరేకించటం కాక, వాటిని అనుకూలంగా మలుచుకోవటం ఎలాగో నేర్చుకోవటం అన్ని దేశాలకూ తప్పనిసరి.

ఇంకా బాల కార్మికులా?

విశ్లేషణ



కైలాశ్ సత్యార్థి

ఇప్పటికీ వెట్టి చాకిరీ వలలో చిక్కుకు పోయిన బాల కార్మికులు లక్షలాది మంది ఉన్నారు. పొలాల్లో, ఫ్యాక్టరీల్లో, ఇళ్లలో పని చేస్తున్న నిస్సహాయ బాలల ఆర్తనాదాలు నా చెవుల్లో గింగురుమంటున్నాయి. అటువంటి పరిస్థితుల నుంచి రక్షించిన వందలాది మంది బాలలు 1998లో నా చుట్టూ అల్లుకున్న సంగతి గుర్తుకొస్తోంది. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా 103 దేశాలను చుట్టి వచ్చిన గ్లోబల్ మార్చ్‌లో నా వెంట వచ్చిన బాలలు నిర్భయంగా చేసిన నినాదాలు కూడా గుర్తున్నాయి. యాత్ర ముగింపులో జెనీవాలోని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ప్రధాన కార్యాలయంలో ప్రసంగించవలసిందిగా మమ్మల్ని కోరారు. అక్కడ మేం తక్షణం అమలుపరచవలసిన సరళమైన డిమాండును వినిపించాం: ''చిట్టి చేతుల్లో ఇక ఎంతమాత్రం పనిముట్లు ఉండకూడదు. మాకు పుస్తకాలు, బొమ్మలు కావాలి!''

నెరవేరని లక్ష్యం

ఆ యాత్ర చరిత్ర సృష్టించింది. ఫలితంగా, ఐఎల్ఓ 1999లో (182వ) తీర్మానాన్ని ఆమోదించింది. అది బానిసత్వం, మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా వచ్చిన మొదటి అంతర్జాతీయ చట్టం. ఆ తీర్మానాన్ని ఆమోదించిన మొదటి 16 ఏళ్ళలో గణనీయమైన ప్రగతి కనిపించడంతో ఎన్నో ఆశలు చిగురించాయి. బాల కార్మికుల సంఖ్య 2000–2016 సంవత్సరాల మధ్యలో గణనీయంగా 25 కోట్ల నుంచి 15 కోట్ల 20 లక్షలకు తగ్గింది. దాంతో మార్పు తేగలం అనిపించింది. కానీ, అది సరిపోదు. బాలల విషయంలో ప్రతి క్షణమూ విలువైనదే. స్కూలుకు వెళ్ళలేకపోయిన ప్రతి రోజూ ఒక అవకాశాన్ని కోల్పోయినట్లే లెక్క. ఒక్క నిమిషం బానిసత్వంలో మగ్గినా బాల్యాన్ని కోల్పోయినట్లే లెక్క.

ఐరాస 2016లో సతత వికాస లక్ష్యా (ఎస్.డి.జి.)లను నిర్దేశించుకున్నపుడు ఉద్యమాన్ని పునర్జీవింపజేసే అవకాశం వచ్చింది. బాల కార్మికుల నిర్మూలనను ఒక ఎస్.డి.జి.గా చేర్చేట్లు చూసేందుకు మేం ఉద్యమాన్ని చేపట్టాం. అంతర్జాతీయ అభివృద్ధి అజెండాలో ఈ అంశాన్ని కూడా చేర్చితే ఎంతో ఊతం లభిస్తుందని భావించాం. మా కృషి ఫలించింది. ప్రపంచం 2025 కల్లా బాల కార్మిక వ్యవస్థ ఏ రూపంలోనూ లేకుండా చూస్తామని వాగ్దానం చేసింది.

గ్లోబల్ మార్చ్‌లో పాల్గొన్నవారిలో పిన్న వయస్కుడు బసు రాయ్. ఆ ఎనిమిదేళ్ళ పిల్లాడిని నా భుజాల మీదకు ఎక్కించుకుని నడిచాను. వాడిది కంచు కంఠం. ''బాల కార్మికులను ఎవరు నిరోధిస్తారు? మేమే'' అని నినదించేవాడు. మనం పెట్టుకున్న 2025 గడువు ఇంక కొద్ది నెలల్లో ముగుస్తుందనగా, బసు లాంటి లక్షలాది మంది నుంచి అదే రకమైన గొంతు ఇప్పటికీ వినిపిస్తోందని బరువెక్కిన హృదయంతో చెప్పాల్సి వస్తోంది.

ఎస్.డి.జి.లు చేపట్టిన మొదటి నాలుగేళ్ళలో, 2020 వరకు బాల కార్మికుల సంఖ్య 16 కోట్లకు పెరిగింది. అప్పటికి 20 ఏళ్ళలో బాల కార్మికుల సంఖ్య పెరగడం అదే మొదటిసారి. ఒక్క ఆఫ్రికాలోనే రోజూ 10,000 మంది బాలలు బలవంతపు చాకిరీలోకి దిగుతున్నారు. అదే కాలంలో, ప్రపంచం 10 ట్రిలియన్ డాలర్లకు సంపదను పెంచుకుంది. మరో రకంగా చెప్పాలంటే, కనీసం వారానికొక కోటీశ్వరుడు తయారయ్యాడు. ఇది దయారాహిత్యానికి సంకేతం. దీన్ని నిజంగా మనం అభివృద్ధి అనగలమా? కొన్నేళ్ళ క్రితం నేను ఐరాసలో మాట్లాడుతూ, 2025 నాటికి ప్రపంచంలో బాల కార్మికులు లేకుండా చూడగలమని చెప్పాను. కానీ, ''అయ్యో! బాల కార్మిక వ్యవస్థకు అంతం ఎన్నడు?'' అని ఈ మధ్య ఎవరో నన్ను అడిగినపుడు నాకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు.



అది హక్కుల సమస్య

బాల కార్మికులు లేకుండా చేసే ఉద్యమాన్ని ప్రభావవంతంగా ఎలా మలచాలనే విషయంలో 2016కు ముందు మనం కొన్ని విలువైన పాఠాలు నేర్చుకున్నాం. ప్రజా ఉద్యమ స్ఫూర్తి, రాజకీయ సంకల్ప బలంతో కూడిన నైతిక నాయకత్వం ప్రగతిని సాధించేందుకు తోడ్పడ్డాయి. చాలా దేశాలు విద్యా రంగంపై భారీగా పెట్టుబడులు పెట్టాయి. నిర్బంధ విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించిన బ్రెజిల్, భారత్, కెన్యా, దక్షిణాఫ్రికా సత్ఫలితాలు చూశాయి. ఎక్కడి నుంచి కూడా బాల కార్మికులు వ్యవస్థలోకి రాకుండా చూడాలని రాజకీయంగా బలమైన వాణి (ముఖ్యంగా యూరప్, అమెరికా నుంచి) వినిపించడంతో పరిశ్రమలు కూడా తలొగ్గక తప్పలేదు.

నేడు ప్రపంచ వ్యాప్తంగా ఆ రకమైన ఉద్యమ స్ఫూర్తి కొరవడింది. మనం కూడా బాల కార్మికులను ఒక ఉప అంశంగా చూడటం మొదలెట్టాం. దాన్నొక కార్మిక సమస్యగా పరిగణిస్తున్నాం తప్పించి న్యాయాన్ని, మానవ హక్కులను కాలరాస్తున్న సంక్షోభంగా చూడటం లేదు. లోతైన సమస్యలు మరికొన్ని ఉన్నాయి. అనేక పేద దేశాలు (ముఖ్యంగా ఆఫ్రికాలోనివి) అసమంజస పన్నుల వ్యవస్థల్లో, కునారిల్లజేస్తున్న అప్పుల ఊబిలో, అవినీతి, అవకతవకల పాలనలో, వివిధ వర్గాల మధ్య ఘర్షణల్లో చిక్కుకుపోయాయి. దాంతో ఈ సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. మరో ప్రమాదకరమైన ధోరణిని గమనించాను. అమెరికాలో 30కి పైగా రాష్ట్రాలు బాల కార్మికుల సంరక్షణ చట్టాలను నిర్వీర్యం చేస్తూ కొత్త సవరణలు తీసుకొచ్చాయి. సభ్యులుగా ఉన్న దేశాల నుంచి నిరసన ఎదురవడంతో, బాల కార్మికులకు కంపెనీలను బాధ్యులను చేసే చట్టాన్ని యూరోపియన్ యూనియన్ సడలింపజేసింది. బ్రెజిల్‌లోనూ ఆ దిశగా చర్చలు సాగుతున్నాయి.

- ఐరాస 2016లో సతత వికాస లక్ష్యాలను నిర్దేశించుకున్నపుడు, బాల కార్మిక వ్యవస్థ ఏ రూపంలోనున్నా 2025 నాటికి అంతమొందిస్తామని ప్రపంచం వాగ్దానం చేసింది. కానీ, ఇచ్చిన మాటను ప్రపంచం నిలబెట్టుకోలేక పోయింది.
- ఒక్క ఆఫ్రికాలోనే రోజూ 10,000 మంది బాలలు బలవంతపు చాకిరీలోకి దిగుతున్నారు. మరోవైపు, కనీసం వారానికొక కోటీశ్వరుడు తయారవుతున్నాడు.
- యుద్ధ మండలాల్లో జీవిస్తున్న బాలల శాతం 1990ల నుంచి రెండింతలైంది. సుమారు 47 కోట్ల 30 లక్షల మంది బాలలు ఘర్షణలు సాగుతున్న చోట్ల నలిగి పోతున్నారు.

మన పిల్లలు అనుకుంటేనే!

అయితే, చిన్నవే అయినా, కొన్ని అర్థవంతమైన చర్యలూ కనిపించకపోలేదు. 'యునిసెఫ్' ఇటీవల ప్రపంచ బాలల సంరక్షక నిధిని ఏర్పాటు చేసింది. కానీ, ఆ సాయం సరిపోదు. లక్ష్యంలో సుమారు 30 శాతాన్నే ఆ నిధి అందుకోగలిగింది. ప్రపంచ దేశాలు కూడా మునుపెన్నడూ లేనంత ఘర్షణలను చూస్తున్నాయి. యుద్ధ మండలాల్లో జీవిస్తున్న బాలల శాతం 1990ల నుంచి రెండింతలైంది. నేనిది రాస్తున్న సమయానికి 47 కోట్ల 30 లక్షల మంది బాలలు ఘర్షణలు సాగుతున్న చోట్ల నలిగిపోతున్నారు. వాతావరణ సంక్షోభం బడుగు వర్గాలపై ప్రభావం చూపుతోంది. ఇది బాల కార్మికుల సంఖ్యను పెంచుతూ, పేదరిక, అన్యాయాల వలయాన్ని కొనసాగిస్తోంది. చాలా దేశాలు బాల కార్మికుల సంఖ్యను తగ్గించుకోగలగడం ఒక్కటే ఆశలు మోడువారకుండా చూస్తోంది. బాల కార్మికులకు వ్యతిరేకంగా ప్రజా గొంతుకలు వినిపిస్తూనే ఉన్నాయి.

ఈ ఉద్యమానికి నాయకత్వం వహించగల సత్తా భారత్‌కు ఉంది. మనకు పటిష్ఠమైన చట్టాలు, చక్కని సంక్షేమ పథకాలు, రాజకీయంగా ఏకాభిప్రాయం ఉన్నాయి. పరిశ్రమల నుంచి కూడా ప్రతిఘటన నామమాత్రంగానే ఉంది. అన్నీ అనువైన పరిస్థితులున్నాయి. కనుక, సత్వర కార్యాచరణకు నడుం బిగించాలి. మొదట చట్టాలను అమలుపరచాలి. కాగితాలకు మాత్రమే పరిమితమైన చట్టాల వల్ల ఉపయోగం లేదు. బాల కార్మికులను వివిధ (విద్య, ఆరోగ్యం, పేదరికం) రంగాలతో ముడిపడిన సమస్యగా చూడాలి. అలాగే, విద్యా రంగంలో పెట్టుబడులు కీలకం. ప్రమాణాలతో కూడిన పాఠశాల విద్య బాల కార్మికులను చాకిరీ నుంచి విముక్తులను చేయగలదు. అన్నింటికన్నా ముఖ్యంగా బాల కార్మికులుగా పని చేస్తున్న వారందరూ మన పిల్లలేననే భావన అంకురించాలి. అప్పుడే సమస్య పరిష్కారానికి త్వరపడగలుగుతాం. బాలలకు మెరుగైన ప్రపంచాన్ని అందించాల్సిన బాధ్యత మనపై ఉంది.

వ్యాసకర్త నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, సామాజిక కార్యకర్త ('హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఇండియా ఎటు?



ఇరాన్‌లో యూఎస్ అనుకూల ప్రభుత్వం ఏర్పడితే ఇండియాకు నేరుగా ఉండే ప్రయోజనాలున్నా, అన్ని చమురు క్షేత్రాలు, కీలక రేవులు పాశ్చాత్య కంపెనీలకు పోతాయి. అక్కడ అమెరికా సైనిక స్థావరం ఉంటే, ఇండియా దిశలో చైనా దూకుడు తగ్గుతుంది. అదో పరోక్ష లాభం. అందుకే మనం ఇరాన్ నిరణ్వాయుధీకరణకు మద్దతివ్వాలి కానీ, ప్రభుత్వ మార్పునకు మద్దతు ఇవ్వకూడదు. – దివ్యకుమార్ సోతీ, కాలమిస్ట్

ముందున్నది వెనక్కి!



1979లో (ఇరాన్‌లో షాను గద్దెదించిన ఏడాది) నాలుగు దేశాల తలసరి జీడీపీ (డాలర్లలో): ఇరాన్–2,352, దక్షిణ కొరియా– 1,783, తైవాన్– 2,076, ఇజ్రాయెల్–5,961. (దక్షిణ కొరియా, తైవాన్ కన్నా ఇరాన్ ముందుంది). 2025లో: ఇరాన్ – 5,800, దక్షిణ కొరియా–34,641, తైవాన్–34,430, ఇజ్రాయెల్–57,760. – అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

అదే రియల్ పరీక్ష



డియర్ ఆర్టీవో! నిజమైన ఇండియన్ డ్రైవింగ్ పరీక్షకు దయచేసి వీటిని కలపండి: ఆరు మ్యాన్‌హోళ్లు, తప్పుదోవలో వస్తున్న ట్రక్కు, గమనించకుండా రోడ్డు దాటుతున్న నలుగురు అంకుళ్లు, రోడ్డుమధ్యలో ధ్యానం చేస్తున్న మూడు ఆవులు, అన్నింటినీ తరుముతున్న ఒక కుక్క. – హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఎటని పోతారు?



తెహ్రాన్‌ను ఖాళీ చేయాలా? తెహ్రాన్! కోటి మంది మనుషులు ఎక్కడ బతుకుతారు? మీకేమైనా పిచ్చా? మనుషుల సమూల నాశనాన్ని ఇప్పుడు మనం సోషల్ మీడియా ద్వారా ప్రకటిస్తున్నామా? ఎలాంటి కాలం? – హెబా గోవాయెద్, సోషియాలజీ ప్రొఫెసర్

రోడ్డెక్కేస్తారంతే!



ఇండియాలో నిజంగా జనాలు లైసెన్స్ కోసం డ్రైవింగ్ పరీక్ష ఇస్తారా? చాలామందికి ప్రాథమిక, అంతర్జాతీయంగా ఆమోదం పొందిన ట్రాఫిక్ రూల్స్, సైన్స్ తెలియవు. – సుచేతా దలాల్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

పేదవారి ఎంపిక ఎలా?

అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వం పేదరికం నిర్మూలన గురించి గత డెబ్బై ఐదు సంవత్సరాలుగా చెబుతూనే ఉంది. అయినా పేదరికం అలాగే ఉంది. కొన్ని రోజుల క్రితమే విడుదల చేసిన ప్రపంచ బ్యాంకు నివేదిక వివరాలు భారత ప్రభుత్వానికి వీనులవిందుగా ఉన్నాయి. సంక్షేమ పథకాల ద్వారా పేదరికాన్ని తగ్గించడంలో భారతదేశం మంచి ఫలితాలను చూపుతోందని ఈ నివేదిక కితాబిచ్చింది. పదిహేడు కోట్ల మంది ప్రజలను (2011–12 నుండి 2022–23 సంవత్సరాల మధ్యకాలంలో) దారిద్ర్య సముద్రం నుండి పైకి తీసిందని లెక్కించింది.

సంక్షేమ పథకాల ఉద్దేశాలు భేషుగ్గా ఉన్నా, అవి లక్ష్యంగా పెట్టుకొన్న జిల్లాలకు, మండలాలకు, గ్రామాలకు, ప్రభావిత జనాభాకు చేరడం లేదు. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపికలో చాలా అవకతవకలు జరుగుతున్నాయి. ఉదాహరణకి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ఆర్భాటంతో ఆరంభించిన 'ఇందిరమ్మ నివాస యోజన' లబ్ధిదారుల ఎంపిక పట్ల కోపాలు పెరిగి ఊర్లల్లో ఘర్షణలు జరుగుతున్నాయి.

గెలిచిన ప్రతి రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చాక, తమ కార్యకర్తలను ఏదో ఒక రూపంలో (డబ్బు, స్థానిక కమిటీల్లో పదవులు, కాంట్రాక్టులు, సంక్షేమ పథకాల్లో ప్రత్యక్ష లబ్ధి...) సంతోషపెట్టడానికి మార్గాల్ని వెతుకుతుంటుంది. ఇలాంటి పక్షపాతాన్ని ప్రదర్శించడం వల్ల నిజమైన పేదలకి సంక్షేమ పథకాలు అందకుండా దూరంగా ఉంటున్నాయి. అలాగే ఆర్థికంగా బలమైన కుటుంబాలు, అనర్హులైనవారు... లబ్ధిదారుల లిస్టుల్లో చొరబడటంతో అనుకున్న ఆశయాలు నెరవేరకుండా పథకాలు విఫలమౌతున్నాయి.

గ్రామస్థులందరి సమక్షంలో పేదవారిని సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా ఎన్నిక చేసినట్లయితే మంచి ఫలితాలు వస్తాయి. ఇదేమి కొత్త పద్ధతి కాదు. దీన్ని 'పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్– పీఆర్ఏ' అంటారు. అందరికీ ఆమోదయోగ్యమైన ఈ టెక్నిక్/పద్ధతి 1980వ దశకపు తొలి సంవత్సరాల్లో మనదేశంలో మొదలయ్యింది. దీన్ని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్మెంట్ స్టడీస్ (యూకే)లో పనిచేస్తున్న రాబర్ట్ చాంబర్స్ పేదల వికాసాభివృద్ధి రంగానికి ఉపయోగించారు. ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ఈ వినూత్న పద్ధతిని మనదేశంలో విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చారు. దీని ద్వారా అత్యంత పేద వారిని గ్రామాల్లో గుర్తించడం చాలా సులభతరమే కాక అందరి సమక్షంలో జరుగుతుంది కావున సమ్మతమై చెల్లుతుంది.

– డా‌॥ టి. సంపత్ కుమార్, ఢిల్లీలోని కెనడియన్ హైకమిషన్‌లో మాజీ సీనియర్ సలహాదారు

ఉన్నత స్థానాల్లో ఉన్నా ...

అభిప్రాయం



డా‌॥ కత్తి పద్మారావు

భారతదేశంలో మహర్లు వీరోచితమైన చరిత్ర కలిగినవారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఇటు వంటి మహర్లలో జన్మించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచారు. ఆయన తండ్రి రాంజీ సక్‌పాల్ భక్తి ఉద్యమానికి సంబంధించిన వారు. అంబేడ్కర్ బౌద్ధమతం స్వీకరించేవరకూ మహర్లు భక్తి ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించిన కబీర్ అనుయాయులుగా ఉన్నారు. ఆ తర్వాత బౌద్ధంలోకి మారారు. 1956 డిసెంబర్ 6న అంబేడ్కర్ ఇచ్చిన బౌద్ధ ధర్మ దీక్ష పొందినవారిలో ఒకరు రామకృష్ణ సూర్యభాను గవాయి కుమార్. ప్రస్తుత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి (బీఆర్ గవాయి) ఆయన కుమారుడే. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని బౌద్ధ మతస్థులతో కొనసాగుతున్న జస్టిస్ గవాయి బౌద్ధ జీవన వికాసానికీ, ఆత్మగౌరవ స్వరానికీ, అవమానాన్ని ఎదిరించగలిగిన తత్వానికీ నిదర్శనంగా నిలిచారు.

దళితులు ఎంతటి ఉన్నత స్థానానికి ఎదిగినప్పటికీ ఏదో ఒక రూపంలో భారతీయ నిచ్చెన మెట్ల కుల సమాజంలో అవమానాలు ఎదుర్కొనవలసి రావడం విషాదకరం. దళితుడైన జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కేరళ నుండి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని అధిష్ఠించారు. ఆయన తాను అనేక అవమానాలను ఎదుర్కొన్నట్లు పదవీ విరమణ తరువాత చెప్పారు. రాష్ట్రపతి పదవిని చేపట్టిన కె.ఆర్. నారాయణ్ ఫ్రాన్స్‌లో గెస్ట్‌హౌస్‌లో ఉన్నప్పుడు ఒక విలేకరి 'ఇండియన్ అన్ టచబుల్' అన్న విషయాన్ని స్వయంగా పేర్కొన్న విషయం గమనార్హం. ఇప్పుడు దళితుడైన జస్టిస్ బీఆర్ గవాయి సుప్రీం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) అయిన తర్వాత ఆయనకు తొలినాళ్లలోనే దక్కవలసిన ప్రొటోకాల్ మర్యాద దక్కకపోవడం చర్చనీయాంశం అయ్యింది.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి

"నేను నాకు లభించాల్సిన గౌరవం గురించి మాట్లాడడం లేదు. ఒక రాజ్యాంగ వ్యవస్థకు మరో రాజ్యాంగ వ్యవస్థ ఇవ్వాల్సిన గౌరవం గురించి మాట్లాడుతున్నాను".

జస్టిస్ గవాయి సీజేఐ అయిన సందర్భంగా మహారాష్ట్ర–గోవా బార్ కౌన్సిల్ ఆయనకు ఒక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ముంబై పోలీస్ కమిషనర్ వంటి ఉన్నతాధికారులు హాజరు కాలేదు. మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తి సీజేఐ వంటి ఉన్నత పదవికి ఎంపికైన తరువాత రాష్ట్రానికి తొలిసారి వచ్చినప్పుడు ప్రోటోకాల్ ప్రకారం వారు ఈ కార్యక్రమానికి హాజరు కావాలి. కానీ వారు హాజరు కాలేదు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'నేను నాకు లభించాల్సిన గౌరవం గురించి మాట్లాడడం లేదు. ఒక రాజ్యాంగ వ్యవస్థకు మరో రాజ్యాంగ వ్యవస్థ ఇవ్వాల్సిన గౌరవం గురించి మాట్లాడుతున్నాను' అని అన్నారు.

జస్టిస్ గవాయి గొప్ప సందేశకుడు, ధైర్యశాలి, నిక్కచ్చిగా మాట్లాడటం ఆయన నైజం. ఆయన ప్రమాణ స్వీకారం తరువాత చేసిన ప్రసంగం ఆలోచనను రేకెత్తించింది. దేశంలో ఏ వ్యవస్థా గొప్పది కాదనీ, భారత రాజ్యాంగం మాత్రమే సర్వోన్నతమైనదనీ ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో కీలక స్తంభాలు అయిన శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు మూడూ సమానమేననీ, అవి ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలనీ, పరస్పరం గౌరవించుకోవాలనీ స్పష్టం చేశారు. మహారాష్ట్ర–గోవా బార్ కౌన్సిల్ సత్కార సభలో ఆయన ఇచ్చిన 50 కీలక తీర్పుల సంకలన గ్రంథ ఆవిష్కారం జరిగింది. ఆ సందర్భంగా బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా తానిచ్చిన తీర్పు గురించి వివరించారు. 'నివాస హక్కు ప్రాథమిక హక్కు. ఏ వ్యక్తి అయినా ఏదైనా కేసులో నిందితుడైనా, దోషిగా నిర్ధారణ అయినా... అతడి కుటుంబ నివాసం చట్టబద్ధమైనదైతే దానిని తొలగించడానికి, కూల్చడానికి వీల్లేదు. చట్టాన్ని అనుసరించి వ్యవహరించాల్సిందే' అని స్పష్టం చేశారు. బుద్ధిస్టు అయిన దళితుడు దేశ అత్యున్నత న్యాయమూర్తి కావడం మంచి పరిణామం.

అంబేడ్కర్ భారత రాజ్యాంగకర్తగా ఉండి అనేక అవమానాలు పొందారు. అయితే ఆయన సానుకూల దృక్పథంతో ప్రత్యామ్నాయాలు సృష్టిస్తూ వెళ్ళారు. ఇపుడు భారత రాజ్యాంగ అనుసరణ అనేది ఒక ప్రధాన భూమికగా మారింది. దశాబ్దంలో హిందూ మతోన్మాదశక్తులు, కార్పొరేట్ ఆధిపత్య శక్తులు జమిలిగా మనుస్మృతి భావాజాల ఆధిక్యతను ప్రకటించాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో జస్టిస్ గవాయి ఇచ్చిన ఆత్మ గౌరవ ఫీలింగ్ ప్రాధాన్యం సంతరించుకుంది. 'కులం పునాదుల మీద ఒక జాతిని నిర్మించలేరు, ఒక నీతిని నిర్మించలేరు' అని అంబేడ్కర్ చెప్పారు. ఈ సూత్రాన్ని గ్రహించి దేశంలో రాజ్యాంగం పేర్కొంటున్న సమానత్వం నెలకొనడానికి కృషి జరగాలి. రాజ్యాంగాన్ని అమలు చేసే స్థానంలో ఉన్న వారే కుల వ్యవస్థ దారుణాన్ని చవిచూసినవారైతే వారు ఇచ్చే తీర్పులు ఎలా ఉంటాయో చెప్పనవసరం లేదు.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు
మొబైల్: 98497 41695

అతిరథుడు బాహ్లికుడు

'కొడుకా! నేనెటులో, అట్లె బాహ్లికుడు కూర్చున్ నీకు...' అంటాడు ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడితో! 'కుమారా! నీకు నేనెంతో, అంతగానూ కావలసినవాడు, ప్రియబాంధవుడూ బాహ్లికుడు. నేనూ, బాహ్లికుడూ, భీష్ముడూ... నీకు అత్యంత పూజనీయులం. మా మాట కాదని ధర్మరాజుతో యుద్ధానికి దిగవద్దు' అని దీనంగా బతిమాలుకొంటాడు. ఈ ఘట్టం విన్నప్పుడు, దుర్యోధనుడికి తండ్రి తాతల సరసన మూడో అతి ముఖ్య బంధువయిన బాహ్లికుడు ఎవరు, ఆయన ఎందుకు ప్రసిద్ధుడు కాలేదు అని సందేహం వస్తుంది.



జ్యోతిర్మయం

బాహ్లికుడు, భీష్ముడి తండ్రి శంతనుడి సోదరుడు. భీష్ముడికి పెత్తండ్రి. ఆయన తండ్రి ప్రతీపుడు తను రాజుగా ఉన్నప్పుడే, బాహ్లికుడికి కొంత రాజ్యభాగం ఇచ్చి రాజును చేశాడు. ఆ తరవాత కొన్ని అసాధారణ పరిస్థితుల వల్ల చిన్న కొడుకయిన శంతనుడికి హస్తినాపుర రాజ్యాధికారం లభించింది. పరిశీలనగా చూస్తే, చరిత్రలో ఎన్నెన్నో రాజ్యాధికార వారసత్వాలు అసాధారణంగా సంక్రమించటం కనిపిస్తుంది. భారతంలో అలాంటి సందర్భాలు చాలా కనిపిస్తాయి.

భారతంలో బాహ్లికుడికి ప్రధాన పాత్ర లేదు. ఆయన పేరు అరుదుగా వినిపిస్తుంది. కానీ వంశంలో అందరి కంటె వృద్ధుడిగా, ఆయన కౌరవ పాండవులిద్దరికీ సన్నిహితుడే. వాళ్ళ ఇళ్ళలో శుభాశుభ కార్యాలన్నిటికీ ఆయనే ఇంటి పెద్ద, పూజ్యుడు.

ధర్మరాజు రాజసూయ యాగం చేసినప్పుడు, ఆయన వచ్చి ఇంటి పెద్దగా గొప్ప గౌరవం పొంది, ఒక ఉత్తమ రథాన్ని కానుకగా ఇస్తాడు. ద్రౌపదీ మానభంగ ఘట్టంలో నిస్సహాయంగా చూస్తూ ఊరుకొన్న కురు వృద్ధ, గురు వృద్ధ, బాంధవులలో బాహ్లికుడు ఉన్నాడు. తరవాత జరిగిన రెండో విడత జూదం వారించేందుకు గట్టిగా చెప్పి చూసిన పెద్దలలో బాహ్లికుడి పేరు కూడా కనిపిస్తుంది.

భీష్మ పితామహుడికే పెద తండ్రి అయిన బాహ్లికుడు, పండు ముసలితనంలో కూడా భారత యుద్ధంలో కౌరవుల పక్షాన పోరాడాడు. భీష్ముడి పరిగణనలో ఆయన కౌరవ పక్షంలో ఉన్న మహావీరులలో అగ్రగణ్యులలో ఒకడు. 'అతిరథుడు బాహ్లికుడు విను, అతులిత బలు, డతని యట్ల ఆత్మజుడును...' అని అభివర్ణిస్తాడు గాంగేయుడు. యుద్ధంలో వీరోచితంగా పోరాడి, చివరికి భీముడి చేత వీరమరణం పాలవుతాడు.

మహాభారత కథ ఎన్నెన్నో చిత్రవిచిత్రమైన ఉదాత్తమైన పాత్రల ద్వారా మానవ స్వభావాన్ని అనేక కోణాల నుంచి ఆవిష్కరించి చూపుతుంది. అందుకే, చదివితే భారతమే చదవాలి!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: బ.సప్తమి ప.10.38 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: పూర్వాభాద్ర రా.10.03 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.11.35 నుండి 12.27 వరకు, అమృతఘడియలు: ప.2.16 నుండి 3.50 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.30, సూర్యాస్తమయం: 6.32.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ కార్యాలయం : : సంగారెడ్డి

ఫైల్ నెం. అ2/647/2025 తేది: 11-06-2025

ప్రాథమిక ప్రకటన
ఫారం-VI
(చట్టం 30/2013 యొక్క సెక్షన్ నెం. 11 (1)
మరియు రూల్ 19 యొక్క సెక్షన్ రూల్ (1) చూడగలరు.)

ఈ దిగువ చూపబడిన సంగారెడ్డి జిల్లా, సదాశివపేట మండలము, ఆరూర్ గ్రామములోని సర్వే నెం. 224, 265, 268 లో ఎ. 193.14 గుంటలు విస్తీర్ణము గల అసైన్డ్ భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా "పారిశ్రామిక పార్కు ఏర్పాటు" కొరకు అవసరమైనదని తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ గారు భావించినది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము మెమో నం : 1325/IP&INF/A2/2025-1, ఇండస్ట్రీస్ & కామర్స్ (IP/INF), తేది:20.03.2025 ద్వారా సామాజిక ప్రభావమదింపునకు భూ సేకరణ చట్టం పునరావాస, పునః స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు, 30/2013 లోని చాప్టర్-II మరియు III లను మినహాయించడమైనది. అట్టి మెమోను తెలంగాణ రాజ పత్రము నందు నెం.70-E, తేది: 24.03.2025 నందు ప్రచురించడమైనది.

ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా పైన తెలిపిన "పారిశ్రామిక పార్కు ఏర్పాటు" కొరకు సంగారెడ్డి జిల్లా, సదాశివపేట మండలము, ఆరూర్ గ్రామములోని దాదాపు ఎ. 193.14 గుంటల విస్తీర్ణము గల భూమి సేకరణ నిమిత్తం అవసరమైయున్నవి వాటి వివరాలు దిగువ ఇవ్వబడినవి.

గ్రామం : ఆరూర్ మండలం : సదాశివపేట జిల్లా : సంగారెడ్డి

క్రమ సంఖ్య	సర్వే నెంబర్	పట్టా రకం	భూమి రకం	సేకరణ క్రింద ఉన్న విస్తీర్ణం	భూమి పట్టాదారు పేరు/ అనుభవదారు పేరు మరియు చిరునామా	సరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	నిర్మాణాలు & చెట్లు	రిమార్క్స్
1	2	3	4	5	6	7	8	9	10	11	12
1	224/అ2	అసైన్డ్ భూమి	నిల్లు	2.0000	[illegible]	సర్వే నెం. 223/P	సర్వే నెం. 225/P	[illegible]	సర్వే నెం. 228/P	-	-
2	224/[illegible]	అసైన్డ్ భూమి	నిల్లు	1.3000	[illegible]	సర్వే నెం. 223/P	సర్వే నెం. 225/P	[illegible]	సర్వే నెం. 228/P	-	-
3	224/[illegible]	అసైన్డ్ భూమి	నిల్లు	4.0000	[illegible]	సర్వే నెం. 223/P	సర్వే నెం. 225/P	[illegible]	సర్వే నెం. 228/P	-	-
4–129	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
130	268/[illegible]	అసైన్డ్ భూమి	నిల్లు	0.0575	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-
131	268/[illegible]	అసైన్డ్ భూమి	నిల్లు	0.1150	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-
132	268/[illegible]	అసైన్డ్ భూమి	నిల్లు	0.0575	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-
133	268/30	అసైన్డ్ భూమి	నిల్లు	2.0000	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-
134	268/8	అసైన్డ్ భూమి	నిల్లు	2.1600	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-
		మొత్తం విస్తీర్ణం (సర్వే నెం. 268)		68.20	[illegible]						
మొత్తం విస్తీర్ణం (సర్వే నెం. 224, 265 మరియు 268)				193.14	[illegible]						

క్రమ సంఖ్య	గ్రామం	[illegible]	[illegible]
1	ఆరూర్	-	-

క్రమ సంఖ్య	[illegible]	[illegible]
1	-	-

భూ సేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం, 2013 (చట్టం నెం.30/2013 యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనల క్రింద సంబంధితులందరికి ఈ ప్రకటనను జారీచేయడమైనది.

సదరు భూమి యొక్క ప్లానును జిల్లా కలెక్టర్, సంగారెడ్డి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, సంగారెడ్డి కార్యాలయము నందు ఏదేని పని దినమున పని వేళల్లో తనిఖీ చేసుకోవచ్చును.

సదరు చట్టం యొక్క సెక్షన్ 12 లో నిర్దేశించబడిన మరియు పొందుపరచబడిన విధముగా వారి పని యొక్క సక్రమ నిర్వహణ కొరకు అవసరమైన విధముగా సదరు భూమిలో ప్రవేశించుటకు మరియు భూ సర్వే చేయుటకు, ఏదేని భూమి యొక్క లెవల్స్ ను తీసుకోవటానికి, భూమి లోపలి పొరల్లోకి త్రవ్వటానికి లేదా బోర్ వేయుటానికి మరియు అవసరమైన అన్ని ఇతర పనులను చేయుటానికి రెవెన్యూ డివిజనల్ అధికారి, సంగారెడ్డి మరియు వారి సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్ అధికారమిచ్చారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్ గారి నుండి ముందస్తు అనుమతి లేకుండా ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేది నుండి సదరు భూమికి సంబంధించి ఏవేని వ్యవహారాలు, అనగా, అమ్మకం/కొనుగోలు వగైరాలను జరుపరాదు లేదా ఎట్టి ఎన్ కంబరెన్స్ లను సృష్టించరాదు.

ఈ భూ సేకరణ పట్ల ఏదేని అభ్యంతరం గల ఎవరేని ప్రయోజనం గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 కింద పొందుపర్చబడిన విధంగా ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేది నుండి 60 (అరవై) రోజులలోపు తమ అభ్యంతరాలను జిల్లా కలెక్టర్ / రెవెన్యూ డివిజనల్ అధికారి (భూసేకరణ అధికారి), సంగారెడ్డి వారి సమక్షంలో దాఖలు చేయవలెను.

సం/-	సం/-	సం/-	సం/-
తహశీల్దార్, సదాశివపేట మండలం	రెవెన్యూ డివిజనల్ అధికారి, సంగారెడ్డి	అదనపు కలెక్టర్ సంగారెడ్డి	జిల్లా కలెక్టర్ సంగారెడ్డి

DIPR R.O.No. 237/LA/PP/ADVT/AGENCY/2025-26

'హామ్'తో గ్రామీణ రోడ్ల ఆధునీకరణ

మొదటి విడతలో 7,947 కి.మీ.కు టెండర్లు: మంత్రి సీతక్క

మండలానికి రెండు చొప్పున 1,440 జీపీ భవనాల నిర్మాణం



సాక్షి, హైదరాబాద్: రహదారుల నిర్మాణం కోసం కొత్తగా తీసుకొచ్చిన 'హామ్' (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానం ద్వారా గ్రామీణ రోడ్లకు మహర్దశ పడుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. పట్టణ రోడ్లకు దీటుగా గ్రామీణ రోడ్లను తీర్చిదిద్దే 'హామ్' ప్రాజెక్టుకు సంబంధించిన మార్గదర్శకాలతో త్వరలో జీవో విడుదల చేస్తామన్నారు. హామ్ విధానం అమలుపై అధ్యయనం కోసం త్వరలో కర్ణాటక, మహారాష్ట్రకు అధికార బృందాలను పంపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ విభాగాధిపతులతో జరిగిన భేటీలో సీతక్క మాట్లాడారు. 'హామ్ విధానంలో మొత్తం 18,472 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను ఆధునీకరిస్తాం. తొలి విడతలో 7,947 కి.మీ. ఆధునీకరణ కోసం 15 రోజుల్లో టెండర్లు వేసేలా కార్యాచరణ రూపొందించాలి. ఇప్పటికే ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.1,800 కోట్ల విలువ చేసే పనులు మంజూరయ్యాయి. ఈ ఏడాది మండలానికి రెండేసి చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 1,440 గ్రామపంచాయతీ భవనాలు, 1,440 అంగన్‌వాడీ భవనాలు నిర్మిస్తాం' అని సీతక్క చెప్పారు. ఎంపీడీఓల బదిలీకి కొద్ది రోజుల్లో సీఎం నుంచి అనుమతి వస్తుందన్నారు. త్వరలో అన్ని విభాగాలతో విడివిడిగా సమావేశమై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా జరుగుతున్న పనుల పురోగతి, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, హామ్ విధానంలో రోడ్ల నిర్మాణం, ఇందిరా మహిళా శక్తి, స్త్రీ నిధి తదితరాలపై అధికారులు నివేదికలు అందజేశారు.

రెండోరోజు మూడు ఎకరాలకు రైతు భరోసా

- తాజాగా రూ.1551 కోట్లు విడుదల చేసిన వ్యవసాయశాఖ

సాక్షి, హైదరాబాద్: రైతుభరోసా పథకం కింద మూడెకరాల లోపు భూములున్న రైతులకు మంగళవారం ప్రభుత్వం పెట్టుబడి సాయం విడుదల చేసింది. 10.45 లక్షల రైతులకు చెందిన 25.86 లక్షల ఎకరాలకు రూ.1,551 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసింది. వానాకాలం సీజన్‌కు సంబంధించి 'రైతుభరోసా'పథకాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలిరోజు 2 ఎకరాలలోపు విస్తీర్ణంలో భూమి ఉన్న 41.25 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 2,349.83 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. దీంతో ఇప్పటి వరకు 51.70 లక్షల మంది రైతులకు రూ. 3,901.72 కోట్లు జమ అయ్యాయి. 9 రోజుల్లో రూ. 9వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తానని సీఎం ఇచ్చిన హామీ మేరకు రెండోరోజు నిధులు విడుదలైనట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా అందిస్తామని చెప్పారు.

రైతు భరోసా స్థానిక ఎన్నికల స్టంట్

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతుబంధు పథకం కింద కేసీఆర్ ప్రభుత్వం నాట్లకు నాట్లకు నడుమ పెట్టుబడి సాయం అందిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఓట్లకు ఓట్లకు నడుమ రైతుభరోసా ఇస్తోందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రైతు భరోసాను ఎకరానికి రూ.12వేలకు కుదించారని, రైతులకు ఒక్కో ఎకరాకు రూ.25వేల చొప్పున రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు బాకీ పడ్డారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో రైతుభరోసా పేరిట రైతులను ఆశ పెట్టేందుకు రాజకీయ స్టంట్‌కు కాంగ్రెస్ తెరలేపిందన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే తెలంగాణలో నిజమైన రైతు రాజ్యం వచ్చిందని, బీఆర్ఎస్ పాలనలో రైతులు 3 కోట్ల టన్నుల వరి ధాన్యం పండించారన్నారు. మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగు బిల్లుల అంశంలో సీఎం అనుసరిస్తున్న వైఖరిని పెద్ది సుదర్శన్‌రెడ్డి దుయ్యబట్టారు. కేసీఆర్, హరీశ్‌రావుపై అక్రమ కేసులు బనాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు.

కౌశిక్‌రెడ్డికి ముందస్తు బెయిల్ నో

సాక్షి, హైదరాబాద్: హన్మకొండ జిల్లా సుబేదారి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసుల తరపున హాజరైన పీపీ పల్లె నాగేశ్వర్‌రావుకు ఆదేశాలు జారీ చేస్తూ.. తదుపరి విచారణ ఈ నెల 24కు వాయిదా వేసింది. తన భర్తను రూ.50 లక్షలు ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారంటూ హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడు గ్రామానికి చెందిన క్వారీ యజమాని మనోజ్ భార్య ఉమాదేవి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. ప్రాథమిక ఆధారాలున్నందున విచారణ ఎదుర్కోవాల్సిందేనని చెప్పింది. దీంతో ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున టీవీ రమణారావు వాదనలు వినిపిస్తూ.. ఇది రాజకీయ ప్రేరేపిత కేసు అని, బెయిల్ పిటిషన్‌లో విచారణ ముగిసే వరకు అరెస్టు నుంచి ఉపశమనం ఇవ్వాలని కోరారు. దీనికి పీపీ అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌంటర్ దాఖలు చేసే వరకు కఠిన చర్యలు చేపట్టకుండా ఉత్తర్వులు ఇవ్వాలని రమణారావు కోరగా.. న్యాయమూర్తి నిరాకరించారు.

మరింత ఉధృతంగా దాడులు

ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ కార్యాలయంపై ఇరాన్ దాడులు

ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సీనియర్ మిలటరీ కమాండర్ షాద్మానీ అంతం

టెహ్రాన్/టెల్ అవీవ్/దుబాయ్: అణ్వస్త్ర సామర్థ్యాన్ని ఇరాన్ సముపార్జించకుండా అడ్డుకున్నామని ప్రకటించిన ఇజ్రాయెల్ తన దాడుల తీవ్రతను మరింత పెంచింది. ఇరాన్ అత్యున్నత నేత, సుప్రీం కమాండర్ అయతొల్లా అలీ ఖమేనీకి సన్నిహితుడు, ఖాటమ్ అల్ -అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ సారథి, సైనిక జనరల్ అలీ షాద్మానీని ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని షాద్మానీ ఉంటున్న ఒక రహస్య ప్రదేశంపై క్షిపణుల వర్షం కురిపించి ఆయన ప్రాణాలుతీసింది. భూతలం నుంచి భూతలం మీది లక్ష్యాలను ఛేదించే 120 మిస్సైల్ లాంఛర్లను నాశనం చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. ఎఫ్-14 రకం రెండు యుద్ధవిమానాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. 10 కమాండ్ సెంటర్లను నేలకూల్చామని పేర్కొంది. దీంతో ఇరాన్ సైతం తీవ్రస్థాయిలో బాలిస్టిక్ క్షిపణులతో బదులు చెప్పింది. టెల్ అవీవ్ సిటీలో ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ కార్యాలయంపై మెరుపు దాడులు చేసింది. దీంతో ఆ భవనం ధ్వంసమైనట్లు వార్తలొచ్చాయి. టెల్ అవీవ్‌తోపాటు వెస్ట్ జెరూసలేంలోనూ బాంబుల మోతలు మోగాయి. ఇజ్రాయెల్‌లోని హెర్జిలియాలో 8 అంతస్తుల భవంతి ధ్వంసమైంది. ఇకపై మరింతగా దాడులు చేస్తామని ఇరాన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సయ్యద్ అబ్దుల్‌రహీం మౌసావీ ప్రకటించారు. ఇప్పటిదాకా ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి, డ్రోన్ దాడుల్లో ఇరాన్‌లో 224 మంది ప్రాణాలు కోల్పోయారు. 1,277 మంది గాయపడ్డారు. ఇరాన్ జరిపిన మిస్సైళ్ల దాడుల్లో ఇజ్రాయెల్‌లో 24 మంది చనిపోయారు. 500 మందికిపైగా పౌరులు గాయపడ్డారు.



మిలటరీ కమాండర్ షాద్మానీ

టెహ్రాన్‌లో హాహాకారాలు

ఇరాన్ గగనతల రక్షణవ్యవస్థ దెబ్బతినడంతో ఇజ్రాయెల్ క్షిపణులు పట్టపగ్గాల్లేకుండా విచ్చలవిడిగా విరుచుకుపడ్డాయి. దీంతో టెహ్రాన్ నగరవ్యాప్తంగా మంగళవారం అప్రమత్త సైరన్‌లు మోగుతూనే ఉన్నాయి. కొందరు ప్రాణభయంతో ఇళ్లలో, బంకర్లలో బిక్కుబిక్కుమంటూ తలదాచుకుంటే లక్షలాది మంది కాస్పియన్ సముద్రతీరాలకు వాహనాల్లో తరలిపోతున్నారు. వందలాది మంది సమీప అజర్‌బైజాన్ దేశానికి వలసవెళ్లారు. సొంత వాహనాల్లో జనం వలసవెళ్తుండటంతో రహదారులన్నీ కిక్కిరిసి పోయాయి. స్టాక్‌మార్కెట్ పనిచేయలేదు. సరఫరాలేక పెట్రోల్‌బంకుల్లో నోస్టాక్ బోర్డులు కనిపించాయి. స్టాక్ ఉన్నచోట్ల చాంతాడంత క్యూ లైన్లు కనిపించాయి.



హెర్జిలియాపై ఇరాన్ దాడిలో ధ్వంసమైన భవంతి నుంచి ఎగసిపడుతున్న అగ్నికీలలు



తక్షణమే ఖాళీ చేయండి

టెహ్రాన్ ప్రజలకు ట్రంప్ సూచన ● జీ7 సదస్సు నుంచి స్వదేశానికి

కనానాస్కిస్/వాషింగ్టన్: జీ7 కూటమి శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కెనడాకు చేరుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షెడ్యూల్ కంటే ఒకరోజు ముందే హఠాత్తుగా స్వదేశానికి వెళ్లిపోయారు. కెనడాలో జరగాల్సిన కీలక భేటీలను రద్దు చేసుకున్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ఉధృతంగా మారుతుండడంతో తాజా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించడానికే ఆయన కెనడా పర్యటనను అర్ధంతరంగా ముగించుకొని అమెరికాకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను తక్షణమే ఖాళీ చేయాలని ట్రంప్ సూచించారు. ఇజ్రాయెల్ దాడులు భీకరంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని చెప్పారు. ఆయన స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉదయం కెనడాలో మీడియాతో మాట్లాడారు. మధ్యాహ్నం 'ఎక్స్'లో పోస్టుచేశారు. సాయంత్రం జీ7 దేశాల అధినేతలతో ఫొటోలు దిగారు. ''నేను వెంటనే వెనక్కి వెళ్లిపోవాలి. చాలా ముఖ్యం'' అని చెప్పారు. ఇంకా ఆలస్యం కాకముందే అణు కార్యక్రమానికి తెరదించాలని ఇరాన్‌కు ట్రంప్ హితవు పలికారు. దాడులు ఆగాలంటే అణ్వస్త్రాల ఆలోచన మానుకోవాలని, ఇజ్రాయెల్‌తో ఒప్పందానికి రావాలని సూచించారు. ఒప్పందం విషయంలో ఇప్పటికే 60 రోజుల సమయం లభించినా ఇరాన్ పాలకులు సద్వినియోగం చేసుకోలేదని తప్పుపట్టారు. మరో గత్యంతరం లేక ఇజ్రాయెల్ సైన్యం ఇరాన్‌పై దాడులకు దిగిందని అభిప్రాయపడ్డారు. యుద్ధం ఆగాలా? లేక కొనసాగాలా? అనేది ఇరాన్ చేతుల్లోనే ఉందని అమెరికా అధ్యక్షుడు పరోక్షంగా తేల్చిచెప్పారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో అమెరికా పాత్ర ఏమిటి? అని ప్రశ్నించగా.. స్పందించడానికి నిరాకరించారు.

ఇరాన్‌కు అణుబాంబు దక్కదు

అణు బాంబు తయారీకి ఇరాన్ అత్యంత సమీపంలోకి వచ్చిందని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అయినప్పటికీ ఇరాన్ అణు బాంబును తయారు చేసుకొనే అవకాశం ఎంతమాత్రం లేదని స్పష్టంచేశారు. కెనడా నుంచి స్వదేశానికి వస్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఇరాన్ అణ్వాయుధాలు అభివృద్ధి చేయడం లేదంటూ అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ ఈ ఏడాది మార్చి నెలలో చేసిన ప్రకటనను ట్రంప్ కొట్టిపారేశారు. ఆమె ఏం చెప్పారో తాను పట్టించుకోనన్నారు.

ఇజ్రాయెల్ సైన్యానిదీ అదేమాట

టెల్ అవీవ్/టెహ్రాన్: ఇరాన్ అణు స్థావరాలను పూర్తిగా ధ్వంసంచేయాలని, అణు శాస్త్రవేత్తలను, కీలక సైనికాధికారులను అంతమొందించాలని ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మధ్యభాగంలో క్షిపణి దాడులకు సిద్ధమవుతోంది. సెంట్రల్ టెహ్రాన్‌లో ఉంటున్న 3.30 లక్షల మంది బయటకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించింది. టెహ్రాన్‌ను పూర్తిగా ఖాళీ చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తేల్చిచెప్పిన కాసేపటికే సైన్యం అదే తరహాలో ఆదేశాలివ్వడం గమనార్హం. ఇరాన్ ప్రభుత్వ టీవీ, పోలీసు ప్రధాన కార్యాలయాలతోపాటు ముఖ్యమైన ఆసుపత్రులు సెంట్రల్ టెహ్రాన్‌లోనే ఉన్నాయి. రాజధాని నగరంలో 90 లక్షల మందికిపైగా నివసిస్తున్నారు. ఇక్కడ వైమానిక దాడులు జరిగితే ప్రాణనష్టం ఊహించని స్థాయిలో సంభవించే అవకాశం ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం ఆపరేషన్ రైజింగ్ లయన్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

ఖమేనీ జాడ తెలుసు... ఇప్పుడే చంపం: ట్రంప్

జీ7 సదస్సు నుంచి హడావిడిగా అమెరికాకు పయనమైన డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ జాడపై మాట్లాడారు. '' ఖమేనీ ప్రస్తుతం ఎక్కడ దాక్కున్నారో మాకు స్పష్టంగా తెలుసు. ప్రస్తుతానికి ఆయనను అక్కడే తలదాచుకోనిద్దాం. ఆయనను చంపేందుకు మిస్సైళ్లను ప్రయోగిస్తే సాధారణ పౌరులు, అమెరికా జవాన్లూ చనిపోయే ప్రమాదముంది. అందుకే ఇప్పుడే ఆయనను చంపబోం. కానీ ఆయనను అలా ప్రాణాలతో ఎక్కువ రోజులు ఉండనివ్వం. అసలే మాకు ఓపిక చాలా చాలా తక్కువ'' అని ట్రంప్ అన్నారు. '' ఖమేనీగానీ, ఇరాన్‌గానీ మాకు వీలైనంత త్వరగా బేషరతుగా లొంగిపోతే మంచిది. అణుఒప్పందం కుదుర్చుకోవాలని ఇప్పటికే సూచించా. మధ్యవర్తిత్వం వహించాలనే ఆసక్తి నాలో తగ్గుతోంది. ఇరాన్ అణుఆశలపై నీళ్లు చల్లాం. నేను కాల్పుల విరమణను కోరుకోవట్లేదు. అంతకుమించిన ఫలితాన్ని ఆశిస్తున్నా. ఇప్పుడు ఈ సమస్యకు వాస్తవిక 'ముగింపు' పలకాల్సిందే'' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో మరో పోస్ట్‌పెట్టారు.

బంకర్ బస్టర్ బాంబు ఇవ్వండి

ఇరాన్‌లో ఫోర్డో అణుఇంధన శుద్ధి కార్మాగారం ఒక పర్వతం కింద భూగర్భంలో నిర్మించారు. దీనిని భూస్థాపితం చేస్తేగానీ ఇరాన్ అణు కార్యక్రమం ఆగదని ఇజ్రాయెల్ భావిస్తోంది. అందుకే ఎలాగైనా బంకర్లను బద్దలుకొట్టే భారీ బాంబు కోసం అమెరికాను సాయం కోరనుంది. మ్యాసివ్ ఆర్డ్‌నెన్స్ పెనిట్రేటర్(ఎంఓపీ)గా పిలుచుకునే జీబీయూ-57ఏ/బీ బాంబు బరువు ఏకంగా 14,000 కేజీలు. ఇది పేలితే అక్కడ భూమి 200 అడుగుల లోతుదాకా బద్దలైపోతుంది. అంటే భూగర్భంలోని బంకర్, అణుస్థావరం పూర్తిగా సమాధిదిబ్బగా మారుతుంది. అందుకే ఈ బంకర్ బస్టింగ్ బాంబును తమకు ఇవ్వాలని అమెరికాను ఇజ్రాయెల్ కోరుతున్నట్లు సమాచారం. ఇంతటి బరువైన బాంబును కేవలం బీ-2 స్టెల్త్ బాంబర్ యుద్ధవిమానం నుంచే ప్రయోగించే వీలుంది. ఈ విమానం కూడా ఇజ్రాయెల్ వద్ద లేదు. ఇజ్రాయెల్ అభ్యర్థనను అంగీకరిస్తే అమెరికానే స్వయంగా తన విమానంతో ఈ బాంబును యురేనియం శుద్ధికర్మాగారంపై పడేయాల్సి ఉంటుంది. దీనిపై ఇంకా ఎలాంటి స్పష్టత లేదు.

ఎలక్ట్రానిక్ డివైజ్‌లు వాడొద్దని నిషేధాజ్ఞలు

ఇజ్రాయెల్ తన శత్రుదేశంలో సైనికుల చేతుల్లోకి వాకీటాకీలు, రేడియోసెట్లను ఏకకాలంలో పేల్చి సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వ అధికారులు, వారి వ్యక్తిగత సహాయకులు ఎవరూ స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌వాచ్, ల్యాప్‌టాప్ వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఉపయోగించకూడదని ఇరాన్ నిషేధం విధించింది.

ఖమేనీ అంతమైతేనే యుద్ధానికి ముగింపు

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టీకరణ

టెల్ అవీవ్: పశ్చిమాసియాలో అణుయుద్ధం సంభవిస్తే అందుకు ఇరాన్ బాధ్యత వహించాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తేల్చిచెప్పారు. ఈ ప్రాంతంలో చిరకాలం యుద్ధం జరగాలన్నదే ఇరాన్ కుట్రగా కనిపిస్తోందని ఆరోపించారు. ఆయన సోమవారం ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ఆగాలంటే ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సహా అగ్రనాయకులు అంతం కావాలని తేల్చిచెప్పారు. ఖమేనీ హతమైతే ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయన్న వాదనలో అర్థం లేదని, వాస్తవానికి అదే జరిగితే ఇక్కడ సంపూర్ణ శాంతి నెలకొంటుందని వ్యాఖ్యానించారు. అణు స్థావరాలు, అణు శాస్త్రవేత్తలపై దాడులు చేయడం ద్వారా ఇరాన్‌ను చావుదెబ్బ కొట్టామని, అణ్వాయుధాలు సాధించుకోకుండా ఆ దేశాన్ని చాలావరకు వెనక్కి నెట్టేశామని నెతన్యాహు స్పష్టంచేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో నిత్యం మాట్లాడుతూనే ఉన్నానని, తాజా పరిస్థితులు ఆయనకు వివరిస్తున్నానని తెలిపారు. ఇరాన్ నుంచి ముప్పు కేవలం ఇజ్రాయెల్‌కే కాకుండా అమెరికాకు సైతం పొంచి ఉందన్నారు. 'ఈరోజు టెల్ అవీవ్, రేపు న్యూయార్క్' అని పేర్కొన్నారు.

ఘర్షణలు వెంటనే ఆపండి

● ఇరాన్ అణుశక్తిని పొందడానికి వీల్లేదు
● జీ7 దేశాల అధినేతల ఉమ్మడి ప్రకటన

కననాస్కిస్: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల పట్ల జీ7 దేశాల అధినేతలు ఆందోళన వ్యక్తంచేశారు. ఘర్షణలకు వెంటనే ముగింపు పలకాలని ఇరుదేశాలకు తేల్చిచెప్పారు. ఈ మేరకు ఒక ఉమ్మడి ప్రకటనపై సంతకాలు చేశారు. ఇరాన్ అణ్వాయుధ శక్తిని పొందడానికి వీల్లేదని, అందుకు తాము అంగీకరించే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి తాము కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. తనను తాను కాపాడుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని, ఆ హక్కును గౌరవిస్తున్నామని వివరించారు.

మూడేళ్ల దూరంలో ఇరాన్ అణుబాంబు!

అమెరికా నిఘా సంస్థ నివేదిక

వాషింగ్టన్: అణు బాంబు తయారీకి ఇరాన్ అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసిందని, ముప్పు నుంచి తప్పించుకోవడానికే ఆ దేశంపై ముందస్తుగా దాడికి దిగామని ఇజ్రాయెల్ వాదిస్తోంది. తాము స్పందించకపోతే మరి కొన్ని నెలల వ్యవధిలోనే ఇరాన్ అణు బాంబు సిద్ధమయ్యేదని చెబుతోంది. ఇజ్రాయెల్ వాదనను ఖండిస్తూ అమెరికా నిఘా సంస్థ తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. అణు బాంబు తయారీకి ఇరాన్ మూడేళ్ల దూరంలో ఉన్నట్లు పేర్కొంది. ఇప్పటికిప్పుడు అణ్వాయుధాలు తయారు చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని వెల్లడించింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ రైజింగ్ లయన్‌లో అమెరికా ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం లేదు. అణుబాంబులు లేని ఇరాన్‌పై యుద్ధంలో భాగస్వామి కావాలని సరైంది కాదని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇరాన్ అణు కార్యక్రమాలు కొంత వెనక్కి పోయినట్లేనని అమెరికా చెబుతోంది. నతాంజ్ అణు కేంద్రం, ఇస్ఫహాన్ న్యూక్లియర్ రీసెర్చ్ సెంటర్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. అత్యంత కీలకమైన ఫోర్డో అణుకేంద్రానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు. దీన్ని ధ్వంసం చేసే శక్తి ఇజ్రాయెల్‌కు లేదని, తాము సహకరిస్తేనే అది సాధ్యమని అమెరికా రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు.

ఎయిరిండియా రద్దుల పర్వం

ఏడు విమానాలు క్యాన్సిల్ కాగా వాటిల్లో ఆరు డ్రీమ్‌లైనర్ రకానివే

న్యూఢిల్లీ/అహ్మదాబాద్/కోల్‌కతా: అహ్మదాబాద్ ఘోర ప్రమాదం తర్వాత డ్రీమ్‌లైనర్ రకం విమానాలతో కొనసాగుతున్న ఎయిర్ ఇండియా విమాన సర్వీసులకు 'క్యాన్సిల్' మచ్చ అంటుకుంది. మంగళవారం ఏడు ఎయిర్‌ఇండియా విమా నాలు రద్దుకాగా వాటిలో ఆరు విమానాలు డ్రీమ్ లైనర్ 787-8 రకానికి చెందినవి ఉండడం గమనార్హం. సాంకేతికలోపం సహా ఇతరత్రా కారణాలతో డ్రీమ్‌లైనర్లు గాల్లో చక్కర్లుకొట్టడం మానేసి పార్కింగ్ ప్రాంతానికే పరిమితమయ్యాయి.

సాంకేతికలోపంతో..

ఢిల్లీ నుంచి పారిస్‌కు వెళ్లాల్సిన డ్రీమ్‌లైనర్ విమానంలో సాంకేతికలోపం తలెత్తడంతో దానిని రద్దుచేశారు. ఇలాంటి మరో విమానం అందుబాటులో లేకపోవడంతో అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్లాల్సిన విమాన సర్వీస్ క్యాన్సిల్ అయింది. అహ్మదాబాద్ ఘటన తర్వాత ఎయిర్‌ఇండియా సంస్థ తన విమానాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశాక రాకపోకలకు పంపిస్తోంది. ఈ కారణంగానే ఎక్కువ విమానాలు క్యాన్సిలేషన్ బారినపడుతున్నాయని ఈ రంగ నిపుణులు చెబుతున్నారు. మంగళవారం అధిక సంఖ్యలో విమానాలు రద్దవడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. దీనిపై ఎయిర్‌ఇండియా స్పందించింది. ''రద్దయిన విమాన ప్రయాణికులను హోటల్ వసతులు, లేదంటే టికెట్ క్యాన్సిలేషన్‌పై 100 శాతం రీఫండ్ లేదంటే తదుపరి రీషెడ్యూలింగ్‌కు వెసులుబాటు కల్పిస్తున్నాం'' అని ఎయిర్‌ఇండియా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

రద్దయిన విమానాలు ఇవే..

ఏఐ915- ఢిల్లీ నుంచి దుబాయ్(బీ788 డ్రీమ్‌లైనర్)	ఏఐ 159 - అహ్మదాబాద్ నుంచి లండన్(బీ788 డ్రీమ్‌లైనర్)
ఏఐ 153- ఢిల్లీ నుంచి వియన్నా(బీ788 డ్రీమ్‌లైనర్)	ఏఐ 170 - లండన్ నుంచి అమృతసర్ (బీ788 డ్రీమ్‌లైనర్)
ఏఐ 143- ఢిల్లీ నుంచి పారిస్(బీ788 డ్రీమ్‌లైనర్)	ఏఐ 133 - బెంగళూరు నుంచి లండన్ (బీ788 డ్రీమ్‌లైనర్)
ఏఐ 179 - ముంబై నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో(బీ777)	

అహ్మదాబాద్ నుంచి 'తొలి'విమానం రద్దు

అహ్మదాబాద్ దుర్ఘటన తర్వాత అదే ఎయిర్‌పోర్ట్ నుంచి మంగళవారం మధ్యాహ్నం 1.10 గంటలకు లండన్‌కు బయల్దేరి వెళ్లాల్సిన ఎయిర్‌ఇండియా వారి ఏఐ159 విమానం రద్దయింది. విమానప్రమాదం తర్వాత ఇక్కడి నుంచి వెళ్తున్న తొలి ఎయిర్‌ఇండియా అహ్మదాబాద్-లండన్ సర్వీస్ విమానం ఇదే. మరోవైపు ఢిల్లీ నుంచి ఫ్రాన్స్‌లోని పారిస్ ఛార్లెస్ డీ గాలే ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లాల్సిన ఏఐ143 విమానం సైతం రద్దయింది.



విమానం దిగిపోతున్న ప్రయాణికులు

ఎయిరిండియా విమానంలో పనిచేయని ఇంజన్

శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి బయల్దేరి ముంబైకి రావాల్సిన ఎయిర్‌ఇండియా విమా నం సాంకేతిక లోపంతో కోల్‌కతాలో ఆగిపోయింది. దీంతో ఈ సర్వీసును రద్దు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. 211 మంది ప్రయాణికులతో శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి బయలుదేరిన బోయింగ్ 777-200ఎల్ఆర్ విమానం ముంబైకి చేరుకోవాల్సి ఉంది. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి వస్తూ పాకిస్తాన్ గగనతలం మీదుగా ముంబైకి చేరుకోవాల్సి ఉంటుంది. అయితే, పాక్ తన గగనతలాన్ని భారతీయ సర్వీసులకు మూసివేసిన కారణంగా ఈ విమానం నేరుగా రావడం కుదర్లేదు. దాంతో చుట్టూతిరిగి తొలుత కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. రాత్రి 2 గంటల సమయంలో టేకాఫ్ తీసుకోవాల్సి ఉండగా ఒక ఇంజన్ మొరాయించింది. ఇంజనీర్లు మూడు గంటలపాటు శ్రమించినా ఫలితం లేకపోవడంతో ఆ సర్వీస్‌ను రద్దుచేశారు. కొందరిని ఇతర విమానాల్లో ముంబైకి పంపించారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు



ముంబై: మస్కట్-ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో, విమానాన్ని అధికారులు నాగ్‌పూర్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేయించి, తనిఖీలు చేపట్టారు. బెదిరింపు వట్టిదేనని ధ్రువీకరించుకున్నాక విమానం తిరిగి గమ్యస్థానానికి చేరుకుంది. మస్కట్‌లో బయలుదేరిన ఈ విమానంలో 157 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం విమానం కోచిలో ల్యాండయ్యింది. తిరిగి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే విమానంలో బాంబు ఉందని బెదిరింపు మెయిల్ వచ్చింది.

కాంతివేగంతో డేటా

అత్యంత భద్రమైన క్యాంటమ్ కమ్యూనికేషన్ పరీక్ష సక్సెస్

డీఆర్‌డీవో, ఐఐటీ ఢిల్లీ శాస్త్రవేత్తల ఘనత

ప్రపంచంలోనే అత్యాధునిక, అత్యంత సురక్షితమైన సమాచార బదిలీ విధానమైన క్వాంటమ్ కమ్యూనికేషన్స్‌లో భారత్ తన సత్తా చాటింది. తొలిసారిగా అత్యంత భద్రమైన డేటా ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ అయిన క్వాంటమ్ కమ్యూనికేషన్‌ను విజయవంతంగా పరీక్షించామని రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)-ఢిల్లీ సంయుక్తంగా ప్రకటించాయి. దీంతో డేటా హ్యాకింగ్‌కు ఎలాంటి అవకాశంలేని విధానాన్ని భారత్ తన రహస్య సమాచారమార్పిడి కోసం వినియోగించుకునేందుకు అవకాశం లభించింది. ఢిల్లీ క్యాంపస్‌లో ఫ్రీ-స్పేస్ ఆప్టికల్ లింక్ ద్వారా శాస్త్రవేత్తలు ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించి చూశారు. ఈ వివరాలను రక్షణ శాఖ వెల్లడించింది. సెకన్‌కు 250 బిట్స్ సెక్యూర్ కీ రేటుతో ఈ విధానాన్ని పరీక్షించారు. ప్రయోగాన్ని విజయవంతం చేసిన శాస్త్రవేత్తలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు.

ఏమిటీ క్వాంటమ్ కమ్యూనికేషన్?

క్వాంటమ్ కమ్యూనికేషన్ అనేది సాధారణ ప్రజలు అస్సలు నమ్మలేనంతటి, గమ్మత్తైన సమాచార మార్పిడి విధానం. సాధారణభాషలో చెప్పాలంటే.. ఇద్దరు స్నేహితుల వద్ద చెరో వాకీటాకీ ఉందనుకుందాం. వాకీటాకీ అనేది కాస్తంత దూరాలకు మాత్రమే పనిచేస్తుంది. కానీ ఈ స్నేహితుల్లో ఒకడు చంద్రమండలం మీద ఉన్నాసరే అతను మాట్లాడేది ఇతని వాకీటాకీలో వినిపిస్తే ఎలా ఉంటుంది?. మధ్యలో ఎవ్వరూ వీరి మాటలను ట్రాక్ చేయడం గానీ, హ్యాక్‌చేయడంగానీ కుదరకపోతే!. అద్భుతమే కదా. ఆ అద్భుతాన్ని సుసాధ్యంచేసే ప్రక్రియే క్వాంటమ్ కమ్యూనికేషన్. విశ్వంలోనే అత్యంత సూక్ష్మమైన కాంతి అణువు(ఫొటాన్)ల సాయంతో పూర్తి సురక్షితంగా సమాచారాన్ని చేరవేయవచ్చు.

ఇదంతా క్వాంటమ్ ఎంటాంజిల్‌మెంట్ మహిమ!

క్వాంటమ్ ఎంటాంజిల్‌మెంట్ దృగ్విషయం కారణంగా ఇలా అతిసూక్ష్మస్థాయిలో డేటాను మరోచోటుకు బదిలీచేయొచ్చు. దూరంతో సంబంధంలేకుండా ఎంతటి దూరాల మధ్యనున్న అణువుల మధ్య కూడా ఒక మార్మికమైన బంధం, బదిలీ సాధ్యమవుతుంది. దీనినే క్వాంటమ్ ఎంటాంజిల్‌మెంట్ అంటారు. కిలోమీటర్ దూరంలోని అణువుల మధ్య డేటా ట్రాన్స్‌ఫర్‌ను డీఆర్‌డీవో, ఐఐటీ శాస్త్రవేత్తలు విజయవంతంగా పూర్తిచేశారు. దీనిని సింపుల్‌గా చెప్పాలంటే... 1990 దశకంలో పెద్ద హిట్ అయిన హీరో నాగార్జున సినిమా 'హలో బ్రదర్' చూసే ఉంటారు. అందులో కవల సోదరుల్లో ఒకరు ఎలా డ్యాన్స్‌చేస్తే మరొకరు అలాగే కాలుకదపడం, ఎలా ఫైట్‌చేస్తే అలాగే డిష్యుండిష్యుం పోరాటం చేయడం చూసే ఉంటారు. క్వాంటమ్ ఎంటాంజిల్‌మెంట్‌లో కూడా అచ్చం ఇలాగే ఒక అణువుపై మనం సమాచారాన్ని నిక్షిప్తం చేస్తే 'క్వాంటమ్ ఎంటాంజిల్‌మెంట్' ద్వారా దానితో అదృశ్యబంధం ఏర్పర్చుకున్న ఫొటాన్ కణం మీద సైతం అదే సమాచారం ఠక్కున ప్రత్యక్షమవుతుంది. పాత సినిమాల్లో మంత్రదండం సాయంతో మాంత్రికుడు ఒకచోట మాయమై మరోచోట ప్రత్యక్షమైనట్లు డేటా సైతం ఒక చోట నుంచి మరో చోటుకు కాంతివేగంతో ప్రసారమవుతుంది. నేటి సైబర్ ప్రపంచంలో దాదాపు ప్రతీ సమాచారం హ్యాకర్ల చేతికి చిక్కుతుంది. కానీ క్వాంటమ్ కమ్యూనికేషన్‌లో ఇది అసాధ్యం. ఒకవేళ అత్యంత నిపుణుడైన హ్యాకర్ ఈ జంట మధ్య డేటాచోరీకి యత్నిస్తే వెంటనే ఈ సెండర్, రిసీవర్లకు తెల్సిపోతుంది.

ఫ్రీ-స్పేస్ ద్వారా..

ఫ్రీ-స్పేస్ అంటే బహిరంగంగా ఈ సమాచార బదిలీ జరుగుతుంది. ఇందులో ఎలాంటి కేబుళ్లకు, వైర్లకు పనిలేదు. వేల కిలోమీటర్లదూరంలోని రెండు భవంతుల మధ్య, రెండు శాటిలైట్ల మధ్య కూడా క్వాంటమ్ కమ్యూనికేషన్‌ను ఉపయోగించవచ్చు. సైనిక రహస్యాల స్థాయిలో అత్యంత సురక్షితంగా డేటాను పంపించడానికి ఇప్పుడు అందుబాటులో ఉన్న అన్ని ఇంటెలిజెన్స్ టూల్స్ కంటే క్వాంటమ్ కమ్యూనికేషన్ అనేది మెరుగైంది. ఈ విధానంలో పంపే సమాచారాన్ని మూడో వ్యక్తి పసిగట్టలేరు. భారత్‌లో భవిష్యత్తులో క్వాంటమ్ నెట్‌వర్క్‌లు, అల్ట్రా సెక్యూర్ ఇంటర్నెట్ కనెక్షన్లకు ఈ విధానం బాటలువేయనుంది. ఎన్‌క్రిప్షన్ ద్వారా జాతీయ భద్రత, రక్షణ, ఆర్థిక, టెలికమ్యూనికేషన్స్ రంగాల్లో భవిష్యత్తులో ఈ సాంకేతికతను విరివిగా వాడుకోవచ్చు.

సాక్షి, నేషనల్ డెస్క్

కీవ్‌పై రష్యా దాడులు

15 మంది దుర్మరణం.. ● 156 మందికి గాయాలు

కీవ్: నెలల తరబడి ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న రష్యా సోమవారం రాత్రివేళ ముప్పేట దాడికి దిగింది. డ్రోన్లు, క్షిపణులతో దాడులను ఉధృతంచేసింది. ముఖ్యంగా ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌పై కన్నెర్రజేసింది. రాత్రంగా పలుచోట్ల జరిగిన క్షిపణి దాడుల్లో 15 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని కీవ్ నగర సైనిక పరిపాలన అధిపతి తైమూర్ త్కచెన్కో మంగళవారం ప్రకటించారు. ఈ దాడుల్లో 156 మంది గాయపడ్డారు. క్షిపణి దాడుల ధాటికి 9 అంతస్తుల భవనం ఒకటి నేలమట్టమైంది. మరికొన్ని అపార్ట్‌మెంట్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఉక్రెయిన్ రాజధానిపై ఇటీవలికాలంలో జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇదీ ఒకటని తైమూర్ పేర్కొన్నారు. యుద్ధం మొదలై మూడు సంవత్సరాలు గడిచినా, రెండుసార్లు ప్రత్యక్ష చర్చలు జరిగినా ఈ రణం రవ్వంతైనా సానుకూల, శాంతిపథం దిశగా సాగట్లేదని అంతర్జాతీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి. కేవలం సైనికుల పరస్పర మార్పిడి, బందీల విడుదల వంటి కంటితుడుపు చర్చలు తప్పితే కీలకమైన కాల్పుల విరమణ ఒప్పందం దిశగా అడుగులు పడట్లేదు. తీరప్రాంత నగరం ఒడెసాపైనా రష్యా డ్రోన్ దాడులు జరిపింది. ఈ దాడిలో ఒకరు చనిపోయారు. 17 మంది గాయపడ్డారు. సోమవారం రాత్రి రష్యా ఏకంగా 440 డ్రోన్లు, 32 మిస్సైళ్లను కీవ్‌పై ప్రయోగించిందని జెలెన్‌స్కీ చెప్పారు.



కాల్గరీ ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి స్వాగతం

'గ్లోబల్ సౌత్'కు పట్టం కడతా: మోదీ

కాల్గరీ: జీ7 శిఖరాగ్ర సదస్సులో ప్రపంచస్థాయి అంశాలపైనే దృష్టిసారిస్తానని, గ్లోబల్‌సౌత్ భావనను మరింత ముందుకు తీసుకెళ్తానని ప్రధాని మోదీ చెప్పారు. జీ7 సదస్సులో పాల్గొనేందుకు కెనడాలోని కననాస్కిస్ సిటీకి చేరుకున్న మోదీ అక్కడి జీ7 అధినేతలతో భేటీలు మొదలెట్టారు. మంగళవారం తొలుత ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ద.కొరియా అధ్యక్షుడు మ్యుంగ్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియాతో మోదీ విడివిడిగా సమావేశమయ్యారు. ఆయా దేశాల అధినేతలతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

ఇజ్రాయెల్ కాల్పుల్లో 70 మంది మృతి

ఆహారం కోసం వేచి ఉండగా దారుణం

గాజా: ఆకలితో అలమటిస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ బలగాల క్రౌర్యం అంతకంతకూ తీవ్రరూపం దాల్చుతోంది. గాజా దక్షిణ ప్రాంతంలోని ఖాన్‌యూనిస్ నగరంలోని రోడ్డుపక్కన ఆహారం ట్రక్కుల కోసం ఎదురుచూస్తున్న వారిపై మంగళవారం జరిగిన కాల్పుల్లో ఏకంగా 70 మంది చనిపోగా 200 మందికిపైగా గాయపడ్డారు. ఇజ్రాయెల్ ఆర్మీ డ్రోన్లు, మెషీన్ గన్లు, ట్యాంక్ షెల్స్‌ను అన్నార్తులపైకి ఒక్కసారిగా పెద్దపెట్టున కురిపించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా, తమ వద్దకు తీసుకువచ్చిన క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉందని, మరణాలు మరింత పెరిగే అవకాశాలున్నాయని నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. రఫాలోని ఆహార పంపిణీ కేంద్రం వద్ద సోమవారం చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో 38 మంది చనిపోవడం తెల్సిందే. అమెరికా-ఇజ్రాయెల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆహార పంపిణీ కేంద్రాల వద్ద నిత్యం కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. అయితే, ఇజ్రాయెల్ కాల్పుల్లో మంగళవారం అత్యధికులు ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఆహార నిల్వలు హమాస్ శ్రేణుల చేతుల్లో పడకుండా చూడాలన్నదే తమ ఉద్దేశమని ఇజ్రాయెల్ అంటోంది. అయితే, నూతన పంపిణీ వ్యవస్థ గాజా ప్రజల అవసరాన్ని ఏమాత్రం తీర్చలేదని, ఇలాగే కొనసాగిస్తే పాలస్తీనియన్లు ఆకలి చావులు తీవ్రతరం కాక తప్పదని ఐరాస ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఈ యుద్ధం... ప్రపంచానికి పెనుభారం
టెహ్రాన్‌ను వదిలివెళ్లండి
ఇరాన్‌లో ఉన్న పౌరులకు భారత్ అడ్వైజరీ జారీ
సాక్షి ప్లస్ జాతీయంలో

‘బనకచర్ల’పై చర్చిద్దాం రండి

రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, అధికార, విపక్ష ఎంపీలకు సర్కారు విజ్ఞప్తి

ఫోన్లు, లేఖల ద్వారా ఆహ్వానించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేటి సాయంత్రం సచివాలయంలో భేటీ.. ముఖ్య అతిథిగా సీఎం రేవంత్

ఏపీ ప్రాజెక్టుకు అనుమతులివ్వకుండా కేంద్రంపై ఒత్తిడికి కార్యాచరణ సిద్ధం చేసే యోచన

అందరి అభిప్రాయాలు, సలహాలను కోరనున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: ఏపీ చేపడుతున్న గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును తీవ్రంగా ప్రతిఘటించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు జారీ చేయకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే అంశంపై ..రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులతో పాటు అధికార, విపక్ష పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల అభిప్రాయాలు, సలహాలను స్వీకరించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఈ సమావేశానికి గౌరవ అతిథులుగా హాజరు కావాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి ఉత్తమ్ స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించారు. అందుబాటులో ఉన్న ఇతర ఎంపీలకు సైతం ఆయన ఫోన్ చేసి ఆహ్వానించారు. రాష్ట్రం నుంచి ఎంపికైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఎంపీలందరికీ ఆహ్వాన లేఖలను పంపించారు.

అడ్డుకునే వ్యూహంపై చర్చిద్దాం

గోదావరి ట్రిబ్యునల్ తీర్పుతో పాటు రాష్ట్ర పునర్విభజన చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఈ నెల 3న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను.. సీఎం రేవంత్‌రెడ్డి, తాను కలిసిన విషయాన్ని ఎంపీలకు రాసిన లేఖల్లో మంత్రి ఉత్తమ్ గుర్తుచేశారు. అంతేకాకుండా సీఆర్ పాటిల్‌కు తాను లేఖ సైతం రాశానని తెలిపారు. అయితే ఏపీ నుంచి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు ఇంకా అందలేదని, అందిన తర్వాత తమ శాఖ పరిధిలోని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)..అమల్లో ఉన్న నిబంధనలు, ట్రిబ్యునళ్ల తీర్పులు, అంతర్రాష్ట్ర జల ఒప్పందాలతో పాటు ఏపీ పునర్విభజన చట్టంలోని నిబంధనల ఆధారంగా పరిశీలన జరిపి నిర్ణయం తీసుకుంటుందంటూ పాటిల్ హామీ ఇచ్చారని వివరించారు. కాగా ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని కోరుతూ ఈ నెల 13న సీఆర్ పాటిల్‌కు మళ్లీ తాను లేఖ రాసినట్టు ఉత్తమ్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాజెక్టును అడ్డుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి బుధవారం సచివాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు వస్తారా?

తెలంగాణకు నష్టం కలిగించనున్న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని సీఎం రేవంత్‌రెడ్డికి తాజాగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏపీ సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మరోవైపు ఈ ప్రాజెక్టును అడ్డుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ గత కొంత కాలంగా ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం మంత్రి ఉత్తమ్ నిర్వహించనున్న సమావేశానికి బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు వస్తారా? అనే అంశం ఆసక్తికరంగా మారింది.

బరాజ్‌లపై నిర్ణయం కేసీఆర్‌దే

మంత్రివర్గ సమావేశాల్లో ఎలాంటి నిర్ణయం జరగలేదు

జస్టిస్ ఘోష్ కమిషన్‌కు తెలిపిన నీటిపారుదల శాఖ

కేసీఆర్ వాంగ్మూలాన్ని తోసిపుచ్చిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఎదుట బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన వాంగ్మూలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. గత ప్రభుత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో బరాజ్‌ల నిర్మాణంపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని స్పష్టం చేసింది. కేసీఆర్ స్వయంగా తీసుకున్న నిర్ణయాల మేరకే బరాజ్‌లను నిర్మించారని తేల్చి చెప్పింది. బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెల 11న కేసీఆర్‌కు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించగా, మంత్రివర్గ నిర్ణయాల మేరకే బరాజ్‌లను నిర్మించినట్టు బదులిచ్చారు. ఈ నేపథ్యంలో నాటి మంత్రివర్గ సమావేశాలకు సంబంధించిన మినట్స్ కాపీలను సమర్పించాలని కమిషన్ 13న రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. అదే రోజు రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా కమిషన్‌ను కలిసి వివిధ మంత్రివర్గ సమావేశాలకు సంబంధించిన మినట్స్ కాపీలను అందజేశారు. బరాజ్‌ల నిర్మాణంపై మంత్రివర్గ నిర్ణయాలేమీ జరగలేదని, మాజీ సీఎం కేసీఆర్ మాత్రమే నిర్ణయం తీసుకున్నారని ఆయన కమిషన్‌కు రాతపూర్వకంగా లేఖ ఇచ్చినట్టు తెలిసింది. వాస్తవానికి కమిషన్ విచారణ ప్రారంభించిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని ఫైళ్లను కమిషన్ కార్యాలయానికి అందజేసినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. కమిషన్ మంత్రివర్గ నిర్ణయాలను కోరడంతో మళ్లీ అందజేసినట్టు వెల్లడించాయి.

38 మంది ఇంజనీర్లకు షోకాజ్ నోటీసులు

విజిలెన్స్ సిఫారసుల ఆధారంగా చర్యలు

క్రిమినల్ కేసులను ఎదుర్కోనున్న 17 మంది

జాబితాలో రిటైర్డ్ ఈఎన్‌సీలు, సీఈలు

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిన ఘటనపై విచారణ జరిపి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమర్పించిన నివేదికలోని సిఫారసుల ఆధారంగా బాధ్యులైన ఇంజనీర్లపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ సిఫారసుల ఆధారంగా మొత్తం 38 మంది ఇంజనీర్లు, రిటైర్డ్ ఇంజనీర్లకు మంగళవారం నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 17 మంది ఇంజనీర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని, 33 మంది ఇంజనీర్లపై అభియోగాలు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఏడుగురు రిటైర్డ్ ఇంజనీర్లపై రివైజ్డ్ పెన్షన్‌రూల్స్ ప్రకారం జరిమానాలు విధించాలని విజిలెన్స్ విభాగం సిఫారసు చేయగా, విజిలెన్స్ కమిషన్ సైతం ఆమోదించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గత మార్చి 8న నీటిపారుదల శాఖకు కమిషన్ లేఖ రాసింది. మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో అవకతవకలకు పాల్పడిన నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీపై జరిమానా విధించడంతోపాటు కుంగిపోయిన 7వ బ్లాక్ పునరుద్ధరణ వ్యయాన్ని వసూలు చేయాలని విజిలెన్స్ విభాగం సిఫారసులు చేయగా, ఆ మేరకు ఎల్ అండ్ టీకి సైతం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, బి.నాగేంద్ర రావు, నల్లా వెంకటేశ్వర్లు, నరేందర్ రెడ్డి, సీఈలు/రిటైర్డ్ సీఈలు టి.శ్రీనివాస్, పీఏ వెంకట కృష్ణా, అజయ్‌కుమార్, కె.సుధాకర్ రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ చంద్రశేఖర్, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ వి.ఫణిభూషణం, డిప్యూటీ సీఈ ఎండీ అజ్మల్ ఖాన్, ఎస్ఈలు బి.వెంకటరమణా రెడ్డి, బస్వరాజ్, మాజీ ఈఈ సర్దార్ ఓంకార్ సింగ్, ఈఈలు సీహెచ్ తిరుపతి రావు, ఎం.రఘురామ్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలని విజిలెన్స్ విభాగం సిఫారసు చేసింది.

సాయుధ పోరాట యోధురాలు శాఖమూరి సుగుణ కన్నుమూత



సాక్షి, యాదాద్రి/చందానగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకురాలు శాఖమూరి సుగుణ (91) సోమవరం రాత్రి కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో తుదిశ్వాస విడిచారు. ఆమె యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ సమీపంలోని బ్రాహ్మణపల్లిలో 1934 నవంబర్ 7న జన్మించారు. ఆమె తండ్రి కొమ్మిడి రామ చంద్రారెడ్డి, తల్లి లక్ష్మమ్మ. ఉమ్మడి వరంగల్ జిల్లా చెన్నూరు అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా రెండుసార్లు పనిచేసిన శాఖమూరి వెంకటకృష్ణ ప్రసాద్ అలియాస్ ఎస్వీకే ప్రసాద్ సతీమణి సుగుణ. ఆమె తొమ్మిదేళ్ల వయసులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో చేరారు. సాయుధ పోరాట నేత రావి నారాయణరెడ్డి మొదట ఆమెను తన కొరియర్‌గా నియమించుకున్నారు. 12 ఏళ్ల వయసులో 1949లో జూన్ 25న ఎస్వీకె ప్రసాద్‌తో ఆమెకు వివాహమైంది. ఆయన చెన్నూరు నియోజకవర్గం నుంచి 1952, 1964లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సుగుణ తన అన్న కోదండరాంరెడ్డి, రావి నారాయణరెడ్డితో హైదరాబాద్‌లో మహాత్మాగాంధీని కలిసి, దేశ స్వాతంత్ర్యోద్యమం కోసం తన చెవులకున్న లోలాకులను గాంధీకి విరాళంగా ఇచ్చారు. సాయుధ పోరాటంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవిలతో కలిసి పనిచేశారు. మియాపూర్‌లో తన సొంత భూమిని పేదల ఇళ్ల కోసం పంచిపెట్టారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి శాఖమూరి సుగుణ సొంత తమ్ముడు. సుగుణకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారంతా అమెరికాలో స్థిరపడ్డారు. సోదరి మృతిపట్ల నర్సింహారెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు ఆమె పార్థివ దేహంపై సీపీఐ జెండా ఉంచి పుష్పాంజలి ఘటించారు. సీపీఐ నేతలు సురవరం సుధాకర్‌రెడ్డి, సయ్యద్ అజీజ్ పాషా, పల్లా వెంకటరెడ్డి తదితరులు సుగుణ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆమె పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం గురువారం ఉదయం 8.30 గంటల నుంచి 11.00 గంటల వరకు సీఆర్ ఫౌండేషన్‌లో ఉంచి, మధ్యాహ్నం 12 గంటలకు మియాపూర్‌లోని ఆమె స్వగృహానికి తరలిస్తారు. సాయంత్రం 4.00 గంటలకు ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

..నిజామాబాద్‌లో తక్కువ

▶ మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ స్థానాల పునర్విభజనను జాప్యం చేస్తున్నారంటూ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం ఇటీవలే సమాధానమిస్తూ.. కొత్త జనాభా లెక్కలు రాగానే ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపింది. కోర్టు కేసుతో సంబంధం లేకుండానే 2027 తర్వాత దేశమంతా పునర్విభజన చేస్తుండటంతో రాష్ట్రంలో నియోజకవర్గాల్లో చేర్పులు, మార్పులు, కొత్త నియోజకవర్గాల ఏర్పాటు అనివార్యం కానున్నాయి.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అత్యధిక స్థానాలు

2011 జనాభా లెక్కలతోపాటు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ తాజా అంచనాల మేరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏకంగా 9 శాసనసభ స్థానాలు పెరగనున్నాయి. అవన్నీ ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న శివారు ప్రాంతాల్లోనే కావటం విశేషం. జాతీయ సగటును మించి, విద్య, ఉపాధి, ఐటీ, ఫార్మా, సినిమా, ఇతర అవకాశాల కోసం దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు పెరిగిన వలసల తాకిడి కారణంగా నగరంలో అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. పునర్విభజనలో గ్రేటర్ హైదరాబాద్‌లో కనీసం పది అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. హైదరాబాద్ కోర్‌సిటీ (హైదరాబాద్ జిల్లా)లో రెండు, గ్రేటర్ హైదరాబాద్‌లో భాగమైన శివార్లలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి, రాజేంద్రనగర్, మహేశ్వరం తదితర నియోజకవర్గాల పరిధిలోని ప్రాంతాలన్నీ విడిపోయి కొత్తగా 9 కొత్త నియోకజవర్గాలు ఏర్పాటు కానున్నాయి.

ఖమ్మం జిల్లాలో ప్రత్యేక పరిస్థితి

డీలిమిటేషన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రత్యేక పరిస్థితి ఏర్పడనుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా 27,97,370. అయితే, ఆ జిల్లా నుంచి 5 మండలాలు ఏపీలో విలీనం కావటం, కొన్ని మండలాలు ములుగు జిల్లాల్లోకి వెళ్లటంతో జిల్లా జనాభా గణనీయంగా తగ్గిపోయింది. అయినా, ఆదివాసీ ప్రాంతాలు, భౌగోళిక పరిస్థితుల కారణంగా ఆ జిల్లాలో శాసనసభ స్థానాలు తగ్గించకుండా అదనంగా రెండు స్థానాలు పెంచే అవకాశం ఉంది.

డీలిమిటేషన్ ఇలా..

- దేశవ్యాప్తంగా జనాభా లెక్కలు పూర్తి కాగానే నియోజకవర్గాల పునర్విభజన కోసం ఏర్పాటయ్యే కమిషన్ రాజకీయ పక్షాలు, ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తుంది. కొత్త జిల్లాల మేరకు ఒక మండలం ఒకే నియోజకవర్గం, ఒకే జిల్లాలో ఉండే విధంగా భౌగోళిక మార్పులు చేస్తుంది. ప్రస్తుతం తెలంగాణలో పలు నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో కూడా ఉండగా, వాటిని ఒకే జిల్లా పరిధిలోకి తీసుకొస్తారు.
- రాష్ట్ర మొత్తం జనాభాను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గంలో ఉండాల్సిన సగటు జనాభాను నిర్ణయిస్తారు. 2001 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకున్న గత కమిషన్ తెలంగాణలో ప్రతి నియోజకవర్గానికి 2,30,064 సగటు జనాభాగా నిర్ధారించింది. అయితే ఈ సగటుకు 10 శాతం జనాభా తక్కువ లేదా ఎక్కువైనా ఉండొచ్చు.
- 2001లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న జనాభాను సగటుగా తీసుకుని డీలిమిటేషన్ చేయటంతో తెలంగాణలో అంతకు ముందు 107 ఉన్న అంసెబ్లీ స్థానాలు 119కి పెరిగాయి. 12 స్థానాలు ఆంధ్రప్రదేశ్‌లో తగ్గిపోయాయి.
- డీలిమిటేషన్‌లో కొండప్రాంతాలు, గిరిజనులు, ఇతర ప్రత్యేక కారణాలను కూడా పరిగణనలోకి తీసుకుని నియోకజవర్గాలు ఏర్పాటు చేస్తారు. కొండలతో, విసిరేసినట్లు ఉండే హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహోల్ – స్పితి అసెంబ్లీ నియోజకవర్గం 25 వేల జనాభాతోనే ఏర్పాటైంది. సిక్కింలోని సాంగ్మో అసెంబ్లీ స్థానం సైతం తక్కువ జనాభాతో కొనసాగుతోంది. ప్రస్తుతం దేశంలో 6,98,000 మందితో అత్యధిక జనాభా కలిగిన శాసనసభ నియోజకవర్గంగా శేరిలింగంపల్లి రికార్డుకెక్కింది. ఢిల్లీలోని చాందినీచౌక్, యూపీలోని ఘజియాబాద్‌లు సైతం జనాభా పరంగా అదిపెద్ద నియోజకవర్గాలే.

మావోయిస్టుల ముసుగేసి.. ఫోన్లు ట్యాప్ చేసి!

- ట్యాపింగ్‌కు మావోయిస్టుల పేరు వాడుకున్న ప్రభాకర్‌రావు టీమ్
- 2023 నవంబర్‌లో ఒకే రోజు 600 ఫోన్లు ట్యాపింగ్
- సిట్‌కు వాంగ్మూలం ఇచ్చిన పీసీసీ చీఫ్, రాజ్యసభ ఎంపీ
- నేడు పలువురు బీజేపీ నాయకులు, వ్యాపారుల వాంగ్మూలం
- బుధవారం నాలుగోసారి విచారణకు టి.ప్రభాకర్‌రావు
- ట్యాపింగ్‌కు కేసీఆర్, కేటీఆర్‌లే సూత్రధారులు: మహేశ్‌కుమార్‌గౌడ్



మీడియాతో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్తకొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీల నేతలతో పాటు టార్గెట్ చేసిన బడా వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేయడానికి నాటి ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు టీమ్.. వారందరికీ మావోయిస్టుల ముసుగు వేసినట్లు తేలింది. కొందరి ఫోన్ నంబర్లు మావోయిస్టులవి అని, మరికొందరివి వారి సానుభూతిపరులవి అని, ఇంకొందరు మావోయిస్టులకు సహకరిస్తున్నారనే అనుమానాలు అంటూ ట్యాపింగ్‌కు అనుమతి పొందారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు ఆ విషయాన్ని గుర్తించి.. ప్రభాకర్‌రావు టీమ్ ఎవరి ఫోన్లను ట్యాప్ చేసిందో, వారందరినీ బాధితుల జాబితాలో చేర్చారు. వారికి సాక్షులుగా నోటీసులు జారీ చేసి వాంగ్మూలాల నమోదు ప్రారంభించారు. మంగళవారం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సరిత, ఆమె భర్త తదితరులు సిట్ ఎదుట హాజరై వాంగ్మూలాలు ఇచ్చారు.

నేడు మరికొందరు

బుధవారం ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్‌రావు సహా మరికొందరు బీజేపీ కీలక నేతలు సిట్ ముందు వాంగ్మూలాలు ఇవ్వనున్నారు. మరోపక్క ప్రభాకర్‌రావును మంగళవారం విచారించాల్సి ఉండగా.. బుధవారానికి వాయిదా వేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్ఐబీ, స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) వేల ఫోన్లు ట్యాప్ చేసింది. రాజకీయ నాయకులు, బడా వ్యాపారులు, ప్రముఖులు, కొందరు జర్నలిస్టులపై ఎస్ఓటీ నిఘా ఉంచిందని తేలింది. 2023 నవంబర్ 15న ఒకేరోజు ఏకంగా 600 ఫోన్లు ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ట్యాపింగ్ చేసే ఫోన్ నంబర్లు, వివరాలను రివ్యూ కమిటీని సమర్పించాల్సి ఉంటుంది. దీంతో ప్రభాకర్‌రావు అవన్నీ మావోయిస్టులు, వారికి మద్దతు ఇస్తున్నవారివి అని చెప్పి ట్యాపింగ్‌కు అనుమతి పొందారు. ఫలానా నంబర్లు ట్యాప్ చేయాలని సర్వీస్ ప్రొవైడర్లకు రాసిన లేఖల్లో కొన్నింటిని సిట్ అధికారులు సేకరించారు. నాడు అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో అసంతృప్తుల ఫోన్లు సైతం ఎస్ఓటీ ట్యాప్ చేసింది. ప్రణీత్‌రావు ఆ వివరాలను ఎస్ఐబీలో అదనపు ఎస్పీగా ఉన్న భుజంగరావుకు అందించారని సిట్ గుర్తించింది. ట్యాపింగ్ ద్వారా రికార్డు చేసిన సంభాషణలను నివేదికలుగా మార్చి అవసరమైన వారికి ప్రభాకర్‌రావు పంపారు. దీనికోసం ప్రత్యేకంగా టైపింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. ట్యాపింగ్‌లో వెలుగులోకి వచ్చిన కీలక వివరాలను అప్పటి అధికారపార్టీ నేతలకు భుజంగరావు, రాధాకిషన్‌రావు అందించినట్లు అధికారులు చెప్తున్నారు.

కేసీఆర్, కేటీఆరే సూత్రధారులు

రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా, నేను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 2021లో బాధ్యతలు స్వీకరించాం. అప్పటి నుంచి చాలా సందర్భాల్లో మా కదలికల్ని వాళ్లు గుర్తించారు. దీంతో మా ఫోన్లు ట్యాపింగ్‌లో ఉన్నాయని అనుమానం వచ్చింది. అప్పటి చీఫ్ సెక్రటరీని కలిసి ఫిర్యాదు చేశాం. ఇవాళ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. చట్టవ్యతిరేకంగా కొన్ని వేల మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాప్ చేశారు. ఇది హేయమైన చర్య. ఇలాంటి చర్యకు పాల్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్, కేటీఆర్‌లు సిగ్గుతో తల వంచుకోవాలి. 2018లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి కారణం కూడా ట్యాపింగ్ అని అర్థం అవుతోంది. 2022 నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు అన్నీ ట్యాపింగ్‌లో ఉన్నాయి. సిట్ అధికారులు చూపించిన లిస్టు ప్రకారం 650 మంది సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాప్ చేశారు. ఈ వ్యవహారానికి వంద శాతం సూత్రధారులు ఆనాటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లే. నాటి సీఎస్ సోమేశ్ కుమార్, హోం సెక్రటరీ, డీజీపీలను కూడా శిక్షించాలి.

– మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్, టీపీసీసీ చీఫ్

కేసీఆర్‌కు సోమేశ్‌కుమార్, ప్రభాకర్‌రావు లొంగిపోయారు

గత ప్రభుత్వంలో కేసీఆర్, ఆయన కుటుంబీకులు ప్రభుత్వ సంస్థను దుర్వినియోగం చేశారు. నాటి సీఎస్ సోమేశ్‌కుమార్, ప్రభాకర్‌రావు తదితరులు కేసీఆర్ కుటుంబానికి లొంగిపోయారు. ట్యాపింగ్ ద్వారా లభించిన సమాచారాన్ని దుర్వినియోగం చేశారు. ఇది దేశద్రోహంతో సమానం. ఇలాంటి చర్యలకు పాల్పడ్డారు కాబట్టే ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పారు.

– మీడియాతో అనిల్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు

మహేశ్ గౌడ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసు

ఫోన్ ట్యాపింగ్ వ్యాఖ్యలపై బేషరతు క్షమాపణకు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ పేరిట టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తనతో పాటు తమ పార్టీ నేతలపై దిగజారుడు వ్యాఖ్యలు చేసిన మహేశ్ గౌడ్ బేషరతు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మహేశ్‌గౌడ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. 'స్థానిక ఎన్నికల్లో ప్రజల్ని తప్పుదోవ పట్టించాలనే దురుద్దేశంతోనే మరోసారి ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చినా, ఈ లొట్టపీసు కేసుతో ఒరిగేదేమీ లేదు. సీఎం, పీసీసీ చీఫ్ అబద్ధాలు చెప్పడంలో పోటీపడుతున్నట్టు కనిపిస్తోంది. రాజకీయంగా పబ్బం గడుపుకునేందుకు చేసే ఇలాంటి దుర్మార్గపూరిత వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ లాంటి నాయకులను కోర్టుకు ఈడుస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ సర్కారు తన చేతికానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చింది. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా మాపై ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. ఆరు గ్యారంటీలను, 420 హామీలను పూర్తిగా గాలికొదిలేసి ఇలాంటి దిక్కుమాలిన చర్యలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదు. అడ్డగోలుగా మాట్లాడితే బీఆర్ఎస్ శ్రేణులు కూడా చూస్తూ ఊరుకోవు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

'బండి'పై కేసు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆయనపై మిర్యాలగూడ పరిధిలో దాఖలైన మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘన కేసును కొట్టివేసింది. మిర్యాలగూడ మండలం ఎంపీడీవో ఫిర్యాదు మేరకు బండి సంజయ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకుడు సైదులుపై పోలీసులు కేసు నమోదు చేశారు. నవంబర్ 15న బండి సంజయ్‌తోపాటు 40 వాహనాల కాన్వాయ్ రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా మిర్యాలగూడ నుంచి సూర్యాపేటకు వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాద్గార్‌పల్లి సెంటర్ సమీపంలో సైదులు 60 మంది అనుచరులతో కలిసి కాన్వాయ్‌ను అడ్డుకున్నారని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి సమావేశయ్యారని, కాన్వాయ్‌పై దాడి చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించారని చెప్పారు. తాను ఎలాంటి తప్పు చేయకున్నా కేసు నమోదు చేశారని, కొట్టివేయాలని కోరుతూ బండి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. క్వాష్ పిటిషన్‌ను అనుమతిస్తూ, సంజయ్‌పై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో రక్తదాన దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ రిటైల్ చెయిన్స్‌లో ఒకటైన జోయాలుక్కాస్ ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విస్తృత రక్తదాన డ్రైవ్‌ను నిర్వహించింది. భారత్‌తోపాటు తమ అంతర్జాతీయ షోరూంల నుంచి 2,500యూనిట్ల రక్తాన్ని సేకరించింది. తమ అన్ని అవుట్‌లెట్లలో ఏకకాలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, వినియోగదారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంపై జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ, సమాజానికి తిరిగి ఇవ్వడంతో విశ్వసించే బ్రాండ్ అయిన జోయాలుక్కాస్ జీవితాలను కాపాడే గొప్ప లక్ష్యానికి మద్దతు ఇచ్చినందుకు గర్విస్తున్నామని చెప్పారు. రక్తదానంతో ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపిన ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జోయాలుక్కాస్ గ్రూప్ విభిన్నమైన వ్యాపార ప్రయోజనాలు గల బహుళ బిలియన్ డాలర్ల సంస్థ అని ఆయన చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 9 వేల మందికిపైగా నిపుణులతో పలు పురస్కారాలతో తమ సంస్థ గుర్తింపుపొందిందని ఆయన వెల్లడించారు.

ఓటర్ల జాబితా నుంచి మృతుల పేర్లు తొలగింపు

- రిజిస్ట్రార్ జనరల్ సమాచారం ఆధారంగా చర్యలు
- బహుళ అంతస్తుల సముదాయాల్లోనూ పోలింగ్ కేంద్రాలు
- సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: పౌరుల జనన, మరణాలకు సంబంధించిన సమాచారాన్ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ బర్త్స్, డెత్స్ అండ్ మ్యారేజెస్ నుంచి సేకరించి దాని ఆధారంగా మరణించిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. రిజిస్ట్రార్ జనరల్ నుంచి తీసుకున్న సమాచారాన్ని తమ కార్యాలయం జిల్లాలకు పంపిస్తుందని, దాని ఆధారంగా మృతిచెందిన వారి ఓటర్ల పేర్లను తొలగిస్తారన్నారు. మంగళవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్నికల సంస్కరణలపై సీఈసీ తీసుకుంటున్న చర్యలను సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. పోలింగ్ బూత్‌లో గరిష్ట ఓటర్ల సంఖ్యను 1,200 నుంచి 1,050కి తగ్గించినట్టు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు బహుళ అంతస్తుల సముదాయాలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లలో సైతం పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విషయంలో బిహార్‌లో తీసుకున్న చర్యలను రాష్ట్రంలో సైతం అమలు చేస్తామన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్ల ఫోన్లను తీసుకుని సురక్షితంగా డిపాజిట్ చేసి ఓటేసిన తర్వాత తిరిగి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. నివాస ప్రాంతానికి కనీసం 2 కి.మీ. దూరంలో పోలింగ్ కేంద్రం ఉండాలని నిబంధన ఉండగా, దీనిని 1 కి.మీ.కి తగ్గించినట్టు వెల్లడించారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉండాలన్న నిబంధనను సైతం మార్చి 100 మీటర్లకు తగ్గించినట్టు తెలిపారు. ఎన్నికల సంఘానికి సంబంధించిన 40 మొబైల్ అప్లికేషన్లను 'ఈసీఐ నెట్' పేరుతో ఒకే గొడుగు కిందకి తెస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు , బూత్ స్థాయి ఏజెంట్లకు ఈ నెల 26, 27న శిక్షణ ఇస్తున్నామన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేయడం తప్పనిసరి కాదన్నారు.

'పామాయిల్ గెల'.. గగ్గోలు

ఆయిల్‌పామ్ రైతులకు తాకిన సుంకం తగ్గింపు దెబ్బ

మే నెలాఖరున రూ. 20,058గా ఉన్న టన్ను గెలల ధర ప్రస్తుతం రూ. 18,748



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఆయిల్‌పామ్ రైతులకు దిగుమతి సుంకం తగ్గింపు దెబ్బ తగిలింది. క్రూడ్ పామ్ ఆయిల్ (సీపీఓ) తోపాటు క్రూడ్ సన్ ఫ్లవర్, క్రూడ్ సోయా ఆయిల్‌లపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం గత నెల 31న నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో మే 31 నాటికి ఒక టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.20,058 ఉండగా, ఇప్పుడు ఆ ధర రూ.18,748కి తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతి సుంకాన్ని 10 శాతం మేర కేంద్ర ప్రభుత్వం తగ్గించగా, పామాయిల్ గెలల ధరపై కూడా సుమారు 10 శాతం వరకు ప్రభావం చూపింది. విదేశాల నుంచి క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్ దిగుమతి పెరగడంతోనే ఆయిల్ పామ్ గెలల ధర పడిపోయిందని వ్యవసాయ రంగ నిపుణులు చెబుతున్నారు.

తగ్గని వంటనూనెల ధర

ఆయిల్ పామ్ గెలల ధర తగ్గినా, వంట నూనెల రిటైల్ ధరలు తగ్గకపోవడం గమనార్హం. పామాయిల్, సన్‌ఫ్లవర్, రైస్ బ్రాన్ ఆయిల్ లీటర్ సాచెట్‌ల ధరల్లో రూపాయి వ్యత్యాసం కూడా లేదు.

- మే 31వ తేదీన సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర లీటర్‌కు రూ.137.40 గా ఉంటే ఈనెల 16వ తేదీ నాటికి ఆ ధర రూ.136.10గా ఉంది.
- పామాయిల్ రిటైల్ ధర గత నెల 31న రూ.115.20 ఉండగా, 13వ తేదీ వరకు సుమారు రూ. 5 తగ్గి రూ.110.70కి చేరగా, 16న ఒక్కసారిగా రూ. 5 పెరిగి రూ. 116.10కి చేరుకుంది.

పామాయిల్ గెలల ధరలు తగ్గినా, సాధారణ వినియోగదారుడికి పామాయిల్ ఇతర తిండి నూనెలు అందుబాటులోకి రాకపోవడం ఆందోళన కలిగించే విషయమే. నూనెల ధరలు, గెలల ధరలతో సంబంధం లేకుండా రైతులకు సుస్థిర ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇచ్చి కృషి చేస్తుందని ఆయిల్‌ఫెడ్ ఎండీ శంకరయ్య 'సాక్షి'కి తెలిపారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు.



థాంక్యూ హైడ్రా..

'మా బడికి బాట చూపించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సార్‌కు ధన్యవాదాలు' అంటూ చిన్నారి విద్యార్థులు ముక్తకంఠంతో నినదించారు. -10లో



టెస్ట్.. బెస్ట్

నగరంలో ఫుడీస్, ఫుడ్ లవర్స్, భోజనప్రియులు ముందస్తుగా ఫుడ్ ఇన్‌టోలరెన్స్ టెస్టు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు వైద్యులు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 34.0/24.0

వాతావరణం

నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 34, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

రూ.1.20 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏఈ



లంచం డబ్బులతో ఏఈ స్వరూప

కాప్రా: చర్లపల్లి డివిజన్ పరిధిలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ సీహెచ్ రామిరెడ్డి నుంచి ఇంజినీరింగ్ విభాగం ఏఈ స్వరూప రూ.1.20 లక్షలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు దొరికిపోయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డివిజన్ పరిధిలో రూ. 28.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి అధికారులు టెండర్ వేశారు. టెండర్‌ను కాంట్రాక్టర్ సీహెచ్ రామిరెడ్డి దక్కించుకుని, సీసీ రోడ్డు పనులను దాదాపు పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన నిధుల విడుదలకు ఇంజినీరింగ్ విభాగం అధికారులు రెండు విడతలుగా ఎంబీ బుక్స్ చేసి ఉన్నతాధికారులకు ప్రపోజల్ ఫైల్‌ను పంపారు. తొలుత రూ. 26 లక్షలు మంజూరయ్యాయి. మిగతా రూ. 2.50 లక్షల కోసం సదరు కాంట్రాక్టర్ కాప్రా సర్కిల్ కార్యాలయం చుట్టూ తిరిగారు. అయినా నిధులు మంజూరు కాలేదు. పెండింగ్ బిల్లు మంజూరు చేయాలంటే రూ.1.50 లక్షలు ఇవ్వాలని ఏఈ బి.స్వరూప డిమాండ్ చేశారు. చివరికి రూ.1.20 లక్షలు ఇస్తే బిల్లు ప్రాసెస్ చేస్తానని చెప్పడంతో గత్యంతరం లేని కాంట్రాక్టర్ రామిరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. మంగళవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో కాంట్రాక్టర్ రామిరెడ్డి నుంచి ఏఈ స్వరూప రూ.1.20 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రభుత్వ అధికారులెవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ సూచించారు.

37 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చుక్కలు చూపిస్తున్న కేటుగాళ్ల ఆటకట్టించారు హైదరాబాద్ పోలీసులు. సైబర్ నేరాలు, నేరస్తులను సీరియస్ తీసుకున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆరు రాష్ట్రాల్లో స్పెషల్ ఆపరేషన్స్ నిర్వహించి 37 మంది సైబర్ నిందితులను పట్టుకున్నారు. రూ.14.54 కోట్ల సొమ్మును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఆయా నిందితులపై దేశవ్యాప్తంగా 178 కేసులు ఉండగా.. తెలంగాణలో ఏకంగా 74 కేసులు నమోదయ్యాయి.

సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



సాక్షి, సిటీబ్యూరో: శిల్పా లే ఔట్ ఫేజ్– 2 ఫ్లైఓవర్ సుందరీకరణ పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఓఆర్‌ఆర్ నుంచి గచ్చిబౌలి వరకు రూ. 178 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్లైఓవర్ త్వరలో అందుబాటులోకి రానున్న నేపథ్యంలో మంగళవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుందరీకరణ, గ్రీనరీ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫ్లై ఓవర్‌పై ట్రాన్స్‌ఫర్‌బార్స్ (రంబుల్ స్ట్రిప్స్) ఐఆర్‌సీ నిబంధనల కనుగుణంగా మాత్రమే ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఆన్‌లైన్‌లోనే ల్యాండ్‌యూజ్ సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు

- గతంలో భూ వినియోగ పత్రాలపై భారీగా అక్రమాలు
- చెరువుల్లోని భూములకు సైతం నివాస వినియోగం
- ఇక నిబంధనలకు అనుగుణంగా ల్యాండ్ యూజ్ పత్రాలు
- ట్రిపుల్ ఆర్ వరకు హెచ్‌ఎండీఏ పరిధి విస్తరణ

సులభం.. భూ వినియోగ పత్రం



సాక్షి, సిటీబ్యూరో:

ఇక ఈజీగా భూ వినియోగ ధ్రువీకరణ పత్రాలు లభించనున్నాయి. దరఖాస్తు చేసుకున్న తర్వాత కొన్ని రోజుల వ్యవధిలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లోనే అందజేయనున్నారు. ఇందుకోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ప్రత్యేకంగా దృష్టి సారించింది. గతంలో ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్‌ల జారీలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. చెరువులు, పార్కులు, వ్యవసాయ, అటవీ భూములను సైతం కొన్నిచోట్ల నివాసయోగ్యమైనవిగా ధ్రువీకరిస్తూ సర్టిఫికెట్‌లను జారీ చేశారు. మూడేళ్ల క్రితం వరకు నగరం చుట్టుపక్కల అనేక ప్రాంతాల్లో ల్యాండ్‌యూజ్ సర్టిఫికెట్‌లు పెద్ద ఎత్తున దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మరోవైపు నిజాయతీగా, అన్ని విధాలా అర్హత ఉన్న భూములకు సైతం సకాలంలో ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్‌లు లభించకపోవడంతో చాలా మంది తీవ్రంగా నష్టపోయారు. తీవ్రమైన జాప్యం కారణంగా ఇబ్బందులకు గురయ్యారు.

అక్రమాలను నివారించేందుకు..

రియల్ ఎస్టేట్ భూమ్ బలంగా ఉండి అనేక చోట్ల భూముల ధరలు భారీగా పెరిగాయి. ఆకాశహార్మ్యలు వెలిశాయి. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో భూ వినియోగ ధ్రువీకరణ పెద్ద వ్యాపారంగా కొనసాగింది. ఇలాంటి అక్రమాలను నివారించి పారదర్శకంగా అందజేసేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు కసరత్తు చేపట్టారు. దరఖాస్తుదారులు ప్రత్యేకంగా హెచ్‌ఎండీఏ అధికారులను సంప్రదించాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకొని ఫీజులు చెల్లించి పత్రాలను పొందవచ్చు. 'ఆన్‌లైన్‌లో అందజేయడంలో ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తుదారులకు సకాలంలో సర్టిఫికెట్‌లు లభిస్తాయి' అని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. ఇందుకనుగుణంగా త్వరలో కార్యాచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ట్రిపుల్ ఆర్ వరకు మ్యాపింగ్...

హెచ్‌ఎండీఏ పరిధిని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించిన సంగతి తెలిసిందే. దీంతో గతంలో 7 జిల్లాల్లో 7250 చ.కి.మీ ఉన్న హెచ్‌ఎండీఏ కొత్తగా 10,472 చ.కి.మీ వరకు పెరిగింది. 11 జిల్లాలకు విస్తరించి ఉంది. దీంతో ట్రిపుల్ ఆర్ వరకు కొత్తగా హెచ్‌ఎండీఏలో విలీనమైన 1,355 గ్రామాల్లోని భూములను సైతం జియో మ్యాపింగ్ చేయనున్నారు. ఈ దిశగా ఇప్పటికే మెగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. చాలాచోట్ల భూముల వాస్తవ స్థితిగతులు మారాయి. కొన్నిచోట్ల అనేక రకాలుగా ఆక్రమణకు గురయ్యాయి. నిర్దిష్టంగా ఏ భూమి ఏ రకమైన వినియోగంలో ఉందనే విషయంలో స్పష్టత కొరవడింది. ఈ క్రమంలో అన్ని ప్రాంతాల్లో భూములను జియో మ్యాపింగ్ చేస్తారు. తద్వారా దరఖాస్తుదారులు కోరిన విధంగా ల్యాండ్‌యూజ్ సర్టిఫికెట్‌లను అందజేసేందుకు అవకాశం లభిస్తోంది. ఈ క్రమంలోనే అవకాశం ఉన్న చోట వ్యవసాయ భూములను నివాస యోగ్యమైనవిగా మార్చుకొనేందుకు కూడా వెసులుబాటు లభించనుంది. 'శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో మెగా మాస్టర్‌ప్లాన్ అతికీలకమైన మైలురాయి కానుంది. 2050 వరకు హైదరాబాద్ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను ఇందులో రూపొందిస్తున్నామని హెచ్‌ఎండీఏ ప్లానింగ్ అధికారులు తెలిపారు. ఈ మాస్టర్‌ప్లాన్ ఆధారంగానే దరఖాస్తుదారులు కోరినవిధంగా సేవలను సులభంగా అందజేయవచ్చని పేర్కొన్నారు.

లే అవుట్‌లు, నిర్మాణాల్లో కీలకం..

భూ వినియోగ ధ్రువీకరణ పత్రాలతో పాటు లేఅవుట్‌లు, భవన నిర్మాణాల్లో సైతం వివిధ రకాల భూముల మ్యాపింగ్ కీలకం కానుంది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో సమగ్రమైన మ్యాపులు అందుబాటులో లేకపోవడంతో అధికారులు రకరకాల మ్యాపులను పరిశీలించాల్సి వస్తోంది. ఈ కారణంగా కొత్తగా చేరిన ప్రాంతాల్లో లేఅవుట్ అనుమతుల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. వివిధ కేటగిరీలుగా భూములను మ్యాపింగ్ చేసిన అనంతరం కొత్తగా చేరిన ప్రాంతాల్లో కూడా లే అవుట్ ప్రొసీడింగ్‌లు సులభతరం కానున్నాయి. ట్రిపుల్ ఆర్ వరకు హెచ్‌ఎండీఏ పరిధిలోని భూముల మ్యాపింగ్‌పై రెండు రోజుల క్రితం అధికారులు సమావేశమయ్యారు. ప్రస్తుతం ఈ కసరత్తు తుది దశలో ఉందని, త్వరలోనే పూర్తి చేసి అనుమతులను ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

అండగా ఉండేందుకు..

డబ్ల్యూఎస్‌వీలో వీపీయూ

- బాధిత మహిళలు, చిన్నారుల కోసం ఏర్పాటు
- ఏహెచ్‌టీ, జేబీ విభాగాలు మరింత పటిష్టం
- ప్రారంభించిన నగర పోలీసు కమిషనర్ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: మనుషుల అక్రమ రవాణాలో బాధితులుగా మారిన మహిళలు, వెట్టిచాకిరీ, బాల కార్మిక వ్యవస్థల్లో నలిగిపోతున్న చిన్నారులకు సహాయం చేయడానికి నగర పోలీసులు విక్టిమ్స్ అసిస్టెన్స్ యూనిట్ (వీపీయూ) పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆధునికీకరించిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), జువైనల్ బ్యూరో (జేబీ)లను మంగళవారం నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ప్రారంభించారు. మహిళా భద్రత విభాగం (డబ్ల్యూఎస్‌వీ) నేతృత్వంలో ఈ వింగ్స్ పని చేయనున్నాయి. ఏహెచ్‌టీయూలో ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు హెడ్‌-కానిస్టేబుళ్లు, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారు. మనుషుల అక్రమ రవాణాను నిరోధించాలనే లక్ష్యంగా ఈ విభాగానికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.

పర్యవేక్షణ బాధ్యతల అప్పగింత..

- బాహ్య ప్రపంచంతో పాటు ఆన్‌లైన్‌లోనూ ఉన్న మనుషుల అక్రమ రవాణా కేంద్రాలను వీళ్లు గుర్తిస్తారు. ఈ రెండు మార్గాల్లో సాగే వ్యభిచార దందాకూ చెక్ చెప్పే దిశగా చర్యలు తీసుకుంటారు. అక్రమ రవాణా నెట్‌వర్క్‌లో ఉన్న ప్రతి ఒక్కరి కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటారు. ఇందులో భాగంగా స్థానిక ఠాణాలతో సమన్వయం ఏర్పాటు చేసుకుని బాధితుల మహిళలు, యువతుల రెస్క్యూకు ముందు, తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పర్యవేక్షణ బాధ్యత లీన్నీ కొత్వాల్ వీరికి అప్పగించారు.
- ఇటీవల కాలంలో కొన్ని దేశాల నుంచి మహిళలను తీసుకువచ్చి వ్యవస్థీకృతంగా వ్యభిచారం చేయించే ముఠాలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే వీపీయూకు మరో కీలక బాధ్యతనీ ఉన్నతాధికారులు అప్పగించారు. వ్యభిచార కూపాల నుంచి రెస్క్యూ అయిన వారిలో ఇతర రాష్ట్రాల వారిని ఆయా రాష్ట్రాలకు పంపడం, విదేశీయులను డిపోర్ట్ చేయడం ఈ విభాగం విధుల్లో ఒకటి. ఏడాదికాలంలో ఏహెచ్‌టీయూ వివిధ ప్రాంతాల్లో దాడులు చేసిన 23 కేసులు నమోదు చేసింది, 44మంది బాధితులను రక్షించడంతో పాటు 71 నిందితుల్ని అరెస్టు చేసింది.

బాలల సంక్షేమ కమిటీతో సమన్వయం..

- మరోపక్క జేబీని ఏడుగురితో ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు హెడ్‌-కానిస్టేబుళ్లు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉంటారు. ఈ టీమ్ బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నుంచి చిన్నారులను రక్షిస్తుంది. తప్పిపోయి వచ్చిన చిన్నారుల సంబంధీకులు దేశంలో ఏ ప్రాంతంలో ఉన్నా గుర్తించి వారి వద్దకు చేరుస్తుంది. ఈ దిశగా బాలల సంక్షేమ కమిటీతో సమన్వయంతో పని చేస్తుంది. ఈ ఏడాది జేబీ యూనిట్ రాష్ట్రానికి చెందిన నలుగురు, ఇతర రాష్ట్రాలకు చెందిన ఏడుగురిని తమ కుటుంబాల వద్దకు చేర్చింది. 'ఆపరేషన్ స్మైల్', 'ఆపరేషన్ ముస్కాన్'ల్లో 896 మందిని రెస్క్యూ చేసింది.
- ఏహెచ్‌టీయూ, జేబీలతో కలిసి పని చేయడానికి రాష్ట్రంలోనే తొలిసారిగా వీపీయూను నగర పోలీసులు ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థ ప్రజ్వల సహకారంతో పని చేసే ఈ విభాగం కోర్టుల్లో ఉన్న కేసుల విచారణ సమయంలో సాక్ష్యం చెప్పడానికి బాధితులను సిద్ధం చేస్తుంది. వారికి ప్రభుత్వ పథకాలు, న్యాయ సహాయం, పునరావాస ప్రయోజనాలు, కౌన్సెలింగ్ తదితరాలు పొందడంలో సహాయపడుతుంది. బాధితులు పునరావాసం పొంది, సమాజంలో ఒకరుగా మారడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మహిళా భద్రతా విభాగం డీసీపీ పర్యవేక్షణలో పని చేసే ఈ వీపీయూలో ప్రజ్వల సిబ్బంది ఉంటారు.

ఈవీలకు వైర్‌లెస్ చార్జింగ్

బ్లాక్ చైన్ టెక్నాలజీతో ప్రయోగం

- స్మార్ట్ ఫోన్ సహాయంతో ఆపరేటింగ్
- ఓయూలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ల పరిశోధన



స్మార్ట్ గ్రిడ్ ఎలక్ట్రికల్ మోడల్‌ను పరిశీలిస్తున్న ప్రొఫెసర్లు (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: కాలుష్య నియంత్రణ, ఇంధన కొరత కారణంగా భవిష్యత్‌లో విద్యుత్ వాహనాల వినియోగం భారీ సంఖ్యలో పెరగనున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్లు వైర్‌లెస్ చార్జింగ్‌పై పరిశోధన ప్రారంభించారు. ద్విచక్ర వాహనాల నుంచి బస్సులు ఇతర భారీ వాహనాల వరకు ఎలక్ట్రికల్ వాహనాలకు కావాల్సిన పవర్‌ను (విద్యుత్) బ్యాటరీల చార్జింగ్ ద్వారా పొందుతాయి. విద్యుత్ చార్జింగ్ సెంటర్లు అంతటా అందుబాటులో ఏర్పాటు చేయరు. అనుకోకుండా వాహనం బ్యాటరీలో చార్జింగ్ లేనప్పుడు వెంటనే పొందేందుకు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీని రూపొందించి వైర్‌లెస్ చార్జింగ్ కోసం లోతైన పరిశోధనలు చేస్తున్నట్లు ప్రొఫెసర్లు తెలి పారు. ఈ పద్ధతి వల్ల విద్యుత్ ఆదాతో పాటు స్మార్ట్ ఫోన్‌లో యాప్ ద్వారా ఎలక్ట్రికల్ వాహనాలకు వైర్‌లెస్ చార్జింగ్ చేసుకోవచ్చు అని వివరించారు.

స్మార్ట్ ఫోన్‌తో ఆపరేటింగ్

స్మార్ట్ ఫోన్‌లో ఉబర్, ఓలా యాప్ నుంచి వాహనాలను బుక్ చేసుకున్నట్లు పవర్‌ను బుక్ చేసుకొని కొనుగోలు చేసుకోవచ్చు. స్మార్ట్ ఫోన్‌లో యాప్‌ను ఉపయోగించి కావాల్సిన పవర్‌ను బుక్ చేసుకొని పొందవచ్చు అని ప్రొఫెసర్లు వివరించారు. ఎలక్ట్రికల్ వాహనదారు బయటికి వెళ్లినప్పుడు (షాపింగ్ మహల్, సినిమా, నగరంలోని ఇతర ప్రాంతాలు) అనుకోకుండా వాహనం బ్యాటరీలో పవర్ లేనప్పుడు వైర్‌లెస్ చార్జింగ్ ద్వారా అవసరమున్నంత పవర్‌ను చార్జింగ్ బుక్ చేసుకొని కొనుగోలు చేయవచ్చు. వాహనంలో అధికంగా పవర్ ఉన్నప్పుడు ఇతరులకు విక్రయించవచ్చు.

మీటర్ మించి దూరం ఉండొద్దు..

మార్కెట్‌లో అందుబాటులో ఉన్న యాప్‌లను స్మార్ట్ ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసుకొని థర్డ్ పార్టీ (మూడో వ్యక్తి) ద్వారా పవర్‌ను (విద్యుత్) క్రయ, విక్రయాలు చేయవచ్చు అని తెలిపారు. అయితే.. వాహనానికి, వాహనానికి మధ్య దూరం మీటరు మించి ఉండకూడదన్నారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా వైర్‌లెస్ పవర్ చార్జింగ్ విధానాన్ని కనిపెట్టినట్లు చెప్పారు. ఎలక్ట్రికల్ వాహనం నుంచి పవర్ గ్రిడ్‌కు పవర్ గ్రిడ్ నుంచి మరో వాహనానికి విద్యుత్ అందించవచ్చు ప్రొఫెసర్లు తెలిపారు. ఈ విధానం కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో వినియోగంలో ఉన్నప్పటికీ.. దుబారా లేకుండా నాణ్యత ప్రమాణాలతో కూడిన పవర్ చార్జింగ్ కోసం పరిశోధనలు చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్లు వివరించారు.

బోగస్ సాగదిక!

'సీఆర్‌ఎస్' ద్వారా బర్త్ సర్టిఫికెట్లు

- త్వరలో అమల్లోకి తేనున్న జీహెచ్‌ఎంసీ
- జన గణన రికార్డుల్లోనూ సత్వర నమోదు



సాక్షి, సిటీబ్యూరో:

బర్త్ సర్టిఫికెట్ల జారీలో పలు అవకతవకలు, అక్రమాలు చోటు చేసుకుంటుండంతో ప్రస్తుతమున్న జీహెచ్‌ఎంసీ పోర్టల్‌లోని సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను మార్చాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్‌ఎస్) పోర్టల్‌ను వినియోగించుకోవాలని భావిస్తోంది. జాతీయ స్థాయిలో సెన్సస్ కమిషనరే రిజిస్ట్రార్ జనరల్‌గా వ్యవహరిస్తారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్స్ అండ్ డెత్స్ (డీబీఆర్) యాక్ట్ మేరకు దేశంలోని అన్ని జననాలు, మరణాలు నమోదు చేయాలి. సంబంధిత సీఆర్‌ఎస్ వెబ్‌పోర్టల్ వినియోగించాల్సిందిగా చాలాకాలం క్రితమే రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం రాష్ట్రాలకు సూచించినప్పటికీ, జీహెచ్‌ఎంసీ సొంత సాఫ్ట్‌వేర్‌తోనే నిర్వహిస్తోంది.

బర్త్ సర్టిఫికెట్లలో భారీ అవకతవకల్ని చక్కదిద్దేందుకు రెండున్నరేళ్లుగా ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కట్టడి కాకపోవడంతో ఇక దేశంలోని పలు రాష్ట్రాలు కేంద్రపాలితప్రాంతాల్లో ఇప్పటికే వినియోగిస్తున్న సదరు పోర్టల్‌ను వినియోగించేందుకు బల్దియా సిద్ధమైంది. అందుకుగాను ప్రభుత్వ అనుమతి కోసం సంబంధిత ఫైలు సచివాలయానికి చేరింది. ఆమోదం పొందగానే అమలు చర్యలు చేపట్టనున్నారు. దాదాపు నెల రోజుల తర్వాత కొత్త విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారి తెలిపారు. ఈ విధానంతో జనగణన రికార్డుల్లోనూ జననాల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు కానున్నాయి.

- సీఆర్‌ఎస్ సాఫ్ట్‌వేర్‌తో దేశవ్యాప్తంగా ప్రతి బర్త్, డెత్‌కు యూనిక్ ఐడీ ఉంటుంది.
- రాష్ట్ర అధికార భాషలోనూ నమోదుకు అవకాశం ఉంటుంది
- ఆస్పత్రుల్లోని జననాలను సంబంధిత రిజిస్ట్రార్‌కు ఆన్‌లైన్ ద్వారా పంపే సదుపాయం. ఆస్పత్రులు నివేదించిన వివరాలు సంబంధిత రిజిస్ట్రార్ అనుమతితో మాత్రమే నమోదవుతాయి
- ఇళ్లలో జరిగే జననాలను ప్రజలు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయవచ్చు. సంబంధిత అధికారులు ఆన్‌లైన్‌ద్వారా వివరాలు పరిశీలించే అవకాశం
- జనన నమోదు తర్వాత నిర్ణీత వ్యవధిలో శిశువు పేరు చేర్చే సౌకర్యం.
- దత్తత తీసుకున్న పిల్లల జనన నమోదుకు వీలు
- ఆధార్, జాతీయ జనాభా రిజిస్టరుతో లింక్ చేసే అవకాశం
- జనన సర్టిఫికెట్లో సవరణల కోసం యూబీడీ నంబర్ లింక్ చేసే సదుపాయం
- ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్
- సీఆర్‌ఎస్ పోర్టల్ ఆపరేషన్, మెయింటనెన్స్‌కు జీహెచ్‌ఎంసీకి ఎలాంటి ఆర్థిక భారం ఉండదు.

బోగస్‌లపై దుమారం..

బోగస్ బర్త్ సర్టిఫికెట్ల జారీపై తీవ్ర దుమారం రేగుతున్న తరుణంలో జీహెచ్‌ఎంసీ ఈ కొత్త విధానానికి సిద్ధమైంది. జీహెచ్‌ఎంసీలో బోగస్ బర్త్ సర్టిఫికెట్లతో ఓటర్ కార్డులు, ఆధార్‌లు కూడా పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. గత పదేళ్లలో జీహెచ్‌ఎంసీలో జారీ అయిన బర్త్ సర్టిఫికెట్లపై విచారణ జరిపించాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తమకు సూచించారని వారు చెబుతున్నారు. అవకతవకలకు పాల్పడిన వారిలో కొందరిపై ఇటీవలే జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవడం తెలిసిందే. జీహెచ్‌ఎంసీ సిబ్బందితోపాటు కొన్ని ఆస్పత్రుల ప్రమేయం కూడా ఉందని విచారణలో గుర్తించారు. విచారణలు ఇంకా జరుగుతున్నాయి.

బోనాల విశిష్టతను ప్రపంచానికి చాటుదాం

మంత్రి పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

లంగర్‌హౌస్: ఆషాఢ మాస బోనాల విశిష్టతను, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటుదామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే బోనాల జాతరను పురస్కరించుకొని మంగళవారం గోల్కొండలో నిర్వహించిన అధికారుల సమన్వయ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బోనాలను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు వసతులు కల్పించాలని సూచించారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా పర్యాటక శాఖ బోనాల బోనాల విశిష్టతను తెలియజేస్తూ పర్యాటకులను ఆకర్షించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుత తరం చిన్న చిన్న వీడియోలు, రీల్స్‌కు ఆకర్షితులవుతున్నారని.. సమాచార శాఖ ఈ అంశంపై దృష్టి పెట్టాలని.. చిన్న వీడియోల రూపంలో బోనాల గొప్పదనంపై అనేక రకాలుగా ప్రచారాలు నిర్వహించాలన్నారు. గతంలో ఉన్నట్లు ఆషాఢ మాసాంతం గోల్కొండ కోటలో ప్రవేశం ఉచితంగా ఇవ్వాలని, ప్రస్తుతానికి మంగళవారం కూడా ఉచిత ప్రవేశం కోరుతూ పురావస్తు శాఖకు సూచిస్తున్నట్లు పేర్కొన్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. గోల్కొండ బోనాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం నగర నలుమూలల నుంచీ ఆర్టీసీ బస్సులు నడపనున్నామన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ చైర్మన్ కొండెపుడి చంటిబాబు, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ కోట లోపల నాగదేవత పుట్ట వద్ద పూజలు చేసి అమ్మవారికి కల్లు సాక పెట్టారు.



నాగదేవత అమ్మవారికి కల్లుసాక పెడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

అంగన్‌వాడీల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందాలి

కలెక్టర్ హరిచందన



సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ హరిచందన సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని తన చాంబర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు, సఖి కేంద్రాలు, శిశువిహార్‌పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు గర్భిణిలు, బాలింతలు అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలని ఆమె సూచించారు. జిల్లాలోని చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్ ప్రాజెక్టులోని 37 సెక్టార్లలో నడుస్తున్న 970 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, బాల బాలికలు మొత్తం 1,55,869 మంది ఉన్నారని, వారికి మెరుగైన సేవలు అందాలన్నారు. సీడీపీవోలు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని ఆమె సూచించారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ముఖ్యంగా స్లమ్ ఏరియాలలో ఉన్నటువంటి పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో సఖి కేంద్రం ద్వారా వచ్చిన కేసులు, కౌన్సిలింగ్, నిర్వహణ తీరు, నష్ట పరిహారం చెల్లింపుల విధానం అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, సీడీపీవోలు, సఖి నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత విభేదాలు పక్కన పెడదాం: రాజాసింగ్

సాక్షి, సిటీబ్యూరో: వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి పార్టీ నేతలంతా కలసికట్టుగా పనిచేయాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'రాజాసింగ్ ఒక సీనియర్ నాయకుడు, నేను కేవలం పార్టీలో ఒక సామాన్య కార్యకర్తను. రాజాసింగ్ ఏది చెబితే మేము దాన్ని పాటిస్తాం' అని అన్నారు. ఈ కామెంట్స్‌పై మంగళవారం సోషల్‌మీడియాలో స్పందించిన రాజాసింగ్ తన ఉద్దేశం ఎప్పుడూ సరళంగా, నిష్కల్మషంగా ఉంటుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తమకు కొంత సమయం కేటాయించాలని కోరారు. తాను వ్యక్తిగతంగా కలసి సమస్యలపై చర్చించాలనుకుంటున్నట్లు వివరించారు. మీరు ఎక్కడ, ఎప్పుడు కలుద్దామని నిర్ణయిస్తే ఆ సమయానికి వచ్చి కలిసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం అవసరం ఉందని తెలిపారు. తెలంగాణలో 119 నియోజకవర్గాల్లో ఎలా విజయం సాధించాలి అనేది ఆలోచించడానికి బదులుగా తనను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అయినా పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తున్నానన్నారు.

ఫీవర్‌లో రేబిస్ రోగి మృతి

నల్లకుంట: రేబిస్ వ్యాధి సోకి చికిత్స కోసం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి మృతి చెందాడు. గుడివాడకు చెందిన రాము(36) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి పార్శిగుట్టలో నివాసముంటున్నాడు. ఆరు నెలల క్రితం గుడివాడకు వెళ్లిన అతను వీధి కుక్క దాడిలో గాయపడ్డాడు. ఆ సమయంలో అతను పూర్తి స్థాయిలో చికిత్సలు తీసుకోలేదు. పైగా మద్యం సేవించాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. రేబిస్ లక్షణాలు ఉండడంతో అతన్ని రేబిస్ వార్డులో చేర్చుకుని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. కాగా అతను సోమవారం రాత్రి మరణించాడని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. రేబిస్ సోకితే చికిత్సలు లేవని, నివారణ ఒక్కటే మార్గమని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. నిబంధనల ప్రకారం ఫార్మాలిటీస్ పూర్తి చేసిన ఆసుపత్రి వర్గాలు రాము మృత దేహాన్ని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రేబిస్‌తో మృతి చెందితే పోస్టుమార్టం నిర్వహించరు. అలాగే శవాన్ని పూడ్చకుండా కాల్చివేయాలని వైద్యులు సూచించారు.

రైళ్లపై దాడి చేస్తే కఠిన చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ ప్రాంతాల్లో రైళ్లపై రాళ్ల దాడికి పాల్పడిన 102 మందిని ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టాలపై ప్రమాదకర వస్తువులు ఉంచినందుకు మరో 33 మంది నేరస్తులను సైతం అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. వారిపైన రైల్వే చట్టంలోని సెక్షన్ 153 కింద కఠినమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు 128 చోట్ల రైళ్లపైన రాళ్ల దాడులు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అధికారులు కేసులు నమోదు చేశారు. ఇలాంటి 85 కేసుల్లో 102 మంది నేరస్తులను అరెస్టు చేశారు. వారిలో ఇప్పటి వరకు 12 మందిని దోషులుగా నిర్ధారించారు. ఒక్కరికి 15 రోజుల జైలు శిక్ష విధించారు. మరో 11 మంది నిందితులకు రూ.30,500 జరిమానా విధించారు. రైల్వే పట్టాలపై ప్రమాదకారక వస్తువులను ఉంచిన 29 కేసుల్లో 26 కేసులను గుర్తించారు. 33 మంది నేరస్తులను అరెస్టు చేశారు. ఈ కేసులు న్యాయస్థానాల్లో విచారణలో ఉన్నాయి. ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్య తనిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వ్యక్తుల గురించి 139కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రయాణికుల భద్రతకు, రైల్వే ఆస్తుల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఆకతాయి కుర్రాళ్లు పట్టాలపైన ఎలాంటి తప్పుడు పనులు చేయకుండా తల్లిదండ్రులు హెచ్చరించాలని సూచించారు.

మినీ లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: మినీ లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం అర్ధరాత్రి కాచిగూడ కుమార్ థియేటర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (50) రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన మినీలారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. వాహన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 6 కోట్ల భూమికి ఎసరు!

నార్సింగిలో ఓ ముఠా ఎత్తుగడ

- మార్టిగేజ్ రిలీజ్‌కు ఫోర్జరీ పత్రాల సృష్టి
- గుర్తించిన సబ్‌రిజిస్ట్రార్
- పోలీసులకు ఫిర్యాదు



నార్సింగి మున్సిపల్ కార్యాలయం

మణికొండ: మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేసిన ఓ ప్లాట్‌ను రిలీజ్ చేయాలని ఫోర్జరీ పత్రాలను సృష్టించి..గజం రూ.లక్షకు పైగా పలికే 617 గజాల భూమిని కొట్టేసేందుకు ఓ ముఠా ఎత్తుగడ వేసింది. ఏకంగా కార్యాలయంలో లేని ఓ ఉద్యోగిగా పేర్కొంటూ నకిలీ పత్రాలను సృష్టించింది. ఇక తమ పని అయిపోతుందని, ఏకంగా రూ.6 కోట్ల భూమి తమ స్వంతం అవుతుందని కలలుకన్నారు. వారి నకిలీ పత్రాలను సబ్‌రిజిస్ట్రార్ గుర్తించి..సదరు పత్రం జారీ చేసినట్టుగా ఉన్న అధికారి దృష్టికి తేవటంతో అసలు బాగోతం బయటకు వచ్చింది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 300 నుంచి 303, 306 నుంచి 311, 313 నుంచి 315 వరకు మార్వా టౌన్‌షిప్-బి లేఅవుట్‌ను గతంలో వేశారు. అందులోని ఖాళీ, పార్కు స్థలాలను అప్పట్లో గ్రామ పంచాయతీలకు మార్టిగేజ్ చేశారు. అలాంటి స్థలాలపై కన్నువేసిన ఓ ముఠా ఏకంగా నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయం నుంచి ప్లాట్ నెంబర్ 146(పాత నెంబర్‌లు 597, 598)లను నీరజ దేవులూరికి రిలీజ్ చేస్తున్నట్టుగా పత్రాలు తయారు చేశారు. ఈ నెల 13వ తేదీన మున్సిపల్ కమిషనర్ జారీ చేసినట్టుగా లెటర్ నెంబర్ 960 టీపీ/ఎంసీ/ఎన్ఎంసీ/2025 పేరుతో జారీ చేసినట్టు ఓ పత్రాన్ని తయారు చేశారు.

సబ్‌రిజిస్ట్రార్ గమనించటంతో..

అప్పటి నార్సింగి గ్రామపంచాయతీ, ఇప్పటి నార్సింగి మున్సిపాలిటీ పేరుతో ఉన్న విలువైన స్థలాన్ని మార్టిగేజ్ రిలీజ్ చేయాలని పత్రం తీసుకుని కొందరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ స్లాట్‌ను బుక్ చేసుకుని సోమవారం నార్సింగిలోని గండిపేట తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఎప్పుడో జరిగిన లేఅవుట్‌లో ఇపుడు మార్టిగేజ్ ప్లాట్ రిలీజ్ చేయటం ఏమిటని అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ విషయాన్ని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. దాంతో డొంక కదిలి అవినీతి భాగోతం బయటకు వచ్చింది. మున్సిపల్ కార్యాలయం సీరియల్ నెంబర్లతో రిలీజ్ లెటర్ తయారు చేయటం, మున్సిపాలిటీ స్టాంప్‌లు, మున్సిపాలిటీలో పనిచేయని సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.శివనాగేశ్వర్‌రావు (ఐడీ నెంబర్ 2400862)కు రిలీజ్ అధికారం ఇచ్చినట్టు లెటర్ వెలుగులోకి వచ్చింది. దాంతో వెంటనే తేరుకున్న మున్సిపల్ కమిషనర్ తమ కార్యాలయంలో విచారణ చేయగా అలాంటి లెటర్ ఏది జారీ చేయలేదని గమనించి మంగళవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పక్కాగా స్కెచ్ వేసినా.. పట్టుబడ్డారు!

- భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- పనిచేసిన ఇంట్లో రూ.1.70 కోట్ల విలువ చేసే సొత్తు, నగదు చోరీ
- పది రోజుల్లో దొంగలను పట్టుకున్న పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట: ఒక్క చోరీతో జీవితాలను మార్చేసుకుందామనుకున్నారు. పక్కా ప్రణాళికతో భారీ చోరీకి స్కెచ్ వేసి సక్సెస్ అయ్యారు. కానీ పది రోజుల్లోనే పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యారు. మంగళవారం ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ ఏ.శ్రీనివాస్‌లతో కలిసి ఈ చోరీ వివరాలను వెల్లడించారు. చౌపాల్ సాగర్‌కుమార్ అనే వ్యక్తి పాన్ షాప్ నిర్వహిస్తుండగా..అతని భార్య శాలిని బషీర్‌బాగ్ అవంతినగర్ కాలనీలోని నూకల రామకృష్ణ నివాసంలో పనిమనిషిగా చేరింది. కొద్ది రోజుల తర్వాత పనిమానేసి ఆమె స్థానంలో తల్లి నీలిమను పనికి కుదుర్చింది. కాగా చౌపాల్ సాగర్‌కుమార్ ఒకేసారి భారీగా డబ్బు సంపాదించి జీవితంలో సెటిల్ కావాలని ఆలోచన చేసి చోరీ చేయాలని భావించాడు. ఈ విషయాన్ని తండ్రి చౌపాల్ చంద్రశేఖర్, భార్య శాలినితో చర్చించి మరదలు అశ్విని సహకారాన్ని కూడా తీసుకున్నాడు. అవంతినగర్‌లోని నూకల రామకృష్ణ ఇంట్లో చోరీ చేస్తే భారీగా నగలు, నగదు దొరుకుతాయని నిర్ధారణకు వచ్చారు. అదనుకోసం చూస్తుండగా రామకృష్ణ కుటుంబంతో కలిసి టూర్ వెళ్లాడు. టూర్ వెళ్లిన సమాచారంతో సాగర్‌కుమార్ చోరీకి ప్లాన్ వేశాడు. అందులో భాగంగా కార్వాన్‌కు చెందిన ఆకాశ్‌కుమార్, షకీల్‌ఖాన్, అశ్విన్‌లతో కలిసి చోరీకి సిద్ధపడ్డారు. ఈ నెల 5న అర్ధరాత్రి కిటికీ గ్రిల్స్ తొలగించి రామకృష్ణ ఇంట్లోకి ప్రవేశించారు. లాకర్‌లో ఉన్న 173 తులాల బంగారు అభరణాలు, రూ.17.50 లక్షల నగదు, 8 ఖరీదైన వాచ్‌లను ఎత్తుకెళ్లారు. టూర్ ముగించుకుని ఈ నెల 7న ఇంటికి వచ్చిన రామకృష్ణ చోరీ జరిగినట్లు గమనించాడు. వెంటనే నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ముమ్మరంగా దర్యాప్తు చేశారు. సీసీటీవీ కెమెరా ఫుటేజీ, ఇతర ఆధారాలతో చోరీకి పాల్పడిన వారిని పట్టుకున్నారు. వారి వద్ద 158 తులాల బంగారు అభరాణాలు, రూ.10.75 లక్షల నగదు, 8 వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. సూత్రదారి చౌపాల్ సాగర్ కుమార్ భార్య శాలిని, మరదలు అశ్విని, మరో నిందిడు అశ్విన్ పరారీలో ఉన్నట్లు డీసీపీ వెల్లడించారు. మిగతా నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సమావేశంలో ఏసీపీ మట్టయ్య, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, డీఐ డి.నాగార్జున, డీఎస్ఐ డి.వెంకటేశ్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్టు

77 ఫోన్లు స్వాధీనం



మాట్లాడుతున్న ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి

కంటోన్మెంట్: రోడ్డుపై సొమ్మసిల్లి పడిపోయినట్లు నటిస్తూ...జాలిపడి వారి వద్దకు వచ్చే వాహనదారులు, ప్రజల సెల్‌ఫోన్లు దొంగిలించే ముఠా ఆటకట్టించారు బోయిన్‌పల్లి పోలీసులు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.25 లక్షలు విలువ చేసే 77 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గోపాలకృష్ణ ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన గంటా చిన్న దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడే ముఠాతో సంబంధాలు ఏర్పడ్డాయి. అనంతరం ఒడిశాకు చెందిన ప్రధాన్ శ్రీకాంత్, ఆవుల గోపి రావులతో కలిసి ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్ దొంగతనాలకు అలవాటుపడ్డారు. 2017 నుంచి మూడు కమిషనరేట్ల పరిధిలో వాహనదారులు, ప్రయాణికుల నుండి సెల్ ఫోన్లు చోరీ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. బోయిన్‌పల్లిలో తాడ్‌బండ్ చౌరస్తా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుండా అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా సెల్‌ఫోన్ స్నాచర్లుగా తేలినట్లు ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి వెల్లడించారు. ఇటీవల జరిగిన సెల్‌ఫోన్ దొంగతనాలకు సంబంధించి సీసీ కెమెరాలు పరిశీలించిన అనంతరం ఈ ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాగా నిర్ధారించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు చేధనలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు తులసీదాస్, రాజేశ్, మురళి, మనోహర్ రెడ్డి, శివలను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు. విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ సర్దార్ నాయక్, అడ్మిన్ ఎస్ఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

మొయినాబాద్: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 19న విద్యార్థుల ఎంపిక జరుగుతుందని మండల విద్యాధికారి మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తరగతిలో ప్రవేశాలకోసం ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 19న మొయినాబాద్‌లోని ఎంఆర్‌సీహెచ్ పాఠశాల ఆవరణలో జరిగే ఎంపికకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులకు రన్నింగ్, జంపింగ్ పోటీలతోపాటు ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, మెడికల్ టెస్టులు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, కులం సర్టిఫికెట్, ప్రోగ్రెస్ కార్డుతో హాజరు కావాలన్నారు.

థాంక్యూ హైడ్రా..

'బడి'కి బాట చూపినందుకు కృతజ్ఞతలు

- రంగనాథ్‌ను కలిసిన దూద్‌బావి పాఠశాల విద్యార్థులు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో దూద్‌బావి పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు

చిలకలగూడ: 'మా బడికి బాట చూపించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సార్‌కు ధన్యవాదాలు...' అంటూ చిన్నారి విద్యార్థులు ముక్తకంఠంతో నినదించారు. ఆయన చేసిన మేలు జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని, కష్టపడి ఉన్నత చదువులు చదివి సమాజ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని గట్టిగా చెప్పారు. హైడ్రాను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి జిందాబాద్ అంటూ జై కొట్టారు. వివరాల్లోకి వెళ్తే..మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేదు. తూర్పు దిశలో ఉన్న మార్గంలో కొంతమంది అడ్డుగా ప్రహరీ నిర్మించడంతో ఇరుకైన సందులు, బురదలో నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లేవారు. ఏడాది క్రితం బదిలీపై వచ్చిన పాఠశాల హెచ్‌ఎం మల్లిఖార్జునరెడ్డి బడికి బాట వేసేందుకు తీవ్రంగా కృషి చేశారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి వినతిపత్రం అందించారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మే 26వ తేదీ మా బడికి బాట చూపించండి అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ విషయం మీడియాలో విస్తృత ప్రచారం కావడంతో హైడ్రా దృష్టికి వచ్చింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఆదిత్య మే 27న క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రహరీని అక్రమంగా నిర్మించినట్లు గుర్తించారు. పాఠశాలకు వెళ్లే రహదారికి అడ్డుగా ఉన్న గోడను అప్పటికప్పుడే తొలగించారు. జీహెచ్‌ఎంసీ సహకారంతో రోడ్డు వేయించి, ఇనుప గేటు ఏర్పాటు చేశారు. 20 ఏళ్ల అవస్థలు, 10 నెలల పోరాటం..హైడ్రా చలవతో 24 గంటల్లో సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థులు, అధ్యాపకులు, స్థానికులు సంబరాలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల హెచ్‌ఎం మల్లిఖార్జునరెడ్డి, ఉపాధ్యాయుడు వెంకటరమణల నేతృత్వంలో పలువురు పాఠశాల విద్యార్థులు మంగళవారం హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్‌ను కలిసి మొక్కను బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ ఉన్నతచదువులు చదువుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులను కోరారు. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు కూడా విద్యార్థులు, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంగళాభట్‌కు కన్నీటి వీడ్కోలు

బంజారాహిల్స్: ప్రముఖ కథక్ నాట్యగురు మంగళాభట్ అంత్యక్రియలు మంగళవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అభిమానులు, శిష్యుల అశ్రునయనాల మధ్య ముగిశాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-11 మిథిలానగర్‌లోని వారి స్వగృహం వద్ద ఆమె భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె శిష్యులు వందలాది మంది కలిసి 16 బీట్స్‌లో నట్టువాంగం కథక్ 'పడంత్' జతులు చదువుతూ తాళం వేస్తూ కన్నీటి వీడ్కోలు పలికారు. ఆమె గురువు దుర్గాలాల్ కుమారులు పండిట్ మోహిత్‌లాల్, మోనాలాల్‌తో పాటు ఢిల్లీ, ముంబాయి నుంచి స్నేహితులు, నృత్య కళాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి చివరి చూపు చూసి నృత్య నివాళలర్పించారు. కవి అందెశ్రీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ అలేఖ్య పుంజాల, పూర్వ అధ్యక్షురాలు దీపికారెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ పద్మజారెడ్డి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు, నాట్య గురువులు భాగవతుల సేతురామ్, జొన్నలగడ్డ అనురాధ, వనజా ఉదయ్, రాజేశ్వరి సాయినాథ్, భారతి, రోహిణి కందాల, సీనియర్ ఐఏఎస్ అధికారులు కిషన్‌రావు, సునీత భగవత్, చందా పండిట్, లోకేంద్రశర్మ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

మూసాపేట: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడలో నివాసం ఉంటున్న కన్నెగంటి సంపత్ కుమార్(23)కు కూకట్‌పల్లి సేవాలాల్ నగర్‌లో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న 15 ఏళ్ల బాలికతో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైంది. అది కాస్త ప్రేమగా మారడంతో 2024 డిసెంబర్‌లో సంపత్ నగరానికి వచ్చి బాలికను తీసుకొని వెళ్లాడు. అమ్మాయి తల్లిదండ్రులు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సంపత్ బాలికను తీసుకుని పలు ప్రాంతాల్లో తిరుగుతూ పెళ్లి చేసుకుంటానని నమ్మించి..గర్భవతిని చేశాడు. కొన్నాళ్లకు పోలీసులు అమ్మాయిని తల్లిదండ్రులకు అప్పగించారు. మళ్లీ మంగళవారం బాలిక కోసం సంపత్ కుమార్ రావడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోక్సో కేసు నమోదు చేశారు.

మొదటి అంతస్తు పైనుంచి పడి బాలుడి మృతి



మృతి చెందిన అయాన్ష్

ఉప్పల్: భవనం మొదటి అంతస్తులో ఆడుకుంటూ గ్రిల్స్‌లో నుంచి కింద పడి బాలుడు మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూరేపల్లి గ్రామం భువనగిరి ప్రాంతానికి చెందిన హరికృష్ణ భార్య తన కుమారుడు అయాన్ష్ (18 నెలలు)ను తీసుకుని రామంతాపూర్ పరిధి రామిరెడ్డినగర్‌లోని తల్లిగారింటికి వచ్చింది. ఈ నెల 16న అయాన్ష్‌ను ఎత్తుకుని అన్నం తినిపించడానికి మొదటి అంతస్తుకు వెళ్లింది. అన్నం తినిపించగానే బాబును కింద వదిలేసి చేతులు కడుక్కోవడానికి లోపలికి వెళ్లింది. ఈ లోపు బాలుడు గ్రిల్స్‌లోని ఖాళీ స్థలం నుంచి జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో మోసం..

బంజారాహిల్స్: పెళ్లి పేరుతో సహజీవనం చేసి మోసానికి పాల్పడ్డాడని నర్సింహ అనే వ్యక్తిపై ఓ మహిళ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం..నర్సింహ అనే వ్యక్తితో ఒక మహిళకు కొన్ని నెలల క్రితం పరిచయం ఏర్పడింది. తనకు పెళ్లి కాలేదని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమె వద్ద డబ్బులు తీసుకున్నాడు. మహిళ అతనికి ఒక వాహనాన్ని సైతం కొనిచ్చింది. 2024 డిసెంబర్ 31 రాత్రి నర్సింహ ఆమె ఇంటికి వెళ్లి అక్కడే మహిళతో కలిసి నూతన సంవత్సర వేడుకలు చేసుకున్నాడు. ఆమెకు దగ్గరయ్యాడు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నర్సింహ ఆమె ఫోన్ కాల్స్‌కి స్పందించడం మానేశాడు. పెళ్లి గురించి అడిగితే సమాధానం దాటవేస్తున్నాడు. తాను ఇచ్చిన డబ్బులు, వాహనం గురించి అడిగితే స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించి, నర్సింహపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: కామత్ లింగాపూర్ 11కేవీ ఫీడర్, సంజీవయ్యపార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అల్లాడిన్ కోటి, టోయోటా షో రూం, లైన్, కామత్‌లింగాపూర్, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్సన్, ప్రకాశ్‌నగర్ వాటర్‌ట్యాంకు ప్రాంతాలు. ఫతేనగర్, సూర్యోదయ కాంప్లెక్స్ 11కేవీ ఫీడర్లు, లోధ, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, డీ-మార్ట్ ఏరియా, టొయోటో షోరూంలైన్, స్కోడా లైన్, జెన్ టెక్నాలిజీ, ఆంధ్రాబ్యాంకు లైన్, సూర్యోదయ కాంప్లెక్స్, నెల్లి సిల్క్ శారీస్ ఏరియాల్లో విద్యుత్ ఉండదన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఫిలింనగర్: అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం షేక్‌పేట డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. బాల్య సంరక్షణ-విద్యా సామూహిక అక్షరాభ్యాసం అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్, షేక్‌పేట మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫాతిమాబేగం పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి మృతి

వెంగళరావునగర్: మద్యానికి బానిసైన ఓ యువకుడు మృతిచెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..యూసుఫ్‌గూడలో నివసించే వివేక్ (28) సోమవారం సాయంత్రం శ్రీకృష్ణానగర్‌లోని ఓ దుకాణం ఎదుట మృతిచెంది ఉన్నాడు. వివేక్, దేవన్న అనే కోఆర్డినేటర్ వద్ద పని చేస్తున్నాడు. గత నాలుగైదు నెలలుగా జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం షూటింగ్‌కు వెళ్లి ఫిట్స్ వచ్చి పడిపోవడంతో తోటి ఆరిస్ట్ అతనికి సపర్యలు చేసి పక్కన కూర్చోబెట్టాడు. మరుసటి రోజు మృతిచెందినట్లు దేవన్నకు స్థానికులు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రూ.2 కోట్లతో వరదనీటి పైపులైన్ నిర్మాణం

- లక్డీకాపూల్ ద్వారకా హోటల్ చౌరస్తాలోని సమస్యకు పరిష్కారం
- త్వరలోనే పనులకు శ్రీకారం

బంజారాహిల్స్: వానాకాలం వచ్చిందంటే లక్డీకాపూల్‌లోని ద్వారకా-లక్కీ హోటల్ చౌరస్తాతో పాటు ప్రధాన రహదారి మోకాలు లోతు వరదనీటితో నిండిపోయి స్థానికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దశాబ్దాల ఈ సమస్యకు పరిష్కారం చూపడంలో అధికారులు, ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగించే లక్డీకాపూల్ జాతీయ రహదారిలో ఈ సమస్యతో సతమతమవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులు ప్రతిపాదించినా నిధులులేమి వెంటాడుతుండేది. వానాకాలంలో జీహెచ్‌ఎంసీ మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు ఇక్కడ 24 గంటలు అందుబాటులో ఉండడమే కాకుండా మోటార్ల సహాయంతో వరదనీటిని తోడాల్సి వస్తుంది. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వరదనీరు పెద్ద ఎత్తున నిలిచిపోయి స్థానికంగా రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 అధికారులు ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదించారు. పక్కా డిజైన్‌తో ఇక్కడ వరదనీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు రూపొందించడమే కాకుండా ఇటీవల టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చారు.



లక్డీకాపూల్ ద్వారకా-లక్కీ హోటల్ చౌరస్తాలో వరద ముంపును పరిశీలిస్తున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి



వరదనీటిని తోడేస్తున్న సిబ్బంది

600 ఎంఎం డయా పైపులతో..

లక్డీకాపూల్ ద్వారకా హోటల్-లక్కీ హోటల్ రోడ్డు, చౌరస్తాలో వరదనీటి సమస్య పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. ద్వారకా-లక్కీ హోటల్‌లో రోడ్డులో 600 ఎంఎం డయా 180 మీటర్ల మేర వేయనున్నారు. అలాగే లక్కీ రెస్టారెంట్ నుంచి రైల్వేట్రాక్ వద్ద ఉన్న 900 ఎంఎం డయా వరదనీటి పైపులోకి ఈ పైప్‌లను అనుసంధానించనున్నారు. లక్కీ రెస్టారెంట్ నుంచి రైల్వేట్రాక్ నాలా వరకు 60 మీటర్ల మేర ఒక వర్క్, ద్వారకా హోటల్ నుంచి లక్కీ హోటల్ వరకు 180 మీటర్ల మేర రెండో వర్క్ ఇలా రెండు వర్క్‌లుగా ఈ పైప్‌లైన్ నిర్మాణాన్ని విభజించారు. ద్వారకా హోటల్ నుంచి 600 ఎంఎం డయా పైప్ లైన్ వేసి రైల్వే ట్రాక్ వద్ద ఉన్న 900ఎంఎం డయా నాలాలో కలపనున్నారు.

త్వరలోనే పనులు...

లక్డీకాపూల్ రోడ్డు వాహనాల రద్దీతో, వ్యాపార లావాదేవీలతో, హోటళ్లకు వచ్చే కస్టమర్లతో నిత్యం కిటకిటలాడుతుంటుంది. రవీంద్రభారతి నుంచి అసెంబ్లీతో పాటు ఓల్డ్‌సిటీకి వెళ్లేందుకు ఇదే కూడా ప్రధాన రోడ్డు కావడంతో ఈ రోడ్డులో భారీ వరదనీటి పైప్‌లైన్ పనులు చేపట్టాలంటే చాలా ఇబ్బందితో కూడుకున్నదని అధికారులు పేర్కొంటున్నారు. ట్రాఫిక్ పోలీసుల నుంచి అనుమతులు క్లియరెన్స్ వచ్చిన తర్వాత ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని యోచిస్తున్నారు.

పనులు ప్రారంభిస్తాం..

లక్డీకాపూల్ ద్వారకా హోటల్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ స్తంభించి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇక్కడ వరదనీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగింది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. ఇక్కడ పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతోంది. ఇప్పటికే అనుమతుల కోసం సంబంధిత అధికారులకు లేఖ రాశాం.

రజనీకాంత్‌రెడ్డి, డీసీ, సర్కిల్-17

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించాలి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం. 5/7లోని దుర్గా భవానీనగర్ బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టాలని బస్తీవాసులు మంగళవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బస్తీలో సర్వే కూడా పూర్తయిందని కానీ ఇంత వరకు బస్తీవాసులకు ఎలాంటి సమాచారం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్‌తో మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల మంజూరీకి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో వి. గౌడ్‌నాయక్, వి. జానినాయక్, ఆర్. తావూరు, కృష్ణ, పాండు, మాన్య, కోటేష్, శ్రీను, గణేష్, రాజు, రమేష్, లక్ష్మణ్, తిరుపతి ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న దుర్గా భవానీనగర్ వాసులు

బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచాల్సిందే

- ఆర్.కృష్ణయ్య డిమాండ్

హిమాయత్‌నగర్: బీసి రిజర్వేషన్లు 42 శాతానికి పెంచే వరకు వదిలిపెట్టమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై జీవో జారీ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను రాజ్యాంగంలో చేర్చే విధంగా ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. తనకు పదవుల కన్నా బీసీల హక్కుల సాధనే లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో అనంతయ్య, అంజి, రామకృష్ణ, మధుసూదన్, సతీష్, మోడీ రామ్ దేవ్, నిఖిల్ పాటిల్, కె.శివకుమార్, సి.మణికంత, కె.లింగం ముదిరాజ్, రవి యాదవ్, మురళి, కౌశిక్, బాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

అనుమానాస్పదంగా యువకుడి మృతి

వెంగళరావునగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బి.నర్సింగ్ యాదవ్ రహమత్‌నగర్‌లో ఉంటూ జీటీఎస్ కాలనీలోని సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తుంటాడు. అతడి పెద్ద కుమారుడు మధుయాదవ్ (27) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం బాత్రూంకు వెళ్లిన మధు ఎంత సేపైనా బయటికి రాలేదు. కుటుంబ సభ్యులు తలుపులు పగలకొట్టి చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. హుటాహుటిన మధును ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని సర్కిల్-17 కార్యాలయంలో ఆయన ట్రాఫిక్ ఏసీపీ కే హరిప్రసాద్, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, హైడ్రా ఎస్‌ఎఫ్‌ఓ మోహన్‌రావు, ఈఈ వెంకటనారాయణ, డీఈలు చైతన్య, సందీప్‌తో సమావేశం నిర్వహించారు. హైడ్రా మాన్సూన్ యాక్షన్ టీమ్‌లతో కలిసి సమన్వయంగా పనిచేయడం ద్వారా వరద ముంపు సమస్య తలెత్తకుండా చూడవచ్చని వెల్లడించారు. ట్రాఫిక్ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

సన్మానం



సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

లిబర్టీ: జాతీయ భద్రతా సహాయ మండలి సభ్యులుగా నియమితులైన సతీష్‌రెడ్డిని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి కలిసి సన్మానించారు. గతంలో జాతీయ భద్రతా మండలి సభ్యులుగా సమర్థవంతంగా పని చేశారని కరుణాకర్‌రెడ్డి గుర్తు చేశారు. భద్రతా అంశాల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన ఆలోచన ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సలహా మండలి సభ్యులుగా నియమించిందని భద్రత రక్షణ రంగాల్లో సతీష్‌రెడ్డికి అపారమైన అనుభవం ఉందన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో విద్యార్థులు

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నీలోఫర్ ప్రభుత్వ దవాఖానా సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శైలజ మాట్లాడుతూ.. రక్తదానం మహాదానం అని, ప్రతి ఒక్క విద్యార్థి రక్తదాన ప్రాముఖ్యతను తెలుసుకుని ఆపద సమయంలో రక్తదానం చేయాలన్నారు. మొత్తం 52 మంది విద్యార్థులు రక్తదానం కోసం ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరవిందసీమ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ పల్లాటి నరేష్ పాల్గొన్నారు.

వరద సమస్యకు చెక్

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకుని నిర్మిస్తున్న మల్టీలెవల్ పార్కింగ్ పక్కన రెండు దశాబ్దాలుగా వరదనీరు నిలిచి ట్రాఫిక్ సమస్య తలెత్తేది. వర్షాకాలం వచ్చిందంటే మోకాలు లోతు వరద నిలిచి వాహనాలు ఎక్కడికక్కడే స్తంభించిపోయేవి. వరదనీరు నిలిచినప్పుడు మోటార్ల ద్వారా నీటిని తోడేయాల్సిన దుస్థితి వచ్చేది. సమస్యపై 'ఎన్నాళ్లీ మోటార్ పంప్‌లు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. మంగళవారం 600 ఎంఎం డయా వరదనీటి పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యాయి. రూ.13 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ వరదనీటి పైప్‌లైన్లను కేబీఆర్ పార్కు లోపల ఉన్న చెరువులోకి కలపనున్నారు. ఈ పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే ఇక్కడ చుక్క నీరు కూడా ఆగదని జూబ్లీహిల్స్ సర్కిల్ ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు.



కొనసాగుతున్న పైపులైన్ పనులు

వారానికి నాలుగు రోజులు బస్తీబాట



స్థానికులతో మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: బస్తీబాట ద్వారా ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని ఇకపై వారానికి నాలుగు రోజులు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. హెచ్‌ఎఫ్‌నగర్‌పేజ్-1 బస్తీలో మంగళవారం నిర్వహించిన బస్తీబాటలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు. స్థానిక నాయకులు,బస్తీ అధ్యక్షులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు.హెచ్‌ఎఫ్‌నగర్ బస్తీలో సివరేజీ, నీటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ భరత్,జలమండలి మేనేజర్లు ప్రకాష్,రాజేందర్, వీధిదీపాలు సూపర్‌వైజర్ రాజు,కాంగ్రెస్ నాయకులు సయ్యద్ షరీఫ్,మన్సూర్ పాల్గొన్నారు.

మరమ్మతు విస్మరించారు



పంజగుట్ట ప్రధాన రహదారిలో వరద నీటి కాలువ మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి. పంజగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆనుకొని ఉన్న రోడ్డులో దాదాపు ఐదు మ్యాన్‌హోళ్లు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో కనబడక ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

- బంజారాహిల్స్

'దళిత క్రిస్టియన్ సమాజాన్ని నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర'

హిమాయత్‌నగర్: దళిత క్రిస్టియన్ నేతపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాన్ని ఇకనైనా మానుకోవాలని దళిత క్రిస్టియన్ నేతలు మండిపడ్డారు. మంగ్లీ బర్త్ డే వేడుకల్లో మేడే రాజీవ్ సాగర్ ఉన్నాడని చేసిన తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ సాల్మన్ రాజ్ మాట్లాడారు. ఇది కేవలం రాజీవ్ సాగర్ మీద వ్యక్తిగత దుష్ప్రచారం కాదని, దళిత క్రిస్టియన్ సమాజాన్నే లక్ష్యంగా చేసుకున్న కుట్ర అన్నారు. రాజీవ్ సాగర్ ఎప్పుడూ ప్రజల సంక్షేమానికే కృషి చేశాడని అతని నిష్కళంకతపై కాంగ్రెస్ పార్టీ అపవాదాలు చేస్తూ ఇది రాజకీయ కుట్రకు తెరలేపారని విమర్శించారు. తెలంగాణలో దళిత క్రిస్టియన్ సమాజంపై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. ఈ సమావేశంలో క్యాథలిక్ చర్చి అసోసియేషన్ సెక్రెటరీ లియో లూయిస్, క్రైస్తవ సేవా సమితి నాయకులు ప్రణయ్, ఆర్.మోజెస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాల్మాన్ రాజ్

బెంచీలు మాయం చేశారు

పంజగుట్ట ప్రధాన రహదారిలోని గోకుల్ టవర్స్ ముందున్న బస్టాప్‌లో బెంచీలు మాయమయ్యాయి. ఎవరైనా దొంగిలించారా.. ? లేక కావాలని ఇక్కడున్న వ్యాపారులు వారి దుకాణాలకు అడ్డుగా ఉన్నాయని తీసేశారా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. ఇక్కడ కూర్చోవడానికి బెంచీలు లేక పోవడంతో బస్సు వచ్చే వరకు నిలబడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

- బంజారాహిల్స్



బాధ్యత మరిచారు

కొంతమంది నిర్లక్ష్యంతో విలువైన తాగునీరు వృథాగా పోతోంది. ఫిలింనగర్ బస్తీలకు మంచినీటి సమస్య ఉండకూడదని అధికారులు ప్రతిసారి వారికి సరిపోయేనన్ని నీళ్లు వదులుతారు. కానీ కొంత మంది నీటిని పట్టుకున్న తర్వాత నల్లాలకు స్టాపర్లు పెట్టుకోకపోవడంతో రోడ్లపై వృథాగా పారుతున్నాయి. దీనికి తోడు మరి కొంత మంది తమ ఇంటి ఆవరణ కడగడం, వాహనాలను శుభ్రం చేసుకుంటుండటంతో విలువైన తాగునీరు వృథా అవుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఫిలింనగర్



సాక్షి
బుధవారం, 18, జూన్, 2025

స్థానికులకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు

- హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో పర్యటించిన కమిషనర్ కర్ణన్



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

చందానగర్: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ, ఈర్ల చెరువు, ఆర్టీసీ కాలనీ మంజీరా రోడ్డు ప్రాంతాల్లో శేరిలింగంపల్లి జోన్ అధికారులు, చందానగర్ ఉప కమిషనర్ మోహన్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి, పెండింగ్ పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంజీరా రోడ్డు నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్ నలుదిక్కుల చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోన్ ఎస్ఈ శంకర్ నాయక్, చందానగర్ సర్కిల్ డీఈ శ్రీదేవి, ఏఈ ప్రతాప్, నాయకులు యాదగిరి గౌడ్, రేణుక, రమణమూర్తి, నరేందర్ గౌడ్, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలందా విద్యార్థులూ.. జర్మనీకి రండి

– ఎంపీ డేనియల్ జర్బన్



మాట్లాడుతున్న జర్మనీ ఎంపీ డేనియల్ జర్బిన్

వెంగళరావునగర్: నలందా విద్యార్థులు జర్మనీలో చదువుకోవడానికి ప్రత్యేక ఆహ్వానం పలుకుతున్నామని ఆ దేశ పార్లమెంట్ సభ్యులు డేనియల్ జర్బన్ అన్నారు. ప్రపంచ నేతల సమావేశంలో పాల్గొనడానికి నగరానికి వచ్చిన ఆయన మంగళవారం వెంగళరావునగర్‌లోని నలందా విద్యాసంస్థలను సందర్శించారు. ఇంజనీర్లు, వైద్యులకు అవకాశాలు కల్పించే వేదికగా జర్మనీ ఉందని అన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను కూడా కలిగి ఉండాలని, అప్పుడే దేశానికి దిక్సూచిలా తయారవుతారని చెప్పారు. మొదట సైనికునిగా పనిచేశాని, అనంతరం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా, ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుడిగా విధులు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు. గ్లోబల్ అవకాశాలు, చట్ట వ్యవస్థలు, పౌర బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నలందా విద్యాసంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు, డైరెక్టర్ ఎం.సూర్యనారాయణ కశ్యప్ వర్మ, టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో 272 దరఖాస్తులు



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 272 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 51, రెవెన్యూ 74, ఇందిరమ్మ ఇండ్లు 28, విద్యుత్ 24, ప్రవాసి 02 చొప్పున ప్రజావాణికి దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 93 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

భారత్ సేవాశ్రమ కృషి అభినందనీయం: గవర్నర్

పంజగుట్ట: పేద పిల్లల్లో విద్యావ్యాప్తికి భారత్ సేవాశ్రమ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మంగళవారం భారత్ సేవాశ్రమ సంఘం వార్షిక నోట్ బుక్ పంపిణీ కార్యక్రమాన్ని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన ప్రారంభించారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిషోర్, భారత్ సేవాశ్రమ సంఘం హైదరాబాద్ కార్యదర్శి మునీశ్వరానందజీ మహారాజ్, స్వామి వెంకటేశ్వరానందజీ మహారాజ్‌లతో కలిసి రాజ్‌భవన్ విద్యార్థులకు 4 వేల లాంగ్ నోట్‌బుక్స్, 1,600 చిన్న నోట్‌బుక్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు. గవర్నర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించడానికి అధ్యాపకులు బాగా కృషి చేస్తున్నారని కొనియాడారు. రాజ్‌భవన్ పాఠశాల అద్భుతమైన విద్యా పనితీరును కనబరుస్తోందని ప్రశంసించారు. ఈ విద్యాసంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొత్త తరగతి గదులకు ఫర్నిచర్, మినీ ఇండోర్ స్టేడియం కమ్ ఆడిటోరియం, స్టేజ్ ఏర్పాటు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు.

ఖజానా ఖాళీ.. జీతాలకు కటకట

- కంటోన్మెంట్‌ను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- రూ.1,152 కోట్లు దాటిన ఆర్మీ సర్వీసు చార్జీల బకాయిలు
- రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బకాయిలూ రూ.50 కోట్లపైనే..



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో నిధులకు కటకట ఏర్పడింది. దాదాపు దివాలా స్థితికి చేరుకుంది. ఖజానా ఖాళీ అవడంతో సిబ్బంది జీతాల చెల్లింపులకూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జూలైలో పూర్తిస్థాయిలో జీతాలు అందుతాయో లేదోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2018 నుంచి తాజా ఉప ఎన్నికల వరకు 400 మంది సిబ్బందికి ఇవ్వాల్సిన రూ.4 కోట్ల భత్యాలు సైతం ఇంకా చెల్లించలేదు. స్థానిక పన్నుల ఆదాయం మినహా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కంటోన్మెంట్‌కు ఎలాంటి నిధులు అందవు! పైగా ఆయా ప్రభుత్వాల అధీనంలోని సంస్థలు బోర్డుకు చెల్లించాల్సిన సర్వీసు చార్జీలు, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ(టీపీటీ) ట్యాక్స్, లైసెన్సు ఫీజు, ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్, ప్రొఫెషనల్ ట్యాక్స్ బకాయిలు ఏకంగా రూ.1,300 కోట్లకు చేరాయి. ఇంతటి దారుణ పరిస్థితుల్లో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు ఎలా సాధ్యమంటూ బోర్డు అధికారులు చేతులెత్తేస్తూ ఉండటం గమనార్హం.

ఆర్మీ బకాయిలే అధికం..

ఆర్మీ స్థావరాల చుట్టూ ఉన్న సివిలియన్ ప్రాంతమైన కంటోన్మెంట్ పాలనా వ్యవహారాల్లో అడుగడుగునా ఆర్మీ పెత్తనమే కనిపిస్తోంది. కీలకాంశాల్లో స్థానిక మిలటరీ అధికారుల ఆమోదం తప్పనిసరి. ఆర్మీ అధికారులు కంటోన్మెంట్‌కు చెల్లించాల్సిన సర్వీసు చార్జీలను సకాలంలో చెల్లించడంలే. 30 ఏళ్ల క్రితం చివరిసారిగా పూర్తిస్థాయిలో సర్వీసు చార్జీలు చెల్లించారు. ప్రస్తుతం ఆర్మీ సర్వీసు చార్జీల బకాయిలు ఏకంగా రూ.1,152 కోట్లకు చేరాయి. స్థానిక ఎంపీ ఈటల సైతం సర్వీసు చార్జీల బకాయిలు విడుదలయ్యేలా చూస్తానని పలుమార్లు బోర్డు సమావేశాల్లో చెప్పినప్పటికీ రెండేళ్లలో రూ.4 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి.

రాష్ట్రానిదీ అదే దారి..

2014కు ముందు టీపీటీ నిధులు ఏ రోజుకారోజు నేరుగా కంటోన్మెంట్ ఖజానాకు చేరేవి. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆస్తుల రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు తేవడంతో కంటోన్మెంట్‌కు దక్కాల్సిన టీపీటీ నిధులను సైతం తన ఖాతాలోకి మళ్లించుకుంటోంది. దీనిపై స్థానిక నేతలు హైకోర్టును ఆశ్రయించడంతో అడపాదడపా కొంతమేరకు నిధులు చెల్లిస్తూ వస్తోంది. రెండేళ్లుగా మళ్లీ చెల్లింపులు నిలిచిపోవడంతో తాజాగా టీపీటీ బకాయిలు రూ.49.58 కోట్లకు చేరాయి. హైదరాబాద్ మెట్రోరైల్‌కు సంబంధించిన లైసెన్సు ఫీజు బకాయిలు రూ.9.61 కోట్లకు చేరాయి.

> **అభివృద్ధి పనులకు నిధుల్లేవు**
>
> స్థానిక పన్నుల ఆదాయం సిబ్బంది జీతాలకే సరిపోతుండటంతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేని పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ రూపాల్లో బోర్డుకు రావాల్సిన బకాయిలు విడుదలైతే కాస్త ఉపశమనం కలుగుతుంది. జీఎస్టీ వసూళ్లలోనూ బోర్డుకు తగిన వాటా ఇస్తే ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కే అవకాశం ఉంది.
>
> –మధుకర్ నాయక్, సీఈఓ

మైనారిటీ గురుకుల డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయండి



గురుకులాల కార్యదర్శి షఫీవుల్లాకు వినతిపత్రం సమర్పిస్తున్న యాకూబ్ పాషా

గురుకుల కార్యదర్శి షఫీవుల్లాను కలిసిన యాకూబ్ పాషా

సాక్షి,సిటీ బ్యూరో: రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం మైనారిటీ గురుకులాల కార్యదర్శి బి.షఫీవుల్లాను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 204 మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులు ప్రతి ఏటా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి బయటికి వెళ్తున్నారని, గురుకుల డిగ్రీ కళాశాలలు లేనందున అనేకమంది విద్యార్థులు ఐదేళ్లుగా ఇంటర్ తర్వాత చదువులతోనే స్వస్తి పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా 79 గురుకుల డిగ్రీ కళాశాలలున్నాయని, మైనారిటీలకు మాత్రం ఒక్క కళాశాల కూడా లేదని గుర్తు చేశారు. బాల, బాలికలకు వేర్వేరుగా మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాల కార్యదర్శి స్పందిస్తూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.డి.ఫారూఖ్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు

దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను సత్కరించిన మర్రి రాఘవయ్య

బన్సీలాల్‌పేట్: రైల్వే ఉద్యోగులు, కార్మికులు అంకితభావంతో పని చేయడం వల్లే ఉత్తమ ఫలితాలతో దక్షిణ మధ్య రైల్వే దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచిందని ఆ సంస్థ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ 113వ జనరల్ కౌన్సిల్ సమావేశం సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్ ఆడిటోరియంలో జరిగింది. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఉద్యోగులు మరింత కష్టపడి సంస్థను ప్రగతిపథంలో నడిపించాలని కోరారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకీకృత పెన్షన్ విధానం, కొత్త పెన్షన్ విధానాలను వ్యతిరేకిస్తున్నామని ప్రకటించారు. పాత పెన్షన్ పద్ధతి అమలు చేసే వరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. రైల్వేలో కార్మికులకు కనీస వేతనం 60 వేల రూపాయల వరకు ఉండాలని, రైల్వేలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఈ సమావేశం తీర్మానించినట్లు పేర్కొన్నారు. జూన్ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న అరుణ్‌కుమార్ జైన్‌ను ఎంప్లాయీస్ సంఘ్ తరఫున ఘనంగా సన్మానించారు. సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, సంఘ్ సంయుక్త కార్యదర్శి భరణిప్రసాద్, జోనల్ అధ్యక్షుడు ప్రభాకర్ ఆండ్రుస్, ఏజీఎస్‌లు రుద్రారెడ్డి, రవూఫ్, ఎస్సీఆర్‌లోని అన్ని డివిజన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి ఎదుట ఆందోళన

- ఇంజనీరింగ్ సీట్లను పారదర్శకంగా భర్తీ చేయాలని డిమాండ్



నాంపల్లి: ఇంజనీరింగ్ సీట్ల భర్తీ విషయంలో అవకతవకలు జరగకుండా చూడాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ సీట్ల భర్తీ విషయంపై అవకతవకలు జరగకుండా చూడాలని, డొనేషన్ల పేరు మీద విద్యార్థుల తల్లిదండ్రులపై అధికభారం మోపుతూ ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న కళాశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులందరికీ ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఉపకార వేతనాలు విడుదల కానీ కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, అలాంటి కళాశాలల గుర్తింపును వెంటనే తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, తరుణ్, చిత్తరంజన్, కుమార్, సంతోష్, ప్రధాన కార్యదర్శులు సామల పవన్, గణేష్, సురేష్, కోశాధికారి యోగి, కార్యదర్శి ప్రవీణ్, అశోక్, నాయకులు సుదేంద్ర శర్మ, అరవింద్, వినీత్, అనిత, మహేందర్, భగీరధ్, నితిన్, అవినాష్, నరేన్, గోవర్ధన్, రామకృష్ణ, ఆకాష్, అరుణ్, కక్రిచ వినయ్, ఇంద్ర పాల్గొన్నారు.

దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించండి

– జీహెచ్ఎంసీని ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: దుర్గం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్)ను మరోసారి నిర్ధారించాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)ను హైకోర్టు ఆదేశించింది. న్యాయస్థానం ఏర్పాటు చేసిన ఐదురుగు సభ్యుల కమిటీ ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రజావసరాల కోసం కేటాయించిన భూమిని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని అమర్ సొసైటీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించింది. ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేసి విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసింది. దుర్గం చెరువు చుట్టూ ప్రజావసరాలకు కేటాయించిన భూమి కబ్జా అవుతోందని, దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అమర్ సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. సొసైటీలో తాము కొనుగోలు చేసిన ప్లాట్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రావని అమిత్, కృష్ణ పేర్కొంటున్నారని, ఈ వివాదంపై జీహెచ్ఎంసీ విచారణ చేపట్టి.. చర్యలు తీసుకోవాలని సూచించారు. సొసైటీ స్పందించి వినతిపత్రాలను పరిష్కరించాలని, అక్రమమని తేలితే ప్రైవేట్ వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 8 వారాల్లో కొత్త ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారణ చేయాలని ఉత్తర్వులు జారీ చేయాలని పేర్కొన్నారు.

ఓయూను సందర్శించిన బ్రిటిష్ అధికారి



బ్రిటిష్ అధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఓయూ వీసీ ప్రొ.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గెరెత్ విన్ ఓవెన్ ఓయూను సందర్శించారు. మంగళవారం ఓయూ వీసీ ప్రొ.కుమార్‌తో పాలన భవనంలో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఇరువురి సమావేశంతో గ్లోబల్ అకడమిక్ అనుసంధానాన్ని ప్రోత్సహించే దిశగా మరో ముందడుగు పడింది. ఓయూతో కలసి పనిచేసేందుకు యూకేలోని ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలతో పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. కృత్రిమ మేధ, జీవశాస్త్రం, సస్టైనబిలిటీ, విద్యార్థుల మార్పిడి వంటి రంగాల్లో భవిష్యత్తులో ఓయూతో భాగస్వామ్యమయ్యే అవకాశాలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్, డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రామ్, ఇన్నోవేషన్ హబ్‌లు, సంయుక్త పరిశోధన నెట్‌వర్క్ వంట ప్రాథమిక అంశాలను చర్చించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రిటిష్ హై కమిషనర్ సలహాదారు పీయూష్ అవస్థీ, ఓయూ అధికారులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో సూత్ర ఆధ్వర్యంలో ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బల్కంపేటలోని శ్రీ ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఉదయం 11 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో దేవాదాయ శాఖ మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారు.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ ట్రస్ట్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8గంటల వరకు సంపూర్ణ సంస్థ ఆధ్వర్యంలో వస్త్రభూషణ పేరిట చేనేత వస్త్ర ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కోఠిలోని గాంధీ జ్ఞాన మందిర్ కేంద్ర ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా వారోత్సవాలలో భాగంగా ఉదయం 5.30గంటల నుంచి ఉదయం 9.00గంటల వరకు బ్రీతింగ్ సమస్యలపై యోగ కార్యక్రమం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



– జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, ఏఎం అండ్ హెచ్‌ఓలు, ఎంటమాలజీ అధికారులతో శానిటేషన్, దోమల నివారణ, ఆస్తిపన్ను వసూళ్లపై కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు ఖైరతాబాద్ జోన్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తప్పనిసరిగా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. ఫాగింగ్ పెట్రోల్, డీజిల్ కూపన్లకు ప్రత్యామ్నాయంగా ప్రీ పెయిడ్ కార్డు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఏఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో యాంటీ లార్వా కార్యక్రమం, ఉదయం, సాయంత్రం ఫాగింగ్ పనులు చేపట్టాలన్నారు. పాఠశాలలు, కాలేజీలో డెంగీ, మలేరియా వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. మెయిన్ రోడ్డు పై సీ అండ్ వేస్ట్, వాటర్ లాగింగ్, అనుమతులు లేని హోర్డింగ్‌లు ఉండొద్దని సూచించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆస్తి పన్నులు వసూలు చేయాలని బిల్లు కలెక్టర్లను కర్ణన్ ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ లేని పక్షంలో పన్నులు వసూలు చేయాలని, ప్రతినెలా ట్యాక్స్‌పై సమీక్ష నిర్వహిస్తామన్నారు. బౌన్స్ చెక్కులు బేగంపేట్, సరూర్ నగర్‌లో ఎక్కువగా వచ్చినందున వాటిని వెంటనే సరిచేయాలని సంబంధిత డీసీలను ఆదేశించారు.

కుక్కల దత్తత కార్యక్రమాలు

కుక్కల దత్తత కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని, అప్పుడే పెట్ డాగ్ లైసెన్స్ ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అరు. ఫుడ్ పాయిజన్ కాకుండా మటన్, చికెన్ షాపులను ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి తనిఖీలు చేయాలని చీఫ్ వెటర్నరీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, పంకజ, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావు, రవి కిరణ్, వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ అధికారులు, ఎంటమాలజీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ బోర్డు ఎత్తివేతకు కుట్ర

– ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే, నేతలు

చిక్కడపల్లి: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఏఐటీయూసీ తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు జరిగిన భారీ ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఎత్తేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో 15 లక్షల మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదై ఉన్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ లేబర్ అధికారులు కార్మికులకు నిధులు మంజూరు చేయకుండా జాప్యం చేస్తూ ఇప్పుడు అప్పనంగా బీమా కంపెనీలకు అప్పజెప్పడం విచారకరమన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు క్లెయిమ్‌లను బీమా కంపెనీలకు అప్పజెప్పే టెండర్లు వెంటనే రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బోర్డు కార్యదర్శి, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మోతె నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, అధ్యక్షుడు ఎం.ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మేకల శ్రీనివాస్, పానుగంటి పర్వతాలు, జి.రాజు, నూనె వెంకటేశ్వర్లు, గాదె లక్ష్మీ నారాయణ, లావణ్య, రాజమ్మ, రజిత పాల్గొన్నారు.

పట్టణాల్లో వర్టికల్ భవనాలు అనివార్యం

– ఏసీసీఈఐ వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: భూమి కొరత, ఆకాశాన్నంటుతున్న ధరల కారణంగా పట్టణ ప్రాంతాల్లో వర్టికల్ (నిటారు) భవన నిర్మాణాలు అనివార్యమయ్యాయి. ఎత్తయిన నిర్మాణాల్లో నిర్మాణాత్మక రూపకల్పన, స్థిరత్వం, పర్యావరణ అనుకూలతలు అనేవి సవాళ్లుగా మారుతున్నాయని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా(ఏసీసీఈఐ) అభిప్రాయపడింది. పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి వినూత్న పదార్థాలు, పద్ధతుల వాడకాన్ని ఏసీసీఈఐ ప్రోత్సహిస్తుందని, ఎత్తైన భవనాల భద్రత, మన్నిక కోసం కీలకమైన, స్థిరత్వంతో కూడిన నిర్మాణాల కోసం ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడానికి అధునాతన వ్యవస్థల వినియోగాన్ని కూడా అన్వేషిస్తున్నామని ఏసీసీఈఐ ఏసీసీఈ వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ కంచర్ల అన్నారు. ఏసీసీఈఐ హైదరాబాద్ చాప్టర్ వచ్చే నెల 11, 12 తేదీల్లో గచ్చిబౌలిలోని ఈఎస్సీఐ క్యాంపస్‌లో 'నెక్స్ట్-జెన్ హైరైజ్ బిల్డింగ్స్ - అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ కాంపోజిట్ అండ్ స్టీల్ స్ట్రక్చర్స్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించనుందని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 800 మంది పరిశ్రమల నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటారని పేర్కొన్నారు. హైరైజ్ భవనాలు, సివిల్ ఇంజనీరింగ్ అభివృద్ధి చెందుతున్న తీరు, వివిధ అంశాలపై వారు చర్చిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ చాప్టర్ మాజీ చైర్మన్ కాశీరామ్ ఆడెపు, వైస్ చైర్మన్ భీంరావు, గౌరవ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి పాఠశాలకు పేరు తేవాలి

బంజారాహిల్స్‌లో గతి ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్



పాఠ్య పుస్తకాలను చదివిస్తున్న జిల్లా కలెక్టర్ హరిచందన

బంజారాహిల్స్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్-7లోని గతి ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో కొద్దిసేపు మాటామంతీ నిర్వహించారు. చిన్నారులతో అరగంటపాటు ఆమె ఆనందంగా గడిపారు. పిల్లల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని టాయిలెట్లను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఎంతమంది పిల్లలు ఉన్నారు, పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారా? లేక ఏమైనా ఖాళీలు ఉన్నాయా అని ఆరా తీశారు. పాఠశాల నేమ్ బోర్డు రాయించాలని సూచించారు. పాఠశాలలోని 1వ తరగతి, 4వ తరగతి క్లాస్ రూమ్‌లను సందర్శించి పిల్లలతో పాఠ్యపుస్తకాలను చదివించి, రాయించి వారి పరిజ్ఞానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ ఆర్.రోహిణి, డిప్యూటీ ఈఓ శామ్యూల్ రాజ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బుద్ధారెడ్డి రచనలు పాఠాలుగా ఉండేవి

– ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: గోన బుద్ధారెడ్డి సరళమైన తెలుగులో రాసిన ఉడత సాయం, సీతాన్వేషణం ఒకప్పుడు పాఠాలుగా ఉండేవని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మంగళవారం ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా తెలుగు కవి, రంగనాథ రామాయణం గ్రంథాన్ని రచించిన గోన బుద్ధారెడ్డి యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. మధుసూదనాచారి మాట్లాడుతూ 13వ శతాబ్దికి చెందిన బుద్ధారెడ్డి తొలిసారిగా వాల్మీకి సంస్కృత రామాయణాన్ని రంగనాథ రామాయణం పేరిట అనువదించారని, సాహిత్య భోజుడుగా గుర్తిపు పొందారని పేర్కొన్నారు. తెలుగు సాహిత్య విశిష్టతను పెంచిన గోన బుద్ధారెడ్డి లాంటివారి గురించి నేటి తరాలకు తెలియజేసేందుకు గానసభ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జయరాములు మాట్లాడుతూ బుద్ధారెడ్డి ఆంధ్ర మహాభారత రచన చేసిన తిక్కన సమకాలీకుడని, కాకతీయ మహారాణి రుద్రమదేవి సమకాలికుడైన గోన గన్నారెడ్డి కుమారుడని పేర్కొన్నారు. సమావేశంలో గాయని లక్ష్మీకాంతి, రుక్మిణి పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 18, జూన్ 2025

నగరంలో ఫుడీస్, ఫుడ్ లవర్స్, భోజనప్రియులు.. పేరేదైనా కానీ.. విభిన్న వంటకాలు ఆస్వాదించేవారు పెరుగుతున్నారు. మరోవైపు రెస్టారెంట్స్‌లో మాత్రమే కాదు సంపన్నుల బఫే డిన్నర్స్‌లోనూ, పార్టీస్‌లోనూ విభిన్న రకాల విదేశీ రుచుల వడ్డన సర్వసాధారణం అయ్యింది. అయితే కంటికి ఇంపైనంత మాత్రాన ఇంటికి ఇంపు కావాలని లేనట్టే, నోటికి ఇంపుగా అనిపించినంత మాత్రాన శరీరానికి ఇంపు కాకపోవచ్చని వైద్యులు చెబుతున్నారు. రుచుల వేట సాగించేవాళ్లు ముందస్తుగా ఫుడ్ ఇన్‌టోలరెన్స్ టెస్టు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. వైద్యులు చెబుతున్న వివరాల ప్రకారం..

- సాక్షి, సిటీబ్యూరో



టెస్ట్.. బెస్ట్..

రుచుల వేటతో రోగాల బాట

సాధారణంగా మనుషులు తినకూడని ఆహారాలు మనకి తెలుసు. తినదగినవీ తెలుసు. కానీ కొందరికి మాత్రమే తినదగినవి, కొందరు తినకూడనివి కూడా ఉంటాయి. అలానే ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాలు కూడా కొన్నిసార్లు అస్వస్థతకు కారణమవుతాయి. ఇవి జీర్ణక్రియ సమస్యలు, చర్మం మీద ర్యాషెస్, తలనొప్పి, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలను కలిగించవచ్చు. అయితే ఎటువంటి ఆహారం అనారోగ్యానికి కారణమవుతుందో గుర్తించడం చాలా కష్టం. అనేక సందర్భాల్లో ఈ లక్షణాలు ఆహారం తిన్న కొన్ని గంటల తరువాత మాత్రమే బయటపడతాయి. ఈ క్రమంలో ఫుడ్ ఇన్‌టోలరెన్స్ టెస్ట్ అనేది ఉపయోగపడుతుంది.



- కొన్ని శరీరతత్వాలకు నప్పని కొన్ని పదార్థాలు
- సరిపడని ఫుడ్ తినడం అనారోగ్య కారకం
- ఇప్పుడిప్పుడే నగర వాసుల్లో పెరుగుతున్న అవగాహన
- ఫుడ్ ఇన్‌టోలరెన్స్ పరీక్షలకు పెరుగుతున్న ఆదరణ

ఫుడ్ ఇన్‌టోలరెన్స్ టెస్ట్..

ఈ పరీక్ష ద్వారా ఓ వ్యక్తి శరీరం ఏ ఆహారాల పట్ల అసహనంగా స్పందిస్తుందో గుర్తించవచ్చు. తద్వారా శరీరంలో ప్రతికూల ప్రభావాలు కలిగించే ఆహారాలను అడ్డుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అయితే ఎవరికి ఈ పరీక్ష అవసరం అంటే.. కుటుంబంలో ఎవరైనా ఆహారాల అలర్జీ లేదా అసహనంతో బాధపడుతుంటే, ఆస్తమా వంటి రోగాలు ఉన్నా.. ఫుడ్ ఇన్‌టోలరెన్స్ పరీక్ష అవసరం.





నప్పనివి ఏమిటి?

సాధారణంగా నప్పని ఆహారాల్లో పాలు, సోయా, గుడ్లు, గోధుమలు, షెల్ ఫిష్, పీనట్స్, వాల్‌నట్, ఆల్మండ్, కాజు, పీకాన్ వంటి డ్రై ఫ్రూట్స్.. అయితే ఇవి నప్పకపోవడానికి వాటిలో ఉండే కొన్ని ఉపపదార్థాలు కూడా కారణమే. ఉదాహరణకు పాలలో ఉండే లాక్టోజ్ అనే ఒక రకమైన తియ్యటి పదార్థం, గోధుమలు, బార్లీ వంటి ధాన్యాల్లో ఉండే గ్లూటెన్ అనే ప్రొటీన్, ఫుడ్ ఫ్లేవర్ పెంచడానికి ఉపయోగించే ఎంఎస్‌జీ అనే పదార్థం.. ఇలా.. కొన్ని సందర్భాల్లో అతి తక్కువ మోతాదులో ఈ ఆహారాలను తీసుకున్నా తీవ్ర సమస్యలకు కారణం కావచ్చు. అలాగే మనకు ఏ మాత్రం పరిచయం లేని వంటకాల్లో ఏయే దినుసులు కలుపుతున్నారో వాటిలో ఏవి మనకు నప్పవో తెలీదు కాబట్టి మరింత జాగ్రత్త అవసరం.

ఫుడ్ అలర్జీ.. లక్షణాలు ఇలా..

ఆహారం పడకపోవడం వల్ల మొదటిగా చర్మంపై పొక్కులు, ఎర్రని దద్దుర్లు, నొప్పులు రావచ్చు. అయితే చిన్నపిల్లల్లో మొదటి లక్షణంగా చర్మంపై ర్యాష్ కనిపిస్తుంది. అలాగే శ్వాస సంబంధిత వ్యవస్థపై ప్రభావంతో దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ బిగుదల, ముక్కు పొంగడం వంటి సమస్యలు కలగవచ్చు. జీర్ణ వ్యవస్థపై దాడితో.. నాలుక ఉబ్బిపోవడం, బొజ్జ నొప్పి, నోటిలో మెటాలిక్ రుచి వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే అనాఫిలాక్టిక్ షాక్ అనే తీవ్ర పరిస్థితి ఏర్పడినప్పుడు వేగంగా నాడీ స్పందన, పెదవులు, గొంతు ఉబ్బిపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చర్మం తెల్లగా కనిపించడం, మూర్ఛ వంటివి కూడా రావచ్చు.



ఆహారం.. అసహనం..

మన శరీరానికి హానికరం కాని ఆహారాలను హానికరమైన వైరస్‌లా గుర్తించి స్పందించే స్థితి కూడా ఉంటుంది. ఇది కొన్నిసార్లు చిన్నపాటి జీర్ణ సమస్యలుగా ఉంటే, మరికొన్నిసార్లు అనాఫిలాక్టిక్ షాక్ అనే ప్రాణాంతక పరిస్థితికి దారితీస్తుంది. ఈ సమస్య చిన్నపిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 5 శాతం కంటే ఎక్కువ మంది చిన్నారులు దీని ప్రభావానికి లోనవుతున్నారు. చాలామంది పిల్లలు పెద్దయ్యాక ఈ అసహనాన్ని సహనంగా మార్చుకోగలుగుతారు. కానీ కొందరు మాత్రం కొన్నింటిని నప్పేలా చేసుకుంటారు కొన్నింటి పట్ల అసహనాన్ని కొనసాగిస్తారు.

ఫుడ్ అలర్జీ పరీక్షలు.. ఎలా? ఎక్కడ?

అనుమానాస్పద ఆహారాన్ని స్వల్పంగా ప్రయోగించి శరీరం ఎలా స్పందిస్తుందో పరిశీలించడాన్ని ఓరల్ ఛాలెంజ్ టెస్ట్ అంటారు. అలాగే అనుమానాస్పద ఆహారాలను పూర్తిగా ఆపి, తర్వాత ఒక్కొక్కటిగా మళ్లీ ఆహారంలో చేర్చడాన్ని ఎలిమినేషన్ డైట్, ఆహారాన్ని చర్మంపై ఉంచి సూదితో తక్కువగా గుచ్చి చేసే స్కిన్ ప్రిక్ టెస్ట్, రక్తంలో ఐజీఇ యాంటీబాడీస్ ఉన్నాయా లేదా అనేది పరీక్షించడానికి బ్లడ్ టెస్ట్ చేస్తారు. నగరంలో థైరోకేర్, మై డయాగ్నోస్టిక్స్, డీఎస్ఏ ల్యాబ్స్ ఇండియా, రెడ్ క్లిఫ్ ల్యాబ్స్, ల్యూసిడ్.. వంటి చోట్ల ఈ పరీక్షలు చేస్తున్నారు. కనీసం 200 రకాలు.. ఆపైన అలర్జీలను గుర్తించేందుకు చేసే పరీక్షల వ్యయం కనీసం రూ.5వేల నుంచి రూ.15వేల వరకూ అవుతుంది.



నగరంలో కైమా రుచులు

- నాలెడ్జి సిటీలోని సత్వా పార్కులో ప్రారంభం
- భాగ్యనగరానికి మధ్యధరా- ఆసియా ఫ్లేవర్లు
- ముంబయి, పుణె తర్వాత హైదరాబాద్‌లో
- అద్భుతమైన యాంబియన్స్‌తో ఏర్పాటు

రాయదుర్గం : భాగ్యనగరానికి మధ్యధరా- ఆసియా ఫ్లేవర్లను తీసుకొచ్చేందుకు 'కైమా' రెస్టారెంట్ ఆరంభమైంది. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని సత్వా నాలెడ్జి పార్కులో నగరంలో మొదటి సారిగా కైమా రెస్టారెంట్ మంగళవారం ప్రారంభించారు. మొదటి కైమా రెస్టారెంట్ ముంబయిలోనూ, రెండో రెస్టారెంట్ పుణెలోనూ, మూడో రెస్టారెంట్‌ను హైదరాబాద్ నాలెడ్జి సిటీలోనూ ఏర్పాటు చేయడం విశేషం. సహజసిద్ధమైన పల్లె వాతావరణాన్ని తలపించేలా రాళ్లు, బంకమట్టితో నిర్మించిన గోడలను తలపించే రీతిలో యాంబియన్స్ ఆకట్టుకునేలా ఉంటుంది. టెర్రకోట, గిరిజన మూలాంశాలలోని కథలను వివరించేలా ఆకర్షణీయమైన అలంకరణతో, అబ్బురపరిచే లైటింగ్ ఏర్పాటు చేశారు. రెస్టారెంట్ యజమానులు నిఖితాపూజారి, అంకితాపూజారి, నారాయణ్ పూజారి, మేనేజింగ్ పార్ట్‌నర్ నిఖిల్ రోచ్లాని, చెఫ్‌లతో కలిసి ప్రారంభించారు. హైదరాబాద్ నగరం విభిన్న నగరమే కాకుండా వివిధ రకాల రుచులను ఆస్వాదించే ప్రజలకు అందుబాటులో ఉండేలా తమ కైమా రెస్టారెంట్ ఏర్పాటు చేశామని యాజమాన్యం తెలిపింది.



ప్రత్యేకమైన వంటకాలతో..

కైమా రెస్టారెంట్‌లో వివిధ దేశాల సంప్రదాయ వంటకాలను ఆసియా రుచులతో అనుసంధానించేలా ఏర్పాటు చేశారు. నగరవాసులకు ట్రాన్స్‌రూబియాన్, చికెన్‌షిష్ తవూక్, ఈజిప్షియన్ కోషారీ, సిగ్నేచర్ క్లాసిక్ లెబ్నెహ్ షగ్, కాటేజ్ చీజ్ పాకెట్స్ వంటి వాటిని ఆహారప్రియులైన నగరవాసులు ఆస్వాదించవచ్చని నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా ఆసియన్ వంటకాల్లో కిమ్చి-జ్జిగే సూప్, తాజా రుచికరమైన ట్రిపుల్-ఇ స్పినాచ్ ఆస్పరాగస్ సలాడ్, సిట్రస్-ఫార్వర్డ్ సాల్మన్ టిరాడిటో అందుబాటులో ఉంటాయి. వీటితోపాటు ట్రిపుల్-ఇ ఎడామామ్ మనీ బ్యాగ్, గౌర్రె లేదా జాక్‌ఫ్రూట్‌తో మసాలా రెండాంగ్ గ్యోజా, బోల్డ్ స్పైసీ మష్రూమ్ చెయుంగ్‌ఫాంగ్, ఇటాలియానో సాల్మన్ రోల్, క్వినోవా అవోకాడో రోల్ వంటి సుషీ వెరైటీలు కూడా అందుబాటులో ఉంటాయి. వీటితోపాటు సాల్మన్ టామ్‌యమ్, చిలగడ దుంప- వాసబిమాష్, స్మోకీ-స్వీట్ లాంబ్ చాప్ బుల్గోగి, సామ్జియోప్సల్ ప్లాటర్ వంటి ప్రధాన వంటకాలు, బక్లావా చీజ్ కేక్ నుంచి సుగంధ సాఫ్రాన్ మిల్క్ కేక్, కునాఫా వంటివి కూడా ఆహారప్రియులను అలరించనున్నాయి.



పచ్చని పరవశం..

నర్సరీ బాట పడుతున్న నగర వాసులు

- వర్షాలు కురుస్తుండటంతో గార్డెన్, మిద్దె తోటకు మొక్కల వేట
- కడియం నుంచి నగరానికి పెరిగిన మొక్కల దిగుమతి
- ఆన్‌లైన్ వేదికల్లోనూ పెరిగిన ప్లాంట్ ఆర్డర్స్
- ఈ రెండు నెలలూ అమ్మకాలు ఎక్కువే : నర్సరీ నిర్వాహకులు

మెల్లి మెల్లిగా వర్షాలు పడటంతో నగరంలో చల్లదనపు వాతావరణం ఆవరించుకుంటోంది. గాలి తేమతో నిండిపోయి, ప్రకృతి కళగా మారిన ఈ సమయంలో నగరవాసులు వారి ఇళ్లకు, అపార్ట్‌మెంట్లకు, మిద్దెలకు ఆకుపచ్చ అందాన్ని అద్దేందుకు సంసిద్ధమవుతున్నారు. మొక్కలు నాటేందుకు ఇది అత్యుత్తమ కాలం కావడం, అదే సమయంలో **గ్రీన్ లివింగ్ పై** నగరవాసుల్లో పెరిగిన ఆసక్తి వర్షాకాలాన్ని సరైన సమ**యంగా** మార్చుతోంది. ఇంట్లో చిన్నదైనా సరే.. ఒక గ్రీన్ కార్నర్ ఉం**టే, అది** మన మూడ్‌కు, ఆరోగ్యానికి, జీవనశైలికి నూతన శోభను తీసుకురాగలదు. మొక్కలతో బంధాన్ని పెంచుకుంటే ఈ బీజీ లైఫ్‌లో కాసింతైనా ఉపశమనం లభిస్తుందని నగరవాసుల అభిలాష. ఈ నేపథ్యంలో మొక్కల ప్రేమికులు నర్సరీల బాట పడుతుంటే, మరికొందరు ఆన్‌లైన్‌లో ఆర్డర్స్ పెడుతున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



గత దశాబ్దంతో పోలిస్తే ప్రస్తుతం గార్డెనింగ్, టెర్రస్ గార్డెనింగ్, ఇంటీరియర్ ప్లాంటేషన్ వంటి అభిరుచి గణనీయంగా పెరిగాయి. పని ఒత్తిడిని తేలికపరచడానికి, ఇంట్లోకి ప్రకృతి పారవశ్యాన్ని తీసుకురావడానికి మొక్కలు సరైన ఎంపికగా మారాయి. ఇది ఒక హాబీ అనడం కన్నా.. ఓ నూతన జీవన శైలిలో భాగంగా మారిందనడం సరైనదేమో. ప్లాంట్ థెరపీ అనే ట్రెండ్ ఇప్పుడు మెట్రో లైఫ్ స్టైల్‌లో ప్రత్యేక స్థానం దక్కించుకుంది.



నర్సరీల్లో సందడి..

ఈ వర్షాకాలంలో హకీంపేట్, బేగంపేట్, ఖాజాగూడ, కొంపల్లి, బాచుపల్లి, అమీర్‌పేట్, మియాపూర్, గచ్చిబౌలి, బంజారాహిల్స్ వంటి ప్రాంతాల్లో నర్సరీలు రద్దీగా మారాయి. అంతేకాదు, పాతబస్తీ నుంచీ కొత్తబస్తీ వరకూ పూల మొక్కలతో పాటు డెకరేటివ్ ప్లాంట్స్, హెర్బల్ ప్లాంట్స్, కూల్ ఎయిర్ ప్లాంట్స్ కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగిపోతోంది. ఈ సీజన్‌లో డిమాండ్ పెరగడంతో నర్సరీ యజమానులు ఎక్కువగా మొక్కలను దిగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా కడియం (ఆంధ్రప్రదేశ్), బెంగళూరు, పుణె వంటి గార్డెనింగ్ మార్కెట్ల నుంచి నగరానికి మొక్కలు ఎక్కువగా వస్తుండటమే కాకుండా కొన్నింటి ధరలు గణనీయంగా పెరిగాయి. అయినా సరే, మొక్కలపై ఉన్న ప్రేమ ముందు ధరలు విషయమే కాదనుకుంటున్నారు ప్లాంట్ లవర్స్. హైదరాబాద్ మహా నగరంలో ఏడాదంతా అమ్మకాలు బాగానే ఉన్నప్పటికీ.. ఈ సీజన్‌లో ఎక్కువగా అమ్ముడుపోయే మొక్కలే తమకు అధిక లాభాలను తెచ్చిపెడుతున్నాయని కూకట్‌పల్లికి చెందిన నర్సరీ నిర్వాహకులు వేణుమాధవ్ తెలిపారు.





బిజీ లైఫ్.. ఆన్‌లైన్ ఆర్డర్స్..

బిజీ లైఫ్‌లో మొక్కలు కొనడానికి సమయం లేనివారు ఇప్పుడు మొక్కలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారు. ఉగావో, నర్సరీలీవ్, మైబాగీచ, అమెజాన్, బిగ్‌బాస్కెట్, గార్డెనింగ్ స్టోర్, అర్బన్ మాలి వంటి ప్లాట్‌ఫాంల ద్వారా నేరుగా ఇంటి వద్దకే మొక్కలు డెలివరీ అవుతున్నాయి. కొంత మేరకు ఖర్చు ఎక్కువైనా, బ్రాండెడ్ ప్లాంట్ ప్యాకేజింగ్, ఎలా నాటాలి-పెంచాలనే సూచనలు, పెంపకం టిప్స్ ఇవ్వడం వల్ల కొనుగోలు ధోరణి పెరుగుతోంది.

జీవనశైలిగా మారిన పచ్చదనం..

కేవలం అందం కోసమే కాక, కాలుష్యానికి ప్రత్యామ్నాయంగా, ఇంట్లో మంచి హ్యూమిడిటీకి, ఆక్సిజన్ సరఫరాకు మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గ్రీన్ ఇంటీరియర్ డిజైనింగ్, బాల్కనీ గార్డెనింగ్, వాల్స్‌పై వర్టికల్ గార్డెన్, వాటర్ సేవింగ్ ప్లాంటేషన్ వంటి కాన్సెప్ట్‌లు పెరుగుతున్నాయి.



ట్రెండింగ్ ప్లాంట్స్..

ఇండోర్ డెకోరేటివ్ ప్లాంట్స్- మోన్‌స్టెరా, పీలియా, స్నేక్ ప్లాంట్, జెడ్ ప్లాంట్-పూల మొక్కలు-బోగన్‌విల్లా, రోసెస్, లిల్లీస్, హైబిస్కస్, హెల్కోనియా -ఔషధ మొక్కలు- తులసి, అశ్వగంధ, మతి, అలో వెరా-ఫ్రూట్ ప్లాంట్స్-జామ, నేరేడు, మామిడి, లిచి, సీతాఫలం వంటి మొక్కలు ప్రస్తుతం ట్రెండింగ్ ప్లాంట్స్‌గా ఉన్నాయి.

ఇంటింటా.. మిద్దె పంట..

నగరంలో ప్రధానంగా ప్లాట్స్, ఇండిపెండెంట్ హౌసెస్ ఉన్నవారు మిద్దె పంటలకు పెద్దపీట వేస్తున్నారు. ఇంటికి సరిపడా కూరగాయలు, పూలను పెంచుకోవడంతో పాటు పచ్చదనాన్ని కోరుకుంటున్నారు. ఇందులో భాగంగా టమాట, బీర, దోస, కీరా, మునగ, పాలకూర, కొత్తిమీర వంటి ఆకుకూరలు ఇంట్లోనే పెంచుకుంటూ ఆరోగ్యాన్ని చక్కబెడుతున్నారు.



శిల్పకళావేదికలో ఐరావత్ ఛాంపియన్స్

బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజు

మాదాపూర్ : చదరంగంలాగే జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల విజయానికి వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, మానసిక స్థైర్యం ఎంతో అవసరమని ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజు తెలిపారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో మంగళవారం ఐరావత్ ఛాంపియన్స్ పేరిట ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన ఐఐటీ, జేఈఈ, నీట్-2025 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థలు మరోసారి అగ్రస్థానాన్ని నిరూపించుకున్నందుకు గానూ ఈ ఐరావత్ ఛాంపియన్స్ నిర్వహిస్తున్నట్టు శ్రీ చైతన్య డైరెక్టర్లు శ్రీధర్ యలమంచిలి, సుస్మా బొప్పన, సీమ తెలిపారు. భారతీయ చెస్ గ్రాండ్‌మాస్టర్ గుకేష్ దొమ్మరాజును బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినందుకు సంతోషం వ్యక్తపరిచారు. చిన్నవయసులోనే గుకేష్ సాధించిన అసాధారణ విజయాలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చెవిరెడ్డి పేరు చెప్పాలని 'సిట్' చిత్రహింసలు

మద్యం అక్రమ కేసులో ఆయనకు సంబంధం ఉందని చెప్పాలన్నారు

సిట్ విచారణ తీరుతో ఆస్పత్రి పాలైన హెడ్ కానిస్టేబుల్ మదన్

సాక్షి అమరావతి: మద్యం అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు చెప్పాలని ఆయనతో పాటు తిరిగిన వారిని, సన్నిహితంగా మెలిగిన వారిని సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం-ఎస్ఐటి) అధికారులు టార్గెట్ చేసి చిత్ర హింసలు పెడుతున్నారు. పోలీసులని కూడా చూడకుండా గతంలో గన్‌మెన్‌లుగా పని చేసిన వారిపై కూడా చేయి చేసుకుంటున్నారు. జరగని లిక్కర్ స్కామ్‌లో చెవిరెడ్డికి భాగమున్నట్లు తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని తనకు నరకం చూపారని గతంలో చెవిరెడ్డికి గన్‌మెన్‌గా పనిచేసిన మదన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన ఒంటిపై ఖాకీ యూనిఫాం ఉన్నప్పటికీ తనను కొట్టారని, అనరాని మాటలతో మానసిక వేదనకు గురిచేశారని వివరిస్తూ డీజీపీకి లేఖ రాశారు. అందులోని వివరాలు ఇలా ఉన్నాయి.



సిట్ అధికారులు కొట్టడంతో ఆసుపత్రి పాలైన హెడ్‌కానిస్టేబుల్ మదన్‌రెడ్డి

చెప్పినట్లు చేయడానికి నీకేంటి రోగం?

- 'నన్ను విజయవాడ సిట్ సార్ వాళ్లు రమ్మంటే వెళ్లాను. మొదటి రోజు వారు చెప్పినట్టు రాసి సంతకాలు చేయమన్నారు. నేను సాక్షిగా వచ్చాను.. వాస్తవాలు చెబుతాను, వాస్తవాలు రాస్తాన ని చెప్పాను. అందుకు వాళ్లు నన్ను అసభ్యంగా తిట్టారు. నీ కన్నా ముందు విచారణకు వచ్చిన గిరి అనే కానిస్టేబుల్ మేము చెప్పినట్టు రాసి సంతకాలు పెట్టాడని చెప్పారు. వీడియో రికార్డింగ్‌లోనూ అదే చెప్పాడు. మరి నీకేంటి రోగం.. అంటూ తిట్టారు.
- మొదటి రోజు పది గంటల పాటు ఒకరు మారిస్తే ఒకరు నన్ను మానసికంగా, శారీరకంగా హింసించారు. అనరాని మాటలు అంటుంటే, నన్ను ఇలాగే వేధిస్తే తట్టుకునే శక్తి నాకు లేదన్నాను. ఇక్కడ నాకు ఏదైనా జరిగితే మీదే బాధ్యత అని చెప్పడంతో ఆ రోజుకు పంపించేశారు. రేపు రా.. అది కూడా యూనిఫాం తీసేసి రా అని చెప్పారు. నా కన్నా ముందు సిట్ విచారణకు యూనిఫాం తీసేసి వచ్చిన కానిస్టేబుల్ గిరిని కొట్టారని తెలిసి రెండో రోజు కూడా యూనిఫాం వేసుకుని విచారణకు వెళ్లాను. అలా వచ్చినందుకు నన్ను బూతులు తిట్టారు.
- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి లిక్కర్ స్కామ్‌లో సంబంధం ఉందని, రూ.200 నుంచి రూ.250 కోట్లు రవాణా చేశాడని గిరికి చెబితే ఒప్పుకుని అలాగే రాశాడు. అలాగే నువ్వు కూడా రాసిచ్చి మీ ఊరికి వెళ్లిపో అని చెప్పారు. నేను చెవిరెడ్డి దగ్గర పదేళ్లు గన్‌మెన్‌గా పనిచేశాను. లిక్కర్ వల్ల ఆయన కుటుంబంలో ఇద్దరిని కోల్పోయాడు. అతను ఎన్నికల్లో కూడా మద్యం పంపిణీ చేయలేదు. అతనికి సెంటిమెంట్ కూడా. అలాంటిది ఒక చిన్న కానిస్టేబుల్ అయిన నా చేత అంత పెద్ద మాటలు చెప్పించడం, రాయించడం ఏంటి సార్.. నేను అలా అబద్ధాలు చెప్పలేను అని చెప్పాను. దీంతో సిట్ వాళ్లు చాలా కోపంతో నీ ఉద్యోగం ఊడబెరికి జైలుకు పంపుతామని బెదిరించారు. ఏమైనా సరే అంతగా అబద్ధాలు చెప్పలేనన్నాను. దీంతో అక్కడున్న పది మంది సిబ్బంది యూనిఫాంలో ఉన్న నాపై విరుచుకుపడ్డారు.
- తల, ముఖం, వీపుపై పిడిగుద్దులు గుద్దారు. నా చేతి వేళ్లు పట్టుకుని వెనక్కు విరిచారు. ఆ నొప్పి భరించలేక నేను గట్టిగా అరిచాను. నీళ్లు తాగించి మళ్లీ అలాగే చేశారు. కొంత సేపటి తర్వాత.. యూనిఫాం తీసేసి రావాలంటూ పంపించారు. నేను రూముకు వచ్చాక కళ్లు తిరిగి కిందపడ్డాను. తర్వాత మణిపాల్ ఆసుపత్రికి వెళ్లాను. తీవ్ర ఆందోళనలో ఉన్న నాకు కార్డియాలజీ, న్యూరాలజీ పరీక్షలు చేయాలని అడ్మిట్ చేసుకున్నారు.
- సార్.. ఈ పరిస్థితిలో నేను సిట్ దగ్గరకు ఒంటరిగా వెళ్లలేను. ఆ దెబ్బలు తట్టుకొనే శక్తి, ఆరోగ్యం నాకు లేదు. నాకు ఉద్యోగం లేకపోయినా కూలి పనులు చేసుకుని, పశువులు మేపుకుని బతుకుతాను. అక్కడ నాకు ఏమైనా జరిగితే నా కుటుంబం అన్యాయమైపోతుంది.. దయచేసి పెద్ద మనస్సుతో నా విన్నపాన్ని మన్నించి, నన్ను కొట్టకుండా విచారించేలా సిట్ వాళ్లకు ఆదేశాలివ్వండి' అని విన్నవించారు.

గిరి.. మదన్.. వెంకటేష్.. బాలాజీ..

చెవిరెడ్డికి అంగరక్షకులుగా.. అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారిని బలవంతగా అరెస్టు చేసిన సిట్ అధికారులు రోజుల తరబడి వారి అదుపులో పెట్టుకుని చిత్రవధ చేశారని ఇప్పటికే చెవిరెడ్డి పలుమార్లు మీడియా ద్వారా వెల్లడించారు. మొదటగా గన్‌మెన్ గిరిని పట్టుకుని తీవ్రంగా కొట్టి, భయపెట్టి స్టేట్‌మెంట్ తీసుకున్నారని, ఆ తర్వాత మరో గన్‌మెన్ మదన్‌ను విచారణకు పిలిపించి విచక్షణా రహితంగా కొట్టి శారీరకంగా, మానసికంగా చిత్రవధకు గురిచేశారని చెవిరెడ్డి తెలిపారు. తన సన్నిహితుడైన వెంకటేష్‌నాయుడు, అతని కుటుంబీకులను వేధింపులకు గురి చేసి టార్చర్ పెట్టారన్నారు. బాలాజీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఐదు రోజుల పాటు నరకం చూపారన్నారు. చెవిరెడ్డికి ఏపీ లిక్కర్ స్కాంతో సంబంధం ఉందని చెప్పాలని వీరందరిపై ఒత్తిడి చేశారని చెప్పారు. సిట్ అధికారుల దెబ్బలకు తీవ్రంగా గాయపడిన మదన్.. ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడమే సిట్ బరితెగింపుకు నిలువెత్తు సాక్ష్యమన్నారు.

సిట్ వేధిస్తోంది.. జోక్యం చేసుకోండి

మద్యం విధానానికి సంబంధించిన కేసులో సాక్షిగా విచారణకు హాజరైన తనను సిట్ అధికారులు చిత్రహింసలకు గురి చేశారంటూ వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వర్తించిన హెడ్ కానిస్టేబుల్ ఎస్.మదన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ విచారణ జరిపారు. మదన్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, మద్యం విధానం కేసులో సాక్షిగా తమ ముందు హాజరు కావాలంటూ పిటిషనర్‌కు సిట్ అధికారులు నోటీసులిచ్చారన్నారు. ఈ నోటీసులను గౌరవిస్తూ పిటిషనర్ ఈ నెల 10న విచారణకు హాజరయ్యారని తెలిపారు. విచారణ పేరుతో సిట్ అధికారులు మదన్‌రెడ్డిని తీవ్రంగా బెదిరించారన్నారు. చెవిరెడ్డికి గత పదేళ్లలో రూ.200 కోట్లు అందినట్లు చెప్పాలని, తాము చెప్పినట్లు చేయకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారని వివరించారు. సిట్ అధికారుల తీరు వల్ల పిటిషనర్ తీవ్రంగా ఒత్తిడికి గురై ఆసుపత్రిలో చేరారని, వైద్యులు 15 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సలహా ఇచ్చారన్నారు. మదన్‌రెడ్డిని న్యాయవాది సమక్షంలో విచారించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. సిట్ అధికారుల తరఫున వాదనలు వినిపించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) అందుబాటులో లేకపోవడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు. ఇదిలా ఉండగా, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ చేసిన ఆరోపణలను సిట్ అధికారులు ఖండిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విచారించామే తప్ప తామెవరినీ కొట్టలేదన్నారు.

బాబు అరాచకం..

సిట్ గూండాయిజం

లేని మద్యం స్కామ్‌ను సృష్టించి వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు

సాక్షి, అమరావతి: అచ్చోసిన ఆంబోతు ఊరి మీద పడి బీభత్సం సృష్టించిన తీరును తలపిస్తోంది చంద్రబాబు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పనితీరు. దర్యాప్తు ముసుగులో గూండాగిరీకి బరితెగించమని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ముద్ర వేసి రాష్ట్రం మీదకు వదలినట్టుంది సిట్ అరాచకం. అందుకే బెదిరింపులు, వేధింపులు, కిడ్నాపులు, చిత్రహింసలతో చెలరేగిపోతోంది. చివరకు పోలీసు శాఖలో కింది స్థాయి ఉద్యోగి కానిస్టేబుల్‌ను కూడా విచారణ పేరుతో చిత్రహింసలకు గురి చేయడం సిట్ దాష్టీకానికి పరాకాష్టగా నిలుస్తోంది. విచారణ పేరుతో భౌతికంగా హింసించకూడదని.. అటువంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సుప్రీంకోర్టు విస్పష్టంగా ఆదేశించినా సరే, సిట్ మాత్రం న్యాయ వ్యవస్థ అంటే తమకేమాత్రం లెక్కలేదన్నట్టుగా బరితెగిస్తోంది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ సిట్ చీఫ్ ఎస్వీ రాజశేఖర్‌బాబు, ఆయన బృందం అధికారిక రౌడీయిజం చలాయిస్తోంది. మరోవైపు గతంలో ఎన్నికల కమిషన్ నమోదు చేసిన కేసును వక్రీకరిస్తూ వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేసి అక్రమ అరెస్టుకు తెగబడింది. లుక్ అవుట్ నోటీసులు ఇచ్చి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన స్నేహితుడు వెంకటేశ్ నాయుడులను మంగళవారం బెంగళూరు విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. బెంగళూరులోని న్యాయస్థానంలో హాజరు పరచి, ట్రాన్సిట్ వారెంట్‌పై బుధవారం విజయవాడకు తీసుకురానున్నారు. అనంతరం వారిద్దరినీ విజయవాడ న్యాయస్థానంలో హాజరు పరిచే అవకాశం ఉంది. తద్వారా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేసేందుకు కొన్ని రోజులుగా చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రం బట్టబయలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై రెడ్‌బుక్ కుట్రతో నమోదు చేసిన అక్రమ కేసును వేధింపులకు పాల్పడటమే లక్ష్యంగా అరాచకానికి తెగబడుతోంది. అందుకోసం అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో భేతాళ కుట్రకు తెరతీసింది. ఆ కుట్రలో తాజా అంకమే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ అరెస్టు.. ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి, మరో నలుగురిపై కేసు నమోదు. ఈ అక్రమ కేసులో తాజాగా వెంకటేశ్ నాయుడు(ఏ34), బాలాజీ కుమార్ యాదవ్ (ఏ35), యద్దాల నవీన్ (ఏ36), హరీశ్ (ఏ37), చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి (ఏ38), చెవిరెడ్డి మోహిత్ రెడ్డి (ఏ39)లను నిందితులుగా చేరుస్తూ సిట్ విజయవాడ న్యాయస్థానంలో మెమో దాఖలు చేసింది.

బండారం బయట పడుతుందనే..

రెడ్‌బుక్ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని చంద్రబాబు ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంది. తిరుపతి, చంద్రగిరిలో ఆయనపై అక్రమ కేసులు నమోదు చేయించేందుకు యత్నించారు. అక్రమంగా పోక్సో కేసు పెట్టారు. అందుకోసం నిరక్షరాస్యుడైన ఓ వ్యక్తితో ఖాళీ కాగితాలపై సంతకాలు చేయించుకుని మరీ ఆయన ఫిర్యాదు చేసినట్టుగా అక్రమ కేసు నమోదు చేశారు. కానీ పోలీసుల కుట్ర తెలుసుకున్న ఆ వ్యక్తి న్యాయస్థానంలో అసలు విషయం వెల్లడించారు. తాను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, పోలీసులే తనతో ఖాళీ కాగితాలపై సంతకాలు చేయించుకుని తమకు నచ్చినట్టుగా అబద్ధపు ఫిర్యాదు రాసుకున్నారని వెల్లడించడంతో పోలీసుల కుట్ర బెడిసి కొట్టింది. ఈ నేపథ్యంలో ఆయనపై మద్యం అక్రమ కేసు నమోదు చేయాలని ప్రభుత్వ పెద్దలు ఆదేశించారు. అందుకోసం ఆయన వద్ద గతంలో గన్‌మెన్‌గా పని చేసిన గిరి, మదన్ రెడ్డి అనే ఏఆర్ కానిస్టేబుళ్లను వేధించి, భౌతికంగా హింసించి మరీ అబద్ధపు వాంగ్మూలం కోసం బలవంతం చేశారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్నేహితుడు వెంకటేశ్ నాయుడు, ఆయన సతీమణిని కూడా సిట్ అధికారులు విచారణ పేరిట హైదరాబాద్ నుంచి విజయవాడ తీసుకువచ్చి అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని రోజుల తరబడి వేధించారు. తిరుపతికి చెందిన బాలాజీ అనే వ్యక్తిని వేధించి లొంగదీసుకునేందుకు యత్నించారు. తనను చిత్రహింసలకు గురి చేశారని ఏఆర్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో తమ కుట్ర పూర్తిగా బట్టబయలవుతుందని భావించిన సిట్ అధికారులు వెంటనే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టుకు పావులు కదిపారు.

ఈసీ పరిధిలో ఉన్న కేసును వక్రీకరిస్తూ..


2024 ఎన్నికల సమయంలో ఈసీ జప్తు చేసిన రూ.8 కోట్ల నగదు కేసును సిట్ అధికారులు వక్రీకరిస్తూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు. గత ఏడాది ఎన్నికల ముందు ఓ ప్రైవేటు సంస్థ హైదరాబాద్ నుంచి తీసుకువస్తున్న రూ.8 కోట్ల నగదును పోలీసులు జప్తు చేసి కేసు నమోదు చేశారు. ఎన్నికల కమిషన్ ఆ కేసును పర్యవేక్షిస్తోంది. కాగా ఆ నగదు తమ సంస్థకు చెందినదని అప్పట్లోనే తిరుపతిలోని ఈశా ఇన్‌ఫ్రా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ ఈసీకి తెలిపింది. ఆ సంస్థ ఎండీ ప్రద్యుమ్న చంద్రపాటి హైకోర్టును ఆశ్రయించారు. ఆ కేసు విచారణ పేరిట వేధింపులకు పాల్పడకుండా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఆ కేసు విచారణ పేరిట ఆ సంస్థ ఎండీనీగానీ ఇతరులు ఎవర్నీగానీ పిలవవద్దని హైకోర్టు 2024 మే 31నే పోలీసులను ఆదేశించింది. కానీ సిట్ అధికారులు ఎన్నికల ముందు జప్తు చేసిన ఆ నగదు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎన్నికల కోసం తరలిస్తున్నదని, ఈ అక్రమ కేసుతో దానికి లింకు పెడుతూ అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని ఏఆర్ కానిస్టేబుళ్లను వేధించారు. అదే వక్రీకరణతో చెవిరెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు.

న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే ఎత్తుగడ

ఈ కేసులో మంగళవారం సాయంత్రం వరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన స్నేహితుడు వెంకటేశ్ నాయుడులను సిట్ నిందితులుగా చేర్చనేలేదు. కానీ వారిపై గుట్టుచప్పుడు కాకుండా లుక్ అవుట్ నోటీసు జారీ చేసింది. నిందితులుగా కాకపోయినా లుక్ అవుట్ నోటీసు జారీ చేయడం సిట్ బరితెగింపే. సొంత కంపెనీ పనిపై చెవిరెడ్డి మంగళవారం ఉదయం కొలంబో వెళ్లి.. తిరిగి బుధవారం సాయంత్రం వచ్చేలా ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకున్నారు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలిసి వెళ్లేందుకు బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడులను అక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాతే ఈ కేసులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఏ38), వెంకటేశ్ నాయుడు (ఏ34)తోపాటు మరో నలుగురిని నిందితులుగా చేరుస్తూ సిట్ అధికారులు న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారు. అంటే బెంగళూరు విమానాశ్రయంలో వారిని అదుపులోకి తీసుకునే వరకు వారు ఈ కేసులో నిందితులే కారు. అయినా సరే వారిపై లుక్ అవుట్ నోటీసు జారీ చేసి వారిని అడ్డుకోవడం కచ్చితంగా నిబంధనలకు విరుద్ధమే. ఇదిలా ఉండగా, తాను ఎప్పుడు పిలిచినా సిట్ విచారణకు రావడానికి సిద్ధమని ఇప్పటికే చెవిరెడ్డి పలుమార్లు ప్రకటించారు. అయినా ఆయన ఎక్కడికో పారిపోతున్నట్లు సిట్ రహస్యంగా లుక్ అవుట్ నోటీసులిచ్చి అరెస్ట్ చేయడం చంద్రబాబు ప్రభుత్వ బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది.

బీసీల రిజర్వేషన్ కోసం జూలై 17న రైల్‌రోకో

రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత



మెదక్ జోన్: బీసీల రిజర్వేషన్ అమలు కోసం జూలై 17న రాష్ట్రవ్యాప్తంగా రైల్‌రోకో చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్‌లో తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేంత వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. అన్ని బీసీ సంఘాల నాయకులను కలుపుకొని ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు. బీసీ బిల్లు అడ్డుకునే కుట్రలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు పోతోందని, బిల్లుకు చట్టబద్ధత కలిగేంత వరకు రాష్ట్రంలో ఎన్నికలను అడ్డుకుంటామని హెచ్చరించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు బీసీ బిల్లు గురించి ఒక్క రోజు కూడా మాట్లాడలేదన్నారు. కాగా, కవిత ఆధ్వర్యంలో మెదక్‌లో జరిగిన బీసీల రౌండ్ టేబుల్ సమావేశానికి బీఆర్‌ఎస్ నేతలు దూరంగా ఉన్నారు. సమావేశానికి రాకుండా కొందరు నేతలు బీసీ సంఘాల నాయకులను అడ్డుకున్నారంటూ కవిత సభావేదికపై నుంచి విమర్శించారు.

మాజీ మావోయిస్టు కుటుంబానికి చెందిన ముగ్గురి హత్య

- ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో దారుణం
- ఏడుగురిపై దాడి..12 మంది కిడ్నాప్

చర్ల: మాజీ మావోయిస్టు ఒకరు పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతో ఆయన కుటుంబానికి చెందిన ముగ్గురిని మావోయిస్టులు హత్య చేశారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లా పెద్ద కోర్మా గ్రామానికి వచ్చిన మావోయిస్టులు.. అక్కడ మాజీ మావోయిస్టు దినేశ్ మొడియం కుటుంబీకులైన జింగు మొడియం, సోమా మొడియం, అనిల్ మడివిని దారుణంగా చంపేశారు. అనంతరం గ్రామంలోని మరో ఏడుగురిపై దాడి చేశారు. 12 మందిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. వీరంతా పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారని అనుమానించినట్లు సమాచారం. కాగా సమాచారం అందడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమై మంగళవారం రాత్రి ప్రత్యేక బలగాలతో గ్రామానికి రావడమే కాక కూంబింగ్ చేపట్టారు.

42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంఘాల డిమాండ్

- కేంద్రం ఇవ్వడం లేదు.. కాంగ్రెస్ అడగడం లేదని ధ్వజం
- 2029లో బీసీ బిడ్డ సీఎం నినాదంతో ఏకమవుదామని పిలుపు



అభివాదం చేస్తున్న చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల, మధుసూదనాచారి తదితరులు

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ల అమలుతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాల నేతలు, బీసీ మేధావులు డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ఇవ్వాల్సిన కేంద్రం ఇవ్వడం లేదని, అడగాల్సిన కాంగ్రెస్ అడగడం లేదని ధ్వజమెత్తారు. రిజర్వేషన్ల అమలు కోరుతూ 'మేమెంతో.. మాకంత' అనే నినాదంతో తాము ముందుకెళ్తామని అన్నారు. బీసీల రథం లక్ష కిలోమీటర్ల వేగంతో వెళ్తుందని, ఎవరూ అడ్డువచ్చినా తొక్కుకుంటూ వెళ్తుందని పేర్కొన్నారు. 2029లో బీసీ బిడ్డ సీఎంగా ఏకమవుదామని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత కాంగ్రెస్, బీజేపీలదేనని అన్నారు. మంగళవారం 'స్థానిక సంస్థల ఎన్నికలు- బీసీ రిజర్వేషన్లు అమలు- భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై' బీసీ సంఘాలు అత్యవసర రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. బీసీ కమిషన్ మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ మేధావుల వేదిక చైర్మన్ టి.చిరంజీవులు, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బీసీ సంఘాల ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి: జాజుల

బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బాధ్యత తీసుకోవాలని జాజుల ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీని గ్రామాల్లో తిరగనివ్వబోమని, ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. రిజర్వేషన్లు తేల్చకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎలా అంటారని ప్రశ్నించారు. రిజర్వేషన్ల అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని, కేంద్రంతో కొట్లాడాలని డిమాండ్ చేశారు. బీసీల శకం ఆరంభం అయిందని, 2029లో బీసీ ముఖ్యమంత్రి నినాదంతో ప్రతి బీసీ అడుగులు ముందుకు వేయాలని పిలుపునిచ్చారు. చిరంజీవులు మాట్లాడుతూ తమిళనాడు తరహాలో కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లును చేర్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మధుసూదనాచారి మాట్లాడుతూ.. పార్టీలు బీసీలకు అన్యాయం చేయాలని భావిస్తే బీసీలంతా పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

దురాచారం



కట్నంగా కిడ్నీ

వరకట్నమా... అదెక్కడుంది?
అని పైకి అంటున్నారు గానీ
లాంఛనాలు నెరవేర్చడానికి తల్లిదండ్రులు
ఎన్ని అప్పులు చేస్తున్నారో
సమాజానికి తెలుసు.
తాజాగా బిహార్‌లో ఒక ఘటన
ఉలిక్కిపడేలా చేసింది.
వరుడు అడిగిన మోటార్ సైకిల్‌ని
పెళ్లికూతురు ఇవ్వలేననేసరికి
'పోనీ కిడ్నీ ఇవ్వు..
అమ్ముకుంటాం' అన్నారు.
దాంతో పెద్ద కేసయ్యి
పెళ్ల ఆగిపోయింది.
ఆడపిల్ల తల్లిదండ్రులు
తగ్గి ఉండాల్సిన
అవసరం ఇంకా ఉందా?

వాళ్లు మొదట బైక్ అన్నారు. లేదా నాలుగు లక్షల క్యాష్ అన్నారు. లేదా కిడ్నీ అన్నా ఇవ్వు అంటున్నారు.

బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఉంటున్న దీప్తి అనే మహిళ ఈ విషయమైన పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ చేయడానికి వస్తే పోలీసులు కూడా డంగై పోయారు.

విషయం ఏమిటంటే– దీప్తికి 2021లో పార్థ్ అనే వ్యక్తితో వివాహం అయ్యింది. ఆ తర్వాత ఏం జరిగిందో దీప్తి వివరించింది– 'మా అమ్మానాన్నలు నా పెళ్లి కోసం 30 లక్షలు ఖర్చు పెట్టారు. అయినా అత్తవారింటిలో అడుగు పెట్టినప్పటి నుంచి కట్నం కోసం సూటి పోటి మాటలు వినిపించేవి. మా అత్తగారు ఆయుర్వేద దుకాణం తెరవడానికి మరో 8 లక్షలు తెమ్మని నన్ను కోరారు. నేను అతి కష్టం మీద 3 లక్షలు నాన్నను అడిగి తెచ్చాను. రెండేళ్ల క్రితం నా భర్తకు కిడ్నీ వ్యాధి ముదిరింది. అది పెళ్లికి ముందే ఉంటే దాచి పెళ్లి చేశారు. మేము ఢిల్లీకి వెళ్లి అక్కడ మా ఆడపడుచు ఇంట్లో ఉండి వైద్యం చేయించాం. అక్కడి నుంచే నాకు సమస్యలు మొదలయ్యాయి' అని తెలిపిందామె.

డబ్బు లేదా కిడ్నీ

దీప్తిని ఆమె అత్తామామలు మొదట బైక్ అడిగారు. తర్వాత నాలుగు లక్షలు తెమ్మన్నారు. తర్వాత భర్తకు కిడ్నీ అయినా ఇవ్వు అని డిమాండ్ చేశారు. దీప్తి ఇవ్వను అని చెప్పేసరికి పుట్టింటికి తరిమేశారు. దాంతో తట్టుకోలేకపోయిన దీప్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే విడాకులు కావాలని డిమాండ్ కూడా చేసింది. భర్త ఇందుకు నిరాకరించినా దీప్తి మాత్రం ఈ పెళ్లి నుంచి బయటపడాలని నిశ్చయించుకుంది. కేసు దర్యాప్తులో ఉంది.

మెడకు చుట్టుకుంటున్న లాంఛనాలు

కట్నం అనే మాట మన దేశంలో ఎట్టకేలకు అనాగరికంగా మారాక ఆడపెళ్లివారికి ఖర్చులు మరో విధంగా చుట్టుముట్టాయి. వాటిలో ప్రధానమైనది బంగారం. పిల్లకు ఏం పెడతారు అనే విషయం చాలా పెద్ద సమస్య– బంగారం రేటును తలుచుకుంటే! అలాగే కల్యాణ మంటపం, భోజనాలు, ఇతర ఆర్భాటాలు మహామహులను కూడా అప్పుల పాలు చేస్తున్నాయి. పెళ్లయ్యాక కూడా ఆ ఖర్చు అనీ ఈ ఖర్చు అనీ అల్లుళ్లు పిండేస్తున్నారు. కార్లు అడిగే అల్లుళ్లు కొందరైతే వ్యాపారానికి పెట్టుబడి అడిగేవారు కొందరు. ఇటు భర్తకు సర్ది చెప్పలేక అటు తల్లిదండ్రులను అడగలేక ఆడపిల్లలు పోకచెక్కలవుతున్నారు.

అమ్మాయికి ఏం తక్కువ?

ఇన్నేళ్ల తర్వాత కూడా అమ్మాయి డబ్బు ఇచ్చేదిగా అబ్బాయి డబ్బు తీసుకునేవాడిగా వివాహ వ్యవస్థ ఉండటం విషాదం. ఆడపిల్లలు బాగా చదువుకుని ఉద్యోగాలు చేస్తూ డబ్బు సంపాదిస్తూ మరో వైపు కుటుంబంలో కీలకపాత్ర పోషిస్తూ ఉన్నా 'తగ్గి ఉండే' ధోరణిని సమాజం ప్రోత్సహిస్తూనే ఉంది. విద్యావంతులైన వధూవరులు పెళ్లి విషయంలో పరస్పర గౌరవనీయమైన లాంఛనాలను చర్చించి ఎవరికీ ఇబ్బంది, ఆర్థిక భారం కలిగించని వాటికే చోటిస్తూ వివాహానికి అంగీకరించాలి. అందుకు పెద్దల్ని ఒప్పించాలి. పెద్దలు ఏవేవో డిమాండ్లు పెట్టి, నెరవేర్చుకుని పక్కకు తప్పుకున్నాక కాపురం చేయాల్సింది వధువరులే. కనుక పరస్పర గౌరవానికి చోటుండే వివాహాలపై వారే ముందడుగు వేయాల్సి ఉంది.

మరాఠాలు ఇస్తున్న సందేశం

మొన్నటి మే నెలలో పుణెలోని వైష్ణవి హగవానె అనే గృహిణి ఆత్మహత్య చేసుకుంది. కారణం – వరకట్న వేధింపులు. ఈ ఆత్మహత్య మహారాష్ట్రలో సంచలనం సృష్టించింది. దీనికి విరుగుడు కనిపెట్టడానికి మరాఠా సమూహాలు వరకట్నాన్ని, పెళ్లి ఆర్భాటాలను నిషేధిస్తూ నిర్ణయం తీసుకుని ప్రచారం చేస్తున్నాయి. పుణె చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ పెరిగి రైతుల భూములకు రెక్కలొచ్చాయి. బిల్డర్లకు భూములు అమ్మిన రైతులు భారీగా ఖర్చు పెట్టి వివాహాలు చేస్తున్నారు. వీటిని చూసి సగటు మధ్యతరగతి వారు కూడా చేతులు కాల్చుకుని అప్పుల పాలవుతున్నారు. ఎంత ఖర్చయినా పర్లేదు... మంచి కుర్రాణ్ణి తేవాలని వేలానికి దిగుతున్నారు. వీటన్నింటిని నిషేధిస్తూ మరాఠా పెద్దలు ప్రచారం చేస్తున్నారు. అక్కడి నేషనల్ కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తుండటంతో ప్రభావం కనపడుతోంది.

ఆర్టీ'షీ' డ్రైవర్!

ఫస్ట్ లేడీ

ఆటో డ్రైవర్‌గా తండా గతుకుల రోడ్డు మీద ప్రయాణం ప్రారంభించిన సరిత నాయక్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. ఆ సవాళ్లకు భయపడి ఉంటే... తెలంగాణ ఆర్టీసీ తొలి మహిళా డ్రైవర్‌గా ప్రత్యేకత సాధించేది కాదు.



సరిత నాయక్

సంస్థాన్ నారాయణపురం మండలం సీత్యా తండాకు చెందిన సరిత తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండడంతో కుటుంబ బాధ్యతలు భుజాలకెత్తుకుంది. అక్క భర్త దేవరకొండలో ఆటోడ్రైవర్. ఆయన ఆరోగ్యం దెబ్బతినడంతో ఆటో నడపడం నేర్చుకుంది సరిత. బావకు విశ్రాంతి ఇచ్చి తానే ఆటో నడిపేది. తోటి డ్రైవర్‌లు రకరకాల ఇబ్బందులు పెట్టేవాళ్లు. ఆటోకు పంక్చర్లు చేయ్యడం, బ్రేక్‌డౌన్ చేసి ఇబ్బందులకు గురి చేసేవారు. అన్ని ఇబ్బందులు తట్టుకుంటూ మూడు సంవత్సరాల పాటు అక్కడే ఆటో నడిపింది. ఆ తరువాత ఆసుపత్రిలో నర్సుగా పని చేయడానికి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. హోలి మేరీ నర్సింగ్ కాలేజీలో చేరడానికి ప్రయత్నం చేసినప్పటికి ఫీజు కట్టే స్థోమత లేక అదే కాలేజీలో వార్డెన్ ఉద్యోగంలో చేరింది. వార్డెన్‌గా పనిచేస్తునే హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో బస్సు డ్రైవింగ్ నేర్చుకుంది. అదే కాలేజీలోనే బస్ డ్రైవర్‌గా పని చేసింది.



అమ్మా,నాన్నల కోసం...

ఢిల్లీలో ఉద్యోగం వదిలి పెట్టి అమ్మ,నాన్నల కోసం హైదరాబాద్‌కు వచ్చాను. వారు వృద్ధాప్యంలో ఉన్నారు. తెలంగాణ ఆర్టీసీ తొలి మహిళా డ్రైవర్‌గా గుర్తింపు లభించినందుకు గర్వంగా ఉంది. నేను ప్రయాణించిన దారిలో ఎన్నో సమస్యలు, సవాళ్లు ఎదురయ్యాయి. అయితే ఎప్పుడూ వెనకడుగు వేయలేదు.

– సరిత నాయక్

తండా టు ఢిల్లీ

హెవీ వెహికిల్ నడపడంలో సరిత నైపుణ్యం ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధి భానుశ్రీ దృష్టికి వచ్చింది. ఆమె సరితకు తమ సంస్థలో పనిచేసే అవకాశం ఇచ్చింది. 'సఖీ క్యాబ్స్' పేరుతో వంద మంది మహిళా డ్రైవర్‌లతో క్యాబ్స్ నడుపుతోంది ఆజాద్ ఫౌండేషన్. ఢిల్లీలో క్యాబ్ డ్రైవర్‌గా కొత్త జీవితం ప్రారంభించిన సరిత, ఫౌండేషన్ ఇచ్చిన శిక్షణతో హిందీ, ఇంగ్లీష్, మరాఠీ భాషలలో కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకుంది.

ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో మహిళా డ్రైవర్ ఉద్యోగం కోసం నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసుకుంది. అన్ని పరీక్షలలో నెగ్గి ఆ ఉద్యోగానికి ఎంపిక అయింది.



తెలంగాణ ఆర్టీసీ గతంలో మహిళ డ్రైవర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఎవరూ దరఖాస్తు చేయ్యలేదు. సరిత ఆర్టీసీలో బస్సు డ్రైవర్‌గా చేరడంతో తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి మహిళ డ్రైవర్‌గా ప్రత్యేకత సాధించింది.

– తడకమళ్ల శ్రీధర్,
సాక్షి, సంస్థాన్ నారాయణపురం

• కిచెన్ టిప్స్



కిచెన్ ప్లాట్‌ఫాంను శుభ్రం చేయడానికి రసాయనాలతో కూడిన క్లీనింగ్ లిక్విడ్‌లను వాడడానికి బదులుగా వైట్ డిస్టిల్డ్ వెనిగర్ ఒక కప్పు తీసుకుని అందులో మెత్తని క్లాత్‌ను ముంచి తుడిస్తే ఎటువంటి బ్యాక్టీరియా అయినా తుడిచిపెట్టుకుపోతుంది. వెనిగర్ సహజమైనది కాబట్టి దీని అవశేషాలు ప్లాట్‌ఫాం మీద ఉండిపోయి ఆహార పదార్థాలలో కలిసినా కూడా ఎటువంటి ప్రమాదం ఉండదు. రసాయనాల అవశేషాలు ఆహారంలో కలిస్తే జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఎదురవుతాయి.



ఫ్రిజ్‌ను శుభ్రం చేయడానికి ఒక కప్పు వెనిగర్‌లో అంతే మోతాదు నీటిని కలిపి అందులో క్లాత్‌ను ముంచి తుడవాలి.

బులియన్

జూన్ 17న ముగింపు (బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,810
బంగారం (22 క్యారెట్లు)	91, 290
వెండి	1,07,300
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,01,750
బంగారం (22 క్యారెట్లు)	92,000
వెండి	1,09,300
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,00,370
బంగారం (22 క్యారెట్లు)	92,000
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,01,750
బంగారం (22 క్యారెట్లు)	94,760
వెండి	1,09,300
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,100
బంగారం (22 క్యారెట్లు)	90,250
వెండి	1,06,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,00,360
బంగారం (22 క్యారెట్లు)	92,000
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

బ్యూటిప్స్

పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల ప్రస్తుతం చిన్న వయసువారు కూడా జుట్టు తెల్లబడటంతో హెయిర్‌డైలు వేసుకుంటున్నారు. అలా కాకుండా తలకు ఆవాల నూనె రాసుకుంటే జుట్టు బూడిద రంగులోకి మారుతుంది. క్రమంగా అది నలుపుగా తయారయ్యే అవకాశం ఉంది. సత్వర ఫలితాలు కావాలంటే ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆవాల నూనెను మాడుకు సున్నితంగా మర్దనా చేసుకొని ఉదయాన్నే తల స్నానం చేయాలి.



వర్షాలలో తడిసీ తడిసీ జుట్టు తన సౌందర్యాన్ని కోల్పోతుంది. అలా కాకుండా కురులు నిగనిగలాడాలంటే తలంటు స్నానం చేసిన ప్రతిసారి రెండు టీస్పూన్ల శనగ పిండి, ఒక గుడ్డు తెల్ల సొన, ఒక టీస్పూన్ పెరుగు, అర టీస్పూన్ నిమ్మరసం తీసుకొని వాటన్నింటిని కలపాలి. ఆ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత చల్లటి నీటితో తల స్నానం చేయాలి. రెండు వారాల్లో కనీసం ఇలా నాలుగుసార్లు చేస్తే మెరిసే కురులు మీసొంతం.

ప్రతిరోజూ ఉదయం ఒక గ్లాసు అల్లం రసాన్ని తాగితే అది ముఖంపై మొటిమలను దూరం చేస్తుంది. అంతే కాదు ఆ రసాన్ని మాడుకు రాసుకుంటే రక్త ప్రసరణ బాగా జరగడంతో చుండ్రు మాయమవుతుంది. అలాగే జుట్టు రాలడం తగ్గి ఒత్తుగా పెరుగుతుంది.

ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లాలంటే ముఖంపై మొటిమలు పెద్ద సమస్యగా మారతాయి. ఒక్క రాత్రిలో మొటిమలు తగ్గుముఖం పట్టాలంటే రాత్రి పడుకునే ముందు తెల్లటి టూత్ పేస్ట్‌ను మొటిమలపై రాసుకోవాలి. ఉదయాన్నే చల్లటి నీటితో కడుక్కుంటే మంచి ఫలితం ఉంటుంది. అయితే ఉపయోగించే పేస్ట్ జెల్ కాకూడదు.



ఒక్కోసారి కాళ్లు, చేతుల మీద ఉండే చర్మం పొడిబారిపోయి, గరుకుగా తయారవుతుంది. అలాంటప్పుడు రెండు కోడిగుడ్ల తెల్లసొనలో పావు కప్పు జొన్నపిండి, నాలుగు చెంచాల చక్కెరపొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని కాళ్లకు, చేతులకు పట్టించి...ఆరిన తరువాత చల్లని నీటితో కడిగేసుకోవాలి. పది లేక పదిహేను రోజులు ఇలా చేసి చూడండి... తేడా మీకే తెలుస్తుంది.

అరకప్పు ఓట్స్ తీసుకుని మెత్తని పొడిలా గ్రైండ్ చేసుకోవాలి. దీనికి పెరుగు, టమోటా గుజ్జు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి... అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. వారానికోసారి ఇలా చేస్తే మురికి, మృతకణాలు తొలగిపోయి ముఖం కాంతివంతమవుతుంది. అలాగే... బాదం పప్పు పేస్టులో పాలు, నిమ్మరసం, కాసింత మినప్పిండి కలిపి ప్యాక్‌లా వేసుకున్నా ముఖం మెరిసిపోతుంది.

లీగల్

అలా అయితే ఇరవై ఏళ్ల తర్వాతా కేసు అవుతుందా?

నాకు పెళ్లయి 20 ఏళ్లవుతోంది. ఒక పాప..16 ఏళ్లు. బాబు..14 ఏళ్లు. పెళ్లి నాటికి నాకు ఇరవై ఏళ్లు. నా భార్యకు పదహారేళ్లు. గత కొన్నేళ్లుగా మా ఇద్దరికీ తరచూ గొడవలు జరుగుతున్నాయి. విడాకులు ఇచ్చి నాకున్న ఏకైక ఇంటిని తన పేర రాసివ్వాలని, లేకపోతే తన మైనార్టీ తీరకముందే లైంగికంగా లొంగదీసుకుని, బలవంతంగా పెళ్లి చేసుకున్నట్లు కేసు పెడతానంటూ బెదిరిస్తోంది. మాది పెద్దలు కుదిర్చిన వివాహమే. ఏం చేయమంటారు?

– శ్రీహరి, కర్నూలు

బాల్యవివాహాల నిరోధక చట్టం, 2006 ప్రకారం ఒక మేజర్ పురుషుడు ఒక మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటే, ఆ పెళ్లి చేసుకున్న పురుషుడికి అలాగే ఆ పెళ్లి జరిపించిన పెద్దలకు, ఆ పెళ్లి జరగాలని ప్రోత్సహించిన వారికి కూడా రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా ఉంది. ఈ చట్టం ప్రకారం పెళ్లికి పురుషులకైతే చట్టబద్ధమైన వయసు 21, స్త్రీలకు 18 సంవత్సరాలు. అయితే మీరు కంగారు పడవలసిన అవసరం లేదు. ఎందుకంటే హిందూ వివాహ చట్టం ప్రకారమైనా, బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారమైనా.. బాల్య వివాహం జరిగితే సదరు అమ్మాయి తనకు ఇరవై ఏళ్లు నిండేలోపు కోర్టును ఆశ్రయించి తన వివాహం చెల్లదని దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. మైనర్‌గా ఉన్నప్పుడు కూడా ఒక ప్రతినిధి ద్వారా, మిత్రుల సహాయంతో, బాల్యవివాహాల నిరోధక అధికారి ద్వారా కూడా వివాహాన్ని రద్దు చేసుకోవచ్చు. 20 ఏళ్లు నిండిన తర్వాత వివాహ రద్దుకు ప్రస్తుత చట్టం అంగీకరించదు. ఆ అమ్మాయి ఇష్టపూర్వకంగానే వైవాహిక సంబంధం కొనసాగించిందని చట్టం భావిస్తుంది. ఇరవై ఏళ్ల వైవాహిక బంధం, సంతానం కూడా కలిగిన తర్వాత మీపై పోక్సో కేసు వేసే ఆస్కారం లేదు! వివాహం కాకుండా ఉండి ఉంటే అది వేరే సంగతి! బలవంతపు పెళ్లి చేశారనే ఆస్కారం కూడా లేదిప్పుడు. ఎందుకంటే హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 12 (2) ప్రకారం కూడా బలవంతపు పెళ్లి చేసుకున్న తర్వాత భాగస్వామితో వైవాహిక సంబంధం కొనసాగిస్తే ఆ బలవంతం/మోసపూరితమైన అంగీకారం అనే కారణాలపై వివాహాన్ని రద్దు చేయడం కుదరదు. మీరిద్దరూ కలిసి ఒక మంచి ఫ్యామిలీ కౌన్సిలర్‌ని కలవండి. సమస్యలు పరిష్కారం కాకపోతే సామరస్యంగా విడిపోయే ప్రయత్నం చేయండి. లాయర్‌ను సంప్రదించి మీకున్న అవకాశాలు, హక్కులను తెలుసుకోవడం కూడా మంచిదే!

– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది



మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

స్ఫూర్తి

కలెక్టర్ అభినందనలు అందుకుంటున్న యోగేశ్వరి





యావరేజ్ – ఏరో స్పేస్

అంతంతమాత్రంగా చదివే అమ్మాయి పెద్ద కలలు కనవచ్చా? ఐఐటీ–బాంబేలో చదువుకోవాలనుకోవచ్చా? 'యస్' అనడమే కాదు తన కలను సాకారం చేసుకుంది యోగేశ్వరి సెల్వం.

తన మరుగుజ్జుత్వంతో ఒకప్పుడు బాధలు పడిన తమిళనాడుకు చెందిన యోగేశ్వరి కళ్లలో ఇతరులకు స్ఫూర్తినిచ్చే ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది.

ఏడవ తరగతి చదువుతున్నప్పుడు యోగేశ్వరి ఏరోస్పేస్ ఇంజనీరింగ్ గురించి విన్నది. ఇక అప్పటి నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌పై ఆసక్తి మొదలైంది. తానేమో యావరేజ్ స్టూడెంట్. 'నేను ఏరోస్పేస్ ఇంజనీర్ అవుతాను' అని తన కల గురించి చెబితే నవ్వుతారేమోననే భయం వల్ల చాలాకాలంపాటు ఎవరికీ చెప్పలేదు.

తమిళనాడులోని విరుదునగర్ జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన యోగశ్వరి తల్లి ఒక ఫైర్‌వర్క్ కంపెనీలో కూలీగా పనిచేస్తోంది. తండ్రి టీస్టాల్ నడుపుతాడు.

ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌పై ఆసక్తి మాట ఎలా ఉన్నా... చాలా కాలం వరకు యోగేశ్వరి సెల్వానికి జేఈఈ గురించి తెలియదు.

'ఇంటర్మీడియెట్‌లో మార్కులు తక్కువ వచ్చినందుకు యోగేశ్వరిని తిట్టాను. జేఈఈలో మంచి మార్కులు తెచ్చుకుంటాను చూడు... అని సవాలు చేసింది. ఆమె మాటలు విని నాలో కోపం మాయమైంది. నువ్వు కచ్చితంగా సాధించగలవు తల్లి అని ఆశీర్వదించాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది యోగేశ్వరి తల్లి. ఈరోడ్‌లోని జేఈఈ–అడ్వాన్స్‌డ్ కోచింగ్ క్యాంప్‌కు నలభై రోజుల పాటు వెళ్లింది యోగేశ్వరి.

'తమిళ్ మీడియం బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చిన నాకు మొదట జేఈఈ–అడ్వాన్స్‌డ్ కష్టంగా అనిపించింది. అయితే ఉపాధ్యాయులు ఆ కష్టాన్ని దూరం చేశారు' అంటుంది యోగేశ్వరి.

జేఈఈ–అడ్వాన్స్‌డ్‌లో హై ర్యాంక్ సాధించి శభాష్ అనిపించుకుంది. ఐఐటీ–బాంబేలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదవబోతోంది.

ప్రగతిపథం





ఎనర్జీ ఫర్ హెల్త్

మిజోరంలోని ఎన్నో గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తరచుగా ఆటంకం కలిగేది. దీని వల్ల గ్రామీణ ప్రాంతాలలోని ఆస్పత్రులలో వైద్యానికి ఇబ్బంది అయ్యేది. కరెంట్ లేకపోవడంతో ఫ్లాష్‌లైట్ల వెలుగులో ప్రసవాలు చేయించడం వల్ల తల్లీబిడ్డలకు ఎన్నో సమస్యలు ఎదురయ్యేవి.

విద్యుత్ సరఫరా సరిగ్గా లేకపోవడం వల్ల ఆస్పత్రులు అందుబాటులో ఉన్నా సరైన వైద్యం అందని పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని 'సెల్కో' ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఎనర్జీ ఫర్ హెల్త్(ఇ4హెచ్) కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రులకు సోలార్ పవర్‌ను తీసుకువచ్చింది.

ఆస్పత్రులలో సిస్టమ్స్ ఇన్‌స్టాల్ చేసేముందు సిబ్బందికి సోలార్ పవర్ ప్రయోజనాల గురించి వివరిస్తారు. సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు ఎలా రిపేర్ చేయాలో నేర్పిస్తారు.

పునరుత్పాదక శక్తి సాంకేతికత వల్ల ఆస్పత్రుల కరెంటు కష్టాలు తీరడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుంది.



నేనే కెప్టెన్సీ వద్దన్నాను: బుమ్రా

లండన్: రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటన తర్వాత భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసినప్పుడు క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చ సాగింది. అనుభవజ్ఞుడు, జట్టు ప్రధాన బలమైన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను కాకుండా గిల్‌ను సారథిగా ఎంపిక చేయడంపై ఆశ్చర్యం వ్యక్తమైంది. దీనిపై ఇప్పుడు బుమ్రా స్పష్టత ఇచ్చాడు. తన గాయాలు, ఫిట్‌నెస్ సమస్యల కారణంగా కెప్టెన్సీ వంటి అదనపు భారం మోయలేనని, నాయకుడిగా తన పేరును పరిశీలించవద్దని బీసీసీఐకి తానే చెప్పినట్లు అతను వెల్లడించాడు. 'నన్ను కెప్టెన్‌గా ఎంపిక చేయడం వెనక ఎలాంటి ఆసక్తికర నేపథ్యం కానీ, నన్ను కావాలని తప్పించారనే వివాదం కానీ ఏమీ లేదు. రోహిత్, కోహ్లి రిటైర్మెంట్‌లకంటే ముందే ఇంగ్లండ్‌తో సిరీస్‌లో నా పని భారం ఎలా ఉండబోతోందో అనే విషయంపై బీసీసీఐ అధికారులతో పాటు నా వెన్ను నొప్పికి చికిత్స చేసిన వైద్యులతో కూడా మాట్లాడాను. జాగ్రత్త పాటిస్తేనే మంచిదని చెప్పారు. దాంతో నేను ఇంగ్లండ్‌లో అన్ని టెస్టులూ ఆడలేనని, సారథిగా నా పేరును పరిగణనలోకి తీసుకోవద్దని బోర్డుకు చెప్పాను. సిరీస్ మధ్యలో నేను తప్పుకొని మరొకరు కెప్టెన్సీ చేయడం సరైంది కాదు. కాబట్టి జట్టు ప్రయోజనాల కోణంలోనే నిర్ణయం తీసుకున్నా. భారత కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవం. కానీ కెప్టెన్‌గాకంటే ఒక ప్లేయర్‌గా నేను జట్టు కోసం ఉపయోగపడటం ముఖ్యమని భావించా' అని బుమ్రా తెలిపాడు.

స్మృతి... మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్



దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానానికి చేరింది. స్మృతి బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 'టాప్'నకు చేరడం 2019 తర్వాత ఇదే తొలిసారి. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన 727 పాయింట్లతో అగ్రస్థానానికి చేరగా... ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వాల్‌వార్ట్ 19 రేటింగ్ పాయింట్లు కోల్పోయి 719 పాయింట్లతో మూడో స్థానానికి పడిపోయింది. ఇంగ్లండ్ కెప్టెన్ నటాలియా సీవర్ బ్రంట్ 719 పాయింట్లతో రెండో స్థానానికి చేరింది. ఈ జాబితాలో భారత్ నుంచి జెమీమా రోడ్రిగ్స్ 14వ స్థానంలో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15వ స్థానంలో ఉన్నారు. శ్రీలంక వేదికగా భారత్, శ్రీలంక, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లో అద్భుత సెంచరీతో చెలరేగిన మంధాన... ఈ ప్రదర్శనతో రేటింగ్ పాయింట్లను మెరుగు పర్చుకుంది. అదే సమయంలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా పేలవ ప్రదర్శన చేయడం ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. మహిళల టి20 ర్యాంకింగ్స్‌లో స్మృతి నాలుగో ర్యాంక్‌లో కొనసాగుతోంది.

'టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీ' పేరు ఖాయం

గెలిచిన జట్టు కెప్టెన్‌కు పటౌడీ పతకం

లండన్: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే టెస్టు సిరీస్‌కు ఇరు దేశాల దిగ్గజాలను గుర్తు చేసేలా టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీ పేరు ఖరారైంది. ఇప్పటి వరకు 'పటౌడీ ట్రోఫీ'గా ఉన్న పేరును మారుస్తున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) గతంలోనే ప్రకటించింది. దాంతో పటౌడీ పేరు తొలగించడంపై విమర్శలు వచ్చి చర్చ జరిగింది. కానీ ఈసీబీ మాత్రం వెనక్కి తగ్గలేదు. తాము అనుకున్న పేరునే ఖాయం చేసింది. తొలి టెస్టుకు ముందు రోజు ఈ నెల 19న ఈ ట్రోఫీని ఆవిష్కరిస్తారు. అయితే పటౌడీని ఏదో ఒక రూపంలో గౌరవించేలా నిర్ణయం తీసుకోవాలంటూ బీసీసీఐ చేసిన విజ్ఞప్తికి మాత్రం ఈసీబీ సానుకూలంగా స్పందించింది. టెస్టు సిరీస్‌లో విజేతగా నిలిచే కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'ను అందజేస్తారు. భారత అత్యుత్తమ కెప్టెన్‌లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న పటౌడీ ససెక్స్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ జట్ల తరఫున కూడా ఆడగా... ఆయన తండ్రి ఇఫ్తికార్ అలీఖాన్ పటౌడీ భారత్, ఇంగ్లండ్ జట్లకు ప్రాతినిధ్యం వహించారు. దాంతో వారి గౌరవార్థం ఇప్పటి వరకు 'పటౌడీ ట్రోఫీ'గా పిలిచారు. అత్యధిక టెస్టులు ఆడిన క్రికెటర్లుగా సచిన్ టెండూల్కర్ (200), జేమ్స్ అండర్సన్ (188) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

రైలులో టీమిండియా ప్రయాణం... భారత జట్టులో హర్షిత్



లీడ్స్: టెస్టు సిరీస్‌కు ముందు భారత్ 'ఎ'తో వార్మప్ మ్యాచ్ ఆడిన టీమిండియా లండన్ నుంచి రైలులో లీడ్స్‌కు చేరుకుంది. తాజాగా పేసర్ హర్షిత్ రాణా జట్టుతో కలిశాడు. నిజానికి ఐదు టెస్టుల కోసం ఎంపిక చేసిన 18 మంది సభ్యుల భారత జట్టులో అతను లేడు. అయితే సుదీర్ఘ సిరీస్‌కు ముందు జాగ్రత్తగా హర్షిత్‌ను జట్టులో చేర్చారు. ఢిల్లీకి చెందిన ఈ 23 ఏళ్ల పేసర్ ఇంగ్లండ్ లయన్స్‌తో అనధికారిక టెస్టులు ఆడేందుకు భారత్ 'ఎ' జట్టుతో వచ్చాడు. కాంటర్‌బరీలో జరిగిన తొలి అనధికారిక మ్యాచ్ కూడా ఆడాడు. ఇతను గతేడాది ఆస్ట్రేలియా పర్యటన ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. రెండు టెస్టులు, ఐదు వన్డేలు, ఒక టి20 ఆడాడు. రిజర్వ్ ఆటగాడిగా అతన్ని అందుబాటులో ఉంచామని, జట్టుతో పాటే లీడ్స్‌కు వచ్చాడని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 20 నుంచి ఇక్కడే భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్టు జరుగుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కొత్త ఆరంభానికి సిద్ధం

భారత జట్టు ఇంగ్లండ్ గడ్డపై 19 సిరీస్‌లు ఆడితే 14 సిరీస్‌లలో పరాజయమే పలకరించింది. రెండు సిరీస్‌లు సమంగా ముగియగా మూడుసార్లు భారత జట్టు విజేతగా నిలిచింది. అయితే పాత రికార్డుల్లోకి వెళ్లకుండా గత మూడు సిరీస్‌లనే చూసుకుంటే టీమిండియా ప్రదర్శనలో అక్కడక్కడ చెప్పుకోదగ్గ మెరుపులు ఉన్నాయి. చివరిసారిగా 2021-22లో పర్యటించిన సమయంలో ఐదు టెస్టుల సిరీస్‌ను 2-2తో 'డ్రా' చేసుకోవడం మన జట్టు మెరుగైన ప్రదర్శనకు సూచిక. అంతకుముందు రెండు పర్యటనల్లో రెండు మ్యాచ్‌లు మాత్రమే గెలిచిన రికార్డు అంకెల్లో కనిపిస్తున్నా... భారత్ చాలా సందర్భాల్లో పైచేయి సాధించింది. దురదృష్టవశాత్తు కీలక క్షణాల్లో పట్టు తప్పడంతో మ్యాచ్‌లు చేజార్చుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో తాజా సిరీస్‌లో శుబ్‌మన్ గిల్ బృందం పట్టుదలను, పోరాటపటిమను ప్రదర్శిస్తే ఇంగ్లండ్‌తో గట్టి పోటీనివ్వడం ఖాయం. అంచనాలకు అనుగుణంగా రాణిస్తే సిరీస్ ఏకపక్షంగా సాగకుండా ఇంగ్లండ్‌ను టీమిండియా నిలువరించవచ్చు. -సాక్షి క్రీడా విభాగం

ఆశల పల్లకిలో భారత జట్టు

- అనుభవలేమి ప్రధాన సమస్య
- ఇంగ్లండ్‌లో సీనియర్లపై భారం

ప్రస్తుతం సిరీస్‌కు సిద్ధమైన జట్టులో ఇంగ్లండ్ గడ్డపై అనుభవంరీత్యా చూస్తే రవీంద్ర జడేజా అందరి కంటే సీనియర్. గత మూడు సిరీస్‌లలో అతను జట్టులో భాగంగా ఉన్నాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, అశ్విన్‌లాంటి ఆటగాళ్లు జట్టుకు దూరమైన స్థితిలో జడేజా అనుభవం జట్టుకు కీలకం కానుంది. కేఎల్ రాహుల్, బుమ్రా, రిషభ్ పంత్ ఇంగ్లండ్‌లో గత రెండు సిరీస్‌లు ఆడగా... కుల్దీప్ యాదవ్, సిరాజ్, శార్దుల్ ఠాకూర్‌లకు కూడా ఆడిన అనుభవం ఉంది. కౌంటీ క్రికెట్‌లో ఆడటాన్ని పక్కన పెడితే మిగతా ప్లేయర్లంతా అంతర్జాతీయ స్థాయిలో తొలిసారి ఇంగ్లండ్‌లో బరిలోకి దిగబోతున్నారు. ఇప్పుడున్న జట్టును చూస్తే స్టార్ అంటూ ఎవరూ లేరు. ముమ్ముందు సిరీస్‌లో ఇదే భారత్‌కు సానుకూలాంశం కూడా కావచ్చు. ఒక్కొక్కరి వ్యక్తిగత ఆటపై కాకుండా టీమిండియా సమష్టి ప్రదర్శన చేయాలని పట్టుదలగా ఉంది. కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఈ సిరీస్ సవాల్‌గా నిలవనుంది. బ్యాటర్‌గా ఇంగ్లండ్ గడ్డపై పేలవమైన రికార్డు (5 టెస్టుల్లో కలిపి 127 పరుగులు) ఉన్న గంభీర్ కోచ్‌గా తన వ్యూహాలకు పదును పెట్టి జట్టుకు ఎలా మార్గనిర్దేశం చేస్తాడనేది ఆసక్తికరం.

బ్యాటర్లకు సవాల్...

మబ్బు పట్టిన వాతావరణంలో బంతి అనూహ్యంగా స్వింగ్ కావడం... డ్రైవ్ కోసం ప్రయత్నిస్తే చాలు బంతి బ్యాట్ అంచులను తాకి స్లిప్స్‌లోకి దూసుకుపోవడం... ఇంగ్లండ్‌లో జరిగే టెస్టు సిరీస్‌లలో సర్వసాధారణంగా కనిపించే దృశ్యాలు. ఇలాంటి స్థితిని దాటి బ్యాటర్లు రాణించాలంటే ఎంతో పట్టుదల, ఓపిక కనబర్చాల్సి ఉంటుంది. తమ బ్యాటింగ్ స్టాన్స్‌లో కూడా పలు మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఓపెనర్లది ప్రధాన పాత్ర కానుంది. ప్రస్తుతం జట్టు కూర్పును బట్టి చూస్తే యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ ఓపెనింగ్ చేయడం ఖాయమే. జైస్వాల్ 19 మ్యాచ్‌ల స్వల్ప కెరీర్‌ను చూస్తే ఆస్ట్రేలియాలో బౌన్సీ పిచ్‌లపై ఆకట్టుకున్న అతను దక్షిణాఫ్రికాలో రెండు టెస్టుల్లోనూ విఫలమయ్యాడు. ఇప్పుడు ఇంగ్లండ్‌లో అతను సత్తా చాటాల్సిన సమయం వచ్చింది. తొలి సిరీస్‌లోనే సుదర్శన్ నుంచి అతిగా ఆశించలేం. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ రెండు ఫైనల్‌లను వదిలేస్తే గిల్ ఇంగ్లండ్‌లో ఒకే ఒక టెస్టు ఆడాడు. కెప్టెన్‌గా అదనపు బాధ్యతతో అతను ఎంత బాగా ఆడతాడనేది కీలకం. గణాంకాల పరంగా చూస్తే మరో ప్రధాన బ్యాటర్ రాహుల్‌కు ఇంగ్లండ్‌లో మంచి రికార్డు ఉంది. ఇప్పుడు తన స్థానంపై సందేహాలు లేవు కాబట్టి స్వేచ్ఛగా ఆడగలడు. ఇక మిడిలార్డర్‌లో కరుణ్ నాయర్‌పై అందరి దృష్టి ఉంది. నాయర్‌కు చోటు దక్కడంలో దేశవాళీ ప్రదర్శనతో పాటు నార్తాంప్టన్‌షైర్ అనుభవం కీలకపాత్ర పోషించింది. కాబట్టి అతను తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఏమాత్రం శ్రమిస్తాడనేది ఆసక్తికరం. ఇక పిచ్, పరిస్థితులతో సంబంధం లేకుండా ఆట దిశను మార్చగల పంత్‌పై కూడా జట్టు భారీగా ఆశలు పెట్టుకుంది. మెల్‌బోర్న్ టెస్టు తర్వాత నిలకడ చూపించలేకపోయిన నితీశ్ రెడ్డి మరోసారి తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించాల్సి ఉంది.



శుబ్‌మన్ గిల్

బుమ్రా, సిరాజ్ చెలరేగితే...



ఈ సిరీస్ ఫలితాన్ని ప్రభావితం చేయగల ఏకైక ప్లేయర్‌లా జస్‌ప్రీత్ బుమ్రా కనిపిస్తున్నాడు. పని భారంతో అతను గరిష్ఠంగా మూడు టెస్టులే ఆడవచ్చని మేనేజ్‌మెంట్ ఇప్పటికే చెప్పింది. ఆ మూడు టెస్టుల్లో ఇంగ్లండ్ బ్యాటర్లకు 'నరకం' కనిపించడం ఖాయం. ఇటీవల ఆస్ట్రేలియాకు ఈ అనుభవం ఏమిటో బాగా తెలిసింది. కాబట్టి బుమ్రా పూర్తి ఫిట్‌నెస్‌తో తన అత్యుత్తమ ప్రదర్శన ఇస్తే టీమిండియాలో ఆత్మవిశ్వాసం పెరగడం ఖాయం. ఎరుపు బంతితో మొహమ్మద్ సిరాజ్ బౌలింగ్ కూడా చాలా పదునెక్కింది. అక్కడి పరిస్థితుల్లో సిరాజ్ బౌలింగ్ ప్రత్యర్థి పాలిట ప్రమాదకరంగా మారడం ఖాయం. గత సిరీస్‌లో సిరాజ్ 5 టెస్టులూ ఆడి 18 వికెట్లు వికెట్లు పడగొట్టడం విశేషం. ఈ అనుభవం చెప్పుకోదగ్గ సానుకూలాంశం. సిడ్నీ టెస్టులో ఆకట్టుకున్న ప్రసిధ్ కృష్ణ మూడో పేసర్‌గా బరిలోకి దిగనున్నాడు. సుదీర్ఘ సిరీస్ కాబట్టి అర్ష్‌దీప్‌కు ఏదో ఒకదశలో అవకాశం దక్కవచ్చు కానీ ఏమాత్రం ప్రభావం చూపగలడో సందేహమే. అశ్విన్ రిటైర్మెంట్‌తో ఇప్పుడు కుల్దీప్‌కు తొలిసారి ప్రధాన స్పిన్నర్‌గా చోటు ఖాయం. 2018లో ఇక్కడ ఆడిన ఏకైక మ్యాచ్‌లో విఫలమైన అతను పెద్ద బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడం ముఖ్యం. కెరీర్ చివరి దశలో ఉన్న జడేజా ఆల్‌రౌండర్‌గా రాణించడం ముఖ్యం. సీమ్ బౌలర్ శార్దుల్ శైలితో ఇక్కడ మంచి ఫలితం రాబట్టవచ్చు కాబట్టి మేనేజ్‌మెంట్ మొగ్గు శార్దుల్ వైపు ఉంది.

సాక్షి సినిమా

ఆగకే అమ్మాడీ...



బేబీ దిత్య, నితిన్

'భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ...' అంటూ పాడేస్తున్నారు నితిన్. ఆయన హీరోగా రూపొందిన తాజా చిత్రం 'తమ్ముడు'. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమీ గౌడ కీలక పాత్రలు పోషించారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జూలై 4న విడుదల కానుంది. అజనీష్ లోకనాథ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'భూ అంటూ భూతం...' అనే పాటని మంగళవారం విడుదల చేశారు మేకర్స్. 'భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, భూ మంత్రం వేసి దాంతో బొమ్మలాట లాడాలి, పుట్టగానే నేరుగా నువ్వు పరుగెత్తలే..' అంటూ ఈ పాట సాగుతుంది. సింహాచలం మన్నేలా సాహిత్యం అందించిన ఈ పాటని అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల పాడారు. ''సినిమాలో తన మేనకోడలు బేబీ దిత్యకు నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాట వస్తుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్.

కథ వినగానే థ్రిల్




సంయుక్త

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మించనున్న ఈ చిత్రంలో విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్తని ఖరారు చేశారు. ''పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి కాంబోలో వస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఇది. ఈ సినిమా ద్వారా తన సిగ్నేచర్ మాస్ కమర్షియల్ స్టయిల్‌లో ఒక యునిక్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నారు పూరి. ఇక ఈ సినిమాలో సంయుక్త లోతైన భావోద్వేగాలతో నటనకు అవకాశం ఉన్న పాత్రలో కనిపిస్తారు. కథ, తన పాత్ర వినగానే థ్రిల్ అయ్యారామె. ఫస్ట్ షెడ్యూల్ కోసం హైదరాబాద్, చెన్నైలలో లొకేషన్లను పరిశీలించాం. ఈ నెల చివరి వారంలో షూటింగ్ ప్రారంభిస్తాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.


హీరోల్లో విలన్



నాగార్జున



ప్రభాస్



ఎన్టీఆర్



అల్లు అర్జున్

విలన్‌గా కెరీర్‌ను ఆరంభించి, ఆ తర్వాత హీరోలైన నటులు ఇండస్ట్రీలో చాలామంది ఉన్నారు. అలానే హీరోగా కెరీర్‌ను ఆరంభించి, ఆ తర్వాత విలన్‌గా చేస్తున్న జాబితా కూడా పెద్దదిగానే ఉంది. కానీ ఒకవైపు హీరోగా చేస్తూనే, మరోవైపు విలన్‌గా చేస్తున్నారు కొందరు తెలుగు హీరోలు. విలన్స్‌గానూ తమ సత్తా ఏంటో ప్రేక్షకులకు చూపించాలనుకుంటున్నారు. ఓసారి ఆ హీరోల్లో ఉన్న విలన్స్‌పై ఓ లుక్ వేద్దాం...



మనోజ్



సుహాస్

రజనీకాంత్‌తో ఢీ: రొమాంటిక్ స్టార్ హీరో నాగార్జున విలన్ రోల్ చేస్తే ఎలా ఉంటుంది? అనేది 'కూలీ' సినిమాలో చూడొచ్చు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన 'కూలీ'లో నాగార్జున ప్రతినాయకుడిగా నటించారు. ఈ సినిమాలో సైమన్ రోల్‌లో కనిపిస్తారు నాగార్జున. కాగా 'కూలీ' చిత్రీకరణ ప్రారంభమైనప్పుడు ఓ వ్యక్తిని నాగార్జున కిరాతకంగా చంపుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో లీకైంది. ఆ వీడియో బయటకు వచ్చినప్పుడే ఈ సినిమాలో నాగార్జున విలన్‌గా కనిపిస్తారనే ప్రచారం జరిగింది. ఇప్పుడు అదే నిజమైంది. ఇక ఈ చిత్రంలో ఉపేంద్ర, శ్రుతీహాసన్, సత్యరాజ్, షౌబిన్ షాహిర్ ముఖ్య పాత్రలు చేశారు. అలాగే ఓ స్పెషల్ సాంగ్‌లో పూజా హెగ్డే అదిరిపోయే స్టెప్పులేశారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది.

వెండితెర బ్రహ్మ రాక్షస: యాక్షన్ చిత్రాల్లో విలన్లను చితక్కొడుతుంటారు ప్రభాస్. ఆరడుగుల ప్రభాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు చేస్తుంటే, థియేటర్స్‌లో విజిల్స్ పడాల్సిందే. కానీ ఇప్పుడు తనలోని విలన్ యాంగిల్‌ని కూడా చూపించాలనుకుంటున్నారట ప్రభాస్. ఇందులో భాగంగానే ప్రభాస్ 'బ్రహ్మ రాక్షస' అనే సినిమా చేయనున్నారని, 'హను-మాన్' ఫేమ్ ప్రశాంత్ వర్మ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారనే టాక్ వినిపిస్తోంది. హోంబలే ఫిలింస్ సంస్థ నిర్మించనుందట. కానీ... ప్రభాస్ ప్రస్తుత కమిట్‌మెంట్స్ కారణంగా ఈ సినిమా సెట్స్‌కు వెళ్లడానికి ఎక్కువ సమయం పట్టేలా ఉంది.

ఎన్టీఆర్ వార్: ఏ తరహా పాత్రనైనా అవలీలగా చేసేస్తారు ఎన్టీఆర్. 'జై లవకుశ, టెంపర్' చిత్రాల్లో హీరోగా కనిపించడంతో పాటు నెగటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లోనూ ప్రేక్షకులను మెప్పించారు. మరోసారి ఈ తరహా పాత్రను 'వార్ 2' చిత్రంలో ఎన్టీఆర్ చేసినట్లుగా తెలుస్తోంది. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన లేటెస్ట్ స్పై యాక్షన్ మూవీ 'వార్ 2'. ఈ చిత్రంలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ లీడ్ రోల్స్ చేశారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మించారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ పూర్తి స్థాయి విలన్ పాత్రలో కనిపిస్తారని, ఆ పాత్ర పేరు వీరేంద్రనాథ్ అని బాలీవుడ్ టాక్. ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. ఇక హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ లీడ్ యాక్టర్స్‌గా సిద్దార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ మూవీ 'వార్' (2019)కు సీక్వెల్‌గా 'వార్ 2' రానుంది.

హీరో... విలన్ ఒక్కరే!: అల్లు అర్జున్ 'ఆర్య 2' సినిమా చూశారుగా! ఆ చిత్రంలో హీరోగా నటించిన అల్లు అర్జున్ పాత్రలో కాస్త నెగటివ్ షేడ్స్ కనిపిస్తాయి. కానీ ఈసారి పూర్తి స్థాయిలో ఓ నెగటివ్ రోల్‌లో అల్లు అర్జున్ కనిపించనున్నారనే వార్త ప్రచారంలో ఉంది. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ మూడింటిలో ఒకటి విలన్ రోల్ అని, ఇప్పటివరకు అల్లు అర్జున్‌ను సిల్వర్ స్క్రీన్‌పై చూడని విధంగా ఆయన ఈ పాత్రలో కనిపిస్తారని టాక్. ఈ సినిమా చిత్రీకరణ ఇటీవలే ముంబైలో ప్రారంభమైందని తెలిసింది. అల్లు అర్జున్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందట. ఈ చిత్రంలో దీపికా పదుకోన్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే జాన్వీ కపూర్, మృణాల్ ఠాగూర్ ఇతర ప్రధాన హీరోయిన్ పాత్రల్లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది.

బ్లాక్ స్వార్డ్: నటుడిగా కొంత గ్యాప్ తీసుకుని, ఇటీవల 'భైరవం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు మంచు మనోజ్. ఈ చిత్రంలో మనోజ్ పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉన్నాయి. మరోసారి మంచు మనోజ్ విలన్‌గా కనిపించనున్నారు. తేజ సజ్జా హీరోగా నటిస్తున్న 'మిరాయ్' చిత్రంలో బ్లాక్ స్వార్డ్ పేరుతో విలన్ పాత్ర చేస్తున్నారు మంచు మనోజ్. ఇటీవల విడుదలైన 'మిరాయ్' టీజర్ మనోజ్‌ది విలన్ పాత్ర అని స్పష్టం చేసింది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబరు 5న రిలీజ్ కానుంది.


మండాడిలో విలన్: తమిళ నటుడు సూరి, తెలుగు నటుడు సుహాస్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా చిత్రం 'మండాడి'. మదిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఎల్రెడ్ కుమార్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హీరోయిన్‌గా మహిమా నంబియార్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో పూర్తి స్థాయి విలన్ పాత్రను సుహాస్ చేస్తున్నారు. ఇక అడివి శేష్ హీరోగా నటించిన 'హిట్ 2' చిత్రంలోనూ సుహాస్ విలన్‌గా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది.

వీరే కాదు... రానా, సందీప్ కిషన్, నవీన్ చంద్ర, ఆది పినిశెట్టి, కార్తికేయ, వరుణ్ సందేశ్ వంటి వారు ఒకవైపు హీరో పాత్రలు చేస్తూనే, కథ కుదిరినప్పుడు విలన్ పాత్రలూ చేస్తున్నారు.

– ముసిమి శివాంజనేయులు

భామ... రామ డేట్ ఫిక్స్

సుహాస్ హీరోగా నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ సినిమా 'ఓ భామ అయ్యో రామ'. ఈ చిత్రంతో మలయాళ నటి మాళవికా మనోజ్ హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. రామ్ గోధల దర్శకత్వంలో హరీష్ నల్ల నిర్మించిన ఈ చిత్రం జూలై 11న విడుదల కానుంది. హీరో రానా దగ్గుబాటి నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా ఈ సినిమాను రిలీజ్ చేయనుంది. రామ్ గోధల మాట్లాడుతూ– ''బ్యూటిఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రం ఇది. రామ్‌గా సుహాస్, సత్యభామగా మాళవికా మనోజ్‌ల మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయి. ఈ చిత్రంలో దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నారు'' అన్నారు. ''సుహాస్ కెరీర్‌లో మైలు రాయిగా నిలిచే చిత్రం ఇది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



మాళవికా మనోజ్, సుహాస్

ఆ శక్తి సినిమాకే ఉంది - ఫణీంద్ర నర్సెట్టి



''సాహిత్యం, కవిత్వం, భాష విలువలు గతంతో పోలిస్తే ప్రస్తుతం తగ్గిపోతున్నాయి. భాషని బతికించే శక్తి సినిమాకే ఉంది. మా '8 వసంతాలు' చూసిన తర్వాత ఎవరో ఒకరు ఆ భాషపై ఇష్టాన్ని పెంచుకోవచ్చు. మా చిత్రం ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత ఎంతోమంది అభినందిస్తూ నాకు సందేశాలు పంపుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు డైరెక్టర్ ఫణీంద్ర నర్సెట్టి. 'మ్యాడ్' మూవీ ఫేమ్ అనంతికా సనీల్‌కుమార్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం '8 వసంతాలు'. హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా పసునూరి, స్వరాజ్ రెబ్బాప్రగడ, సమీరా కిశోర్ ఇతర పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఫణీంద్ర నర్సెట్టి మాట్లాడుతూ– ''మను' సినిమా తర్వాత ఆరేళ్ల గ్యాప్ వచ్చింది. ఈ సమయంలో కొన్ని కథలపై వర్క్ చేశాను. అయితే '8 వసంతాలు' కోసం స్త్రీ కోణంలోకి వెళ్లి ఆ సున్నితత్వాన్ని పట్టుకోవడానికి, కథ రాయడం కంటే స్త్రీ దృక్కోణాన్ని డెవలప్ చేసుకోవడానికి ఎక్కువ టైమ్ పట్టింది. బలమైన స్త్రీ పాత్రలే స్ఫూర్తిగా నా కథలు ఉంటాయి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తన గౌరవాన్ని కోల్పోకుండా ఉండే అమ్మాయి ప్రయాణమే '8 వసంతాలు'. నేను రాసుకున్న శుద్ధీ అయోధ్య పాత్రకు అనంతిక కరెక్టుగా సరిపోయారు. నటిగానే కాదు... తనకి మార్షల్ ఆర్ట్స్‌తో పాటు దాదాపు 13 కళల్లో ప్రవేశం ఉంది. పూర్తి స్థాయి ఇండిపెండెంట్ ఫిల్మ్‌గా 'మను' చేశాను. ఇప్పుడు ఇండియాలోనే వన్ ఆఫ్ ద బిగ్గెస్ట్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్‌లో '8 వసంతాలు' చేశాను. నాకు ఈ రెండు అనుభవాలూ ఉన్నాయి. ఈ సినిమా రిజల్ట్ తర్వాత సమీక్షించుకుని, తర్వాత ఎలాంటి కథలు చేయాలో నిర్ణయించుకుంటాను'' అని చెప్పారు.

స్టాక్ మార్కెట్లు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
213	93
81,583	24,853

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,523	▽	178
డోజోన్స్	42,236	▽	280
ఎఫ్‌టీఎస్ఈ 100	8,834	▽	41
డాక్స్	23,435	▽	264
షాంఘై	3,388	▽	1
నికాయ్	38,535	△	225

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	85.75	86.77
£	బ్రిటన్ పౌండ్	[illegible]	114.70	117.67
€	యూరో	[illegible]	98.11	100.84
¥	జపాన్ యెన్ (100)	[illegible]	59.26	60.81
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	54.80	57.02
S$	సింగపూర్ డాలర్	[illegible]	64.81	69.48
SAR	సౌదీ రియాల్	[illegible]	22.06	23.57
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	22.55	23.33
¥	చైనా యువాన్	[illegible]	11.11	12.93

పసిడికి అమ్మకాల సెగ

- 10 గ్రాములకు రూ.1,200 తగ్గుదల
- ఢిల్లీ మార్కెట్లో రూ.1,00,170

న్యూఢిల్లీ: అమ్మకాల ఒత్తిడికి పసిడి నష్టపోయింది. మంగళవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.1,200 నష్టంతో రూ.1,00,170 స్థాయికి (పన్నుతో కలిపి) దిగొచ్చింది. అంతర్జాతీయంగా ప్రతికూల ధోరణుల మధ్య జ్యుయలర్లు, స్టాకిస్టులు అమ్మకాలకు దిగడంతో బంగారం నష్టపోయినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది.



99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.1,100 నష్టంతో రూ.99,450 స్థాయికి పడిపోయింది. ''ఇరాన్ దౌత్య పరిష్కారం కోసం చురుగ్గా ప్రయత్నిస్తున్నట్టు వచ్చిన వార్తలతో, అప్పటి వరకు ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య పూర్తిస్థాయి యుద్ధం జరుగుతుందన్న అంచనాలను ట్రేడర్లు సమీక్షించుకున్నారు. యుద్ధ విరమణకు అవకాశం ఉన్న నేపథ్యంలో బంగారం ట్రేడర్లలో బేరిష్ సెంటిమెంట్ ఏర్పడింది''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. మరోవైపు ఢిల్లీ మార్కెట్లో వెండి కిలోకి రూ.100 పెరిగి రూ.1,07,200 స్థాయిని (పన్నుతో కలిపి) తాకింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ధర ఔన్స్‌కు 10 డాలర్ల నష్టంతో 3,400 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యింది. మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ అధిక ధరల వద్ద పసిడి పెట్టుబడుల నుంచి ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపించినట్టు మెహతా ఈక్విటీస్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కళంత్రి వివరించారు. యూఎస్ ఫెడ్ పాలసీ సమావేశానికి ముందు వెండి ధరలు సైతం రోజులో గరిష్ఠ స్థాయిల నుంచి కిందకు దిగొచ్చినట్టు చెప్పారు.

డిజిటల్ ఎకానమీలో భారత్ పవర్‌హౌస్!

గూగుల్ ఇండియా హెడ్ ప్రీతి లోబానా

- త్వరలోనే ట్రిలియన్ డాలర్ల దిశగా పరుగులు...
- పలు గూగుల్ ప్రోడక్టులకు ఇక్కడే ఆజ్యం
- ఏఐ యుగంలో భద్రత, విశ్వసనీయతే కీలకం
- స్థానిక చట్టాలకు కట్టుబడి ఉంటాం

న్యూఢిల్లీ: డిజిటల్ ఎకానమీ వృద్ధి పరుగులు తీస్తుండటంతో భారత్ తిరుగులేని శక్తి (పవర్‌హౌస్)గా ఆవిర్భవించిందని గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్ ప్రీతి లోబానా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో సుస్థిర ప్రగతికి భద్రత, విశ్వసనీయత అత్యంత కీలకమని, వీటిపై మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. టెక్ దిగ్గజం గూగుల్ ఇండియా హెడ్‌గా ఇటీవలే ఎంపికైన ప్రీతి.. ఏఐ రంగంలో భారత్ శరవేగంగా పురోగమిస్తున్న నేపథ్యంలో గూగుల్ భద్రతా చార్టర్‌ను మంగళవారమిక్కడ ఆవిష్కరించారు. ఆన్‌లైన్ మోసాలు, స్కామ్‌ల నుంచి యూజర్లకు రక్షణ కల్పించడం.. ప్రభుత్వం, కంపెనీలకు సైబర్ సెక్యూరిటీ, బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధి వంటి అంశాల్లో సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు ఈ చార్టర్ ఒక బ్లూప్రింట్‌గా నిలుస్తుందని గూగుల్ చెబుతోంది. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రీతి తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆండ్రాయిడ్, ప్లేస్టోర్ విషయానికొస్తే మరింత మెరుగైన, వృద్ధిదాయకమైన డిజిటల్ ఎకోసిస్టమ్‌ను రూపొందించేందుకు గూగుల్ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. కాగా, గుత్తాధిపత్యానికి సంబంధించి భారత్‌లో గూగుల్‌పై కేసుల గురించి మాట్లాడుతూ.. గూగుల్ ఏ దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నా.. అక్కడి స్థానిక చట్టాలకు కట్టుబడి ఉంటుందని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం, నియంత్రణ సంస్థలతో నిరంతరం కలిసి పనిచేస్తామని ఆమె తేల్చిచెప్పారు.

యూపీఐ.. అద్భుతం

భారత్‌లో డిజిటల్ ఆర్థిక స్వరూపం ఎంతో ప్రత్యేకమైనదని, కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలో తమకు తిరుగులేదని నిరూపించిందన్నారు. 'డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ) శరవేగంగా విస్తరించడం దీనికి మచ్చుతునక. గూగుల్ పే వంటి పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లు అంచనాలను మించి విజయం సాధించాయి. కొన్నేళ్ల క్రితం యూపీఐ ప్రజల దైనందిన జీవితాల్లో ఇలా చొచ్చుకుపోతుందని ఎవరైనా ఊహించారా. ఇప్పుడు దేశంలో ఇదో అద్భుతమైన డిజిటల్ విప్లవంగా మారింది. వందల కోట్ల లావాదేవీలతో యూపీఐ ప్రజల వినియోగం, కొనుగోళ్ల తీరునే సమూలంగా మార్చేసింది' అని ప్రీతి పేర్కొన్నారు.

భారత్ కీలక మార్కెట్...

గూగుల్‌కు భారత్ అత్యంత కీలక మార్కెట్‌గా కొనసాగుతోందని.. సమీప భవిష్యత్తులోనే ట్రిలియన్ (లక్ష కోట్లు) డాలర్లకు చేరే దిశగా దేశ డిజిటల్ ఎకానమీ పరుగులు తీస్తోందని ప్రీతి పేర్కొన్నారు. అడ్వర్టయిజింగ్, క్లౌడ్ టెక్నాలజీ, అధునాతన ఏఐ రంగాల్లో గూగుల్‌కు ఉన్న పట్టు, నైపుణ్యాలను భారత్ ఆర్థిక వృద్ధికి తోడ్పాటు అందించేందుకు ఉపయోగిస్తామన్నారు. దేశ ఆర్థిక పురోగతికి ముఖ్యంగా డిజిటల్ రంగంలో గూగుల్ ఇతోధికంగా సహకారం అందిస్తున్న 'ఈ కీలకమైన, ఉత్తేజకరమైన తరుణం'లో కంపెనీ ఇండియా హెడ్‌గా కొత్త బాధ్యతలను చేపట్టడం చాలా ఉత్సాహాన్నిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు. గూగుల్ ప్రపంచవ్యాప్త వ్యూహంలో భారత్ మార్కెట్ కీలక పాత్ర పోషిస్తుందనడానికి యూట్యూబ్ షార్ట్స్, జీపే తొలుత ఇక్కడే ప్రారంభించడం నిదర్శనమని కూడా గుర్తుచేశారు.



కొత్త టెక్నాలజీతో సవాళ్లు...

ఏఐ వంటి కొత్త టెక్నాలజీలు సృజనాత్మక సామర్థ్యాలను వెలికితీస్తున్నాయని.. అయితే, వాటివల్ల డీప్‌ఫేక్స్ వంటి సవాళ్లు కూడా పుట్టుకొస్తున్నాయని ప్రీతి అంగీకరించారు. 'అందుకే మా ఏఐ సాంకేతికతను ఉపయోగించి రూపొందించే ఏ కంటెంట్‌లో అయినా వాటర్‌మార్క్‌లు ఉండేలా చూసేందుకు మేము ప్రయత్నిస్తున్నాం. దీనివల్ల యూజర్లు ఈ కంటెంట్‌లో దేనినైనా అప్‌లోడ్ చేస్తే, వాటిలోని 'సింథ్‌ఐడీ'ని ఆయా షేరింగ్ టూల్స్ గుర్తించగలుగుతాయి' అని వివరించారు. ఏఐ ఆధారిత తప్పుడు సమాచారాన్ని, డీప్‌ఫేక్స్ సవాళ్లను ఎదుర్కోవాలంటే పరిశ్రమవ్యాప్తంగా సహకారం అవసరమన్నారు. గూగుల్ సహా ఇతర కంపెనీలన్నీ ఈ కీలక అంశంపై దృష్టి సారిస్తున్నాయని చెప్పారు.

బీఎస్ఈ, ఎన్ఎస్ఈ డెరివేటివ్స్ రేసు

కాంట్రాక్టుల ముగింపు రోజుల్లో మార్పు

- మంగళవారానికి ఎన్ఎస్ఈ డెరివేటివ్స్
- బీఎస్ఈ కాంట్రాక్టుల గడువు గురువారానికి
- సెప్టెంబర్ 1 నుంచి అమలుకు సెబీ అనుమతి



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లో అత్యధిక శాతం ట్రేడింగ్ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లోనే జరుగుతుంటుంది. ఇటీవల నగదు విభాగంలోనూ టర్నోవర్ భారీగా పెరిగినప్పటికీ ఎఫ్‌పీఐలు, డీఐఐలు అధికంగా పొజిషన్స్ తీసుకునే డెరివేటివ్స్‌దే ఆధిపత్యం. అయితే కొన్నేళ్లుగా ఎన్ఎస్ఈలో ఎఫ్అండ్‌వో కాంట్రాక్టుల గడువు ప్రతి నెలా చివరి గురువారం ముగుస్తుంటే.. బీఎస్ఈలో వీటికి చివరి మంగళవారం తెరపడుతోంది. ఈ నేపథ్యంలో క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఒకే రోజు ఈక్విటీ డెరివేటివ్స్ ముగింపు ప్రయోజనకరంగా ఉంటుందంటూ గత నెల(మే)లో స్టాక్ ఎక్స్చేంజీ దిగ్గజాలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సూచించింది. కానీ.. బీఎస్ఈ గడువుకు ఎన్ఎస్ఈ, ఎన్ఎస్ఈ గడువుకు బీఎస్ఈ తాజాగా సెబీ నుంచి అనుమతులు పొందడం విశేషం!

అటూఇటూ మార్పు(స్వాప్) ఇలా..

ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టులను ప్రతి నెలా చివరి మంగళవారం ముగించేందుకు సెబీ అనుమతించినట్లు ఒక ప్రకటనలో నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ(ఎన్ఎస్ఈ) వెల్లడించింది. ప్రస్తుతం ప్రతి నెలా చివరి గురువారం ఎఫ్అండ్‌వో ముగింపును చేపడుతోంది. మరోపక్క బొంబాయి స్టాక్ ఎక్స్చేంజీ(బీఎస్ఈ) సైతం డెరివేటివ్ కాంట్రాక్టుల గడువును ప్రతి నెలా చివరి మంగళవారం నుంచి గురువారానికి మార్చుకునేందుకు సెబీ అనుమతించినట్లు తెలియజేసింది. వెరసి ఎన్ఎస్ఈ డెరివేటివ్స్ ప్రతీ నెలా చివరి మంగళవారం, బీఎస్ఈ కాంట్రాక్టులు ప్రతి నెలా చివరి గురువారం ముగియనున్నాయి. ఎఫ్అండ్‌వో గడువు మార్పును రెండు ఎక్స్చేంజీలు సర్క్యులర్‌లో పేర్కొన్నాయి. వెరసి 2025 సెప్టెంబర్ 1 నుంచి డెరివేటివ్ కాంట్రాక్టులకు కొత్త షెడ్యూల్ అమలుకానుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఐపీవోకు మూడు కంపెనీలు రెడీ | 'జీల్'కు ప్రమోటర్ల దన్ను

మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు

- పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం
- సెన్సెక్స్ నష్టం 213 పాయింట్లు



ముంబై: పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకోవడంతో ఇన్వెస్టర్లు మెటల్, ఫార్మా, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 213 పాయింట్లు నష్టపోయి 81,583 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు పతనమై 24,853 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 369 పాయింట్లు కోల్పోయి 81,427 వద్ద, నిఫ్టీ 132 పాయింట్లు పతనమై 24,814 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఆసియాలో కొరియా, జపాన్ నికాయ్ ఇండెక్సులు లాభాల్లో.., చైనా, హాంగ్‌కాంగ్ ఇండెక్సులు నష్టాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ముగిశాయి.

- డాలర్ మారకంలో రూపాయి 30 పైసలు బలహీనపడి 86.34 వద్ద స్థిరపడింది. ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధం, క్రూడాయిల్ ధరలు పుంజుకోవడం, డాలర్ బలోపేతం దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయి. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 85.96 వద్ద ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో 85.96 - 86.28 శ్రేణిలో ట్రేడైంది.

ఓస్వాల్ పంప్స్ ఐపీఓకు 34 రెట్ల స్పందన

ఓస్వాల్ పంప్స్ పబ్లిక్ ఇష్యూకు 34.42 రెట్ల అధిక స్పందన లభించింది. క్యూఐబీ కోటా 88.08 రెట్లు, రిటైల్ కోటా 3.60 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కోటా 36.7 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–ఏపీ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– రీజనింగ్



నాబార్డ్‌లో ఉద్యోగాలు

ముంబైలోని బాంద్రాలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** డేటా సైంటిస్ట్/ఏఐ ఇంజనీర్–02, డేటా ఇంజనీర్–01, డేటా సైంటిస్ట్–కమ్–బీఐ డెవలపర్–01, స్పెషలిస్ట్–డేటా మేనేజ్‌మెంట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీసీఏ, ఎంసీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు తదితర నైపుణ్యాలు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** డేటా సైంటిస్ట్/ఏఐ ఇంజనీర్, డేటా ఇంజనీర్ పోస్టులకు 25 నుంచి 35 ఏళ్లు, డేటా సైంటిస్ట్‌కు 23 నుంచి 30 ఏళ్లు, స్పెషలిస్ట్‌కు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** ఏడాదికి డేటా సైంటిస్ట్/ఏఐ ఇంజనీర్ పోస్టుకు రూ.21 నుంచి 30 లక్షలు, డేటా ఇంజనీర్‌కు రూ.18 నుంచి 27 లక్షలు, డేటా సైంటిస్ట్‌కు రూ.15 నుంచి రూ.21 లక్షలు, స్పెషలిస్ట్‌కు రూ.12 నుంచి రూ.15 లక్షలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025
» **వెబ్‌సైట్:** https://www.nabard.org

హెచ్‌పీసీఎల్‌లో 372 ఉద్యోగాలు

ముంబయిలోని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) పలు ఉద్యోగాలు ప్రకటన విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 372
» **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్–10, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (సివిల్)–50, జూనియర్ ఎగ్జిక్యూటివ్ క్వాలిటీ కంట్రోల్–19, ఇంజినీర్ (ఎలక్ట్రికల్)–35, సీఏ–24, ఆఫీసర్(హ్యూమన్ రీసోర్స్)–06, ఇంజినీర్ (మెకానికల్)–98, ఇంజినీర్(కెమికల్)–26, ఆఫీసర్(ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్)–01, మేనేజర్(ఇనుస్ట్రుమెంటేషన్)–01, ఇంజినీర్(సివిల్)–16, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (మెకానికల్)–15, మేనేజీరియల్–72.
» **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఎస్సీ, బీటెక్/బీఈ, డిప్లొమా, సీఏ, ఎంఏ, ఎంబీఏ/పీజీడీఎంలో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** పోస్టులను అనుసరించి 18–45 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

సీబీటీ/రాత పరీక్ష/నెట్ స్కోర్/టైపింగ్ టెస్ట్/గ్రూప్ టాస్క్ తదితర టెస్టుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. ఈ పరీక్షలో రెండు పేపర్లు మొత్తం 170 మార్కులకు ఉంటాయి.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 30.06.2025
» **వెబ్‌సైట్:** www.hindustanpetroleum.com

ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్, బెంగళూరులో 37 ఫ్యాకల్టీ పోస్టులు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్) పర్మనెంట్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–07, అసోసియేట్ ప్రొఫెసర్–5,అసిస్టెంట్ ప్రొఫెసర్–25.
» **విభాగాలు:** సైకియాట్రీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, న్యూరో వైరాలజీ, సైకాలజీ, నర్సింగ్, ఆయుర్వేద, బయోస్టాటిస్టిక్స్, క్లినికల్ సైకాలజీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్, పీహెచ్‌డీ, ఎంసీహెచ్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 50 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,68,900 నుంచి రూ.2,20,400, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,38,300 నుంచి రూ.2,09,200, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500 నుంచి రూ.1,67,400.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డైరెక్టర్, ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్, పోస్ట్ బాక్స్ నెం.2900 రోడ్, బెంగళూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.07.2025.
» **వెబ్‌సైట్:** www.nim-ans.ac.in

నిట్ వరంగల్‌లో వివిధ ఉద్యోగాలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ).. వరంగల్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** విజిటింగ్ కన్సల్టెంట్(లీగల్ అడ్వైజర్)–01, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్–01, విజిటింగ్ కన్సల్టెంట్(ఆర్కిటెక్ట్)–01, స్టూడెంట్ కౌన్సిలర్–01, పీఆర్‌వో–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్‌లో మూడేళ్ల హోదా కలిగి, న్యాయవాదిగా ఉండాలి.
» **వేతనం:** నెలకు విజిటింగ్ కన్సల్టెంట్‌కు రూ.50,000, ఎఫ్ఎస్‌వో, స్టూడెంట్ కౌన్సిలర్, పీఆర్‌వోకు రూ.60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**09.07.2025
» **వెబ్‌సైట్:** https://nitw.ac.in

ఎఫ్ఎస్ఎన్ఎల్‌లో 13 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్).. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యూనిట్‌లలో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 13.
» **స్టైపెండ్:** నెలకు రూ.15,000.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**11.07.2025
» **వెబ్‌సైట్:** https://fsnl.co.in

అవుతారా.. ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్

» 437 జేటీవో పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» ఇంగ్లిష్/హిందీలో పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు
» రాత పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ



కేంద్ర ప్రభుత్వ నియామకాల సంస్థ ఎస్ఎస్‌సీ (స్టాఫ్ సెలక్షన్ కమిషన్).. కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్ 2025కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/సంస్థల్లో 437 గ్రూప్ బీ నాన్ గెజిటెడ్ ఉద్యోగాల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ ట్రాన్స్‌లేటర్ ఉద్యోగాలకు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, రాత పరీక్ష, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 437 కొలువుల భర్తీకి ప్రకటన ఇచ్చింది. దీనిద్వారా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, సీనియర్ ట్రాన్స్‌లేటర్, సబ్ ఇన్స్‌పెక్టర్(హిందీ ట్రాన్స్‌లేటర్ ఇన్ సీఆర్‌పీఎఫ్) ఉద్యోగాలకు నియామక ప్రక్రియ చేపట్టనుంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 437

పోస్టుల వివరాలు

- సెంట్రల్ సెక్రటేరియట్ అఫీషియల్ లాంగ్వేజ్ సర్వీస్‌లో జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్(జేటీవో).
- ఆర్మ్‌డ్ ఫోర్సెస్ హెడ్ క్వార్టర్స్‌లో జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్(జేటీవో).
- వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు/సంస్థల్లో జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్(జేహెచ్‌టీ)/జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్(జేటీవో)/జూనియర్ ట్రాన్స్‌లేటర్(జేటీ).
- వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/సంస్థల్లో సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్(ఎస్‌హెచ్‌టీ)/సీనియర్ ట్రాన్స్‌లేటర్(ఎస్‌టీ).
- సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)లో సబ్ ఇన్స్‌పెక్టర్(హిందీ ట్రాన్స్‌లేటర్).

అర్హతలు

- జేహెచ్‌టీ/జేటీవో/జేటీ పోస్టులకు ఇంగ్లిష్ తప్పనిసరి సబ్జెక్టుగా హిందీలో మాస్టర్స్ డిగ్రీ లేదా హిందీ తప్పనిసరి సబ్జెక్టుగా ఇంగ్లిష్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉండాలి లేదా హిందీ మీడియంలో ఏదైనా మాస్టర్స్ డిగ్రీతోపాటు ఇంగ్లిష్ తప్పనిసరి సబ్జెక్టుగా చదివి ఉండాలి లేదా ఇంగ్లిష్ మీడియంలో ఏదైనా మాస్టర్స్ డిగ్రీతోపాటు హిందీ తప్పనిసరిగా చదివి ఉండాలి. డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లిష్ పాఠ్యాంశంగా చదివి ఉండాలి. దీంతోపాటు ఇంగ్లిష్ నుంచి హిందీలోకి, అలాగే హిందీ నుంచి ఇంగ్లిష్‌లోకి అనువాదంలో డిప్లొమా లేదా సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసి ఉండాలి(లేదా) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయంలో లేదా ప్రభుత్వ రంగ సంస్థల్లో హిందీ నుంచి ఇంగ్లిష్, అలాగే ఇంగ్లిష్ నుంచి హిందీలోకి అనువాదం చేసిన రెండేళ్ల అనుభవం ఉండాలి.
- సబ్ ఇన్స్‌పెక్టర్ (సీఆర్‌పీఎఫ్‌లో హిందీ ట్రాన్స్‌లేటర్) పోస్టులకు పై అర్హతలతోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి.

వయసు

01.08.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

వేతనం

సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్/సీనియర్ ట్రాన్స్‌లేటర్ పోస్టుకు నెలకు లెవెల్–7లో రూ.44,900 –రూ.1,42,400 వేతన శ్రేణి లభిస్తుంది. మిగతా అన్ని పోస్టులకు లెవెల్ –6లో నెలకు రూ.35,400 –రూ.1,12,400 వేతన శ్రేణి అందుతుంది.

ఎంపిక ప్రక్రియ

రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. రాత పరీక్షలో 200 మార్కులకు చొప్పున రెండు పేపర్లు ఉంటాయి.

పరీక్ష విధానం

- పేపర్ 1 పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. ఇందులో జనరల్ హిందీ 100 ప్రశ్నలు–100 మార్కులకు, జనరల్ ఇంగ్లిష్ 100 ప్రశ్నలు– 100 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన వ్యవధి 2 గంటలు. పేపర్1లో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులను తగ్గిస్తారు.
- పేపర్ 1లో సాధించిన స్కోర్ ఆధారంగా పేపర్ 2కు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- పేపర్ 2 డిస్క్రిప్టివ్ విధానంలో జరుగుతుంది. ఇందులో ట్రాన్స్‌లేషన్, ఎస్సే 200 మార్కులకు ఉంటాయి. పేపర్ 2 పరీక్ష వ్యవధి 2 గంటలు.

భాషపై పట్టును పరీక్షించేలా

- ఆబ్జెక్టివ్ తరహా పేపర్ 1(సీబీటీ)లో అడిగే ప్రశ్నలు అభ్యర్థికి భాష, సాహిత్యంపై ఉన్న పట్టును పరిశీలించేలా ఉంటాయి. సరైన పదాల వినియోగం, ఫ్రేజెస్, ఇడియమ్స్‌ను సరైన చోట ఉపయోగించగలగడం, పొరపాట్లు లేకుండా భాషను సంక్షిప్తంగా, సమర్థంగా రాయగలగడం వచ్చి ఉండాలి. పేపర్ 1 పరీక్ష ప్రశ్న పత్రం డిగ్రీ స్థాయిలో ఉంటుంది.
- వ్యాసరూప విధానంలో జరిగే పేపర్ 2లో రెండు ప్యాసేజెస్ ఉంటాయి. వీటిల్లో ఒకటి ఇంగ్లిష్ నుంచి హిందీకి అనువాదమైతే.. మరొకటి హిందీ నుంచి ఇంగ్లిష్ అనువాదంపై ఉంటుంది. అదే విధంగా ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఒక్కోటి చొప్పున వ్యాసాలు ఉంటాయి. అభ్యర్థి అనువాదం నైపుణ్యాలను పరీక్షించడం తోపాటు రెండు భాషల్లో తప్పులు లేకుండా రాయగలిగే సామర్థ్యాన్ని పరిశీలిస్తారు. పేపర్ 2 ప్రశ్న పత్రం మాస్టర్స్ డిగ్రీ స్థాయిలో ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 26.06.2025
- పేపర్ 1(సీబీటీ) పరీక్ష తేది: 12.08.2025
- వెబ్‌సైట్: https://ssc.gov.in

'ఉద్యోగం / వ్యాపారంలో స్థిరపడాలి. ఆ తర్వాతే పెళ్లి, పిల్లలు'.. ఇంతేగా ఓ సగటు యువతీ, యువకుడి ఆలోచన. ఇదంతా పెళ్లికి ముందు. పెళ్లి తర్వాత వారి ఆలోచనల్లో చాలా మార్పులొస్తున్నాయి. ఇప్పుడే వద్దు అని చెప్పేవారు కొందరైతే.. ఇద్దరిని మించి పెంచలేం బాబోయ్ అంటున్నవారు మరికొందరు. పిల్లలను వద్దనుకోవడానికి లేదా వాయిదా వేయడానికే మొగ్గుచూపుతున్న జంటల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా విద్యావంతులైన మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. ఆర్థిక, అనారోగ్య సమస్యలే పిల్లలను కనాలా వద్దా అన్న నిర్ణయం తీసుకోవడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



ఇప్పుడే వద్దు! ఇద్దరు చాలు!!

మనదేశంలో జననాల రేటు 1960లలో సగటున ఒక్కో మహిళకు సుమారు 6గురు పిల్లలుగా ఉండేది. ఇప్పుడు ఇది 1.9కి పడిపోయింది. అంటే ఇద్దరు పిల్లలు కూడా కాదన్న మాట. ప్రపంచ సగటు 2.2తో పోలిస్తే ఇది తక్కువే. ఇందుకు ఆర్థిక పరిమితులు, ఉద్యోగ అభద్రత, అనారోగ్య సమస్యలు... ఇలా ఎన్నో కారణాలు. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) రూపొందించిన 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ 2025' నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ప్రపంచ జనాభాలో 37 శాతం మంది ఉన్న భారత్, అమెరికా వంటి 14 దేశాల్లో ఈ సర్వే నిర్వహించారు.

ఇద్దరు చాలంటున్నారు

ఎంతమంది పిల్లలు కావాలని అడిగితే ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది చెప్పిన సమాధానం.. ఇద్దరు! మనదేశంలో అసలు పిల్లలే వద్దన్నవారు సగటున 5 శాతం కాగా, ఇది అమెరికాలో సుమారు 14 శాతం కావడం గమనార్హం. ఒక్కరే చాలని మనదేశంలో సగటున 14 శాతం మంది చెబితే.. అమెరికాలో కేవలం 7 శాతం మందే ఇలా కోరుకున్నారు. ఇద్దరు బిడ్డలు కావాలని మన దేశంలో పురుషుల్లో 33 శాతం, మహిళల్లో 41 శాతం మంది చెప్పారు. అమెరికాలో ఇలా కావాలన్నవారి సగటు కేవలం 26 శాతమే. మనదేశంలో ముగ్గురు లేదా నలుగురు పిల్లలు కావాలన్నవారు స్త్రీ, పురుషుల్లో గరిష్ఠంగా 6 శాతాన్ని కూడా మించలేదు. ఆసక్తికరంగా అమెరికాలో ఇలా కావాలన్నవారు దాదాపు 16 శాతం.

ఆర్థిక పరిమితులు

భారత్, అమెరికాలో ఆర్థిక పరిమితులే ప్రధానంగా మాతృత్వానికి అడ్డంకిగా ఉన్నాయని 38 శాతం మంది వెల్లడించారు. ఆదాయ అసమానతలు, అప్పులు పేరుకుపోవడం, ఊహించని ఖర్చులు, ఉద్యోగ భద్రత లేకపోవడం, నిరుద్యోగం, పొదుపు లేకపోవడం లేదా సరైన ఆర్థిక ప్రణాళిక లేకపోవడం వంటి ఆర్థిక పరిమితులు చుట్టుముడుతున్నాయి. ఈ సవాళ్లే కుటుంబ జీవితంలోని వివిధ అంశాలను.. ప్రధానంగా బిడ్డలను కనాలన్న నిర్ణయాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. పిల్లలను వద్దనుకోవడానికి.. నిరుద్యోగం లేదా ఉద్యోగం పోతుందేమోనన్న అభద్రతాభావం కారణమని 21 శాతం భారతీయులు, 17 శాతం అమెరికన్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా జాబ్ మార్కెట్‌లో అనిశ్చితి ఒకవైపు.. ఏఐ వంటి నూతన సాంకేతికత రాకతో కొన్ని రంగాలకు చెందిన పలు విభాగాల్లో ఉద్యోగుల తీసివేతలు మరోవైపు.. వెరసి యువతకు ఉద్యోగాలు, కొత్త అవకాశాల వేట తప్పడం లేదు. ఇవన్నీ కూడా పిల్లలను కనాలా వద్దా అన్న నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

పిల్లలను కనడానికి ఆలోచిస్తున్న వైనం	
వద్దనుకోవడం లేదా వాయిదాకు మొగ్గు	ఆర్థిక, అనారోగ్య సమస్యలే ప్రధాన కారణం
అమెరికా, భారత్‌లలో కొన్ని విషయాల్లో పోలికలు	
ఐక్యరాజ్యసమితి నివేదికలో ఆసక్తికర అంశాలు	

అనారోగ్య సమస్యలు

వంధ్యత్వం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు భారత్‌లో 13 శాతం, అమెరికాలో 16 శాతం మంది వెల్లడించారు. పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) వంటి హార్మోన్ల సమస్యలు, థైరాయిడ్, ఊబకాయం వంటివి సంతానోత్పత్తికి ఆటంకంగా మారుతున్నాయి. సమయపాలన లేని ఆహారపుటలవాట్లు; విధులు, ఉద్యోగంలో భాగంగా గంటల తరబడి కంప్యూటర్లకు అతుక్కుపోవడం, శారీరక శ్రమ లేమి, వంశపారంపర్యంగా వస్తున్న సమస్యలు కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. గర్భధారణ సమయంలో సరైన వైద్య సంరక్షణ లేకపోవడం కారణమని భారత్‌లో 14 శాతం, యూఎస్‌లో 8 శాతం మంది తెలిపారు. గర్భం వచ్చిన తర్వాత తల్లి, బిడ్డ ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాలి. వారు సూచించిన పరీక్షలు చేయించడంతోపాటు, మందులు వాడాలి. ఈ ప్రక్రియను ఆర్థికంగా భారంగా భావించడమో, లేదా వైద్య సౌకర్యాలు లేకపోవడమో కారణంగా.. మాతృత్వాన్ని కాదనుకోవడమో, వాయిదా వేయడమో చేస్తున్నారు.

చూసుకునేవారు లేక..

తగినంత/నాణ్యమైన పిల్లల సంరక్షణ అవకాశాలు లేకపోవడం కారణమని భారత్‌లో 18 శాతం, అమెరికాలో 12 శాతం మంది తెలిపారు. అంటే పిల్లలను చూసుకోవడానికి పెద్దవారు అందుబాటులో లేకపోవడం, సంరక్షణ కేంద్రాల లేమి.. కుటుంబాలను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. పిల్లలను చూసుకునేవారు లేకపోతే తల్లిదండ్రులు పని చేయడం కష్టతరం అవుతుంది. వారి ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా మహిళలు ఉద్యోగాలకు దూరం కావడానికి దారితీస్తుంది. ఇలాంటి కారణాలతో భాగస్వామి తక్కువ మంది పిల్లలను కోరుకోవడమూ ప్రధాన కారణమని భారత్, యూఎస్‌లలో 19 శాతం మంది వెల్లడించారు.

పిల్లలు వద్దనుకోవడం లేదా పిల్లలను కనడం వాయిదా వేయడానికి కారణం (చెప్పినవారి శాతం)

కారణం	భారత్	అమెరికా
ఆర్థిక పరిమితులు	38	38
నిరుద్యోగం, ఉద్యోగ అభద్రత	21	17
వంధ్యత్వం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు	13	16
గర్భధారణ సంబంధిత వైద్య సంరక్షణ లేమి	14	8
నాణ్యమైన పిల్లల సంరక్షణ లేమి	18	12
భాగస్వామి తక్కువ మంది పిల్లలను కోరుకోవడం	19	19
తీవ్రమైన అనారోగ్య సమస్యలు లేదా వ్యాధులు	15	12
గృహ సంబంధ సమస్యలు (అధిక అద్దెలు, సరిపడా స్థలం లేకపోవడం వగైరా)	22	15

సహకార యూనియన్ ఆధ్వర్యంలో 3 నూతన శిక్షణా కేంద్రాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కొత్తగా మూడు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందనరావు ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో ఈ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, వరంగల్ జిల్లా కేంద్రాలలో శిక్షణా కేంద్రాలు కొనసాగుతుండగా, కొత్తగా ఏర్పాటైన వాటితో కలిపి ఐదుకు చేరనున్నాయి. రాష్ట్రంలో ఉన్న సుమారు 60 వేల సహకార సంఘాలకు వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ఈ కేంద్రాల విధి. కాగా ఇప్పుడున్న రెండు కేంద్రాలు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గల సహకార సంఘాలకు శిక్షణ ఇచ్చేందుకు సరిపోవడం లేదని, కొత్తగా శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి తెలిపారు.

నిరంతర ప్రక్రియగా రోడ్డు భద్రత కార్యక్రమాలు

- ప్రతి బడిలో చిల్డ్రన్ అవేర్‌నెస్ పార్కు
- సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిరంతర ప్రక్రియగా నిర్వహించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు పాఠశాలల్లో నిరంతరం నిర్వహించాలని, ప్రతి బడిలో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కులు ఏర్పాటు చేసేలా రవాణా శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలు క్రమం తప్పకుండా కొనసాగాలని ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖలపై సమీక్షించారు.

అడిస్ అబాబాకు నాన్‌స్టాప్ విమాన సర్వీసు

శంషాబాద్: ఆఫ్రికా ఖండంలోని ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాకు హైదరాబాద్ నుంచి నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఇథియోపిన్ ఎయిర్‌లైన్స్ విమానం శంషాబాద్ విమానాశ్రయం నుంచి అడ్డిస్ అబాబాలోని బోలె అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరేందుకు టేకాఫ్ తీసుకుంది. వారంలో మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో ఇక్కడి నుంచి విమాన సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. 6.25 గంటల్లో ఇది గమ్యస్థానానికి చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో గెయిల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ప్రదీప్ ఫణీకర్ మాట్లాడుతూ.. శంషాబాద్ విమానాశ్రయానికి కొత్త కనెక్టివిటీ ఓ మైలురాయిలాంటిదన్నారు. పర్యాటకుల రాకపోకలతోపాటు వైద్య, వాణిజ్య రంగాలకు సంబంధించిన అంశాల్లో ఈ సర్వీసులు కీలకంగా మారతాయన్నారు. కార్యక్రమంలో ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ప్లాస్టిక్‌పై సమరం



ప్లాస్టిక్ వాడకంతో నష్టాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలని గురుకులాలు సంకల్పించాయి. అందుకే గురుకుల హాస్టల్‌లో చేరే విద్యార్థులు ట్రంక్‌పెట్టె మొదలు బకెట్ వరకు ఏదీ ప్లాస్టిక్‌వి వాడకూడదని నిబంధనలు అమలు చేస్తున్నారు. దీంతో ఇప్పుడిప్పుడే బడులకు చేరుతున్న విద్యార్థులు స్టీల్ బకెట్లు, స్టీల్ వాటర్ బాటిల్స్, స్టీల్ ప్లేట్స్.. ఇలా అన్నీ స్టీల్ వస్తువులను వినియోగిస్తూ ప్లాస్టిక్‌పై సమరానికి నడుం బిగిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకులంలో విద్యార్థులు స్టీల్ బకెట్‌లు, స్టీల్ వాటర్ బాటిళ్లతో వస్తూ 'సాక్షి' కెమెరాకు ఇలా పోజులిచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

నిజాయితీ చాటుకున్న పారిశుధ్య కార్మికుడు

- చెత్తలో దొరికిన 2 తులాల బంగారు గొలుసు అప్పగింత
- కార్మికుడిని సన్మానించిన కమిషనర్



బంగారు గొలుసు లభించిన మున్సిపల్ కార్మికుడు శంకర్ (ఎడమవైపు), ఇంటి యజమానులకు బంగారు గొలుసు అందిస్తున్న మున్సిపల్ అధికారి

నిజామాబాద్ సిటీ: చెత్తలో దొరికిన రెండు తులాల బంగారు గొలుసు తిరిగి అప్పగించినిజాయితీ చాటుకున్నాడు ఓ పారిశుధ్య కార్మికుడు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ 24లో పారిశుధ్య కార్మికుడు శంకర్ చెత్త సేకరిస్తుంటాడు. రోజులాగే మంగళవారం ఉదయం చెత్తను సేకరిస్తూ గాయత్రీనగర్‌లో గల ఓ ఇంటి చెత్తను కూడా మున్సిపల్ వాహనంలో వేశాడు. ఆ తర్వాత మరికొన్ని ఇళ్లలో చెత్తను కూడా సేకరించాడు. సేకరించిన చెత్తకుప్పలో శంకర్‌కు రెండు తులాల బంగారు గొలుసు కనపడింది. వెంటనే జవాన్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. గాయత్రీ నగర్‌లో పద్మాగౌడ్ అనే మహిళ తన మెడలోని బంగారు గొలుసు తీసి కిందపెట్టి మర్చిపోయింది. ఈలోపు ఆమె కోడలు ఇంటిని శుభ్రం చేశారు. ఆ చెత్తలో బంగారు గొలుసుకూడా పోయింది. తన గొలుసు కనపడకపోవడంతో పద్మాగౌడ్ తన కుమారుడు అరుణ్‌గౌడ్‌కు చెప్పింది. ఈ లోపు జవాన్ కుమార్, ఎస్ఐ సునీల్‌లు బంగారు గొలుసు ఎవరిదని ఆరా తీస్తుండగా అరుణ్ వచ్చి తమ ఇంట్లో బంగారు గొలుసు పోయిన విషయం తెలిపాడు. గొలుసు వారిదేనని నిర్ధారణ చేసుకుని అప్పగించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, కార్మికుడు శంకర్‌తో పాటు వాహనం డ్రైవర్ ఇమాముద్దీన్, ఎస్ఐ సునీల్‌ను బల్దియాకు పిలిపించి శాలువాతో సన్మానించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
బుధవారం । 18-6-2025



జడకొప్పు కోలాటంపై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



జడకొప్పు.. చెక్కభజన

అంతరించిపోతున్న కళలకు జీవం

40 మంది విద్యార్థులు... 20 రోజుల శిక్షణ

విద్యార్థినులను అభినందించిన నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అంతరించిపోతున్న గ్రామీణ కళలు చెక్కభజన, జడకొప్పు, కోలాటాలకు మళ్లీ జవసత్వాలొస్తున్నాయి. సెల్‌ఫోన్ ఆటల్లో నేటి తరం విద్యార్థులు మునిగితేలుతుంటే.. మరి కొందరు విద్యార్థులు మాత్రం గ్రామీణ కళారూపాలకు కొత్త జీవం పోస్తున్నారు. ఇప్పటి తరానికి తెలియని ఆటలు, కళా ప్రదర్శనల్లో శిక్షణ పొందిన విద్యార్థులు మళ్లీ వాటిని తెరపైకి తెస్తున్నారు. తెలంగాణ భాష సాంస్కృతికశాఖ, అందె మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని విద్యార్థినులకు 20 రోజులపాటు శిక్షణ ఇచ్చింది. ఈ శిక్షణతో విద్యార్థినులు ఆయా కళల్లో మెరుగైన ప్రదర్శన ఇస్తున్నారు.

కళలకు జీవం

జడకొప్పు అనగా.. గర్భజడ, నుగాయిజడ, పాయలజడ, పచ్చలజడ, పట్టెడజడలు. వీటిపై విద్యార్థినిలకు అవగాహన కల్పించి ఎలా ప్రదర్శన ఇవ్వాలో శిక్షణ ఇచ్చారు. చెక్కభజన, కోలాటంపై 20 రోజులు శిక్షణ ఇచ్చారు. నిత్యసాధనతో పాతకళల్లో నైపుణ్యాలు సాధించారు. ఈనెల 11వ తేదీ రాత్రి రాజన్నపేటలో ముగింపు ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు తాము నేర్చుకున్న కళలను ప్రదర్శించారు. చూసిన గ్రామస్తులు శభాష్ అంటూ అభినందించారు.

కళానైపుణ్యం నేర్చుకున్నాం



ఇరవై రోజుల శిక్షణలో వివిధ కళా నైపుణ్యాలు నేర్చుకున్నాం. ఇది మాకు ఎంతో నచ్చింది. అంతరిస్తున్న కళారూపాలను మాకు పరిచయం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలి.

– ఎ.మనోజ, రాజన్నపేట

ప్రతీ గ్రామంలో శిక్షణ బృందాలు



జిల్లాలో ప్రతీ గ్రామంలో శిక్షణ బృందాలను ఏర్పాటు చేస్తాం. గ్రామంలోనే 40 రోజులపాటు జడకొప్పు, కోలాటం, చెక్క భజనలపై శిక్షణ ఇస్తాం. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఇలాంటి కార్యక్రమాలకు మంచి స్పందన వస్తుంది.

– ముక్క రమేశ్, నిర్వాహకులు

శిక్షణ బాగుంది



అంతరించిపోతున్న కళలకు ఇలాంటి శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. స్వచ్ఛంద సంస్థలు శిక్షణ తరగతుల్లో మాలాంటి విద్యార్థులు ఎంతో నేర్చుకుంటున్నారు. 20 రోజులుగా నలభై మంది విద్యార్థులం కోలాటం, జడకొప్పు, చెక్కభజన నేర్చుకున్నాం.

– ఎస్.లిట్టు, రాజన్నపేట

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



ఈతరం యువతకు పాత కళలను పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. ఎంతో మంది వాటి గురించి మర్చిపోయారు. అంతరించిపోతున్న నాటి కళలకు జీవం పోయడానికి రమేశ్ లాంటి వారు ముందుకు రావడం అభినందనీయం. ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి.

– ముక్క శంకర్, మాజీ సర్పంచ్, రాజన్నపేట

ఆయన ఇల్లే గ్రంథాలయం

సొంత ఖర్చుతో వేలాది పుస్తకాలు కొనుగోలు

వేములవాడకు చెందిన ఆంజనేయులు సాహిత్యసేవకు ప్రశంసలు

నిత్యం 30 మంది పాఠకులకు వేదిక



తన ఇంటినే గ్రంథాలయంగా మార్చిన రిటైర్డ్ అధ్యాపకుడు వీరగోని ఆంజనేయులు గౌడ్

వేములవాడ: తన ఇంటిని అద్దెకిచ్చుకుని ఆర్థికంగా ఎదగాలన్న ఆశలేదు.. ఆదాయంలో సగం కంటే ఎక్కువ డబ్బులు వెచ్చించి పుస్తకాలు కొనుగోలు చేసే అలవాటు.. సన్మానాల కోసమో.. సత్కారాల కోసమో ఆయనెప్పుడూ పాకులాడలేదు. కేవలం పుస్తకాలపై ప్రేమతో తన ఇంటినే గ్రంథాలయంగా మార్చి పౌర గ్రంథాలయం అంటూ బోర్డును ఏర్పాటు చేసుకున్నారు. ఇంటికి రెండు వైపులా గేట్లు ఓపెన్ చేసి విద్యావంతులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు రిటైర్డ్ అధ్యాపకుడు వీరగోని ఆంజనేయులుగౌడ్.

ఇల్లు చిన్నది.. ఆలోచన గొప్పది

పాఠశాల విద్యార్థులు, పట్టభద్రులు, పరిశోధకులు ఎవరైనా వస్తే వారికి కావాల్సిన సమాచారం కోసం పుస్తకాలు చూపించి, చదివేలా ప్రోత్సహిస్తారు ఆంజనేయులు. రోజూ పత్రికలు కొనుగోలు చేసి.. అందులో ముఖ్యమైన విషయాలను ఆచరణాత్మకంగా భావించి ప్రదర్శిస్తారు. ఆయన ఇల్లు చిన్నదైనా, ఆలోచనలు గొప్పవి. తన సొంత ఖర్చుతో ఈ లైబ్రరీని నిర్వహిస్తున్నారు.

గర్రెపల్లి నుంచి వేములవాడకు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన వీరగోని ఆంజనేయులు 1977లో వేములవాడకు వచ్చారు. 1978 నుంచి స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం రాజన్న ఆలయానికి చెందిన సంస్కృత కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. నాటి నుంచి ఇంటినిండా పుస్తకాలతో సంతోషంగా గడుపుతున్నారు. రూ.15 లక్షల పైచిలుకు ఖర్చు చేసి ఇళ్లంతా పుస్తకాలతో నింపేశారు.

ప్రతిరోజూ 30 మంది వస్తారు



నాకు పుస్తకాలంటే అమితమైన ప్రేమ. అందరికీ విద్యను పంచాలన్నదే నా లక్ష్యం. ప్రస్తుతం మా ఇంట్లో 65 వేల వరకు పుస్తకాలు ఉన్నాయి. 50 ఏళ్ల నాటి పత్రికలు నేటికీ జాగ్రత్తగా దాచిపెట్టుకున్నా. ప్రతి రోజూ 30 మంది వరకు వచ్చి ఇక్కడ చదువుకుంటారు. ఇంటికి రెండు వైపులా రోడ్డు ఉండటంతో రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేసి ఎప్పుడూ తెరిచే ఉంచుతాం. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా నాకు సత్కారాలు అందాయి.

– వీరగోని ఆంజనేయులుగౌడ్



పౌర గ్రంథాలయం పేరుతో తన ఇంటికి బోర్డు ఏర్పాటు చేసిన ఆంజనేయులు గౌడ్

లాభం తేలేదెప్పుడు.. వాటా ఇచ్చేదెప్పుడు?

సింగరేణిలో లాభాల లెక్క ప్రకటనపై జాప్యం

- ఈసారి 35 శాతం వాటా చెల్లించాలని వినతులు
- విద్యాసంవత్సరం మొదట్లోనే ఇస్తే మేలంటున్న కార్మికులు



గనుల్లో పనిచేస్తున్న గని కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ నెలలో పిల్లల ఫీజులు, పుస్తకాలు ఇలా ఇతరత్రా ఖర్చులతో తల్లిదండ్రులపై పెనుభారం పడుతుంది. ఈ నేపథ్యంలో సింగరేణి కార్మికులు ప్రైవేట్ అప్పులు చేయకుండా.. యాజమాన్యం 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన లాభాలను ప్రకటించి వాటా చెల్లిస్తే మేలని పలువురు సూచిస్తున్నారు. గతేడాది కార్మికులకు లాభంలో 33 శాతం చెల్లించగా ఈసారి మరో 2 శాతం పెంచి 35 శాతంగా ఖరారు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంలో యాజమాన్యం త్వరగా నిర్ణయం తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కోరుతున్నారు.

1998 నుంచి వాటా చెల్లింపు

సింగరేణి సంస్థ ప్రతీ ఆర్థిక సంవత్సరంలో సాధించిన బొగ్గు ఉత్పత్తి, వాటి అమ్మకాల టర్నోవర్‌పై కొంత వాటాను 1998 నుంచి కార్మికులకు చెల్లిస్తోంది. గతేడాది కంపెనీ సాధించిన లాభాల్లో 33 శాతం వాటా చెల్లించారు. అయితే, 2024 – 25 ఆర్థిక సంవత్సరం ముగిసి రెండున్నర నెలలు కావస్తున్నా టర్నోవర్ కానీ, లాభాలను కానీ ప్రకటించకపోవడం గమనార్హం. దీంతో కార్మికులు ఏరోజుకారోజు ఎదురుచూపులతో గడుపుతున్నారు. ఈ నెలలోనే లాభాల వాటా ప్రకటించి చెల్లిస్తే అటు వ్యవసాయం, ఇటు పిల్లల చదువుల అవసరాలకు ఉపయోగపడతాయని చెబుతున్నారు.

2010 నుంచి 2024 వరకు కార్మికులకు చెల్లించిన లాభాల వాటా వివరాలు

ఏడాది	సాధించిన ఉత్పత్తి (మి.టన్నుల్లో)	కంపెనీకి వచ్చిన లాభం (రూ.కోట్లలో)	చెల్లించిన శాతం	కార్మికులకు అందిన నగదు (రూ.కోట్లలో)
2010-11	51.33	351.37	16	56.21
2011-12	52.21	358.27	17	60.90
2012-13	53.19	401.00	18	72.18
2013-14	50.40	418.74	20	83.74
2014-15	52.54	490.44	21	102.99
2015-16	60.38	1,066.13	23	245.20
2016-17	61.34	395.38	25	98.00
2017-18	62.01	1,212.75	27	327.44
2018-19	64.50	1,766.00	28	494.00
2019-20	64.02	993.86	28	278.28
2020-21	50.58	272.64	29	79.06
2021-22	65.00	1,227.00	30	368.00
2022-23	67.14	2,222.46	32	711.18
2023-24	70.02	2,412.00	33	796.00
2024-25	69.01	--	--	--

గతేడాది అన్యాయమే జరిగింది..



బీఆర్‌ఎస్ హయాంతో పోలిస్తే మెరుగైన వాటా చెల్లిస్తామని గత ఏడాది గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ నాయకులు చెప్పారు. కానీ 2022 - 23లో 32 శాతం చెల్లిస్తే, 2023 – 24 లాభాల్లో 33 శాతానికే పెంచగలిగారు. ఈసారి త్వరగా లాభాలు ప్రకటించి 35 శాతం వాటాను ఈ నెలాఖరులోగా చెల్లించాలి.

– రియాజ్ అహ్మద్, హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ

జూన్‌లోనే ప్రతిపాదించే వాళ్లం..



తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం హయాంలో వాటా ఎంత ఇచ్చినా జూన్ నెలలో ప్రతిపాదన పెట్టేవాళ్లం. ప్రస్తుత సంఘాలు ఈ విషయాన్ని మర్చిపోయినట్లున్నాయి. దీంతో నాయకులు గుర్తుకొచ్చి అడిగితే కంపెనీకి వీలైనప్పుడు చెల్లిస్తుందేమో. కార్మికుల తరఫున అడిగే వారు లేకపోవడంతోనే ఈ పరిస్థితి.

– మిరియాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

గతేడాది కంటే మెరుగైన వాటా



సంస్థ ఈ ఏడాది రూ.5 వేల కోట్ల లాభాలు ఆర్జించింది. ఇందులో కొత్త ప్రాజెక్టుల సర్వేలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు, ఇతర చెల్లింపులు పోను మిగిలినది నికర లాభం. ఇందులో అత్యధికంగా కార్మికుల సంక్షేమానికే వినియోగిస్తాం. లాభాల్లో గతేడాది కంటే మెరుగైన వాటా కార్మికులకు చెల్లించేలా కృషి చేస్తాం. ఇదే సందర్భంలో కార్మికులు సైతం కంపెనీ అభివృద్ధి, పని గంటల పెంపుపై శ్రద్ధ కనబర్చాలి.

– ఎస్.బలరామ్, సింగరేణి సీఎండీ

రైతు భరోసా స్థానిక ఎన్నికల స్టంటే: కొప్పుల



సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా స్థానిక ఎన్నికల స్టంట్ మాత్రమేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. రైతు భరోసా ఇచ్చామని సంబరాలు చేసుకోవడం కాదని, కౌలు రైతులు, రైతు కూలీలకు మీరు ఇస్తామని చెప్పిన రూ.15 వేల సంగతేమిటని మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రైతు భరోసా వెనుక ప్రభుత్వం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఎజెండాను సెట్ చేసినట్టు ఉందని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గత సంవత్సరం రైతు భరోసా ఎవరికి పడ్డదో ఎవరికి పడలేదో తెలియదని, కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం రైతు భరోసా విషయంలో అభాసుపాలైందని ఆయన విమర్శించారు. 80 లక్షల మందికి ఒకే రోజు రైతుబంధు వేసిన ఘనత కేసీఆర్‌ది అని చెప్పారు.

విత్తన చట్టం ఎలా అమలవుతుంది?

- హరియాణా అధికారులను అడిగి తెలుసుకున్న విత్తన చట్టం రూపకల్పన కమిటీ
- నేడు హైపవర్ కమిటీతో సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సమగ్ర విత్తన చట్టం రూపొందించేందుకు ఏర్పాటైన విత్తన చట్టం రూపకల్పన కమిటీ మంగళవారం హరియాణా రాష్ట్రంలో పర్యటించింది. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితోపాటు సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, కమిటీ సభ్యులు దొంతి నర్సింహారెడ్డి, రామానుజేయులు, శివప్రసాద్, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్ తదతరులు హైదరాబాద్ నుంచి చండీగఢ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 4 గంటలకు హరియాణా రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు ప్రదీప్ మీల్, అమిత్ కుమార్‌తోపాటు హరియాణా సీడ్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఆ రాష్ట్రంలో అమలవుతున్న విత్తన చట్టంపై చర్చించారు. విత్తన విధాన చట్టం అమలు తీరు, నిబంధనలు, అనుభవాలను తెలంగాణ బృందానికి ఆ రాష్ట్ర అధికారులు వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న వ్యవసాయ సంక్షేమ పథకాలపై తెలంగాణ ప్రతినిధుల బృందం హరియాణా అధికారులకు వివరించింది.బుధవారం ఉదయం హరియణా రాష్ట్రంలో పర్యటన కొనసాగనుంది. హరిపూర్ బ్లాక్ పరిధిలోని రాయ్‌పూర్ రాణి గ్రామంలో పర్యటించి అక్కడ అమలవుతున్న విత్తన చట్టంపై అక్కడి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తారు. దేశవ్యాప్తంగా రైతు సమస్యలపై సుప్రీంకోర్టు గతంలో ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీతో తెలంగాణ ప్రతినిధుల బృందం సమావేశం కానుంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ సమావేశం రెండు దఫాలుగా సాగనుంది. ఈ కమిటీ ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అమలవుతున్న వ్యవసాయ విధానాలు, పథకాలు, ప్రధాన పంటలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయా రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, నిపుణుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న వ్యవసాయ విధానాలు, ప్రధాన పంటలు, సవాళ్లను హైపవర్ కమిటీ పంచకుల నగరంలో జరిగే సమావేశంలో చర్చించనుంది.

తోతాపురి మామిడి రైతుకు మద్దతు ధర ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం కిలోకు రూ. 8 మేర కొనాల్సిందే అని కంపెనీలకు చెబుతున్నా, పక్కాగా దాన్ని అమలు చేయడంలేదు. మరోవైపు చిత్తూరు జిల్లా ర్యాంపుల్లో కిలో కాయ ధర రూ. 3 మించి పలకని దైన్యం నెలకొంది. ఈ నేపథ్యంలో తోతాపురి రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

వీరు రూ. 8 అంటారు.. వారు రూ. 3కి కొంటారు

ప్రస్తుతం తోతాపురి ర్యాంపుల్లో కేజీ రూ.3లే

- మద్దతు ధర రూ.8గా ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- ఫ్యాక్టరీలో రూ.5 నుంచి రూ.6
- మద్దతు ధరపై చేతులెత్తేసిన వైనం
- అర్ధరాత్రి ఫ్యాక్టరీలోకి తీసుకెళ్లిన కూటమి నేతల కాయల వాహనాలు
- కేజీ రూ.6కు తగ్గకుండా చూస్తామన్న ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి

కాణిపాకం: చిత్తూరు జిల్లాలో తోతాపురి ధరలు పాతాళానికి పడిపోయాయి. ర్యాంపుల్లో కేజీ రూ.3కు మించి కొనుగోలు చేయడంలేదు. ఫ్యాక్టరీలో రూ.5, రూ.6కు తీసుకుంటున్నారు. ప్రభుత్వం తోతాపురికి మద్దతు ధర కేజీ రూ.8గా నిర్ణయించింది. ప్రభుత్వ ప్రోత్సాహక నిధిగా కేజీకి రూ.4 ఇస్తామని ప్రకటించింది. ఈనెల 14వ తేదీన చిత్తూరు జిల్లాలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించి, కచ్చితంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ఫ్యాక్టరీలు తోతాపురిని కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో ఈ మద్దతు ధర ఎక్కడా అమలుకావడం లేదు. రైతుకు కనీస ధర ఇప్పించలేక ప్రభుత్వం చేతులెత్తేసింది.



చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలోని ఫుడ్ ఇనోసిస్ ఫ్యాక్టరీ వద్ద రైతుల పాట్లు

కిలో రూ.6 కు తగ్గకుండా చూస్తాం: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

కిలో మామిడికాయల ధర రూ.6కు తగ్గకుండా చూస్తామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి మీడియా సమావేశంలో వెల్లడించారు. ర్యాంపుల్లో రూ.3.50కి కొంటున్నారని తెలిపారు. కిలో రూ. 6లు చెల్లించేలా టాస్క్‌ఫోర్స్ కమిటీ వేస్తామన్నారు. తద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని వివరించారు.

ఉద్యానశాఖ కుంటిసాకులు

జిల్లాలో మామిడి రైతుల ఆందోళనల నేపథ్యంలో ఉద్యానశాఖ అధికారులు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కాయలు పక్వానికి రాకుండా కోత కోయడం వల్లే ఇబ్బందులు వస్తున్నాయని కుంటిసాకులు చెబుతూ మద్దతు ధరకు మంగళం పాడుతున్నారు. అధికారుల తీరుపై జిల్లా రైతులు భగ్గుమంటున్నారు. మద్దతు ధర రూ. 8 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



ఫుడ్ ఇనోసిస్ ఫ్యాక్టరీ వద్ద భారీగా నిలిచిన మామిడి కాయల లోడు వాహనాలు

టోకెన్ల కోసం తోపులాటలు..తొక్కిసలాటలు

చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలోని ఓ పరిశ్రమ వద్ద టోకెన్ల కోసం మామిడి రైతులు పడరాని పాట్లు పడ్డారు.మంగళవారం సుమారు మూడు గంటల పాటు టోకెన్ల కోసం అవస్థలు పడ్డారు. రద్దీని గుర్తించిన పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని నియంత్రించి టోకెన్లు జారీ చేశారు. ఈ తరుణంలో ఫ్యాక్టరీ వద్ద గందరగోళ పరిస్థితులు ఎదురయ్యాయి. టోకెన్ల కోసం గేటు తీసే క్రమంలో తోపులాటలు, తొక్కిసలాటలు జరిగాయి. ముగ్గురు వ్యక్తులు సొమ్మసిల్లి పడిపోయారు.

ఫ్యాక్టరీల ఆవరణలో వందలాది వాహనాలు

మామిడి కాయలను విక్రయించేందుకు జిల్లా వ్యాప్తంగా రైతులు ఫ్యాక్టరీలకు వచ్చారు. అయితే సరైన మద్దతు ధర లభించని కారణంగా తెచ్చిన కాయలను ఇంటికి తిరిగి తీసుకెళ్లలేక, అయినకాడికి తెగనమ్ముకోలేక వచ్చిన వాహనాల్లో రోజులుగా వేచిచూస్తున్నారు. దీంతో ఫ్యాక్టరీ ఆవరణలో వందలాది ట్రాక్టర్లు, లారీలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా ఆ వాహనాలు ముందుకు, వెనక్కు కదలకుండా అలానే నిలిచిపోయాయి.

క్లుప్తంగా...

శాఖమూరి సుగుణ మృతికి సీపీఐ సంతాపం

సాక్షి, అమరావతి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఐ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు శాఖమూరి సుగుణ మృతి పట్ల సీపీఐ ఏపీ రాష్ట్ర సమితి సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో రజాకార్ల దురాగతాలకు ఎదురొడ్డి నిలిచిన ఘన చరిత్ర ఎస్వీఎన్ ప్రసాద్, సుగుణ దంపతులదని కితాబిచ్చారు. తుదికంటా కమ్యూనిస్టు భావాల పట్ల అంకితభావంతో ఉండటం ఆదర్శనీయమని, మహిళా సమాఖ్య నాయకురాలుగా అటు పార్టీకి, ఇటు మహిళా సమాఖ్యకు సుగుణ అందించిన సేవలు ఎనలేనివని రామకృష్ణ పేర్కొన్నారు. సుగుణ మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

'సీఈ'లుగా పదోన్నతికి ప్రభుత్వం ఆమోదం

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో నలుగురు అధికారులను సీఈలుగా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

మాకు ట్రాన్స్‌ఫర్ పాలసీని రూపొందించండి

సాక్షి, అమరావతి: విలేజ్ క్లినిక్స్‌లో వైద్య సేవలు అందించే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు బదిలీలు చేపట్టాలని ఏపీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉద్యోగ రీత్యా దంపతులు వేర్వేరుగా ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లకు ట్రాన్స్‌ఫర్ పాలసీ రూపొందించాలని డిమాండ్ చేశారు.

కృష్ణంరాజు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: అమరావతి గురించి వ్యాఖ్యలు చేసినందుకు తనపై తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలంటూ సీనియర్ పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

మొన్న అమరావతి.. నిన్న మహానాడు.. నేడు విశాఖకు..

- యోగాంధ్రకు తరలిపోతున్న ఆర్టీసీ బస్సులు
- నేడు తిరుపతి నుంచి విశాఖకు 30 బస్సులు
- తిరిగి 22వ తేదీ రాత్రికి తిరుపతికి తిరుగుముఖం
- నాలుగు రోజులు ప్రయాణికులకు తప్పని తిప్పలు

తిరుపతి అర్బన్: మొన్న వైఎస్సార్ కడపలో జరిగే మహానాడుకు 220 బస్సులు ...నిన్న అమరావతికి 85 బస్సులు....నేడు విశాఖలో జరిగే యోగాంధ్రకు 30 బస్సులు..కార్యక్రమమేదైనా సరే..జిల్లానుంచి బస్సులు వెళ్లాల్సిందే. దీంతో ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో ఆర్టీసీ బస్సు సౌకర్యం అనునిత్యం అందడం లేదు. జిల్లాకు చెందిన ఆర్టీసీ సర్వీసులను కూటమి సర్కార్‌లో ప్రచారానికై వాడుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అమరావతితో ఆరంభమై..

గత నెలలో ప్రధాని నరేంద్రమోదీ అమరావతికి వచ్చారు. ఆ సందర్భంలో తిరుపతి జిల్లా నుంచి 85 ఆర్టీసీ బస్సులను పంపించారు. ఆ తర్వాత మే చివరివారంలో జరిగిన టీడీపీ మహానాడుకి 220 బస్సులను ఇక్కడి నుంచి తరలించారు. తాజాగా విశాఖపట్నంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఇక్కడి నుంచే 30 బస్సులను బుధవారం రాత్రి పంపించారు. తిరిగి ఈ సర్వీసులు ఈ నెల 22 లేదా 23 వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఈ నాలుగు రోజులు తమకు అవస్థలు తప్పవని ప్రయాణికులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా ముందుగా ఆర్టీసీ బస్సులను వాడుకుంటున్న కూటమి పాలకుల తీరుపై పెదవి విరుస్తున్నారు.

అవసరం 1100..ఉన్నవి 774

జిల్లా వ్యాప్తంగా 11 డిపోల్లో 774 బస్సులున్నాయి. వీటిలో నిత్యం 74 సర్వీసులు మరమ్మత్తుల్లో ఉంటున్నాయి. మిగిలిన 700 బస్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణికుల సంఖ్యతో పోల్చి చూస్తే ఇవి ఏమూలకూ సరిపోవడం లేదు. జిల్లాకు ప్రస్తుత అవసరాలమేరకు 1100 సర్వీసులు అవసరం. 400 బస్సులు కేటాయించాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి సర్కార్ పదే పదే ఆర్టీసీ సర్వీసులను వాడేస్తున్న వైనాన్ని ప్రయాణికులు తప్పుబడుతున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 94 అద్దె బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. అయినా ముఖ్యమైన ఆలయ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు.

మొదటిస్థానానికి మూడినట్లే..

గత ఆరేళ్లుగా ఆర్టీసీ ఆదాయంలో తిరుపతి జిల్లా రాష్ట్రస్థాయిలో అగ్రగామిగా ఉంది. 2023–24 లో జిల్లా ఆర్టీసీ రాబడి రూ.572 కోట్లతో రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇలా ఆర్టీసీ సర్వీసులను అక్కడికి, ఇక్కడికి ఎడాపెడా వాడేస్తే ఆదాయం పడిపోతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీని వేగవంతం చేయండి

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని వేగవంతం చేయాలని అధికారులను సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. తొలి విడతగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీలను విద్యార్థులకు అందించామని.. మిగిలిన వస్తువులు కూడా మండల పాయింట్లకు 100 శాతం చేరగానే పాఠశాలలకు పంపించాలన్నారు. ఆ వెంటనే బ్యాగులు, యూనిఫాం క్లాత్‌లు, బూట్లు, సాక్సులు, బెల్టులను పంపిణీ చేయాలని సూచించారు. వచ్చే నెల మొదటి వారంలో జరిగే పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి విద్యార్థులు కొత్త యూనిఫాంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంలను ఆదేశించారు.

మోదీ పాలన ఎమర్జెన్సీకి మించి ప్రమాదం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

సాక్షి, అమరావతి: ప్రధాని మోదీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వానికి ఎమర్జెన్సీకి మించిన ప్రమాదం వచ్చిందని, దీన్ని ఐక్యంగా ఎదుర్కోవాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు అన్నారు. విజయవాడలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీకి జూన్ 25 నాటికి 50 ఏళ్లు పూర్తవుతాయని, అప్పటి దారుణ పరిస్థితులతో పాటు ఈ దేశానికి మోదీ పాలనలో వచ్చిన ఎమర్జెన్సీ ప్రమాదాన్ని కూడా ప్రజలకు వివరించాలని సీపీఎం కేంద్ర కమిటీ నిర్ణయించిందన్నారు. ఆనాడు ప్రజలందరూ కలిసి ఎమర్జెన్సీ నుంచి దేశాన్ని ఎలా రక్షించుకున్నారో.. ఈరోజు నయా ఫాసిస్టు శక్తుల నుంచి లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ప్రతిపక్షాలు ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

నియోజకవర్గాల్లో యువ నిపుణులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో యువ నిపుణులను నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశించారు. ఆ మేరకు ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్రణాళిక ప్రకారం 175 మంది యువ నిపుణులు నాలుగేళ్ల పాటు విధులు నిర్వహిస్తారని స్పష్టం చేశారు. నెలకు ఒక్కొక్కరికి రూ.60 వేల చొప్పున ఏడాదికి 175 మందికి రూ.12.60 కోట్లు, నాలుగేళ్లలో రూ.50.40 కోట్లు రాష్ట్ర డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ గ్రాండ్ ఇన్ ఎయిడ్ నుంచి చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు. యూనిట్ చైర్మన్/చైర్ పర్సన్‌గా స్థానిక ఎమ్మెల్యే ఉంటారు. ఒక ప్రత్యేక అధికారిని కలెక్టర్ నామినేట్ చేస్తారు. మరో ఐదుగురిని గ్రామ, వార్డు సచివాలయాల నుంచి నియమిస్తారు.

బనకచర్ల ద్వారా వరద జలాలే మళ్లింపు

- ఈఏసీ కమిటీకి రాష్ట్ర జలవనరులశాఖ అధికారుల నివేదన

సాక్షి, అమరావతి: పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు ద్వారా గోదావరి వరద జలాలను మాత్రమే మళ్లిస్తామని.. దీని వల్ల తెలంగాణతోపాటు ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టమూ ఉండబోదని కేంద్ర పర్యావరణ నిపుణుల అంచనా కమిటీ(ఈఏసీ)కి రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు నివేదించారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతితో ఆ ప్రాజెక్టు పనులు చేపడతామని పేర్కొన్నారు. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు పర్యావరణ అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృష్ణా డెల్టా సీఈ బి.రాంబాబు దరఖాస్తు చేశారు. పర్యావరణ అనుమతికి నియమ, నిబంధనల(టీవోఆర్)పై ప్రొఫెసర్ జీజే చక్రపాణి నేతృత్వంలోని ఈఏసీ కమిటీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్ సమావేశాన్ని నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, కృష్ణా డెల్టా సీఈ బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీల వరద జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, అందులో 200 టీఎంసీలను తరలించి దుర్భిక్ష ప్రాంతాల్లో కొత్తగా 3 లక్షల హెక్టార్లకు సాగునీటిని అందించడంతోపాటు 9.14 లక్షల హెక్టార్ల స్థిరీకరణ, 80 లక్షల మందికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు 20 టీఎంసీలను అందించే లక్ష్యంతో పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు కమిటీకి వివరించారు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించి ప్రాజెక్టును చేపడుతుందోని.. దీని వల్ల తమ రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందని తెలంగాణ సర్కార్ ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఈఏసీ చైర్మన్ చక్రపాణి సమావేశంలో ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు ప్రాథమిక నివేదికను గత నెల 22న సీడబ్ల్యూసీకి సమర్పించామని.. దాన్ని బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలు, గోదావరి బోర్డు, కృష్ణా బోర్డుకు సీడబ్ల్యూసీ పంపిందని రాష్ట్ర జలవనరుల అధికారులు వివరించారు. ప్రాథమిక నివేదికను అన్ని రాష్ట్రాలకూ పంపి.. దానిపై వాటి అభిప్రాయాన్ని సీడబ్ల్యూసీ కోరిందని వివరించారు. వరద జలాలను మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా తరలిస్తామని.. దీని వల్ల తెలంగాణతో పాటు ఎగువ రాష్ట్రాల ప్రయోజనాలకు ఏమాత్రం విఘాతం కలగదని స్పష్టం చేశారు.

ఆదర్శ పాఠశాల సిబ్బంది నేడే విధుల్లో చేరాలి

సాక్షి, అమరావతి: ఆదర్శ పాఠశాలల్లో పని చేస్తూ బదిలీ ఉత్తర్వులు తీసుకున్న ప్రిన్సిపల్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు కొత్త పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరాలని విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణ బదిలీల ప్రక్రియలో రాష్ట్రంలో ఆదర్శ పాఠశాలల నుంచి 2,608 మంది రెగ్యులర్ ఉపాధ్యాయ సిబ్బందికి గాను 1,312 మంది దరఖాస్తు చేసుకోగా.. 1,009 మందికి కోరుకున్న పాఠశాలలకు బదిలీ చేసినట్లు తెలిపింది.

మద్యం కేసు పేరుతో సిట్ అరాచకం

- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆగ్రహం

సాక్షి,అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా సృష్టించిన మద్యం అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ నేతలను ఇరికించాలనే లక్ష్యంతో సిట్ అధికారులు అరాచకానికి తెగబడుతున్నారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి మండిపడ్డారు. జరగని మద్యం కేసులో ఆధారాలు లేకపోవడంతో స్టేట్‌మెంట్ల ద్వారా వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు బనాయించేందుకు కూటమి నేతలు అనుకూల పోలీస్ అధికారులతో ఏర్పాటైన సిట్ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వద్ద గన్‌మెన్‌గా గతంలో పనిచేసిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్‌రెడ్డిని విచారణ పేరుతో పిలిచిన సిట్ అధికారులు తమ వారికి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇవ్వాలంటూ చిత్రహింసలకు గురి చేశారు. ప్రస్తుతం మదన్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చివరకు సిట్ నుంచి రక్షణ కల్పించాలంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఎంత దారుణంగా పని చేస్తుందో ఈ ఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. మదన్‌రెడ్డిని యూనిఫాం లేకుండా రావాలని సిట్ అధికారులు ఆదేశించారు. అయితే యూనిఫాం లేకుండా వెళ్తే శారీరకంగా హింసిస్తారని గ్రహించిన మదన్‌రెడ్డి యూనిఫామ్‌తోనే వెళ్లారు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన పోలీసు అధికారులు పదిమంది మదన్‌రెడ్డిని తీవ్రంగా దూషించారు. భౌతిక దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా హింసించారు. అయినా కూడా ఆయన తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు నిరాకరించారు. సిట్ అధికారులు కొట్టిన దెబ్బలతో తీవ్రంగా గాయపడిన మదన్‌రెడ్డి ప్రస్తుతం తాడేపల్లిలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తనకు సిట్ అధికారుల నుంచి రక్షణ కల్పించాలని, తనను చిత్రహింసలకు గురి చేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని మదన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఇకపై న్యాయవాది సమక్షంలోనే తన విచారణ జరిగేలా చూడాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. సిట్ అధికారులు కూటమి సర్కారుకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. అని మనోహర్‌రెడ్డి మండిపడ్డారు.

'ఉపాధి హామీ' పనుల తనిఖీకి కేంద్ర బృందాలు

సాక్షి, అమరావతి: గత ఏడాది కాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను కేంద్ర బృందాలు తనిఖీ చేస్తున్నాయి. తిరుపతి, కాకినాడ జిల్లాల్లో మంగళవారం నుంచి ఈ నెల 20 వరకు.. అనంతపురం జిల్లాలో బుధవారం నుంచి 21వ తేదీ వరకు ఈ బృందాలు పర్యటించనున్నాయి. ఈ బృందాల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో పాటు ఎన్జీవోలు ఉన్నారు. ఈ బృందాలు ఆయా జిల్లాల్లోని రెండేసి మండలాల పరిధిలో నాలుగేసి గ్రామాల్లో ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. కూలీలతో మాట్లాడుతాయి.

సొంత మండలాలకు బదిలీ చేయండి

గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ వినతి

సాక్షి, అమరావతి: సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులను వారి సొంత మండలం లేదా సొంత మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పరిధిలోనే బదిలీ చేసే వీలు కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఫెడరేషన్ ప్రతినిధులు సచివాలయాల శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల కన్నా అతి తక్కువ జీతాలు ఇస్తున్నారని, చాలీచాలని వేతనాలతో సొంత మండలాలకు దూరంగా పనిచేయడం కష్టమవుతుందని పేర్కొన్నారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు సైతం ఇప్పించాలని కోరుతూ మరో వినతిపత్రం సమర్పించినట్టు ఫెడరేషన్ అధ్యక్షుడు ఎండీ జానీపాషా, ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు తెలిపారు.

బదిలీల్లో నిబంధనలను సడలించాలి

సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ

భవానీపురం (విజయవాడ పశ్చిమ): గ్రామ, వార్డ్ సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణ, బదిలీలపై ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాల్లోని పలు సమస్యలపై గ్రామ/వార్డ్ సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య మంగళవారం సచివాలయాల శాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్, అడిషనల్ కమిషనర్ జీవీ సూర్యనారాయణలను కలిసి వినతి పత్రం అందజేశారు. అర్లయ్య మాట్లాడుతూ రెవెన్యూ మండలం ప్రామాణికంగా తీసుకుని స్థానికంగా పని చేస్తున్న ఉద్యోగులను వారి రెవెన్యూ మండలం నుంచి తప్పక బదిలీ చేయడం అనే నిబంధనను సడలించాలని కోరారు. గ్రామ/వార్డ్ సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అర్బన్, రూరల్ ఉద్యోగులను బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారులను కలిసినవారిలో సంస్థ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జీ దుర్గారావు, కృష్ణాజిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

రొయ్యకు సిండి'కాటు'

వనామీ ధరలు పతనం

- 100 కౌంట్ ధర రూ.240 నుంచి రూ.200 తగ్గింపు
- 2 టన్నులలోపు అయితే రూ.180
- ఆందోళనలో ఆక్వా రైతులు
- సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేస్తున్నారని ఆవేదన
- అప్సడాతో సిండికేట్ ఆగడాలకు చెక్ పెట్టిన జగన్ ప్రభుత్వం



సాక్షి, భీమవరం: వారం వ్యవధిలో వనామీ రొయ్యల ధరలు అమాంతం పడిపోయాయి. నిన్నమొన్నటి వరకు కిలో రూ.240 ఉన్న 100 కౌంట్ ధర రూ.200 నుంచి రూ.180కి తగ్గించేయడం ఆక్వా రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం సిండికేటుకు కొమ్ముకాస్తోందని విమర్శిస్తున్నారు.

అమెరికా పన్నుల పేరిట దోపిడీ

వేసవి ఉష్ణోగ్రతలు అనుకూలించి మార్కెట్‌లోకి రొయ్యలు రావడం పెరగడంతో ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, వ్యాపారులు ఏకమై ధరలు తగ్గిస్తూ వచ్చారు. ఏప్రిల్ 3న అమెరికా ప్రతీకార సుంకాల ప్రకటన వెలువడే నాటికి 30 కౌంట్ ధర రూ.460, 40 కౌంట్ ధర రూ.370, 100 కౌంట్ ధర రూ.230కి తగ్గించేశారు. అమెరికా పన్నులను సాకుగా చూపించి కౌంట్‌కు కేజీకి రూ.30 నుంచి రూ.70 వరకు కోత పెట్టారు. ఇప్పట్లో పన్నులు లేవని తర్వాత అమెరికా ప్రకటించినా సిండికేట్ వర్గాలు ధరలను పెంచకపోవడం గమనార్హం.

కంటితుడుపు చర్యలతో సరి

ఫీడ్ ప్లాంట్ల యజమానులు మేత ధరలు పెంచేయడం .. ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎగుమతిదారులు ఏకమై తమ కష్టాన్ని దోచుకుంటుంటే కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏప్రిల్‌లో రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లోని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో పంట విరామం సైతం ప్రకటించారు. ఈ పరిణామాలతో ఉలిక్కిపడిన ప్రభుత్వం ఉండిలో ఆక్వా సదస్సు, విజయవాడలో ప్రాన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశాల్లో మేత ధరలను కేవలం టన్నుకు రూ.4 వేలు మాత్రమే తగ్గించడం, 100 కౌంట్ ధరను స్వల్పంగా పెంచడం తదితర కంటితుడుపు చర్యలతో సరిపెట్టింది.

మళ్లీ ధరలు పతనం

వారం క్రితం 100 కౌంట్ ధర దాదాపుగా రూ.240 ఉండగా, 30 కౌంట్ ధర రూ.385, 40 కౌంట్ ధర రూ.325, 50 కౌంట్ ధర రూ.295, 60 కౌంట్ ధర రూ.265 వరకు ఉన్నాయి. రానున్న సీజన్‌కు గాను మరలా చెరువులను సిద్ధం చేసుకునేందుకు రైతులు పట్టుబడులు ముమ్మరం చేయడంతో మార్కెట్‌లోకి రొయ్యలు రావడం ముమ్మరమైంది. ఇదే అదునుగా తిరిగి సిండికేట్లు ధరలను తగ్గించేస్తున్నాయి. పెద్ద రైతులైతే ఎక్కువ టన్నుల్లో పట్టుబడులు జరిగి 100 కౌంట్‌కు రూ.210 వరకు ధర చెల్లిస్తుంటే.. చిన్న రైతులు మూడు టన్నుల లోపు పట్టుబడులు చేయడం వల్ల పట్టుబడి పరిమాణం బట్టి 100 కౌంట్ రొయ్యలను రూ.200 నుంచి రూ.180కు కొనుగోలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. మిగిలిన కౌంట్ల ధరలు సైతం తగ్గించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతికూల వాతావరణం, నాణ్యత లేని సీడ్, ఫీడ్‌తో ఇబ్బందులు పడుతుంటే ధరల పతనం తమను మరింత నష్టాల్లోకి నెట్టేస్తోందని వాపోతున్నారు.

నాడు అప్సడాతో అండ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020లో ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా)ని ఏర్పాటు చేసి హేచరీలు, ఫీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఆగడాలకు చెక్ పెట్టింది. ప్రతి 10 రోజులకు ఒకసారి సమావేశమై ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంది. రైతులకు లాభసాటి ధర అందేలా పనిచేసింది.

ఆక్వా రంగం కుదేలు



ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఆక్వా రంగం సిండికేటు దోపిడీతో సంక్షోభంలో కూరుకుపోతోంది. సీడ్, ఫీడ్, లీజు, మెడిసిన్ ధరలు 100 శాతం పెరగ్గా.. రొయ్యల ధర మాత్రం పతనమవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే సాగు చేయడం చాలా కష్టం. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టపోతున్నాం.

– పొత్తూరి శ్రీనివాసరాజు, ఆక్వా రైతు, కలగంపూడి

గత ప్రభుత్వంలో ఇలా లేదు



ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు సిండికేట్ అయి ఇష్టానుసారం ధరలు తగ్గించేస్తున్నారు. టన్నులను బట్టి 100 కౌంట్ రూ.210 నుంచి రూ.180కి కొంటున్నారు. గత ప్రభుత్వంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. ధరలు స్థిరంగా ఉండేవి. ఇప్పుడు రోజుకు ఎలా మారతాయో తెలియడం లేదు. ఆక్వా రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– పెనుమాల నరసింహస్వామి, ఆక్వా రైతు, గొల్లవానితిప్ప

'ఎల్‌పీఎస్' పనుల్లో వేగం పెంచండి

అధికారులకు ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి ఆదేశాలు

తాడికొండ: అమరావతికి భూములిచ్చిన రైతులకు తిరిగి ఇచ్చే ప్లాట్లను అభివృద్ధి చేసి వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, ఎండీ డి. లక్ష్మీ పార్థసారథి ఆదేశాలిచ్చారు. మంగళవారం జోన్–2, 7 ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్‌పీఎస్) లే అవుట్లను పరిశీలించారు. జోన్–1 లో అబ్బరాజుపాలెం, నెక్కల్లు, తుళ్ళూరు, శాఖమూరు గ్రామాల పరిధిలో 2.85 వేల ఎకరాల్లో జరుగుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను తనిఖీ చేశారు. జోన్–7లో కొండమరాజు పాలెం, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల్లో 26 వేల ఎకరాల్లో చేపట్టాల్సిన లే అవుట్ల అభివృద్ధికి సమాయత్తం కావాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ సీహెచ్ ధనుంజయ, ఏడీసీ చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

'సెయిల్' విద్యుత్ యూనిట్ రూ.4.51

కొనుగోలుకు అనుమతించిన ఏపీఈఆర్సీ

సాక్షి, అమరావతి: సెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈఐఎల్) నుంచి ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు విద్యుత్ కొనుగోలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) అనుమతిచ్చింది. అలాగే 2025–26 నుంచి 2028–29 వరకు మూలధన వ్యయం(ఫిక్స్‌డ్ కాస్ట్) రూ.3,067 కోట్లుగా నిర్ణయించింది. ఈ మేరకు రెండు పిటిషన్లపై కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లాలోని నేలటూరు, పైనంపురం గ్రామాలలో ఉన్న సెయిల్ ప్రాజెక్ట్– ఐలోని 660 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్–2 నుంచి యూనిట్ రూ.4.51 చొప్పున విద్యుత్ కొనుగోలుకు డిస్కంలు సవరించిన ఒప్పందాన్ని (పీపీఏ) 120 రోజుల్లోగా చేసుకోవచ్చని మండలి పేర్కొంది. ఇంధన ఛార్జీలను యూనిట్‌కు రూ.2.83గా నిర్ణయించింది. కాగా 12 ఏళ్లపాటు ఈ ఒప్పందం అమలులో ఉంటుందని తెలిపింది. సెయిల్‌కి కేటాయించిన రాయితీ బొగ్గు, జీరో ప్రీమియం బొగ్గు నుంచి మాత్రమే ఉత్పత్తిని అనుమతించింది. అవసరమైన విధంగా ప్రీమియం బొగ్గును ఉపయోగించి విద్యుత్ సేకరించే స్వేచ్ఛను డిస్కంలకి ఇచ్చింది. దీని ప్రకారం, స్థిర ఛార్జీల చెల్లింపు నియంత్రించవచ్చని కమిషన్ వివరించింది.అయితే డిస్కంలు విద్యుత్తును తీసుకోవాల్సిన అవసరం లేనప్పుడు ప్రీమియం బొగ్గును ఉపయోగించి మూడో పక్షాలకు తన విద్యుత్తును విక్రయించే స్వేచ్ఛను సెయిల్‌కి కల్పించింది.

సాగుబడి

ఆరుద్ర కార్తె: జూన్ 22 నుంచి

ఎరువుల లోకం..!



రసాయనిక ఎరువులు, అధిక దిగుబడినిచ్చే వంగడాలు, నీటిపారుదల సదుపాయాలు.. ఈ మూడింటిని ఒక ప్యాకేజీగా రైతులకు అందుబాటులోకి తెచ్చింది 'హరిత విప్లవం'. ఆంగ్లంలో ఈ మూడిటిని కలిపి గ్రీన్ రెవెల్యూషన్ టెక్నాలజీస్ (జిఆర్‌టిలు) అంటారు. హరిత విప్లవ కాలంలో ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల్లో రైతులకు ఈ మూడే విస్తృతంగా అందుబాటులోకి రావటంతో పంట దిగుబడులు ఇబ్బడిముబ్బడి అయ్యాయి. ఏటేటా రసాయనిక ఎరువులతో పాటు పురుగుమందులు తదితర వ్యవసాయ రసాయనాల వాడకం పెరుగుతూనే ఉంది. పెరిగే జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు తదితర వ్యవసాయోత్పత్తుల ఉత్పత్తిని పెంచవలసి వస్తోంది. అయితే, రసాయనిక ఎరువుల వాడకాన్ని అంతకంతకూ పెంచుకుంటూ పోవటం వల్ల పర్యావరణ సంబంధమైన సమస్యలు వస్తున్నాయి. నేలలు చౌడుబారిపోతున్నాయి. నీటి వనరులు రసాయనిక ఎరువుల అవశేషాలతో కలుషితం అవుతున్నాయన్న ఆందోళనలు సైతం పెరిగిపోతున్నాయి. అందువల్లనే పర్యావరణానికి అంతగా హాని చేయని సుస్థిర / సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఇటీవల కాలంలో గతమెన్నడూ లేనంతగా ఆదరణ పొందుతున్నాయి.

అయినప్పటికీ ఇప్పటికీ నూటికి 95 శాతం మంది రైతులు రసాయనిక ఎరువులతోనే వ్యవసాయం చేస్తున్నారు. ఇంతకీ, ఏయే దేశాల్లో పంటలకు ఎంతెంత మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతున్నారు? నత్రజని అనగానే యూరియా గుర్తొస్తుంది. పంటలకు యూరియా యేతర మార్గాల ద్వారా నత్రజని ఎంతెంత అందుతుంది? ఎరువులను ఎంతెంత వాడుతున్నారు? వీటిని శాస్త్రవేత్తలు సూచించిన దానికన్నా అనేక రెట్లు ఎక్కువ వాడుతుండటం వల్ల వస్తున్న పరిణామాలేంటి? ఇటువంటి ఆసక్తికరమైన అంశాలను పరిశీలిద్దాం.. కాసేపు రసాయనిక ఎరువుల లోకంలోకి తొంగి చూద్దాం...



పంట మొక్కలు, తోటలు ఆరోగ్యంగా పెరిగి మంచి ఫలసాయాన్ని ఇవ్వాలంటే వాటి పెరుగుదలకు అవసరమైనంత మోతాదులో 17 రకాల పోషకాలు అవసరం. ఇవి రెండు రకాలు.. స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలు. కర్బనం, హైడ్రోజన్, ఆక్సిజన్.. ఈ మూడింటిని వాతావరణం నుంచి మొక్కలు గ్రహిస్తాయి. మిగతా 14 రకాలు నేల నుంచి వేర్ల ద్వారా పంటలు గ్రహిస్తాయి. అదేవిధంగా ఎరువుల్లో రెండు రకాలు. రసాయనిక ఎరువులు, సేంద్రియ ఎరువులు (జీవన ఎరువులు కూడా ఈ కోవలోకే వస్తాయి). నత్రజని, ఫాస్పరస్, పొటాషియం అనేవి స్థూల పోషకాలు. ఇవి పెద్ద పరిమాణంలో పంటలకు అవసరం. ఐరన్, జింక్, బోరాన్, మెగ్నీషియం.. వంటి సూక్ష్మపోషకాలు. ఇవి స్వల్ప పరిమాణంలో అవసరం. సాధారణంగా రసాయనిక ఎరువులు అని అంటే చాలా వరకు నత్రజని, ఫాస్పరస్, పొటాషియం అనే అర్థం. ఎన్‌పీకే ఎరువులని అంటుంటాం.

2024లో 19.54 కోట్ల మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువులను ప్రపంచవ్యాప్తంగా రైతులు పంటల సాగు కోసం ఉపయోగించారు. 2023 కన్నా ఇది కొంచెం ఎక్కువ. 2022లో 18.5 కోట్ల టన్నులు వాడారు. 2021తో పోల్చితే ఇది 7% తక్కువ. కొవిడ్ నేపథ్యంలో రసాయనిక ఎరువుల ధరలు బాగా పెరిగిపోవటంతో కొన్ని చోట్ల వాడకం తగ్గినా అది తాత్కాలిక పరాణామమేనని చెప్పొచ్చు. రసాయనిక ఎరువుల ఉత్పత్తి, ఎగుమతి యూరప్, అమెరికా ఖండాల్లో ఎక్కువ. ఐదు దేశాలు ఎరువుల ఎగుమతిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. అయితే వాడకం ఆసియాలో ఎక్కువ. భారత్ సహా ఆసియా దేశాలన్నీ రసాయనిక ఎరువులను దిగుమతి చేసుకుంటూ వ్యవసాయానికి మద్దతు పలుకుతున్నాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధకాలంలో ఎరువుల సరఫరా తగ్గి, ధర పెరిగిపోవటం మనకు తెలుసు.

ఆయా దేశాల్లో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, నేలల్లో సారం, రైతుల స్థోమత, వారు అనుసరిస్తున్న సాంకేతికత, స్థానిక ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు వంటి అనేక పర్యావరణ, ఆర్థిక, భౌగోళిక అంశాలపై ఎరువుల వాడకం మోతాదులు, దిగుబడులు వంటివి ఆధారపడి ఉంటాయి.

రసాయనిక ఎరువుల వాడకం ఏయే దేశాల్లో ఎంతెంత? (హెక్టారుకు కిలోలలో)

దేశం	నత్రజని		ఫాస్పరస్		పొటాషియం		మొత్తం	
	2000	2022	2000	2022	2000	2022	2000	2022
ప్రపంచం	51.3	65.4	21.0	26.0	13.7	21.7	85.9	113.1
ఆసియా	83.1	108.4	31.5	40.0	14.0	28.3	128.6	176.7
ఆఫ్రికా	10.4	13.3	3.9	5.3	2.0	2.9	16.3	21.6
అమెరికాలు	40.4	60.9	21.9	33.7	20.7	35.8	82.9	130.4
యూరప్	38.5	41.6	12.4	10.2	14.3	12.0	65.1	63.8
భారత్	64.2	120.2	24.8	47.1	9.2	10.2	98.2	177.6
బ్రెజిల్	27.4	96.2	42.6	90.5	44.4	115.2	114.3	301.8
చైనా	169.1	191.4	65.8	75.4	26.5	70.0	261.4	336.7
ఇజ్రేల్	115.6	62.5	35.4	12.3	70.8	76.5	221.7	151.2
జర్మనీ	123.0	68.0	26.3	8.8	38.5	17.1	187.7	93.9
యుఎస్ఎ	48.1	59.1	21.8	23.7	22.7	24.8	92.6	107.6
ఆస్ట్రేలియా	36.0	54.7	32.9	25.9	7.3	6.1	76.2	86.6
వియత్నాం	163.2	151.2	62.2	55.3	53.2	35.6	278.6	242.1

పంట పొలానికి వివిధ రూపాల్లో అందుతున్న నత్రజని ఎరువులు ఎంత? (హెక్టారుకు కిలోలలో)

దేశం	2021				పంట కోతతో	పంట భూమిలో మిగిలిన నత్రజని	
	వర్షం/మంచు ద్వారా లభించేది	సూక్ష్మజీవుల ద్వారా లభించేది	సేంద్రియ ఎరువుల ద్వారా...	రసాయనిక ఎరువుల ద్వారా...	భూమి కోల్పోయిన నత్రజని	2000	2001
ప్రపంచం	9.8	25.5	16.2	64.3	65.1	48.3	51.9
ఆఫ్రికా	6.0	11.2	5.5	16.3	26.8	8.6	12.6
అమెరికాస్	6.4	62.4	13.9	60.7	96.8	35.2	48.3
యూరప్	6.8	4.6	21.3	48.1	49.4	40.6	32.9
ఆసియా	15.8	20.2	21.2	99.6	72.4	79.3	85.4
భారత్	21.2	34.2	12.6	104.2	72.7	65.3	100.8
చైనా	26.8	25.9	38.1	170.8	131.0	168.0	132.4
ఇజ్రేల్	18.8	2.7	20.0	90.3	32.6	99.6	99.7
జర్మనీ	14.8	3.5	46.3	77.4	90.7	103.3	54.8
బ్రెజిల్	8.2	162.8	22.0	87.6	190.5	43.2	92.9
ఆస్ట్రేలియా	1.8	9.2	4.2	46.3	47.8	6.7	15.5
అమెరికా	7.1	46.5	10.0	57.5	88.3	38.0	34.2
వియాత్నాం	12.6	19.9	28.7	128,4	80.5	154.5	109.3

ఎరువుల వినియోగం 18.5 కోట్ల టన్నులు

ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం (పంటలు, పశుపోషణ, ఆక్వాకల్చర్, అడవుల పెంపకం, చేపల వేటసహా) ద్వారా సమకూరే ఆదాయం 2000-2022 మధ్య కాలంలో 89 శాతం పెరిగింది. 2022లో 3.8 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇందులో ఆసియా దేశాలదే 66%తో ప్రధాన పాత్ర. ప్రపంచ దేశాల వార్షిక ఆదాయంలో 4% మాత్రమే వ్యవసాయ రంగం నుంచి వస్తున్నప్పటికీ స్వతంత్ర ఆహారోత్పత్తి వ్యవస్థను కలిగి ఉండటం ఏ దేశానికైనా ఆహార సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవటానికి అవసరమే. అందుకు ఈ రోజుకు ప్రధాన సాధనంగా రసాయనిక ఎరువులే నిలుస్తున్నాయి.

ఆహార వ్యవసాయ సంస్థ (యుఎన్-ఎఫ్‌పిఓ) ప్రకటించిన తాజా గణాంకాల ప్రకారం.. 2022 నాటికి ప్రపంచంలో రసాయనిక ఎరువుల వార్షిక వినియోగం 18.5 కోట్ల టన్నులకు చేరింది. ఇందులో సింహభాగం 58% నత్రజని ఎరువులే. 10.8 కోట్ల టన్నుల యూరియా వాడకం జరిగింది. 4.2 కోట్ల టన్నుల ఫాస్ఫరస్ (23%), 3.5 కోట్ల టన్నుల పొటాషియం (19%) ఎరువులను రైతులు వాడారు.

2022లో రసాయనిక ఎరువుల వాడకంలో 55 శాతం వాటాతో ఆసియా ముందంజలో ఉంది. అమెరికా దేశాలు రెండోస్థానంలో, యూరప్ మూడో స్థానంలో, ఓసియానా నాలుగో స్థానంలో ఉన్నాయి. చైనా, భారత్, బ్రెజిల్, అమెరికా దేశాలు అధికంగా రసాయనిక ఎరువులు వాడుతున్నాయి. ఆసియా దేశాల్లో వాడుతున్న ఎరువుల్లో నత్రజని ఎరువుల వాటా 61-62% మేరకు ఉంది.

హెక్టారుకు 130 కిలోలు

హెక్టారు పొలంలో రసాయనిక ఎరువుల వాడకం 130 కిలోల మేరకు ఆసియా దేశాల్లోనే అత్యధికంగా ఉంది. అమెరికా ఖండంలో 130 కిలోలు, ఓసియానా దేశాల్లో 84 కిలోలు, యూరప్‌లో 64 కిలోలు, ఆఫ్రికాలో అతి తక్కువగా 22 కిలోల మేరకు రసాయనిక ఎరువులు వాడుతున్నారు. అమెరికా ఖండంలో 2000-2022 మధ్యకాలంలో వినియోగం 57% పెరిగింది. ఆసియాలో 37%, ఆఫ్రికాలో 32%, ఓసియానాలో 15% పెరగ్గా, యూరప్ దేశాల్లో 2% తగ్గింది. చెరకు, మొక్కజొన్న, గోధుమ, వరి పంటలను అత్యధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు.

వర్షం ద్వారా 9.8 కిలోల నత్రజని!

ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే.. పంటలకు నత్రజని అందేది యూరియా ద్వారా మాత్రమే కాదు. అందుకు అనేక ఇతర మార్గాలు కూడా ఉన్నాయి. యుఎన్-ఎఫ్ఎఓ గణాంకాల ప్రకారం (2022).. ప్రపంచవ్యాప్తంగా సగటున హెక్టారుకు ఏడాదికి సేంద్రియ ఎరువుల ద్వారా 16.2 కిలోల నత్రజని పంటలకు అందుతోంది. రసాయనిక ఎరువుల ద్వారా అందుతోంది 64.3 కిలోలు. వర్షం/మంచు ద్వారా 9.8 కిలోల నత్రజని


వాతావరణంలో నుంచి గ్రహించి సూక్ష్మజీవులు అందిస్తున్నది 25.5 కిలోలు. ఎంట కోతల ద్వారా (ఫలసాయం, పంట వ్యర్థాలతో కలుపుకొని) మనం భూమి నుంచి పొందుతున్న నత్రజని 65.1 కిలోలు మాత్రమే.

అయితే, వర్షం, మంచు ద్వారా భారత్‌లో పొలాలకు 2022లో అందిన నత్రజని సగటున హెక్టారుకు 21.2 కిలోలు! ఇది ప్రపంచ సగటు 9.8 కిలోలతో పోల్చితే రెట్టింపు కన్నా ఎక్కువ కావటం విశేషం.

2021లో వివిధ మార్గాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా హెక్టారు భూమికి సగటున 116.9 కిలోల నత్రజని అందింది. అందులో నుంచి, పంట పండిన తర్వాత మనం పొందే ఫలసాయం ద్వారా 65.1 కిలోల నత్రజని పోగా మిగతా 51.8 కిలోల నత్రజని ప్రతి హెక్టారు భూమిలో మిగిలిందని ఎఫ్.ఎ.ఓ. లెక్కగట్టింది. 2000 సంవత్సరంలో ఇలా మిగిలింది 48.3 కిలోలు మాత్రమేనట.



Agriculture value added went up 89% between 2000 and 2022, to USD 3.8 trillion.



The share of agriculture in global GDP has been stable at around 4% since 2000.



Agricultural use of inorganic fertilizers in 2022 was 185 million tonnes of nutrients, of which 108 million tonnes (58%) was nitrogen.



The production of primary crops was 9.6 billion tonnes in 2022, 56% more than in 2000.



Four crops account for about half of global primary crop production: sugar cane, maize, wheat and rice.

సాక్షి ప్లస్
బుధవారం । 18-6-2025



హోండా ఎక్స్ఎల్ 750 ట్రాన్సల్ప్

ధర రూ.10,99,990 • బుకింగ్స్ ప్రారంభం
• జూలై నుంచి డెలివరీలు

న్యూఢిల్లీ: హోండా మోటార్‌సైకిల్–స్కూటర్ ఇండియా '2025 ఎక్స్ఎల్ 750 ట్రాన్సల్ప్' పేరుతో అడ్వెంచర్ బైక్‌ను విడుదల చేసింది. ఈ మోడల్ ఎక్స్ షోరూం ధర రూ.10,99,990గా ఉంది. బుకింగ్‌లు మొదలయ్యాయి. జూలై నుంచి డెలివరీలు ప్రారంభిస్తారు. రాక్ వైట్, గ్రాఫైట్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. ఈ అడ్వెంచర్ బైక్ 755 సీసీ లిక్విడ్-కూల్డ్, ప్యారలల్-ట్విన్ ఇంజిన్‌ను కలిగి ఉంది. ఇది 9,500 ఆర్‌పీఎం వద్ద గరిష్ఠంగా 67.5 కిలోవాట్ల పవర్‌ను ఉత్పత్తి చేయగలదు. ఈ ఇంజిన్‌కు 6-స్పీడ్ గేర్‌బాక్స్ జత చేశారు. ఐదు రైడింగ్ మోడ్స్ ఉంటాయి. ఇందులో థ్రోటిల్-బై-వైర్ (టీబీడబ్ల్యూ) వ్యవస్థ ఉంది. 5.0 అంగుళాల ఫుల్-కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే, ఎమర్జెన్సీ స్టాప్ సిగ్నల్ ఫీచర్లున్నాయి. ఇంజిన్ పవర్, బ్రేకింగ్, ఏబీఎస్ వంటి అంశాలు రైడర్ ఇష్టానికి అనుగుణంగా మార్చుకునే అవకాశం ఉంటుంది. అన్ని రకాల రోడ్లపై ప్రయాణించడానికి వీలుగా ప్రత్యేకంగా తయారు చేసిన మోడల్ ఇది. ముఖ్యంగా సాహస యాత్రలను కోరుకునే రైడర్లకు అనుకూలంగా ఉంటుంది.

జియో నుంచి సరికొత్త స్టార్టర్ ప్యాక్

హైదరాబాద్: కొత్తగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే వినియోగదారులకు సరికొత్త డిజిటల్ అనుభవాన్ని అందించేందుకు రిలయన్స్ జియో స్టార్టర్ ప్యాక్‌ను ప్రారంభించింది. కేవలం రూ.349 తో కస్టమర్లకు ఈ స్టార్టర్ ప్యాక్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఒకే ఆఫర్ ద్వారా 5జీ నెట్‌వర్క్‌లో 28 రోజుల పాటు అపరిమిత సేవలు, 50 రోజుల ఉచిత జియోఫైబర్/ఎయిర్‌ఫైబర్ ట్రయల్ కనెక్షన్ (టీవీ + వైఫై + ఓటీటీ యాప్‌లు) 50 జీబీ ఉచిత జియో ఏఐ క్లౌడ్ స్టోరేజీ, 4కే నాణ్యతతో టీవీ లేదా మొబైల్‌లో 90 రోజుల పాటు ఉచిత జియో హాట్‌స్టార్ యాప్ వినోదం అందిస్తోంది. స్మార్ట్‌ఫోన్ యూజర్లకు డిజిటల్ అనుభవాన్ని సులభతరం చేయడం లక్ష్యంగా దీన్ని రూపొందించినట్లు కంపెనీ వెల్లడించింది.

బిజినెస్ రీల్

జియో బ్లాక్‌రాక్ 'అలాదీన్'

పెట్టుబడుల నిర్వహణ ప్లాట్‌ఫామ్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ: జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను మరింత సులభతరం చేసేందుకు 'అలాదీన్' ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. దీంతో బ్లాక్‌రాక్‌కు చెందిన పెట్టుబడుల విశ్లేషణ, రిస్క్ నిర్వహణ ప్లాట్‌ఫామ్ మొదటిసారి భారత ఇన్వెస్టర్లకు అందుబాటులోకి వచ్చినట్లు సంస్థ ప్రకటించింది. ''పెట్టుబడులు ఇక ఎంతో సులభం. జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ సంయుక్తంగా ఇదే నమ్మకాన్ని ఇన్వెస్టర్ల ముందుకు తీసుకొచ్చాయి. జియో డిజిటల్ ఫస్ట్ విధానానికి, బ్లాక్‌రాక్ సంస్థకు అంతర్జాతీయంగా పెట్టుబడుల్లో ఉన్న నైపుణ్యం కలగలసి ఇన్వెస్టర్లకు అనుకూలమైన సొల్యూషన్లను అందించనున్నాం''అని జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ట్వీట్ చేసింది. ఇది ఆరంభం మాత్రమేనంటూ.. అందరికీ అందుబాటు ధరలకే పెట్టుబడుల సేవలను అందించనున్నట్లు పేర్కొంది.

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుతో మారుతీ జట్టు



న్యూఢిల్లీ: ఆటోమొబైల్స్ దిగ్గజం మారుతీ సుజుకీ తమ కస్టమర్లకు వాహన రుణాల సదుపాయాన్ని అందించేందుకు ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుతో చేతులు కలిపింది. కొత్త కార్లు, యూజ్డ్ కార్లు, వాణిజ్య వాహనాలకి రిటైల్ రుణాల కోసం ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని మారుతీ సుజుకీ తెలిపింది. మరింత పెద్ద సంఖ్యలో కస్టమర్లకు చేరువయ్యేందుకు, ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ ఆఫర్లు అందించేందుకు ఇది తోడ్పడుతుందని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-6-2025

విశాఖ	550-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,722.00	1.66
INFY	1,638.00	0.87
ASIANPAINT	2,264.00	0.86
MARUTI	12,598.00	0.54
TCS	3,512.00	0.45

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,485.20	-2.31
ETERNAL	246.96	-2.06
DRREDDY	1,319.90	-2
TATAMOTORS	673	-1.99
SUNPHARMA	1,653.10	-1.91

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,236
ఎన్ఎస్ఈ	1,03,109
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,24,860
ఎఫ్ఐఐ	+ 1,483
డీఐఐ	+ 8,207

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.50 (రాత్రి 11.30కు)	$ 70.25 (క్రితం ముగింపు)
బ్రెంట్	76.85 (రాత్రి 11.30కు)	$ 73.23 (క్రితం ముగింపు)

'జీల్'కు ప్రమోటర్ల దన్ను



- రూ. 2,237 కోట్ల పెట్టుబడులు
- 18.4 శాతానికి ప్రమోటర్ల వాటా
- 16.95 కోట్ల వారంట్ల జారీకి ఓకే

న్యూఢిల్లీ: బ్రాడ్‌క్యాస్టింగ్ రంగ దిగ్గజం జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్(జీల్)కు ప్రమోటర్లు పెట్టుబడులు సమకూర్చనున్నారు. తద్వారా తమ వాటాను పెంచుకోనున్నారు. ప్రమోటర్ గ్రూప్ సంస్థల నుంచి రూ. 2,237 కోట్లకుపైగా నిధులు సమీకరించనున్నట్లు జీల్ తాజాగా పేర్కొంది. దీంతో కంపెనీలో ప్రమోటర్ల వాటా 18.4 శాతానికి బలపడనుంది. తాజాగా నిర్వహించిన సమావేశంలో పూర్తిగా మార్పిడికి వీలయ్యే 16.95 కోట్లకుపైగా వారంట్లను జారీ చేసేందుకు బోర్డు అంగీకరించినట్లు కంపెనీ వెల్లడించింది. ప్రిఫరెన్షియల్ పద్ధతిలో ఆల్టిలిస్ టెక్నాలజీస్, సన్‌బ్రైట్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్స్, ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు వారంట్లను జారీ చేయనున్నట్లు తెలియజేసింది. ప్రమోటర్ల నుంచి అందుకోనున్న పెట్టుబడుల ద్వారా కంపెనీ ప్రధాన బిజినెస్ విభాగాలలో మరింత పటిష్టంకానున్నట్లు పేర్కొంది. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలలో వృద్ధి అవకాశాలను అన్వేషించనున్నట్లు తెలియజేసింది.

ఒక్కో వారెంట్‌కు రూ. 132 ధరలో

ఒక్కో వారంట్‌కు రూ. 132 ధర చొప్పున ప్రమోటర్లకు 16,95,03,400 వారంట్లను జీల్ జారీ చేయనుంది. తద్వారా నగదు రూపేణా రూ. 2,237.44 కోట్లు లభించనుండగా.. కంపెనీలో ప్రమోటర్ల వాటా 18.39 శాతానికి చేరనున్నట్లు జీల్ వివరించింది. కాగా.. సెబీ మార్గదర్శకాల ప్రకారం వారంట్‌ను రూ. 128.58 ధరలో కేటాయించవలసి ఉన్నప్పటికీ బోర్డు రూ. 3.42 ధర అధికంగా నిర్ణయించింది. ఇందుకు ప్రమోటర్లు సైతం అంగీకరించినట్లు కంపెనీ వెల్లడించింది. ఇష్యూ ధరలో ప్రమోటర్లు ముందస్తుగా 25 శాతం(రూ. 33) ధర చెల్లించనున్నారు. వారంట్లను అలాట్‌మెంట్ నుంచి గరిష్ఠంగా 18 నెలల్లోగా ప్రమోటర్లు షేర్లుగా మార్పిడి చేసుకునేందుకు వీలుంటుంది. ఒక్కో వారంట్‌కు రూ. 99(75 శాతం) చొప్పున చెల్లించడం ద్వారా ఈక్విటీ షేర్లుగా మార్చుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్ల వాటా 3.99 శాతానికి పరిమితమైన సంగతి తెలిసిందే. దేశీ మీడియా బిజినెస్(సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా)ను జీల్‌తో విలీనం చేసే ప్రతిపాదనను గతేడాది సోనీ గ్రూప్ విరమించుకున్న నేపథ్యంలో ప్రమోటర్ల పెట్టుబడులకు ప్రాధాన్యత ఏర్పడినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

వారంట్ల జారీ వార్తలతో బీఎస్ఈలో జీల్ షేరు 0.5 శాతం బలహీనపడి రూ. 138 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 142–136 మధ్య ఊగిసలాడింది.

విశాల్ మెగా మార్ట్‌లో వాటా అమ్మకం

- ప్రమోటర్ల నుంచి 19.6 శాతం ఔట్
- డీల్ విలువ రూ. 10,220 కోట్లు
- దేశీ ఎంఎఫ్‌ల చేతికి 32 కోట్ల షేర్లు



న్యూఢిల్లీ: ప్రమోటర్ సంస్థలలో ఒకటైన సమయత్ సర్వీసెస్ ఎల్ఎల్‌పీ తాజాగా సూపర్‌మార్కెట్ చైన్ విశాల్ మెగా మార్ట్‌లో 19.6 శాతం వాటా విక్రయించింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 90 కోట్ల షేర్లు అమ్మివేసింది. పీఈ దిగ్గజం కేదార క్యాపిటల్, స్విస్ సంస్థ పార్ట్‌నర్స్ గ్రూప్ సంయుక్త ఎస్‌పీవీ సమయత్ సర్వీసెస్ షేరుకి రూ. 113.51–113.61 ధరల శ్రేణిలో 19.58 శాతం వాటాను ఆఫ్‌లోడ్ చేసింది. వీటి విలువ రూ. 10,220.4 కోట్లు. తాజా లావాదేవీ తదుపరి విశాల్ మెగా మార్ట్‌లో సమయత్ సర్వీసెస్ వాటా 74.55 శాతం నుంచి 54.97 శాతానికి క్షీణించింది. కాగా.. విశాల్ మెగా మార్ట్ షేర్ల(వాటా)ను ఎస్‌బీఐ, కొటక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలు చేశాయి. ఎస్‌బీఐ ఫండ్ 16.58 కోట్ల షేర్లు(3.61 శాతం వాటా), కొటక్ మహీంద్రా ఫండ్ 7.95 కోట్ల షేర్లు(1.73 శాతం వాటా), హెడీఎఫ్‌సీ ఎంఎఫ్ 7.5 కోట్ల షేర్లు(1.63 శాతం వాటా) చొప్పున సొంతం చేసుకున్నాయి. వెరసి 32 కోట్లకుపైగా షేర్లను దేశీ ఎంఎఫ్‌లు రూ. 3,636 కోట్లు వెచ్చించి కొనుగోలు చేశాయి. బ్లాక్‌డీల్ నేపథ్యంలో విశాల్ మెగా మార్ట్ షేరు ఎన్ఎస్ఈలో 4 శాతం జంప్‌చేసి రూ. 130 వద్ద ముగిసింది. 2010లో ఏర్పాటైన విశాల్ మెగా మార్ట్‌ను పార్ట్‌నర్స్ గ్రూప్, కేదారా క్యాపిటల్ కలసి 2018లో కొనుగోలు చేశాయి. టీపీజీ క్యాపిటల్, శ్రీరామ్ గ్రూప్ నుంచి 73.5 కోట్ల డాలర్లకు సూపర్ మార్కెట్ చైన్‌ను సొంతం చేసుకున్నాయి. ఆపై 2024లో పబ్లిక్ ఇష్యూతో విశాల్‌ను లిస్ట్ చేయడం ద్వారా రూ. 8,000 కోట్లు సమీకరించాయి.

మేలో స్వల్పంగా తగ్గిన వాహన విక్రయాలు

సియామ్ గణాంకాలు వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా మే నెలలో ప్యాసింజర్ వాహన హోల్‌సేల్(టోకు) విక్రయాలు స్వల్పంగా 0.8% తగ్గాయని వాహన తయారీదార్ల సమాఖ్య సియామ్ వెల్లడించింది. ఈ ఏడాది మే నెలలో 3,44,656 యూనిట్లు అమ్ముడైనట్లు తెలిపింది. గతేడాది ఇదే మేలో 3,47,492 యూనిట్ల విక్రయాలు జరిగినట్లు తెలిపింది. మారుతీ నుంచి డీలర్లకు సరఫరాలు 1,44,002 నుంచి 1,35,962కు తగ్గాయి. ఎంఅండ్ఎం సరఫరా 43,218 నుంచి 52,431కు పెరిగాయి. హ్యుందాయ్ అమ్మకాలు 49,151 నుంచి 43,861 యూనిట్లకు తగ్గాయి.

- ద్విచక్ర వాహనాల విక్రయాలు 2% వృద్ధితో 16,20,084 నుంచి 16,55,927 యూనిట్లకు చేరుకున్నాయి. ఇందులో మోటార్‌సైకిళ్ల విక్రయాలు 10,39,156 యూనిట్లు, స్కూటర్ అమ్మకాలు 5,79,507 యూనిట్లుగా ఉన్నాయి.
- త్రి చక్రవాహన అమ్మకాలు 3.3% క్షీణించి 53,942 యూనిట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే మేలో ఈ విక్రయాలు 55,763గా ఉన్నాయి.

''గడిచిన ఆరునెలల్లో ఆర్‌బీఐ 3 సార్లు రెపోరేటు మొత్తంగా 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. సాధారణ వర్షపాతం నమోదు అంచనాలు, వినియోగదారుల సెంటిమెంట్ బలపడటం తదితర అంశాలు వాహన విక్రయాల డిమాండ్ కొనసాగేందుకు దోహదపడ్డాయి'' అని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు.

క్వాడ్రియా గ్రూప్ హెల్త్ క్వాడ్ ఫండ్ –3

- రూ.2,550 కోట్ల సమీకరణ లక్ష్యం
- హెల్త్‌కేర్ కంపెనీల్లో పెట్టుబడులు



న్యూఢిల్లీ: ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడుల సంస్థ క్వాడ్రియా గ్రూప్.. హెల్త్ క్వాడ్ ఫండ్ -3ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. 200 మిలియన్ డాలర్ల వరకు సమీకరించే లక్ష్యాన్ని పెట్టుకుంది. డిమాండ్ అధికంగా ఉంటే గ్రీన్‌షూ ఆప్షన్ కింద మరో 100 మిలియన్ డాలర్లను సైతం (మొత్తం 300 మిలియన్ డాలర్లు/రూ.2,550 కోట్లు) సమీకరించనున్నట్లు ప్రకటించింది. హెల్త్ క్వాడ్ ఫండ్ 1, 2కు కొనసాగింపుగా దీన్ని తీసుకొచ్చింది. గత రెండు ఫండ్‌ల రూపంలో సమీకరించిన పెట్టుబడులను ఆరోగ్య సంరక్షణ రంగంలో కార్యకలాపాలు నిర్వహించే 18 హెల్త్‌కేర్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసినట్లు ఈ సంస్థ తెలిపింది. వీటిల్లో క్యూర్.ఏఐ, మెడికాబజార్, టీహెచ్‌బీ, వైసా, ఎకిన్‌కేర్, రెడ్‌క్లిఫ్ ల్యాబ్స్, గోయాప్టివ్, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ తదితర కంపెనీలున్నాయి. ఇప్పటికే కంపెనీల్లో ఉన్న పెట్టుబడులను, పెట్టుబడుల కమిటీ సభ్యులను కొనసాగించుకోవడంతోపాటు.. మరింత మందిని జోడించుకోనున్నట్లు క్వాడ్రియా గ్రూప్ ప్రకటించింది. భారత్ ఆకర్షణీయమైన హెల్త్‌కేర్ పెట్టుబడుల అవకాశాలను అందిస్తున్నట్లు పేర్కొంది. డిజిటల్ అనుసంధానత, డిమాండ్ పెరుగుదలకు తోడు.. ప్రాథమిక, డయాగ్నోస్టిక్స్, దీర్ఘకాలిక వ్యాధుల పరిష్కారాల సేవలు దేశమంతటా అందుబాటులో లేకపోవడాన్ని గుర్తు చేసింది.

3 కంపెనీలు రెడీ

ఐపీవో స్ట్రీట్

- సెబీ నుంచి తాజాగా గ్రీన్ సిగ్నల్
- జాబితాలో ఎంఅండ్‌బీ ఇంజినీరింగ్
- సన్‌షైన్ పిక్చర్స్, లూమినో ఇండస్ట్రీస్



న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలో తిరిగి జోరందుకున్న ప్రైమరీ మార్కెట్లు పలు అన్‌లిస్టెడ్ కంపెనీలకు జోష్‌నిస్తున్నాయి. ఈ ప్రభావంతో తాజాగా మూడు కంపెనీలు లిస్టింగ్ బాట పట్టాయి. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు అనుమతి పొందాయి. జాబితాలో సన్‌షైన్ పిక్చర్స్, లూమినో ఇండస్ట్రీస్, ఎంఅండ్‌బీ ఇంజినీరింగ్ చేరాయి. ఈ మూడు కంపెనీలు ఈ ఏడాది జనవరి–ఫిబ్రవరి మధ్య సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. వివరాలు చూద్దాం..

విపుల్ షా సంస్థ

టీవీ, సినిమాల నిర్మాత, దర్శకుడు విపుల్ షా కంపెనీ సన్‌షైన్ పిక్చర్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. దీనిలో భాగంగా 50 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో 33.75 లక్షల షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. వెరసి ఐపీవోలో 83.75 లక్షల షేర్లను విక్రయించనుంది. కంపెనీ ప్రమోటర్లలో ప్రధానంగా విపుల్ అమృత్‌లాల్ షా 23.69 లక్షల షేర్లు, షెఫాలీ విపుల్ షా 10 లక్షల షేర్లు చొప్పున విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించనుంది. వీటితోపాటు రూ. 94 కోట్లు భవిష్యత్ వృద్ధి, కార్యకలాపాల నిర్వహణకు వెచ్చించనుంది.

ఈపీసీ కంపెనీ

ప్రధానంగా ఈపీసీ కార్యకలాపాలు నిర్వహించే కోల్‌కతా కంపెనీ లూమినో ఇండస్ట్రీస్ ఐపీవో బాటలో సాగుతోంది. ఇందుకు వీలుగా రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 1,000 కోట్ల సమీకరణపై కన్నేసింది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 420 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. రూ. 15 కోట్లు పెట్టుబడి వ్యయాలకు వినియోగించనుంది. మిగిలిన నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది.

పీఈబీ సేవలు

ప్రీఇంజినీర్డ్ బిల్డింగ్స్(పీఈబీ)తోపాటు సెల్ఫ్‌సపోర్టెడ్ రూఫింగ్ సర్వీసులందించే ఎంఅండ్‌బీ ఇంజినీరింగ్ ఐపీవోకు సిద్ధపడుతోంది. ఇందుకు అనుగుణంగా గుజరాత్ కంపెనీ రూ. 325 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 328 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. దీంతో ఐపీవో ద్వారా రూ. 653 కోట్లు సమీకరించనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 64 కోట్లు పరికరాలు, మెషీనరీ కొనుగోలుకి వెచ్చించనుంది. రూ. 60 కోట్లు రుణ చెల్లింపులకు, మరో రూ. 110 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించనుంది. మిగిలిన నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

గ్లోబ్ ప్రాజెక్ట్స్ @ రూ. 67–71

ఈ నెల 24-26 మధ్య ఐపీవో



న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల అభివృద్ధి కంపెనీ గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 24న ప్రారంభంకానుంది. 26న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి షేరుకి రూ. 67–71 చొప్పున ప్రకటించింది. దీనిలో భాగంగా రూ. 10 ముఖ విలువగల 1,67,60,560 ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 119 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. వీటిలో రూ. 75 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 14 కోట్లు పరికరాలు, మెషీనరీ కొనుగోలుకి వెచ్చించనుంది. మిగిలిన నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. 2024 డిసెంబర్ 31తో ముగిసిన 9 నెలల కాలానికి దాదాపు రూ. 255 కోట్ల ఆదాయం, రూ. 18 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2025 మార్చి31కల్లా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 669 కోట్ల విలువైన ఆర్డర్‌బుక్‌ను కలిగి ఉంది.

స్టార్‌బిగ్‌బ్లాక్ ఐపీవో బాట



న్యూఢిల్లీ: స్టార్‌బిగ్‌బ్లాక్ బిల్డింగ్ మెటీరియల్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. తాజాగా నిర్వహించిన అసాధారణ సర్వసభ్య సమావేశం(ఈజీఎం)లో ఇందుకు వాటాదారులు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. బీఎస్ఈ లిస్టెడ్ బిగ్‌బ్లాక్ కన్‌స్ట్రక్షన్‌కు పూర్తి అనుబంధ సంస్థ ఇది. ఐపీవో ద్వారా సంస్థకు సరైన విలువను వెలికితీయడం, విస్తరణకు అవసరమైన పెట్టుబడుల సమీకరణ తదితరాలకు వీలుంటుందని మాతృ సంస్థ బిగ్‌బ్లాక్ కన్‌స్ట్రక్షన్ పేర్కొంది. అయితే నియంత్రణ సంస్థల అనుమతులు, క్యాపిటల్ మార్కెట్ పరిస్థితులు, ఇతర క్లియరెన్స్‌లపై ఆధారపడి ఐపీవో చేపట్టనున్నట్లు వివరించింది. 2015లో ఏర్పాటైన బిగ్‌బ్లాక్ కన్‌స్ట్రక్షన్ దేశీయంగా ఏఏసీ బ్లాకు తయారీలో ఏకైక లిస్టెడ్ కంపెనీగా నిలుస్తోంది. గుజరాత్, మహారాష్ట్రలలోగల ప్లాంట్ల ద్వారా వార్షికంగా 1.3 మిలియన్ ఘనపు మీటర్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. గతేడాది(2024–25) రూ. 225 కోట్ల ఆదాయం సాధించింది.

బీఎస్ఈలో బిగ్‌బ్లాక్ షేరు 6.5 శాతం పతనమై రూ. 65 వద్ద ముగిసింది.

భారత ఆటబొమ్మల నాణ్యత భేష్

అంతర్జాతీయ ప్రమాణాల కంటే మెరుగు • బీఐఎస్ సైంటిస్ట్ డైరెక్టర్ అద్భుత్ సింగ్



ముంబై: భారత ఆటబొమ్మల (టాయ్స్) నాణ్యత ప్రమాణాలు అంతర్జాతీయ బెంచ్‌మార్క్ కంటే మెరుగైనవని భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) సైంటిస్ట్ డైరెక్టర్ (వెస్టర్న్ రీజినల్ ఆఫీస్ ల్యాబరేటరీ) అద్భుత్ సింగ్ తెలిపారు. దేశీ ఎగుమతిదారులు తమ ఉత్పత్తులను విదేశీ మార్కెట్లకు ఎగుమతి చేయడంలో ఈ ప్రమాణాలు సాయపడుతున్నట్లు చెప్పారు. టాయ్స్‌కు సంబంధించి భౌతిక, రసాయన, ఎలక్ట్రికల్ భద్రతా ప్రమాణాలను బీఐఎస్ రూపొందించి, అమలు చేస్తుండడం గమనార్హం. అంతర్జాతీయంగా ఐఎస్‌వో, ఐఈసీ సంస్థలు నిర్ణయించిన బెంచ్‌మార్క్ ప్రమాణాలకు అనుగుణంగా భారతీయ ప్రమాణాలను బీఐఎస్ అభివృద్ధి చేసింది. వీటి ప్రకారం దేశీయంగా తయారీకి, దిగుమతులకు గాను ఏడు రకాల ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. ఈ ప్రమాణాలు దేశీయంగా, అంతర్జాతీయంగా భారత ఆటబొమ్మల అమ్మకాలు పెరిగేందుకు సాయపడినట్లు అద్భుత్ సింగ్ తెలిపారు.

పోటీకి అవకాశం..

బీఐఎస్ ప్రమాణాలు ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోపాటు దిగ్గజ కంపెనీలతో పోటీపడే అవకాశం కల్పించినట్లు ముంబైకి చెందిన జెఫిర్ టాయ్ మేకర్స్ ప్రైవేటు లిమిటెడ్ సీఈవో మోయిజ్ గబ్జీవాలా తెలిపారు. ''బీఐఎస్ ప్రమాణాలు అమల్లోకి వచ్చిన తర్వాత (2021 జనవరి 1 నుంచి) మా ఆదాయం గణనీయంగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.25 కోట్ల ఆదాయం సాధించాం. 2025–26లో 20 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నాం''అని ప్రకటించారు. తమ ఉత్పత్తుల్లోకి వినియోగించే ముడి సరుకుల్లో 99 శాతం దేశీయంగా తయారైనవేనని చెప్పారు. 15 కేటగిరీల్లో 100కుపైగా రకాలతో 1-1.5 లక్షల బొమ్మలను నెలవారీగా ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. భారత కంపెనీలు ఇప్పుడు నాణ్యమైన ఆటబొమ్మలను అందుబాటు ధరలకే ఉత్పత్తి చేయగలుగుతున్నట్లు వివరించారు. బీఐఎస్ సర్టిఫికేషన్ ఉంటే సంబంధిత ఆటబొమ్మల్లో పాదరసం, థాలేట్స్ వంటి విషపూరిత పదార్థాలు లేవని, మింగేందుకు అవకాశం ఉన్న చిన్నపాటి విడిభాగాల్లేవని, పదునైన అంచుల్లేవన్న భరోసానిస్తుందని అద్భుత్ సింగ్ తెలిపారు. గ్లోబ్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ సంస్థ (జీటీఆర్ఐ) నివేదిక ప్రకారం చూస్తే.. 2023–24లో టాయ్స్ ఎగుమతులు అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 154 మిలియన్ డాలర్ల నుంచి 152 మిలియన్ డాలర్లకు తగ్గడం గమనార్హం.

ఎంఅండ్ఎం చేతికి ఎస్ఎంఎల్ ఇసుజు

59 శాతం వాటా కొనుగోలుకి సీసీఐ సై

న్యూఢిల్లీ: వాణిజ్య వాహన తయారీ కంపెనీ ఎస్ఎంఎల్ ఇసుజులో మెజారిటీ వాటా సొంతం చేసుకునేందుకు దేశీ ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్ఎం) అనుమతి పొందింది. ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) తాజాగా ఎక్స్‌లో పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఎస్ఎంఎల్ ఇసుజులో 58.96 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు ఏప్రిల్‌లో ఎంఅండ్ఎం ప్రకటించింది. ఇందుకు రూ. 555 కోట్లు వెచ్చించనున్నట్లు తెలియజేసింది. దీనిలో భాగంగా సంస్థలో సుమితోమో కార్పొరేషన్‌కున్న పూర్తి వాటా(43.96 శాతం)ను కొనుగోలు చేయనున్నట్లు ఏప్రిల్‌లో పేర్కొంది. అంతేకాకుండా పబ్లిక్ వాటాదారుగా ఉన్న ఇసుజు మోటార్స్ నుంచి 15 శాతం వాటా సొంతం చేసుకోనున్నట్లు వివరించింది.

వన్డేలకు వీడ్కోలు

వరల్డ్‌కప్ తర్వాత వైదొలగనున్న న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్

టి20ల్లో కొనసాగుతానని కివీస్ ఆల్‌రౌండర్ వెల్లడి



ఆక్లాండ్: ఇటీవల పురుషుల క్రికెట్‌లో వరుస రిటైర్మెంట్‌లు సంభవించగా... ఇప్పుడు మహిళల క్రికెట్ వంతు వచ్చింది. న్యూజిలాండ్ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ సోఫీ డివైన్ ఈ ఏడాది ప్రపంచ కప్ అనంతరం వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలకనుంది. భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నీ అనంతరం వన్డే ఫార్మాట్ నుంచి వైదొలుగుతానని 35 ఏళ్ల సోఫీ మంగళవారం ప్రకటించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో మేటి ఆల్‌రౌండర్‌గా గుర్తింపు సాధించిన సోఫీ... టి20లపై



ఎక్కువ దృష్టి పెట్టడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న వివిధ ఫ్రాంచైజీ లీగ్‌ల్లో ఆడే వెసులుబాటు కోసం వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకుంది.

- 2006లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన డివైన్... 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 152 వన్డేలు, 146 టి20 మ్యాచ్‌లు ఆడింది. వన్డేల్లో 31.66 సగటుతో 3,990 పరుగులు చేసింది అందులో 8 సెంచరీలు, 16 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇక బంతితోనూ అదరగొట్టిన ఆమె... 107 వికెట్లు పడగొట్టింది.
- టి20ల్లో 3431 పరుగులు చేసిన డివైన్... 119 వికెట్లు ఖాతాలో వేసుకుంది. 2020 నుంచి న్యూజిలాండ్ పరిమిత ఓవర్ల జట్టుకు సారథిగా వ్యవహరిస్తున్న డివైన్... 2022 కామన్వెల్త్ క్రీడల్లో కివీస్ జట్టుకు కాంస్యంతో పాటు... గతేడాది టి20 ప్రపంచకప్ టైటిల్‌ను అందించింది.
- 'ఇదే సరైన సమయం అని భావిస్తున్నా. న్యూజిలాండ్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అదృష్టం. ఇన్ని మ్యాచ్‌లు ఆడతానని అనుకోలేదు. వన్డే వరల్డ్‌కప్ తర్వాత 50 ఓవర్ల ఫార్మాట్ నుంచి తప్పుకుంటా. వార్షిక కాంట్రాక్టు వదిలేసుకున్నా... 'క్యాజువల్ ప్లేయింగ్ అరేంజ్‌మెంట్' ప్రకారం టి20లకు మాత్రం అందుబాటులో ఉంటా. కొత్త ప్లేయర్లు జట్టును మరింత ముందుకు తీసుకెళ్తారని భావిస్తున్నా' అని డివైన్ వెల్లడించింది.
- మహిళల టి20ల్లో వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో 50 కంటే ఎక్కువ పరుగులు చేసి అరుదైన రికార్డు ఖాతాలో వేసుకున్న డివైన్... ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న మహిళల వన్డే ప్రపంచ కప్‌లో కివీస్ జట్టుకు సారథిగా వ్యవహరించనుంది. కెరీర్ ఆరంభం నుంచే టెస్టు ఫార్మాట్‌కు దూరంగా ఉన్న ఈ ఆల్‌రౌండర్... వన్డేల్లో న్యూజిలాండ్ తరఫున అత్యధిక మ్యాచ్ (152)లు ఆడిన రెండో ప్లేయర్‌గా కొనసాగుతోంది. 171 మ్యాచ్‌లు ఆడిన సూజీ బేట్స్ అగ్రస్థానంలో ఉంది. అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో ఈ స్టార్ ఆల్‌రౌండర్ నాలుగో స్థానంలో కొనసాగుతుండటం విశేషం. వన్డేల్లో కివీస్ తరఫున అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల జాబితాలో డివైన్ ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది.

మెయిన్ 'డ్రా'కు బోపన్న జోడీ



లండన్: క్వీన్స్ క్లబ్ ఏటీపీ-500 టెన్నిస్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-సాండర్ జిలె (బెల్జియం) జోడీ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-సాండర్ ద్వయం 6-4, 7-5తో డేవియల్ ఇవాన్స్-హెనీ సియర్లీ (బ్రిటన్) జంటపై విజయం సాధించింది. అంతకుముందు తొలి రౌండ్‌లో బోపన్న-సాండర్ జోడీ 6-2, 7-6 (7/4)తో యూకీ బాంబ్రీ (భారత్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) ద్వయంపై గెలిచింది. డబుల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో జాకుబ్ మెన్‌సిక్ (చెక్ రిపబ్లిక్)-హోల్గర్ రూనె (డెన్మార్క్)లతో బోపన్న-సాండర్ తలపడతారు.

రిత్విక్ ద్వయం బోణీ



లండన్: లెక్సస్ నాటింగ్‌హామ్ ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ శుభారంభం చేశాడు. నికోలస్ బరియంతోస్ (కొలంబియా)తో జతకట్టి ఈ టోర్నీలో బరిలోకి దిగిన రిత్విక్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రిత్విక్ (భారత్)-బరియంతోస్ జంట 6-3, 6-4తో బ్లేక్ బేల్డన్ (ఆస్ట్రేలియా)-రీసీ స్టాల్డెర్ (అమెరికా) ద్వయంపై విజయం సాధించింది. 66 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బరియంతోస్ ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు.

భారత్‌కు మూడో ఓటమి



దీపిక

లండన్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) మహిళల ప్రొ లీగ్‌లో భారత జట్టుకు వరుసగా మూడో ఓటమి ఎదురైంది. అర్జెంటీనా జట్టుతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సలీమా టెటె నాయకత్వంలోని భారత జట్టు 1-4 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. అర్జెంటీనా తరఫున అగస్టినా గొర్జెలానీ (40వ, 54వ, 59వ నిమిషాల్లో) మూడు గోల్స్‌తో 'హ్యాట్రిక్' నమోదు చేయగా... ఫలాస్కో (29వ నిమిషంలో) ఒక గోల్ సాధించింది. భారత జట్టుకు దీపిక (30వ నిమిషంలో) ఏకైక గోల్‌ను అందించింది. 11 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న భారత జట్టు 9 పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. నేడు జరిగే నాలుగో మ్యాచ్‌లో అర్జెంటీనాతోనే భారత్ ఆడనుంది.

బిగ్ బాష్ లీగ్‌లో సిద్ధార్థ్ కౌల్!



మెల్‌బోర్న్: భారత మాజీ పేసర్ సిద్ధార్థ్ కౌల్ బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో ఆడేందుకు పేరు నమోదు చేసుకున్నాడు. టీమిండియా తరఫున 3 వన్డేలు, 3 టి20లు ఆడిన కౌల్... గతేడాది నవంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్ నుంచి మొత్తం 15 మంది పురుష క్రికెటర్లు, 15 మంది మహిళా క్రికెటర్లు ఈ లీగ్‌లో ఆడేందుకు ఆసక్తి కనబర్చారు. ఇంగ్లండ్ మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్ కూడా తన పేరు నమోదు చేసుకున్నాడు. ప్రస్తుతానికి ఉన్న ప్లేయర్లందరిలో 43 ఏళ్ల అండర్సనే పెద్ద వయస్కుడు. మహిళల ఐపీఎల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఆ తర్వాత జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేసిన కనిక అహుజా కూడా పేరు నమోదు చేసుకుంది. భారత్ నుంచి జెమీమా రోడ్రిగ్స్, శిఖా పాండే, రాధ యాదవ్, యస్తిక భాటియా ఇప్పటికే డబ్ల్యూపీఎల్‌లో ఆడగా... హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి, మేఘన, ప్రతీక రావల్, నికీ ప్రసాద్, ఉమా ఛెత్రి, కాశ్వీ గౌతమ్, ప్రియ మిశ్రా ప్రస్తుతం పేర్లు నమోదు చేసుకున్న వారిలో ఉన్నారు.

ఫైనల్లో షణ్ముఖి



సింగపూర్: ఆసియా కప్ రెండో అంచె పోటీల్లో భారత జూనియర్ కాంపౌండ్ ఆర్చర్లు సత్తా చాటుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ షణ్ముఖి నాగసాయితో పాటు భారత్‌కే చెందిన తేజల్ బాలికల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో ఫైనల్‌కు చేరారు. దీంతో ఈ ఈవెంట్‌లో స్వర్ణ, రజతాలు భారత్‌కు రావడం ఖాయమైంది. సెమీఫైనల్లో షణ్ముఖి 145-139 పాయింట్ల తేడాతో యురికె నినా బొనిటా (ఇండోనేసియా)పై గెలుపొందింది. తేజల్ 147-142 పాయింట్ల తేడాతో ఫాతిన్ నూర్‌ఫతే (మలేసియా)పై నెగ్గింది. బాలుర వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో కుషాల్ ఫైనల్లో అడుగుపెట్టాడు. సెమీఫైనల్లో కుషాల్ 147-143తో బంగ్లాదేశ్‌కు చెందిన హిము బచార్‌పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన పదో సీడ్ సచిన్ సెమీఫైనల్లో ఓడి కాంస్య పతక రేసులో నిలిచాడు. ఇప్పటికే ఈ టోర్నీలో భారత ఆర్చర్లు రెండు ప్రపంచ రికార్డులు సృష్టించారు. బాలికల కాంపౌండ్ విభాగంలో షణ్ముఖి, తేజల్, తనిష్క జట్టు 2101 పాయింట్లు సాధించి టీమ్ క్వాలిఫికేషన్‌లో వరల్డ్ రికార్డు నెలకొల్పగా... మిక్స్‌డ్ టీమ్‌లో కుషాల్, షణ్ముఖి జంట 1420 పాయింట్లతో మరో రికార్డు నెలకొల్పింది. ఈ రెండింటిలోనూ ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ కీలక పాత్ర పోషించడం విశేషం.

ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్ టోర్నీకి సౌమ్య

న్యూఢిల్లీ: ఆసియా కప్-2026 మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 24 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణకు చెందిన సౌమ్య గుగులోత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. దేశవాళీ లీగ్‌లో ఈస్ట్ బెంగాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సౌమ్య గత సీజన్‌లో భారత మహిళల ఉత్తమ ఫుట్‌బాలర్ అవార్డును అందుకుంది. ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా భారత జట్టు గ్రూప్ 'బి'లో ఉంది. భారత జట్టుతోపాటు గ్రూప్ 'బి'లో థాయ్‌లాండ్, మంగోలియా, తిమోర్ లెస్టె, ఇరాక్ జట్లున్నాయి. ఈనెల 23 నుంచి జూలై 5 వరకు జరిగే గ్రూప్ 'బి' మ్యాచ్‌లకు బ్యాంకాక్ ఆతిథ్యమిస్తుంది. ఈనెల 23న తమ తొలి మ్యాచ్‌లో మంగోలియాతో ఆడనున్న భారత జట్టు ఆ తర్వాత వరుసగా తిమోర్ లెస్టె (జూన్ 29న), ఇరాక్ (జూలై 2న), థాయ్‌లాండ్ (జూలై 5న) జట్లతో పోటీపడుతుంది. 2026 ఆసియా కప్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీకి మార్చి 1 నుంచి 21 వరకు ఆస్ట్రేలియా ఆతిథ్యమిస్తుంది. మొత్తం 12 దేశాలు బరిలోకి దిగుతాయి. ఆతిథ్య దేశం హోదాలో ఆస్ట్రేలియా, 2022 టోర్నీ చాంపియన్ చైనా, 2022 టోర్నీ రన్నరప్ దక్షిణ కొరియా, 2022 టోర్నీలో మూడో స్థానం పొందిన జపాన్ జట్లు ఇప్పటికే నేరుగా అర్హత సాధించాయి. మిగిలిన ఎనిమిది బెర్త్‌లు క్వాలిఫయర్స్ టోర్నీ ద్వారా ఖరారవుతాయి. క్వాలిఫయర్స్ టోర్నీలో మొత్తం 34 జట్లు పాల్గొంటున్నాయి. 34 జట్లను ఎనిమిది గ్రూప్‌లుగా విభజించారు. 'ఎ', 'బి' గ్రూపుల్లో 5 జట్ల చొప్పున... మిగిలిన 'సి', 'డి', 'ఈ', 'ఎఫ్', 'జి', 'హెచ్' గ్రూపుల్లో 4 జట్ల చొప్పున ఉన్నాయి. ఎనిమిది గ్రూప్‌ల విజేత జట్లు వచ్చే ఏడాది ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.



భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు: ఎలాంగ్‌బమ్ పంథోయ్ చాను, మోనాలీసా దేవి, పాయల్ బసుదె (గోల్‌కీపర్లు), హేమం షిల్కీ దేవి, కిరణ్ పిస్డా, మార్టినా థోక్‌చోమ్, స్వీటీ దేవి, నిర్మలా దేవి, పూర్ణిమ కుమారి, సంజు, రంజన చాను (డిఫెండర్లు), అంజు తమాంగ్, గ్రేస్ డాంగ్మె, కార్తీక అంగముత్తు, రత్నబాలా దేవి, ప్రియదర్శిని సెల్లాదురై, సంగీత బస్ఫోరె (మిడ్ ఫీల్డర్లు), లిండా కోమ్ సెర్టో, మాళవిక, మనీషా కల్యాణ్, మనీషా నాయక్, ప్యారీ జక్సా, రింపా హల్దర్, సౌమ్య గుగులోత్ (ఫార్వర్డ్స్).

సారీ... కోకో!

- ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్‌ను క్షమాపణ కోరిన రన్నరప్ సబలెంకా
- ఫైనల్ అనంతర వ్యాఖ్యలపై లేఖ

బెర్లిన్: తాజా ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ కోకో గాఫ్‌కు ప్రపంచ నంబర్‌వన్ ప్లేయర్ సబలెంకా (బెలారస్) క్షమాపణలు చెప్పింది. ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ కోసం ఇద్దరు తలపడగా... అమెరికన్ స్టార్ కోకో గాఫ్ విజేతగా నిలిచింది. మ్యాచ్ అనంతరం రన్నరప్ సబలెంకా మాట్లాడుతూ... తన స్వీయ తప్పిదాల వల్లే ప్రత్యర్థి గెలిచిందని, విజయంలో గాఫ్ పాత్రలేదన్నట్లుగా వ్యాఖ్యానించింది. మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత అయిన సబలెంకా వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెలువెత్తాయి. దీంతో క్షమాపణలు కోరుతూ సబలెంకా లేఖ రాసింది. 'నా వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాను. ఓ విజేతను ఉద్దేశించి అలా మాట్లాడాల్సింది కాదు. నా భావోద్వేగాలను నియంత్రించుకుని ఉంటే బాగుండేది. గాఫ్‌ను క్షమాపణలు కోరుతున్నాను. మనుషులందరూ పొరపాట్లు చేస్తుంటారు. జీవితంలో నేర్చుకునే దశలో ఉన్న నేను కూడా అంతే. తదనంతరం నేను మాట్లాడిన మాటలు నన్నే కలత పెట్టాయి. ముమ్మాటికి ఫ్రెంచ్ ఓపెన్ గెలిచే అర్హత గాఫ్‌కే ఉంది. ఆమె విజయాన్ని నేను మన స్ఫూర్తిగా గౌరవిస్తున్నా' అని లేఖలో పేర్కొంది. నిజానికి గాఫ్‌పై మాటలతో దాడి చేయాలనే ఉద్దేశం తనకు లేదని చెప్పింది. మ్యాచ్ ముగిసిన వెంటనే మీడియా సమావేశం జరగడం... ఫలితంతో నిరాశలో ఉన్న తాను అలా మాట్లాడాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. 'ఎప్పుడైనా సరై ప్రత్యర్థిని గౌరవించే నాకు ఇలా చిన్నబుచ్చే వ్యాఖ్యలు చేయడం పట్ల మనస్తాపం చెందాను. అందుకే మన్నించమని విజ్ఞప్తి చేస్తున్నాను. జీవితంలో నేను ఎప్పటికి గుర్తుంచుకోవాల్సిన పాఠం ఇది' అని సబలెంకా తెలిపింది. బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా రెండు ఆస్ట్రేలియన్ ఓపెన్ (2023, 2024) టైటిల్స్‌తో పాటు ఒక యూఎస్ ఓపెన్ (2024) ట్రోఫీ గెలుచుకుంది. అయితే ప్రపంచ రెండో ర్యాంకర్ కోకో గాఫ్‌తో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో తడబడింది. ఏకంగా 70 అనవసర తప్పిదాలు చేసింది. గాఫ్ మాత్రం 30 తప్పిదాలే చేసి టైటిల్ విజేతగా నిలిచింది. కోకో గాఫ్ 2023లో సబలెంకాపైనే గెలిచి యూఎస్ ఓపెన్ టైటిల్ కూడా సాధించింది.



వారెవ్వా... ట్రిపుల్ 'సూపర్' డూపర్

మూడో సూపర్ ఓవర్లో నేపాల్‌పై నెగ్గిన నెదర్లాండ్స్ ● టి20ల్లో పుటలకెక్కిన ఫలితం

గ్లాస్గో: అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు 'సూపర్ ఓవర్ల'తో చరిత్రకెక్కిన టి20 మ్యాచ్‌లో నేపాల్‌పై నెదర్లాండ్స్ విజయం సాధించింది. నిర్ణీత ఓవర్లు సహా, తొలి, రెండో సూపర్ ఓవర్లోనూ హోరాహోరీగా సాగిన పోరు చివరికి మూడో సూపర్ ఓవర్లో ఒక సిక్సర్‌తో వీగిపోయింది. అప్పటిదాకా పోరాడిన నేపాల్ మూడో 'సూపర్'లో పరుగే చేయకుండా ఓపెనర్ రోహిత్ (0), వన్‌డౌన్ బ్యాటర్ రూపేశ్ (0) వికెట్లను కోల్పోయింది. దీంతో 1 చేస్తే గెలిచే లక్ష్యాన్ని నెదర్లాండ్స్ ఓపెనర్ మైకేల్ లెవిట్ (6 నాటౌట్) మొదటి బంతికే సిక్సర్‌తో ముగించాడు. అంతకుముందు తొలి సూపర్ ఓవర్లో నేపాల్ 19 పరుగులు చేస్తే... నెదర్లాండ్స్ (19) సమం చేసింది. రెండో సూపర్ ఓవర్లో నెదర్లాండ్స్ 17 పరుగులు చేస్తే... నేపాల్ (17) సరిచేసింది. ఇక అంతకుముందు నిర్ణీత 20 ఓవర్లలో మొదట నెదర్లాండ్స్ 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. నెదర్లాండ్స్‌లో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిడమనూరు తేజ (35; 1 సిక్స్), విక్రమ్‌జీత్ (30; 2 సిక్స్‌లు) రాణించారు. ప్రత్యర్థి బౌలర్లలో సందీప్ 3, నందన్ 2 వికెట్లు తీశారు. తర్వాత నేపాల్ కూడా 20 ఓవర్లలో సరిగ్గా 8 వికెట్లకు 152 పరుగులే చేయడంతో మ్యాచ్ 'టై' అయ్యింది. రోహిత్ పౌడెల్ (48; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుశాల్ భుర్తెల్ (34; 5 ఫోర్లు) మెరిశారు. డానియెల్ డోరమ్‌కు 3 వికెట్లు దక్కాయి.

ఎందుకీ 'సూపర్' సాగతీత...

ఒకప్పుడు స్కోర్లు సమమైతే 'బౌల్ అవుట్'తో ఫలితాన్ని తేల్చారు. 2007లో జరిగిన తొలి టి20 ప్రపంచకప్‌కే ఇది పరిమితమైంది. తర్వాత దీనిస్థానంలో 'సూపర్ ఓవర్'ను తీసుకొచ్చారు. దీనికీ ఒకటే ఓవర్ పరిమితి ఉండేది. 2019 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఇలాగే ఒక ఓవర్‌కే పరిమితమైన సూపర్ ఓవర్లోనూ



న్యూజిలాండ్, ఇంగ్లండ్ స్కోర్లు సమమయ్యాయి. దీంతో బౌండరీ కౌంట్ (నిర్ణీత ఓవర్లలో అత్యధిక సిక్సర్లు, ఫోర్లు బాదిన జట్టు)తో ఇంగ్లండ్‌ను విశ్వవిజేతగా నిర్ణయించడం యావత్ క్రికెట్ విశ్లేషకులు, దిగ్గజాల్ని తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో విజేతకు ఇదేం తిక్కలెక్క అని విమర్శల పాలవడంతో ఐసీసీ... ఫలితం తేలేదాకా సూపర్ ఓవర్లే అని సవరించింది.

'శత'క్కొట్టిన నజ్ముల్, ముష్ఫికర్



కుటుంబ సభ్యులతో ఏంజెలో మాథ్యూస్



నజ్ముల్

- భారీ స్కోరు దిశగా బంగ్లాదేశ్
- తొలి ఇన్నింగ్స్ 292/3
- శ్రీలంకతో మొదటి టెస్టు



ముష్ఫికర్

గాలె: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ బ్యాటర్లు విజృంభించారు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో మంగళవారం ప్రారంభమైన తొలి టెస్టులో కెప్టెన్ నజ్ముల్ హుసేన్ షంటో (260 బంతుల్లో 136 బ్యాటింగ్; 14 ఫోర్లు, 1 సిక్స్), సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ (186 బంతుల్లో 105 బ్యాటింగ్; 5 ఫోర్లు) శతకాలతో కదంతొక్కారు. ఫలితంగా టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్... తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 292 పరుగులు చేసింది. ఓపెనర్ షాద్‌మన్ ఇస్లామ్ (14), అనాముల్ హక్ (0)తో పాటు మోమినుల్ హక్ (29) వెంటవెంటనే అవుటయ్యారు. దీంతో ఒకదశలో 45 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన బంగ్లాదేశ్‌ను నజ్ముల్, ముష్ఫికర్ ఆదుకున్నారు. శ్రీలంక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 247 పరుగులు జోడించారు. చాన్నాళ్లుగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న ఈ ఇద్దరూ... లంక బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్నారు. ఈ క్రమంలో నజ్ముల్ 202 బంతుల్లో సెంచరీ పూర్తిచేసుకోగా... కాసేపటికే ముష్ఫికర్ 176 బంతుల్లో మూడంకెల మార్క్ చేరుకున్నాడు. ఈ సిరీస్ కోసం శ్రీలంక జట్టు ఆరుగురు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేయగా... అందులో తరిందు రత్ననాయకే, లహిరు ఉదారా ఈ మ్యాచ్ ద్వారా టెస్టు అరంగేట్రం చేశారు. రెండు చేతులతో స్పిన్ బౌలింగ్ చేయగల సామర్థ్యం ఉన్న తరిందు రత్ననాయకే 2 వికెట్లు పడగొట్టగా... అశిత ఫెర్నాండో ఒక వికెట్ పడగొట్టాడు. చేతిలో 7 వికెట్లు ఉన్న బంగ్లాదేశ్ జట్టు రెండో రోజు మరెన్ని పరుగులు జోడిస్తుందనేది ఆసక్తికరం. ఈ టెస్టు అనంతరం శ్రీలంక సీనియర్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ రిటైర్ కానున్న నేపథ్యంలో... మ్యాచ్ ఆరంభానికి ముందు అతడిని సన్మానించారు.



వదిలేసిన పాత ఓడ గడ్డి, చెట్లు దట్టంగా అల్లుకుని ఓ ద్వీపంలాగా మారిపోయింది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగర సమీప మైన్ నది ఒడ్డున కనిపించిన దృశ్యమిది



ఇండోనేసియాలోని మౌమెరె ప్రాంతంలో ఉన్న లెవొటొబి లకి-లకి అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. మంగళవారం ఈ అగ్ని పర్వతం నుంచి వెలువడుతున్న లావా, పొగను గమనిస్తున్న స్థానికులు



జర్మనీకి చెందిన చిత్రకారిణి కెథరినా గ్రోస్సె 'కోయిర్(2025)' పేరుతో గీచిన కళాఖండమిది. స్విట్జర్లాండ్‌లోని బసెల్‌లో మంగళవారం జరిగిన ప్రదర్శనలో అందరినీ ఆకట్టుకుంది.

ఈ యుద్ధం... ప్రపంచానికి పెనుభారం

ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంపై ప్రపంచ దేశాల ఆందోళన

- పతనమైన స్టాక్ మార్కెట్లు.. మదుపరుల సంపద ఆవిరి
- హొర్ముజ్ జలసంధిని మూసివేసే యోచనలో ఇరాన్
- ముడి చమురు ధర పెరిగే అవకాశం ఉందంటున్న నిపుణులు
- పెరుగనున్న ఉత్పత్తి వ్యయం... వినియోగదారులపైనే భారం

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం ప్రపంచ దేశాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రపంచంలో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తిలో అగ్రశ్రేణి దేశాల్లో ఒకటైన ఇరాన్ నేడు యుద్ధభూమిగా మారింది. పశ్చిమాసియాలో బలీయమైన సైనిక శక్తి కలిగిన రెండు దేశాలు ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. ఈ యుద్ధం మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు, వైమానిక రంగంతోపాటు కీలక రంగాలు తీవ్రంగా ప్రభావితం కానున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. భారీగా సంపద హరించుకుపోయింది. సోమవారం కొంతవరకు కోలుకున్నాయి. మరోవైపు ఆయుధ తయారీ సంస్థలతోపాటు చమురు కంపెనీల షేర్ల ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడం గమనార్హం. ఇప్పుడున్న పరిస్థితుల్లో స్టాక్ మారెకెట్‌ను నమ్ముకోవడం తెలివైన పని కాదన్న ఆలోచనతో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడి సాధనాల వైపు దృష్టి పెట్టారు. వారు తమ సొమ్మును బంగారం కొనుగోళ్ల వైపు మళ్లిస్తున్నారు.

100 డాలర్లకు ముడి చమురు?

ఇరాన్‌లో ఎప్పుడు యుద్ధం జరిగినా తక్షణమే ప్రభావితమయ్యేది చమురు రంగమే. బ్యారెల్(158.98 లీటర్లు) ముడి చమురు ధర సోమవారం 74.60 డాలర్లకు చేరుకుంది. గురువారంతో పోలిస్తే 7 శాతం పెరిగింది. ఒకవేళ యుద్ధం మరింత ఉధృతంగా మారి, హొర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తే బ్యారెల్ ముడి చమురు ధర 100 డాలర్లు దాటేస్తుందని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ గోల్డ్‌మాన్ సాచ్స్ తేల్చిచెప్పింది. ప్రపంచంలో సముద్ర మార్గంలో జరిగే చమురు రవాణాలో మూడింట ఒకవంతు హొర్ముజ్ జలసంధి గుండానే జరుగుతోంది. ఇక్కడ ప్రతిరోజూ 2.1 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. ఇరాన్, గల్ఫ్ దేశాలను వేరుచేసే అతిసన్నని సముద్ర మార్గమైన హొర్ముజ్‌పై ఆధిపత్యం ఇరాన్‌దే. ఇజ్రాయెల్‌తో యుద్ధం తీవ్రస్థాయికి చేరితే హొర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేయాలని ఇరాన్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. అదే జరిగితే భారత్, జపాన్, చైనా సహా పలు ఆసియా దేశాలకు చమురు కష్టాలు తప్పవు. 1980వ దశకంలో ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో హొర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేయలేదు. ఈసారి కూడా మూసివేసే పరిస్థితి ఉండబోదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ముడి చమురు ఎగుమతులు ఆగిపోతే ఇరాన్ ఆర్థికగా నష్టపోవడం ఖాయం.

పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు

చమురు ధరలు పెరిగితే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాని ప్రభావం అన్ని రంగాలపైనా పడుతుంది. ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. అంతిమంగా ఆ భారం భరించాల్సింది వినియోగదారులే. చమురు కోసం దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. వృద్ధిరేటు తగ్గిపోతుంది. ధరల పెరుగుదల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించడానికి ఇప్పటికే కొన్ని దేశాలు వడ్డీరేట్లు తగ్గిస్తున్నాయి. జీ7 దేశాల్లో కేంద్ర బ్యాంకులు ప్రస్తుతం ఇదే పనిలో నిమగ్నమయ్యాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

విమానయానం మరింత ప్రియం

యుద్ధం వల్ల పశ్చిమాసియాలో చాలా దేశాలు ముందు జాగ్రత్తగా తమ గగనతలాన్ని మూసివేశాయి. దాంతో విమానయాన సంస్థలు తమ విమానాలను కూడా రద్దు చేసుకోవాల్సి వస్తోంది. కొన్ని విమానాలను దారి మళ్లిస్తున్నాయి. దీంతో వ్యయం పెరుగుతోంది. విమానయానం మరింత ఖరీదుగా మారే పరిస్థితి కనిపిస్తోంది. ఎమిరేట్స్, ఎతిహాద్, ఖతార్ ఎయిర్‌వేస్ తదితర సంస్థలు ఇరాన్, ఇరాక్, జోర్డాన్, లెబనాన్, సిరియా వంటి దేశాల నుంచి తమ విమానాలు నడపడం లేదు. తాత్కాలికంగా రద్దు చేసినట్లు ప్రకటించాయి. ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా తమ గగనతలం పూర్తిగా మూసి ఉంటుందని ఇరాన్ అధికార వర్గాలు ప్రకటించాయి.

థగ్‌లైఫ్ కర్ణాటకలో విడుదల కావాల్సిందే

- సినిమా చూడొద్దని ప్రేక్షకులను బెదిరించకూడదు
- నిరసన సంఘాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- ఉద్రిక్తతలు చెలరేగకుండా చూసే బాధ్యత రాష్ట్ర సర్కార్‌దే
- స్పష్టం చేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ: కన్నడ భాషపై ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలతో వివాదాస్పదంగా మారిన థగ్‌లైఫ్ సినిమా విడుదలపై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. సినిమాను కర్ణాటక రాష్ట్రంలో విడుదలచేయాల్సిందేనంటూ థగ్‌లైఫ్ చిత్రబృందానికి అనుకూలంగా ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలో సినిమా విడుదల వేళ భాషా సంబంధ నిరసన సంఘాలు ఎలాంటి అవాంతరాలు సృష్టించకుండా, ఉద్రిక్తతలు తలెత్తకుండా అంతా సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యత కర్ణాటక ప్రభుత్వానిదేనని సుప్రీం కోర్టు మంగళవారం స్పష్టంచేసింది. సినిమా చూడొద్దని ప్రేక్షకులపై ఎవరూ తుపాకీ తలకు గురిపెట్టకూడదని జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ''సినిమా విడుదలను, సినిమాను అడ్డుకునేందుకు అల్లరిమూకలు, నిరసనసంఘాలు వీధుల్లో వీరంగం ఆడతామంటే ఒప్పుకోం. శాంతిభద్రతలకు సంబంధించి చట్టాన్ని తూ.చ. తప్పకుండా ఖచ్చితంగా అమలుచేయాల్సిందే. ఆందోళనకారుల ఆగడాలను మేం అస్సలు సహించం. ఏదైనా అంశంపై ఒకరు అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే ఇంకొరు దానిని తీవ్రంగా ఖండిస్తూ, ప్రతి విమర్శలు చేయొచ్చు. అంతేగానీ సినిమా విడుదలను అడ్డుకోకూడదు''అని జస్టిస్ భూయాన్ వ్యాఖ్యానించారు. సినిమా విడుదల విషయంలో మీ వైఖరి ఏంటో జూన్ 18వ తేదీకల్లా చెప్పాలని కర్ణాటక ప్రభుత్వానికి ధర్మాసనం సూచించింది.

బ్లాక్ కాఫీతో చక్కటి ఆయుష్షు

- నిత్యం సేవిస్తే మరణం ముప్పు 14 శాతం తగ్గుదల
- అమెరికా పరిశోధనలో వెల్లడి

న్యూఢిల్లీ: పాలు, చక్కెర కలపకుండా నిత్యం బ్లాక్ కాఫీ తాగే అలవాటు మీకు ఉందా? అయితే, మీరు ఎక్కువ రోజులు జీవిస్తారు. మీ ఆయుష్షు పెరుగుతుంది. అమెరికా జాతీయ ఆరోగ్య, పౌష్టికాహార పరీక్ష సర్వేలో ఈ వెల్లడయ్యింది. ప్రతిరోజూ ఒకటి నుంచి రెండు కప్పుల బ్లాక్ కాఫీ సేవిస్తే మరణం ముప్పు 14 శాతం తగ్గుతున్నట్లు తేలింది. అయితే, బ్లాక్ కాఫీలో పాలు లేదా చక్కెర కలిపితే పెద్దగా ప్రయోజనం ఉండదని ఈ సర్వే స్పష్టం చేసింది. ఈ వివరాలను జర్నల్ ఆఫ్ న్యూట్రీషన్‌లో ప్రచురించారు. సర్వేలో భాగంగా 1999 నుంచి 2018 దాకా నేషనల్ డెత్ డేటాను సమగ్రంగా పరిశీలించారు. 46 వేలకుపైగా మరణాలను విశ్లేషించారు. వీరంతా 20 ఏళ్లు దాటినవారే. బ్లాక్ కాఫీ లేదా అతి తక్కువ చక్కెర లేదా తక్కువ సంతృప్త కొవ్వు కలిపిన కాఫీ సేవించేవారిలో మరణాల ముప్పు 14 శాతం తగ్గినట్లు గుర్తించారు. కాఫీ అలవాటు లేనివారితో పోలిస్తే వీరు ఎక్కువ కాలం జీవిస్తున్నట్లు గమనించారు.



పారిస్ ఎయిర్ షోలో మంగళవారం ప్రదర్శనకు ఉంచిన ఈ యుద్ధ డ్రోన్ పేరు బేరక్తర్. దీనిని తుర్కియే కంపెనీ బేకర్ తయారు చేసింది.



ఫ్రాన్స్‌కు చెందిన తుర్కిస్ ఎట్ గైల్లార్స్ రూపొందించిన ఆరోక్ యుద్ధ డ్రోన్



ఫ్రాన్స్ కంపెనీ డెల్‌ఎయిర్ తయారీ డ్రోన్ ఆస్కార్



భవిష్యత్తులో రూపుదిద్దుకోనున్న ప్రపంచంలోనే అతిపెద్దదైన విమానం 'రాడియా విండ్‌రన్నర్' నమూనా రూపం



అమెరికాకు చెందిన ఆర్చర్ కంపెనీ రూపకల్పన చేసిన ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ ఇది. పారిస్ ఎయిర్ షోలో అందర్నీ ఆకట్టుకుంది.



సీషార్క్ 800 అనే ఈ అత్యాధునిక మానవరహిత బోట్ ఇది. తైవాన్ రక్షణ శాఖ రూపొందించిన ఈ బోట్ మంగళవారం తైవాన్ సముద్ర జలాల్లో దూసుకెళ్లి తన పనితీరును చాటింది.

జనగణనకు తెలంగాణ మోడల్

సచిన్ పైలట్ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జన గణనకు తెలంగాణ మోడల్‌గా తీసుకోవాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ డిమాండ్ చేశారు. కులగణనపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. జనగణన కోసం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావన ఎక్కడా లేదన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి మేరకే ఎట్టకేలకు జనగణనలో కులగణనకు బీజేపీ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందన్నారు. అయితే, మహిళా బిల్లు మాదిరిగానే జనగణనలో కుల గణనను ప్రకటనలకే పరిమితం చేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జనగణనకు రూ.8 వేల నుంచి రూ.10వేల కోట్లు ఖర్చవుతుండగా కేవలం రూ.570 కోట్లు కేటాయించడం ఏమిటని కేంద్రాన్ని ప్రశ్నించారు. తెలంగాణ నమూనా ఆధారంగా కేంద్రం కుల గణన నిర్వహించాలని డిమాండ్ చేశారు.

టెహ్రాన్‌ను వదిలివెళ్లండి..

ఇరాన్‌లో ఉన్న పౌరులకు భారత్ న్యూ అడ్వైజరీ

న్యూఢిల్లీ: ఇరాన్-ఇజ్రాయెల్ వివాదం తీవ్రమవుతున్న తరుణంలో భారత్ మంగళవారం కొత్త అడ్వైజరీ జారీ చేసింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ డ్రోన్లు, క్షిపణులతో నిరంతర వైమానిక దాడులు జరుగుతున్నందున టెహ్రాన్‌లో నివసిస్తున్న భారత పౌరులు, భారత సంతతికి చెందిన వ్యక్తులు టెహ్రాన్‌ను విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. 'తమ సొంత వ్యయంతో టెహ్రాన్ నుంచి బయటకు వెళ్లగలిగినవారు వెంటనే సురక్షితమైన ప్రదేశానికి వెళ్లాలని సూచించింది. ఇంకా రాయబార కార్యాలయంలోనమోదు చేసుకోని పైరులు వెంటనే తమ మిషన్‌ను సంప్రదించాలని రాయబార కార్యాలయం విజ్ఞప్తి చేసింది. మూడు అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను +98 9010144557, +98 9128109115, +98 9128109109 విడుదల చేసింది. దేశంలో చిక్కుకున్న 10,000 మందికి పైగా విద్యార్థులను సురక్షితంగా తరలించాలని ఇరాన్‌ను భారత్ కోరింది. అయితే.. టెహ్రాన్ గగనతలం మూసివేసినందున.. విద్యార్థులు భూ సరిహద్దుల గుండా అజర్‌బైజాన్, తుర్క్‌మెనిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌కు వెళ్లాలని సూచించింది.

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పరస్పర వైమానిక దాడులు తీవ్రతరమయ్యాయి. ఈ దాడుల్లో ఇరువైపులా వందలాది మంది మరణించారు. ఐదు రోజుల ఘర్షణలో 224 మంది మరణించారని, వారిలో ఎక్కువ మంది పౌరులు ఉన్నారని ఇరాన్ ప్రకటించగా, తమ పౌరులు 24 మంది మరణించినట్లు ఇజ్రాయెల్ నివేదించింది. దాదాపు 3,000 మంది ఇజ్రాయెలీయులను ఇరాన్ నుంచి ఇప్పటికే తరలించారు. ఈ నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం ఈ హెచ్చరిక చేసింది.

నేడు భారత్‌కు రానున్న 110 మంది..

ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయ తరలింపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. సోమవారం, మంగళవారం మధ్య రాత్రుల్లో 110 మంది భారతీయులతో కూడిన మొదటి బ్యాచ్ అర్మేనియాలోకి ప్రవేశించింది. వారిని నేడు ప్రత్యేక విమానంలో బయలుదేరి ఢిల్లీకి వస్తారు.

ట్రాఫిక్ తప్పించుకోవడానికి అంబులెన్సుల్లో వెళ్లి..

ట్రాఫిక్ బాగా ఉన్నప్పుడు అంబులెన్స్‌లో వెళ్తే స్పీడ్‌గా వెళ్లిపోవచ్చు అనుకుంటాం. అయితే మనం అనుకోవడంతోనే సరిపెడితే.. కొందరు ఆచరణలో పెట్టారు. అది కూడా ఏ నగర రద్దీనో తప్పించుకోవడానికి కాదు. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ పుణ్య క్షేత్రానికి వెళ్లేందుకు అరాచకంగా ఆలోచించారు. చివరకు పోలీసులకు చిక్కి ఇబ్బంది పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. హిమాలయాల్లోని దేవాలయం కేదార్‌నాథ్ మే2న తెరుచకున్న విషయం తెలిసిందే. అయితే కేదార్‌నాథ్ ఆలయానికి త్వరగా వెళ్లాలని కొందరు రెండు అంబులెన్స్‌లను బుక్ చేసుకున్నారు. వాటిని ట్యాక్సీలుగా మార్చారు. ఇంకేముంది ఆరామ్‌గా అంబులెన్సుల్లో ఏసీ వేసుకుని, సైరన్లు మోగిస్తూ మరీ దర్జాగా హరిద్వార్ నుంచి కేదార్‌నాథ్‌కు బయలుదేరారు. సాధారణంగా, హరిద్వార్ నుంచి రిషికేశ్, బ్యాసి, దేవ్‌ప్రయాగ్, శ్రీనగర్, రుద్రప్రయాగ్, తిల్వారా, అగస్త్యముని, గుప్తాకాశి ఫాటా వంటి ప్రదేశాల్లో పోలీసు తనిఖీలు కచ్చితంగా ఉంటాయి. అంబులెన్సులు కావడంతో అత్యవసర పరిస్థితి దృష్ట్యా ఆయా చెక్‌పోస్టుల్లోని పోలీసులు ఈ రెండు వాహనాలను ఆపలేదు. కానీ సోన్ ప్రయాగ్ పోలీసులకు మాత్రం అనుమానం వచ్చింది. ఎందుకంటే.. గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్‌కు వెళ్లే మార్గంలో ఒక్క భక్తుడు అనారోగ్యానికి గురైనా లేదా అత్యవసర పరిస్థితి ఏర్పడినా అన్ని చెక్‌పోస్టులను అప్రమత్తం చేస్తారు. అలాంటి సమాచారమేది సోన్‌ప్రయాగ్ పోలీసులకు రాలేదు. మరి ఈ రెండు అంబులెన్స్‌లు ఎక్కడికి వెళ్తున్నాయని అనుమానం వచ్చి ఆపేశారు. రెండు వాహనాల్లో భక్తులు దర్జాగా కూర్చుని ఉన్నారు. వెంటనే వారిని దింపేసిన పోలీసులు.. ఇరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లకు జరిమానా విధించారు. అంబులెన్సుల్లో ఒకటి రాజస్థాన్‌ది కాగా, మరోకటి హరిద్వార్‌కు చెందినది.

- సాక్షి, నేషనల్ డెస్క్

భాషల ఆధారంగా దేశాన్ని విభజించలేం

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

పుదుచ్చేరి: ప్రపంచంలోనే ఆదర్శప్రాయమైన మన దేశం భాషల విషయంలో విభజనకు గురవడం భరించలేని విషయమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. దేశ భవిష్యత్తు గురించి ఆలోచించాలని, అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం(ఎన్‌ఈపీ)-2020 అమలు దేశ విద్యారంగానికి మేలిమలుపు వంటిదని ఆయన అభివర్ణించారు. ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ మంగళవారం పాండిచ్చేరి యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. 'ఎన్‌ఈపీ ఏదో ఒక ప్రభుత్వ విధానం కాదు. అన్ని భాషలకు సముచిత స్థానం కల్పిస్తూ మన యువత శక్తిసామర్థ్యాలను ప్రతిభను చాటుకునేందుకు ఒక అవకాశం కల్పిస్తుంది'అని పేర్కొన్నారు. భాషలను బట్టి వేరుగా ఉందామా?అని ప్రశ్నించారు. హిందీని తమపై రుద్దే ఎన్‌ఈపీని కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అమలు చేయడాన్ని వ్యతిరేకించే వారిని ఉద్దేశించి ఆయనీ మాటలన్నారు. పార్లమెంట్‌లో సభ్యులు 22 భాషల్లో మాట్లాడే అవకాశముందని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాతలు మనకు బోధించినవి గందరగోళానికి, ఘర్షణలకు, అవాంతరాలకు తావులేని విధానాలన్న విషయాన్ని రాజకీయ నాయకత్వాలు గుర్తుంచుకోవాలని పరోక్షంగా అధికార పార్టీ డీఎంకేకు ఆయన సూచించారు.

బిహార్ అసెంబ్లీ బరిలో ఆప్: సంజయ్ సింగ్

పట్నా: బిహార్ అసెంబ్లీకి మరికొద్ది నెలల్లో జరిగే ఎన్నికల్లో ఆప్ పోటీ చేయనుంది. ఈ విషయాన్ని ఆ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ మంగళవారం వెల్లడించారు. అయితే, ఏఏ స్థానాల్లో పోటీ చేయాలనే అంశాన్ని సరైన సమయంలో పార్టీ అగ్రనాయకత్వం ప్రకటిస్తుందని చెప్పారు. ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం బిహార్, పూర్వాంచల్ ప్రాంతాల వలసదారులను శత్రుదేశం పౌరులుగా చూస్తోందని ఆరోపించారు. పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాంటూ ఎన్నికల్లో వాగ్దానం చేసిన ఆ పార్టీ మురికి వాడలను సైతం నేలమట్టం చేసి, వారికి నిలువనీడ లేకుండా చేస్తోందన్నారు. బీజేపీని అధికారం నుంచి దించేయాలని బిహార్ ప్రజలకు సంజయ్ సింగ్ పిలుపునిచ్చారు.

సోనియాగాంధీ ఆరోగ్యం మెరుగుపడుతోంది

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఆరోగ్యం మెరుగుపడుతోందని, ఇన్ఫెక్షన్ నుంచి ఆమె కోలుకుంటున్నారని సర్‌గంగారామ్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉదర సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆమె చికిత్సకు బాగా స్పందిస్తున్నారని ఆస్పత్రి చైర్మన్ అజయ్‌స్వరూప్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ వైద్యుల బృందం ఆమె ఆరోగ్యం, ఆహారాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారని ఆయన అన్నారు. ముందు జాగ్రత్త చర్యగా, ఆమె డిశ్చార్జ్ తేదీని ఇంకా నిర్ణయించలేదని తెలిపారు. కాగా, ఉదర సంబంధిత సమస్యలతో సోనియాగాంధీ ఆదివారం సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. జూన్ 9న, అదే ఆసుపత్రిలో ఆమె వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆమెకు రక్తపోటు పెరగడంతో సిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీలో చికిత్స చేయించుకున్న ఆమెకు తరువాతి రోజు గంగారామ్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఈడీ విచారణకు రాబర్ట్ వాద్రా డుమ్మా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరుకాలేదు. వాద్రా సన్నిహితుడు, యూకేకు చెందిన ఆయుధ కన్సల్టెంట్ సంజయ్ భండారీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో విచారణకు రావాలంటూ ఈడీ సమన్లు పంపింది. అయితే, వాద్రా తన కుమార్తె యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు కోర్టు అనుమతితో విదేశాలకు వెళ్తున్నందున విచారణకు వెళ్ల లేదని ఆయన లాయర్ చెప్పారు. తాజాగా సమన్లు జారీ చేసేందుకు ముందే కోర్టు అనుమతి తీసుకున్న విషయాన్ని ఈడీకి కూడా తెలిపామన్నారు. ఈ కేసులో జూన్ 10న విచారణకు రావాలంటూ అంతకుముందు ఈడీ నోటీసు పంపగా అనారోగ్యాన్ని కారణంగా చూపుతూ వాద్రా గైర్హాజయ్యారు. తాజాగా, వాద్రా నుంచి వచ్చే సమాధానం ఆధారంగా ఈడీ మరోసారి సమన్లు జారీ చేసే అవకాశముంది.

స్టాన్‌ఫోర్డ్‌కు రిషి సునాక్, అక్షతా మూర్తి

కాలేజీ రోజులను గుర్తు చేసుకున్న దంపతులు

కాలిఫోర్నియా: యూకే మాజీ ప్రధాని రిషి సునాక్, ఆయన భార్య అక్షతా మూర్తి.. కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్‌కు వెళ్లారు. రెండు దశాబ్దాల తరువాత వర్సిటీకి వెళ్లిన జంట.. 2025 విద్యాసంవత్సరం ప్రారంభోపన్యాసం చేశారు. తమ కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నారు. స్టాన్‌ఫోర్డ్ తమ జీవితాలను ఎలా తీర్చిదిద్దిందో పంచుకున్నారు. భారత్ నుంచి కాలిఫోర్నియాకు తన ప్రయాణం గురించి చెప్పిన అక్షతా మూర్తి... రిషిని, తనను కలిపిన స్థలం ఇదేనని, వర్సిటీ తమ ఆలోచనా విధానాన్ని, తమ జీవితాలనే మార్చేసిందని గుర్తు చేసుకున్నారు. స్టాన్‌ఫోర్డ్ అత్యుత్తమ బిజినెస్ కాలేజ్ మాత్రమే కాదు.. మెరుగైన పెళ్లి సంబంధాలను కుదిర్చే చోటు అంటూ చమత్కరించారు. కాగా, వర్సిటీ తనకు నేర్పిన పాఠాలను రిషి సునాక్ విద్యార్థులతో పంచుకున్నారు. ఆశయం, తెలివితేటలే కాదు.. కలిసే వ్యక్తులు, కాలేజీ నుంచి తీసుకెళ్లే విలువలే జీవిత గమనాన్ని రూపొందిస్తాయని విద్యార్థులకు సూచించారు. అనంతరం కాలేజీ రోజులను గుర్తు చేసుకుంటూ దిగిన ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో పంచుకున్నారు.

అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని సుమారు 50 లక్షల మంది అసంఘటిత కార్మికులకు వివిధ రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ తెలిపింది. బీడీ, సినీ, గని కార్మికుల పిల్లలకు రూ.1,000 నుంచి రూ.25 వేల వరకు వార్షిక స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. జాతీయ స్కాలర్‌షిప్ పోర్టల్(ఎన్‌ఎస్‌పీ) ద్వారా అమలయ్యే ఈ పథకం కోసం ఏటా లక్ష మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నట్లు వివరించింది. ఆరోగ్య పథకం కింద ఔట్ పేషెంట్ సేవలు, గుండె జబ్బులు, మూత్రపిండ మార్పిడి, క్యాన్సర్, క్షయవ్యాధి, చిన్న శస్త్రచికిత్సలు వంటి అనారోగ్యాలకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు వివరించింది. వివిధ శస్త్రచికిత్సలకు రూ.30 వేలు నుంచి రూ.7.5 లక్షల వరకు సాయం అందిస్తున్నట్లు కార్మిక, ఉపాధి శాఖ వెల్లడించింది.

విమాన ప్రమాదంలో 163 మంది మృతుల గుర్తింపు

అహ్మదాబాద్: విమాన ప్రమాద ఘటనలో మృతిచెందిన వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం మధ్యాహ్నం వరకు 163 మృతదేహాలు ఎవరివన్నది డీఎన్‌ఏ పరీక్ష ద్వారా నిర్ధారించారు. ఇందులో 124 మృతదేహాలను సంబంధిత కుటుంబాలకు అప్పగించారు. ఈ నెల 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమానం కుప్పకూలిన ఘటనలో 270 మంది మరణించిన సంగతి తెలిసిందే. ప్రమాద తీవ్రతకు మృతదేహాలను గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కాలిపోవడంతో డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మెడికల్ విద్యార్థులు ఎలా బయటపడ్డారంటే..

తాజాగా బయటకొచ్చిన వీడియోలు

అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిన అనంతరం బీజే మెడికల్ కాలేజీ(బీజేఎంసీ)క్యాంపస్‌లో భీతిల్లిన విద్యార్థులకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వస్తున్నాయి. భవనంలో మంటలు చెలరేగడం చూసిన రెండు, మూడు అంతస్తుల్లో ఉన్న విద్యార్థులు ప్రాణభయంతో వణుకుతూ కేకలు వేయగా, కొందరు దుప్పట్లు, ఇతర దుస్తులను ఒకదానికొకటి ముడివేసి వాటి సాయంతో కిందికి దిగడం, మరికొందరు దూకేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా అందులో ఉంది. విమానం కూలిన ప్రాంతంలో కొన్ని మీటర్ల దూరంలోనే మంటలు వ్యాపిస్తుండటం చూసిన ఓ యువతి కేవలం రెయిలింగ్ సాయంతోనే కిందికి దిగేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉన్న మరో ఓ వీడియోలో రికార్డయింది. క్యాంపస్ వెలుపలి గోడపై నుంచి ఈ వీడియో తీస్తున్న వారు.. కింద పడిపోతే గాయాలవుతాయని ఆమెను హెచ్చరిస్తూ వేస్తున్న కేకలు సైతం వినిపించాయి. మరో వ్యక్తి కూడా అదే రెయిలింగ్ ద్వారా కిందికి దిగేందుకు యత్నించారు. మెడికల్ కాలేజీ హాస్టల్ మూడో అంతస్తు వరకు నిచ్చెనలు వేసుకుని ఫైర్ సిబ్బంది మంటల్లో చిక్కుకున్న విద్యార్థులను రక్షించినట్లుగా మరో వీడియోలో ఉంది. విమానం కూలిన మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంలో ఉన్న ఐదుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు సహా 29 మంది ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. విమాన ప్రమాదంతో మెడికల్ కాలేజీకి సంబంధించిన నాలుగు భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

కల్హణుడు ఏ కాశ్మీర్ రాజుకు సమకాలీనుడు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

తొలి మధ్యయుగం

తొలి మధ్యయుగ భారతదేశ చరిత్రలో ఉత్తర భారతదేశాన్ని 36 రాజపుత్ర వంశాలు పాలించాయి. వీటిలో ప్రతీహారులు, పరమారులు, చౌహాన్‌లు, సోలంకీలతోపాటు మరికొన్ని రాజ వంశాలు కూడా ప్రఖ్యాతి చెందాయి. ఈ రాజవంశాలు తమ పాలన ద్వారా ఉత్తర భారత సంస్కృతికి, వాస్తుశిల్ప కళలకు అమూల్య సేవలందించాయి.



చాందేలులు

వీరు ఘూర్జర ప్రతీహారుల తర్వాత జేజకభుక్తి (బుందేల్‌ఖండ్) ప్రాంతాన్ని పాలించారు. వీరు శాసనాల్లో తమను చంద్రవంశ క్షత్రీయులుగా పేర్కొన్నారు. వీరి రాజధాని ఖజురహో. క్రీ.శ. 9 నుంచి 14వ శతాబ్దం వరకు పాలించారు. వీరి కాలంలో దాదాపు 80 ఆలయాలను నిర్మించారు. వాటిలో 30కి పైగా ఆలయాలు నేటికీ నిలిచి ఉన్నాయి.

నన్నుక: చాందేల వంశాన్ని స్థాపించినవాడు. చాందేలుల వంశంలో తొలిరాజుగా నన్నుకను పేర్కొంటారు.

వాక్పతి: నన్నుక అనంతరం రాజ్యానికి వచ్చినవాడు వాక్పతి. తన సమకాలీన పాల వంశ రాజు దేవపాలుడితో, ప్రతీహార రాజు భోజుడితో ఇతడు పలు యుద్ధాలు చేశాడు.

జయశక్తి: వాక్పతి కుమారుడు జయశక్తి. ఇతడు తన తండ్రి అనంతరం రాజ్యానికి వచ్చాడు. ఇతడి పేరు మీదుగానే ఈ రాజ్యాన్ని జేజకభుక్తి రాజ్యం అని పిలిచేవారు.

యశోవర్మన్: జయశక్తి అనంతరం విజయశక్తి, రాహిలుడు అనే రాజుల తర్వాత యశోవర్మన్ రాజ్యానికి వచ్చాడు. తన దండయాత్రల ద్వారా అనేక ప్రాంతాలను జయించి చాందేలులను ఒక గొప్పశక్తి రూపొందించాడు. తన రాజధాని ఖజురహోలో ఇతడు చతుర్భుజ స్వామి అనే విష్ణు ఆలయాన్ని నిర్మించాడు. దీన్నే లక్ష్మణ ఆలయం అని కూడా పిలుస్తారు.

ధంగ: ఇతడు 50 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ కాలంపాటు చాందేల రాజ్యాన్ని పాలించాడు. ఇతడి పాలనలో చాందేలులు తిరుగులేని శక్తిగా ఎదిగారు. ఇతడి రాజ్యం విదిష నుంచి గ్వాలియర్ వరకు, వారణాసి నుంచి నర్మద వరకు విస్తరించింది. ధంగ హయాం వాస్తుకళలకు పేరొందింది. రాజధాని ఖజురహోలో ఇతడు విశ్వనాథ, పార్శ్వనాథ ఆలయాలను నిర్మించాడు. ఇతడి కాలంలో పంజాబ్‌పై గజనీరాజు సబక్తజిన్ దాడి చేశాడు. ఈ దాడి నుంచి హిందూ షాహీరాజు జయపాలుడిని రక్షించేందుకు ధంగ కొన్ని రాజ్యాల కూటమిని ఏర్పరిచి ఈ దాడిని ఎదుర్కొన్నాడు.

గండ: తన తండ్రిలాగే ఇతడు కూడా విదేశీ దండయాత్రలను ఎదుర్కొనేందుకు పంజాబ్ షాహీ రాజుల కూటముల్లో చేరాడు. ఇతడి కాలంలో క్రీ.శ. 1008లో మహ్మద్ గజనీ పంజాబ్‌పై దాడి చేశాడు. ఖజురహోలో గండ రెండు దేవాలయాలను నిర్మించాడు. అవి - దేవి జగదాంబి ఆలయం (వైష్ణవాలయం), చిత్రగుప్త ఆలయం (సూర్య దేవాలయం).

విద్యాధర: ఇతడు తన సమకాలీనులైన కాలచూరి రాజులను, పరమార రాజులను ఓడించి రాజ్యాన్ని మరింత విస్తరించాడు. ఇతడి పాలనా కాలంలో మహ్మద్ గజనీ క్రీ.శ. 1019, 1022లో రెండుసార్లు చాందేల రాజ్యంపై దాడి చేశాడు. ఖజురహోలోని దేవాలయాలన్నింటిలోకి తలమానికమైన కందరియ మహాదేవ ఆలయాన్ని విద్యాధరుడే నిర్మించాడు.

మదనవర్మన్: విద్యాధరుడి అనంతరం విజయపాల, దేవవర్మన్, కీర్తివర్మన్ మొదలైన బలహీన రాజుల పాలన అనంతరం మదనవర్మన్ రాజ్యానికొచ్చాడు. ఇతడు త్రిపురి పాలకులైన కాలచూరి రాజులను, పరమార రాజులను, గహద్వాలులను ఓడించాడు. కానీ ఇతడు మూడో పృథ్వీరాజు చౌహాన్ చేతిలో ఓడిపోయాడు.

పరమార్ది దేవ: ఇతడి కాలంలో కుతుబు ద్దీన్ ఐబక్ వీరి రాజ్యంపై దాడి చేసి మహోబా, కళింజర్ మొదలైన ప్రాంతాలను ఆక్రమించా డు. పరమార్ది దేవ అనంతరం త్రిలోక్య వర్మన్, వీరవర్మన్ అనే రాజులు పాలించారు. కానీ క్రీ.శ. 1309లో అల్లాఉద్దీన్ ఖిల్జీ కల్యాణీ చాళుక్య రాజ్యాన్ని ఢిల్లీ సామ్రాజ్యంలో విలీనం చేశాడు.

గహద్వాలులు

వీరు తాము సూర్య చంద్ర వంశాలకు చెందినవారమని, యయాతి వారసులమని పేర్కొ న్నారు. కానీ వీరిని రాష్ట్రకూటుల శాఖకు చెంది నవారిగా చరిత్రకారులు భావించారు.

యశో విగ్రహ: ఇతడు గహద్వాల వంశస్థాపకుడు.

చంద్రదేవ: ఇతడిని స్వతంత్ర గహద్వాల రాజ్య స్థాపకుడిగా భావిస్తారు. ఇతడు పలు ప్రాంతాలను ఆక్రమించి బనారస్‌ను తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. ముస్లింల దాడులను ఎదుర్కొనేందుకు తన ప్రజల నుంచి తురుష్క దండన అనే పన్ను విధించాడు.

గోవిందచంద్ర: చంద్రదేవ అనంతరం కొద్దికాలం మదనపాలుడు పాలించాడు. తర్వాత అతడి కుమారుడు గోవిందచంద్ర రాజ్యానికొచ్చాడు. ఇతడిని ఈ వంశంలో అందరికంటే గొప్పవాడిగా పరిగణిస్తారు. ఇతడు పాల, బేధి, చాందేల రాజులను ఓడించాడు. గజనీరాజు మూడో మసూద్‌షా సైనికుల దాడిని తిప్పికొట్టాడు. కాశ్మీర్ రాజు జయసింహుడితో, గుజరాత్ పాలకుడు సిద్ధరాజుతో స్నేహ సంబంధాలను కలిగి ఉన్నాడు. ఇతడి ఆస్థానంలోనే లక్ష్మీధరుడు (యుద్ధమంత్రి) కృత్యకల్పతరు/కల్పద్రుయ అనే గ్రంథాన్ని రచించాడు. ఇతడి ఆస్థానంలోని మరో కవి దామోదరశర్మ ఉక్తి-వ్యక్తి-ప్రకరణం అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించాడు. గోవిందచంద్ర రాణి కుమారదేవి సారనాథ్‌లో బౌద్ధ విహారాన్ని నిర్మించింది.

విజయచంద్ర: తన తండ్రిలాగే ఇతడు కూడా వాయవ్యం నుంచి జరిగే విదేశీ దాడులను విజయవంతంగా ఎదుర్కొన్నాడు. విజయచంద్రుడి విజయాల గురించి విజయప్రశస్తి అనే గ్రంథాన్ని శ్రీహర్షుడు రచించాడు.

జయచంద్రుడు: పృథ్వీరాజరాసో గ్రంథం లో ఇతడి కుమార్తె రాణి సంయుక్తకు, మూడో పృథ్వీరాజ్‌కు మధ్య గల ప్రేమాయణం గురించి వివరించారు. పృథ్వీరాజ్‌తో ఇతడికి బద్ధ వైరముంది. ఇతడి కాలంలోనే ఘోరీ మహ్మద్... చౌహాన్ రాజ్యాన్ని అంతం చేశాడు. చివరికి 1193-94లో ఘోరీ... కనౌజ్‌పై దాడి చేసి జయచంద్రుడిని వధించి గహద్వాల రాజ్యాన్ని ఆక్రమించాడు. కానీ జయచంద్రుడి కుమారుడు హరిశ్చంద్రుడిని తన సామంతుడిగా చేసుకొని గహద్వాల రాజ్యాన్ని తిరిగి అప్పగించాడు.

జయచంద్రుడి ఆస్థానంలోని ప్రముఖ సంస్కృత కవి శ్రీహర్షుడు. ఇతడు నైషధ చరితం, ఖండన ఖండ ఖాద్య అనే గ్రంథాలను రచించాడు. చివరికి ఇల్‌టుట్‌మిష్ కాలంలో ఈ రాజ్యం ఢిల్లీ సామ్రాజ్యంలో విలీనమైంది.

పాలవంశం

తొలి మధ్య యుగంలో తూర్పు భారతదేశాన్ని పాలించిన వంశాల్లో పాలవంశం ప్రముఖ మైంది. తొలుత పాటలీపుత్రం, తర్వాత మాంఘీర్ రాజధానులుగా పాలరాజులు బెంగాల్, బీహార్, ఒరిస్సా మొదలైన ప్రాంతా లను క్రీ.శ. 8వ శతాబ్దం నుంచి 11వ శతాబ్దం వరకు పాలించారు. భారతదేశంలో బౌద్ధ మతా న్ని ఆదరించిన చివరి రాజవంశంగా పాలవంశాన్ని పేర్కొనవచ్చు. వీరు వజ్రయాన మతాన్ని గొప్పగా ఆదరించారు. వీరి కాలంలోనే ఈ మతం టిబెట్‌కు కూడా వ్యాప్తి చెందింది.

గోపాల: గౌడ శశాంకుడి తదనంతరం బెంగాల్‌లో మత్స్యన్యాయం రాజ్యమేలింది. దాదాపు 100 సంవత్సరాలు సాగిన ఈ రాజకీయ అనిశ్చితిని అంతం చేసి గోపాల క్రీ.శ.750లో పాలరాజ్యాన్ని స్థాపించాడు. ఇతడిని ప్రజలే తమ రాజుగా ఎన్నుకున్నారు. గోపాలుడు తన రాజ్యంలో శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించాడు. బౌద్ధమతాన్ని ఆదరించాడు. ఓదంతపురి విహారాన్ని నిర్మించాడు.

ధర్మపాల: కనౌజ్ కోసం జరిగిన త్రిరాజ్య యుద్ధాల్లో పాల్గొన్న మొదటి పాలరాజు ధర్మపాల. కనౌజ్ ఆక్రమణ కోసం ప్రతీహారులతో, రాష్ట్రకూటులతో ఇతడు యుద్ధాలు చేశాడు. ప్రతీహార సామంతుడు ఇంద్రాయుధుడిని ఓడించి కనౌజ్‌ను ఆక్రమించాడు. కానీ ప్రతీహార రెండో నాగభటుడు ఇతడిని మాంఘీర్ యుద్ధంలో ఓడించాడు. ధర్మపాలుడు కూడా గొప్ప బౌద్ధ మతాభిమాని. ఇతడు విక్రమపుర, సోమపుర బౌద్ధ విశ్వవిద్యాలయాలను స్థాపించాడు. అంతేకాకుండా గుప్తుల కాలంలో స్థాపించిన నలంద విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించి దాని నిర్వహణకు రెండు వందల గ్రామాలను దానంగా ఇచ్చాడు. బౌద్ధ భిక్షువుల కోసం దాదాపు 50 మత సంస్థలను స్థాపించాడు. ఇతడి ఆస్థానంలో హరిభద్రుడు అనే గొప్ప బౌద్ధ పండితుడు ఉండేవాడు.

మాదిరి ప్రశ్నలు

1. ఖజురహో దేవాలయాల గురించి తొలిసారిగా ప్రస్తావించిన విదేశీ చరిత్రకారుడు/ రచయిత?
   1) సులేమాన్, అల్‌మసూదీ
   2) అల్‌బెరూనీ, ఇబ్న్‌బతూతా
   3) అబ్దుల్ రజాక్, అబ్దుల్ రహీం
   4) వి.ఎ. స్మిత్, రాబర్ట్ సీవెల్
2. పంజాబ్ హిందూషాహీరాజు ఆనంద పాలుడి కూటమిలో చేరి మహ్మద్ గజనీ దాడిని ఎదుర్కొన్న చాందేల రాజు?
   1) ధంగ 2) గండ
   3) జయపాల 4) యశోవర్మన్
3. ఖజురహోలోని కందరీయ మహాదేవ ఆలయ నిర్మాత?
   1) విద్యాధర 2) గండ
   3) ధంగ 4) నన్నుక
4. కుతుబుద్దీన్ ఐబక్ దాడిని ఎదుర్కొన్న చాందేల రాజు?
   1) త్రిలోక్య వర్మన్ 2) మదన వర్మన్
   3) పరమార్ది దేవ 4) వీరవర్మన్
5. ఖజురహో దేవాలయాలను ఏ వాస్తు శిల్పకళాశైలికి పరాకాష్టగా భావిస్తారు?
   1) ద్రావిడ 2) నగర
   3) వెస్సార 4) ఇండో-పర్షియన్
6. తొలిసారిగా హిందీలో శాసనాలను జారీ చేసినవారు?
   1) చౌహాన్‌లు 2) చాందేలులు
   3) గహద్వాలులు 4) ప్రతీహారులు
7. కామసూత్ర శిల్పాలతో దేవాలయాలను నిర్మించినవారు?
   1) చాందేలులు 2) చోళులు
   3) పరమారులు 4) పాలరాజులు
8. కనౌజ్ రాజధానిగా పాలించిన రాజ వంశాలు?
   1) మౌఖరీలు
   2) మౌఖరీలు, ప్రతీహారులు
   3) మౌఖరీలు, ప్రతీహారులు, గహద్వాలులు
   4) ఎవరూ కాదు
9. తురుష్క దండన అనే పన్నును విధించిన రాజు?
   1) మూడో పృథ్వీరాజ్ చౌహాన్
   2) గహద్వాల జయచంద్ర
   3) చంద్రదేవ 4) ఆనంద పాలుడు
10. లక్ష్మీధరుడు కృత్యకల్పతరు గ్రంథాన్ని ఎవరి ఆస్థానంలో రచించాడు.
    1) సిద్ధరాజ జయసింహ
    2) గోవింద చంద్ర
    3) పృథ్వీరాజ 4) జయచంద్ర
11. బంగారు నాణేలను జారీ చేసిన ఏకైక గహద్వాల రాజు?
    1) గోవిందచంద్ర 2) జయచంద్ర
    3) విజయచంద్ర
    4) యశోవిగ్రహ
12. నైషధ చరితం గ్రంథకర్త?
    1) శ్రీహర్షుడు 2) శ్రీనాథుడు
    3) లక్ష్మీధరుడు 4) జయచంద్రుడు
13. మహ్మద్‌ఘోరీ ఏ యుద్ధంలో గహద్వాలులను అంతం చేశాడు?
    1) మొదటి తరైన్
    2) రెండో తరైన్
    3) బనారస్ యుద్ధం
    4) చాందావార్ యుద్ధం
14. కల్హణుడు ఏ కాశ్మీర్ రాజుకు సమకాలీనుడు?
    1) హర్ష 2) క్షేమగుప్త
    3) అవంతీవర్మన్
    4) లలితాదిత్య ముక్తాపీడ
15. దిలికపుర (ఢిల్లీ) నగరాన్ని నిర్మించిన రాజవంశం?
    1) చౌహాన్‌లు 2) ప్రతీహారులు
    3) గహద్వాలులు 4) తోమారులు

సమాధానాలు:

1) 2;	2) 2;	3) 1;	4) 3;
5) 2;	6) 2;	7) 1;	8) 3;
9) 3;	10) 2;	11)1;	12) 1;
13) 4;	14) 1;	15) 4.	

విద్య, ఉద్యోగ సమాచారం

కొచ్చిన్ పోర్ట్ అథారిటీలో వివిధ ఉద్యోగాలు

కేరళలోని కొచ్చిన్ పోర్ట్ అథారిటీ ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ కన్సల్టెంట్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02.
» పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ కన్సల్టెంట్-01, ఎలక్ట్రికల్ ఇంజనీర్-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: ప్రాజెక్ట్ కన్సల్టెంట్ పోస్టుకు 55 ఏళ్లు, ఎలక్ట్రికల్ ఇంజనీర్‌కు 40 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌కు రూ.55,000, ఎలక్ట్రికల్ ఇంజనీర్‌కు రూ.40,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.06.2025.
» వెబ్‌సైట్: www.cochinport.gov.in

ఎగ్జిమ్ బ్యాంక్‌లో వివిధ ఉద్యోగాలు

ముంబైలోని ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎగ్జిమ్ బ్యాంక్).. ఒప్పంద ప్రాతిపదికన కాంప్లియన్స్ ఆఫీసర్-చీఫ్ జనరల్ మేనేజర్, చీఫ్ ఎకనామిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: కాంప్లియన్స్ ఆఫీసర్-చీఫ్ జనరల్ మేనేజర్(గ్రేడ్/స్కేల్ టాప్ ఎగ్జిక్యూటివ్ 7)-01, చీఫ్ ఎకనామిస్ట్-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ, ఐసీఎస్ఐ నుంచి క్వాలిఫైడ్ కంపెనీ సెక్రటరీ, ఉద్యోగానుభవం ఉండాలి.
» వయసు: 31.05.2025 నాటికి 55 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, ఉద్యోగానుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 07.07.2025.
» రాతపరీక్షతేది: ఆగస్ట్ 2025.
» వెబ్‌సైట్: www.eximbankindia.in

జలగ ఏ రకానికి చెందిన జీవి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ - కంటెంట్ (ఎస్‌జీటీ)

జీవశాస్త్ర పరిచయం

జీవశాస్త్రం (బయాలజీ) అనే పదం బయోస్ (జీవం), లాగస్ (అధ్యయనం) అనే గ్రీకు పదాల నుంచి ఉద్భవించింది. అరిస్టాటిల్ (క్రీ.పూ. 384-322) అనేక జీవశాస్త్ర ప్రాథమిక భావనలు ఇచ్చారు. అందువల్ల ఆయనను 'జీవశాస్త్ర పితామహుడు' అంటారు.

★ జీవశాస్త్రంలో రెండు విభాగాలుంటాయి. 1. జంతు శాస్త్రం (జువాలజీ - జోవన్ అంటే జంతువు, లాగోస్ అంటే అధ్యయనం)
2. వృక్షశాస్త్రం (బోటనీ - బొటానె అనే మాటకు మొక్క అని అర్థం)

★ మొక్కలు స్వయం పోషకాలు. అంటే తమ ఆహారాన్ని తామే తయారుచేసుకుంటాయి. కిరణజన్య సంయోగక్రియలో సూర్యరశ్మి సమక్షంలో కార్బన్ డై ఆక్సైడ్, నీరు కలవడం వల్ల పిండిపదార్థం లేదా కార్బో హైడ్రేట్ ఏర్పడుతుంది. ఈ చర్యకు అవసరమైన క్లోరోఫిల్ (పత్రహరితం) మొక్కల్లో ఉంటుంది. శిలీంద్రాల్లో పత్రహరితం ఉండదు. అవి సేంద్రియ పదార్థాలపై ఆధారపడి జీవిస్తాయి.

★ జంతువులు ఆహారం కోసం ఇతర జీవులపై ఆధారపడతాయి. అందువల్ల వీటిని పరపోషకాలు (Heterotrophs) అంటారు.

★ కుళ్లుతున్న సేంద్రియ పదార్థాలపై ఆధారపడే జీవులు 'పూతికాహారులు (Saprophytes)' ఇవి కళేబరాలపై ఆధారపడి జీవిస్తాయి.

★ ఆహారం లేదా ఆవాసం లేదా రెండింటి కోసం ఇతర జీవుల శరీరాన్ని అంటిపెట్టుకునే జీవులను 'పరాన్నజీవులు' అంటారు. అతిథేయి శరీరం బయటకు అంటి పెట్టుకునేవి బాహ్య పరాన్నజీవులు **ఉదా:** జలగ.
అతిథేయి లోపలి భాగాల్లో నివసించేవి అంతర పరాన్న జీవులు
ఉదా: ఆస్కారిస్ (ఏలికపాము)

★ సహజీవనంలో రెండు రకాల జీవులు పరస్పర సహకారం అందించుకుంటాయి.

పోషణ

★ జీవుల ప్రధాన లక్షణం జీవనక్రియలు జరుపుకోవడం. ఈ క్రియల్లో జీర్ణక్రియ ఒకటి. శక్తి కోసం జీర్ణక్రియ అవసరం.

★ ఏకకణ జీవులైన ప్రాథమిక జీవుల్లో జీర్ణవ్యవస్థ ప్రత్యేకంగా అభివృద్ధి చెంది ఉండదు.

★ ఏకకణ జీవుల్లో కణాంతర జీర్ణక్రియ ఉంటుంది.

కణం: జీవి ప్రాథమిక ప్రమాణం కణం. దీన్ని రాబర్ట్ హుక్ గుర్తించాడు.

కణజాలం: ఒకే విధమైన నిర్మాణం కల్గి, ఒకే పనిని నిర్వర్తించే కణాల సమూహాన్ని కణజాలం అంటారు. భిన్న కణజాలాలు కలిసి అవయవం ఏర్పడుతుంది.

- ఎగిరే పక్షుల శరీరం పడవ ఆకారంలో ఉంటుంది. వీటి ఎముకలు గుల్లగా ఉంటాయి. వీటిలో వాయుసంచులు ఉంటాయి.
- బయాలజీ అనే పదాన్ని కనుగొన్నది 'లామార్క్'.
- సరీసృపాల్లోని గుండె గదుల సంఖ్య 'మూడు'. కానీ మొసలిలో నాలుగు గదుల గుండె ఉంటుంది.



వ్యవస్థ: భిన్న అవయవాలు కలిసి ఒకే పనిని నిర్వర్తిస్తే దాన్ని 'అవయవ వ్యవస్థ' అంటారు.

జీవి శరీరంలో జీర్ణ, శ్వాస, విసర్జన, ప్రత్యుత్పత్తి, నాడీ, రక్తప్రసరణ, అంతస్రావ వ్యవస్థలుంటాయి. జంతువులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి: 1. వెన్నెముక లేని జీవులు. 2. వెన్నెముక ఉన్న జీవులు

వెన్నెముక లేని జీవులను 9 వర్గాలుగా విభజించారు.

★ **ప్రోటోజోవా:** ప్రోటో అంటే ప్రాథమిక, జోవన్ అంటే జంతువులు అని అర్థం.

★ **పొరిఫెరా:** పొరి అంటే పోరస్ (రంధ్రాలు ఉన్న), ఫెరిన్ అంటే కల్గి ఉండేవి అని అర్థం. రంధ్రాలు కల్గిన జీవులు.
ఉదా: స్పంజికలు

★ **సీలెంటరేటా:** ఆయికులాస్ ఎంటిరాన్ పదాల కలయికతో సీలెంటరేటా వచ్చింది. ఆయికులాస్ అంటే గొట్టం, ఎంటిరాన్ ఆహారనాళం అని అర్థం. వీటిలో గొట్టం లాంటి ఆహారనాళం ఉంటుంది. ఇవి ద్విస్తరిత (డిప్లోబ్లాస్టిక్) జీవులు. **ఉదా:** హైడ్రా.

★ **ప్లాటీ హెల్మింథిస్:** ప్లాట్ అంటే బల్లపరుపు, హెల్మింథ్స్ అంటే పురుగులు అని అర్థం. ఇవి బల్లపరుపు శరీర నిర్మాణం కల్గిన జీవులు. ఇవి పరాన్నజీవులు.
ఉదా: టీనియా సోలియం(బద్దెపురుగులు)

★ **నిమాటి హెల్మింథిస్:** ఇవి గుండ్రటి పురుగులు. ఎక్కువగా పరాన్నజీవులు.
ఉదా: ఏలిక పాము (ఆస్కారిస్)

★ **అనెలిడా:** అన్యులస్ అంటే వలయాకార ఖండితాలు అని అర్థం. ఈ జీవుల్లో ఇలాంటి అవయవ వ్యవస్థలుంటాయి. సీలోం (శరీర కుహరం) ఉంటుంది.
ఉదా: వానపాము, జలగ.

★ **ఆర్థ్రోపొడా:** ఆర్థ్రాస్ అంటే కీళ్లు కలిగిన పోడియం - కాళ్లు. కీళ్లు కల్గిన (ఖండితాలున్న) కాళ్లు ఉండటం వీటి లక్షణం. బాహ్య అస్థిపంజరం కల్గిన కీట కాలుంటాయి.
ఉదా: బొద్దింక, ఈగ, దోమ.

★ **మొలస్కా:** మెత్తని శరీరం కల్గినది అని అర్థం. దీంట్లో కర్పరాలుంటాయి.
ఉదా: ఆల్చిప్ప, నత్త.

★ **ఇఖైనోడెర్మేటా:** ఇఖినస్ అంటే ముళ్లు, దర్మా అంటే చర్మం. చర్మంపై ముళ్లు కల్గిన జీవులు అని అర్థం. **ఉదా:** సముద్ర నక్షత్రం.

వెన్నెముక ఉన్న జీవులు

వీటిని నాలుగు రకాలుగా విభజించారు.

★ **చేపలు:** జలచరాలు. శీతల రక్త జీవులు (పరిసర ఉష్ణోగ్రత మారినప్పుడు రక్తం ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది). వీటిలో రెండుగదుల గుండె ఉంటుంది. ఇవి చాలా వరకు అండోత్పాదకాలు.

★ **ఆంఫిబియా (ఉభయచరాలు):** నేలపైనా, నీటిలోనూ నివసిస్తాయి. ఇవి కూడా శీతల రక్తజీవులు. 3 గదుల గుండె ఉంటుంది. ఇవి అండోత్పాదకాలు.

★ **సరీసృపాలు:** ఇవి నేలపై పాకే జీవులు. శీతల రక్తజీవులు. 3 గదుల గుండె (2 కర్ణికలు, అసంపూర్తిగా విభజితమైన జఠరిక) ఉంటుంది. ఇవి అండోత్పదకాలు.
ఉదా: పాము, బల్లి, మొసలి.

★ **పక్షులు:** ఉష్ణరక్త జీవులు. అంటే రక్తం ఉష్ణోగ్రత పరిసర ఉష్ణోగ్రతలో మారకుండా స్థిరంగా ఉంటుంది. 4 గదుల గుండె ఉంటుంది. ఇవి ఈకలు కల్గిన జీవులు, అండోత్పదకాలు.

★ **క్షీరదాలు:** పాలిచ్చే శిశుత్పాదకాలు. నాలుగు గదుల గుండె ఉంటుంది. ఉష్ణరక్త జంతువులు.
ఉదా: ఆవు, మేక, కుక్క, మానవుడు.

మాదిరి ప్రశ్నలు

1. బయాలజీ అనే పదానికి సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
   1) గ్రీకు - అరిస్టాటిల్
   2) గ్రీకు - లామార్క్
   3) ఫ్రెంచ్ - లామార్క్
   4) ఏదీకాదు
2. 'జీవశాస్త్ర పితామహుడు' అని ఎవరిని పేర్కొంటారు?
   1) లామార్క్ 2) థియోప్రాస్టస్
   3) అరిస్టాటిల్ 4) ప్లేటో
3. బొటానె అనే మాటకు అర్థం?
   1) విత్తనం 2) వేరు
   3) మొక్క 4) ఫలం
4. కిందివాటిలో ఏ గ్రీకు పదానికి జంతువు అనే అర్థం ఉంది?
   1) బొటానె 2) జోవన్
   3) లాగస్ 4) బయోస్
5. బయోస్, లాగస్ అనే పదాల నుంచి బయా లజీ ఉద్భవించింది. కిందివాటిలో వీటి అర్థాలు వరుసగా..
   1) అధ్యయనం, మొక్కలు
   2) జంతువులు, శాస్త్రం
   3) మొక్కలు, జంతువులు
   4) జీవం, అధ్యయనం
6. మొక్కలు, జంతువుల పోషణకు సంబంధించి కిందివాటిలో సరైన ప్రవచనం?
   1) మొక్కలు పరాన్నజీవులు, జంతువులు పరపోషకాలు
   2) జంతువులు పరపోషకాలు, మొక్కలు స్వయం పోషకాలు
   3) మొక్కలు పూతికాహారులు, జంతు వులు పరాన్నజీవులు
   4) జంతువులు పరపోషకాలు, మొక్కలు పరపోషకాలు
7. జలగ ఏ రకానికి చెందిన జీవి?
   1) పూతికాహార జీవి
   2) అంతర పరాన్న జీవి
   3) స్వయంపోషకం
   4) బాహ్య పరాన్న జీవి
8. ఏ రకమైన జీవులు కుళ్లుతున్న సేంద్రియ పదార్థాలపై ఆధారపడి జీవిస్తాయి?
   1) పరాన్నజీవులు 2) పూతికాహారులు
   3) సహభోజకులు 4) పరపోషకాలు
9. ప్రొటోజోవా వర్గానికి చెందిన ఏకకణ జీవుల్లో ఈ రకానికి చెందిన జీర్ణక్రియ జరుగుతుంది?
   1) కణబాహ్య జీర్ణక్రియ
   2) అసంపూర్ణ జీర్ణక్రియ
   3) కణాంతర జీర్ణక్రియ
   4) ఎక్ట్రా కార్పోరియర్ జీర్ణక్రియ
10. ఏలికపాము, బద్దెపురుగు, స్పంజికలు వరుసగా ఏ వర్గాలకు చెందుతాయి?
    1) ప్లాటిహెల్మింథిస్, నిమాటి హెల్మింథిస్, పొరిఫెరా
    2) నిమాటి హెల్మింథిస్, ప్లాటిహెల్మింథిస్, మొలస్కా
    3) ప్లాటిహెల్మింథిస్, ఇఖైనోడెర్మేటా, ప్రోటోజోవా
    4) నిమాటి హెల్మింథిస్, ప్లాటిహెల్మిం థిస్, పొరిఫెరా
11. ఆల్చిప్ప ఏ వర్గానికి సరైన ఉదాహరణ?
    1) మొలస్కా 2) ఇఖైనోడెర్మేటా
    3) పొరిఫెరా 4) అనెలిడా
12. ఇఖైనోడెర్మేటా జీవుల ప్రధాన లక్షణం?
    1) రంధ్రాలు కల్గి ఉండటం
    2) శరీరత్వచం రెండు పొరలతో ఉండటం
    3) శరీరంపై ముళ్లు ఉండటం
    4) ఖండితాలు కల్గిన కాళ్లు ఉండటం
13. కిందివాటిలో సరైన ప్రవచనం ఏది?
    1) అమీబా బహుకణ జీవి
    2) హైడ్రా ద్విస్తరిత జీవి
    3) బొద్దింక అనెలిడా వర్గానికి చెందింది
    4) బద్దెపురుగు పరాన్నజీవి కాదు

సమాధానాలు

1) 2;	2) 3;	3) 3;	4) 2;
5) 4;	6) 2;	7) 4;	8) 2;
9) 3;	10) 4;	11) 1;	12) 3;
13) 2.			

పల్నాటి యుద్ధంలో పాల్గొన్న కాకతీయ రాజు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఏపీ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. హాలుడు రచించిన గాథాసప్తశతిలో కృష్ణుడు గురించి ఏమని పేర్కొన్నారు?
   1) సుందరుడు 2) మోహనాంగుడు
   3) మధుమథనుడు 4) రతివల్లభుడు
2. శాతవాహన యుగంలో 'శ్రేణి ధర్మం' అంటే?
   1) యుద్ధ సమయంలో కాల్బలం పాటించవలసిన నియమాలు
   2) శాతవాహన రాజు రాజ్యపాలనలో పాటించవలసిన నియమాలు
   3) నికాయసేణు సభ్యులు పాటించవలసిన నియమాలు
   4) శాతవాహన రాణి కి తన రాజుపట్ల ఉండే బాధ్యత
3. ఆంధ్రుల ప్రశంస దేనిలో కనిపిస్తుంది?
   ఎ) ఐతరేయ బ్రాహ్మణం
   బి) మార్కండేయ పురాణం
   సి) రామాయణం
   1) ఎ,బి 2) బి,సి
   3) ఎ,సి 4) పైవన్నీ
4. శాతవాహన యుగంలో సుగంధ ద్రవ్యాలను తయారుచేసే వారిని ఏ పేరుతో వ్యవహరించేవారు?
   1) గధికులు 2) సేల వధకులు
   3) చంకుకారులు 4) తిలపిష్టకులు
5. శాతవాహనులు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారని వి.ఎస్. సుక్తాంకర్ దేని ఆధారంగా చెప్పాడు?
   1) నాసిక్ శాసనం
   2) హిరహడగల్లి శాసనం
   3) నానాఘట్ శాసనం
   4) భట్టిప్రోలు శాసనం
6. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) దక్షిణాపథపతి - మొదటి శాతకర్ణి
   బి) దక్షిణాపథేశ్వరుడు-వాసిష్ఠీపుత్ర పులోమావి
   సి) దక్షిణాపథ సామ్రాట్టు- వాసిష్ఠీపుత్ర శాంతమూలుడు
   1) ఎ,బి 2) ఎ మాత్రమే
   3) ఎ,సి 4) పైవన్నీ
7. నాగార్జున కొండలో బౌద్ధ విహారాన్ని నిర్మించిన ఎహువల శాంతమూలుని సోదరి?
   1) శాంతిశ్రీ 2) హర్మ్యశ్రీ
   3) షష్టిశ్రీ 4) కొడబలిసిరి
8. శాసనాలు వీర పురుషదత్తుడిని ఏ పేరుతో పేర్కొంటున్నాయి?
   1) మాఢరీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   2) వాసిష్ఠీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   3) గౌతమీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   4) శాంతిశ్రీ పుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
9. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) గోరంట్ల శాసనం - అత్తివర్మ
   బి) మట్టిపాడు తామ్ర శాసనం - దామోదర వర్మ
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ,బి 4) ఎ,బి కాదు
10. క్రీ.శ.130 ప్రాంతంలో భారతదేశాన్ని సందర్శించిన టాలెమీ కృష్ణాముఖద్వారంలోని ఏ ప్రాంతం వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని చెప్పాడు?
    1) ఘంటసాల 2) భట్టిప్రోలు (పిటింద్ర)
    3) ధరణికోట 4) నాగార్జున కొండ
11. ఇక్ష్వాకుల కాలంనాటి శిల్పాలలో 'మాంధాత శిల్పం' అతి ముఖ్యమైంది. ఈ శిల్పం ఎక్కడ లభించింది?
    1) జగ్గయ్యపేట 2) నాగార్జున కొండ
    3) అమరావతి 4) ఘటప్రభ
12. 'త్రిపురమర్త్య మహేశ్వర'గా కీర్తి పొందిన వేంగీ చాళుక్యుల రాజు?
    1) ఒకటో విజయాదిత్యుడు
    2) రెండో విజయాదిత్యుడు
    3) మూడో విజయాదిత్యుడు
    4) నాల్గో విజయాదిత్యుడు
13. త్రికాలయోగి సిద్ధాంత దేవునికి రామతీర్థంలో 'రామకొండ' అనే గుహాలయాన్ని నిర్మించి ఇచ్చిన రాజు?
    1) రెండో విజయాదిత్యుడు
    2) రాజరాజనరేంద్రుడు
    3) చాళుక్య భీముడు 4) విమలాదిత్యుడు
14. బెజవాడలో జైన సన్యాసుల కోసం 'నడుంబి వసతి' అనే బసదిని నిర్మించిన రాణి?
    1) రుద్ర భట్టారిక
    2) ఉపాసిక బోధిశ్రీ 3) చల్లవ్వ
    4) అయ్యణ మహాదేవి
15. జతపరచండి.
    జాబితా-I
    a) బెజవాడ శాసనం
    b) చీపురుపల్లి శాసనం
    c) కందుకూరి శాసనం
    d) విప్పర్ల శాసనం
    జాబితా-II
    i) గుణగ విజయాదిత్యుడు
    ii) కుబ్జ విష్ణువర్ధనుడు
    iii) రెండో యుద్ధమల్లుడు
    iv) జయసింహ వల్లభుడు
    1) a-i, b-ii, c-iii, d-iv
    2) a-iii, b-ii, c-i, d-iv
    3) a-iii, b-i, c-iv, d-ii
    4) a-ii, b-iv, c-i, d-iii
16. 'శబ్దచంద్రిక', శబ్దరత్నాకరం' అనే నిఘంటువులను రచించింది?
    1) నన్నయ్య భట్టు 2) కేతన
    3) వామనభట్టు 4) శ్రీనాథుడు
17. తెలుగులో కావ్య లక్షణాలు కనిపిస్తున్న అతి పురాతన గ్రంథం? (పండితుల అభిప్రాయం ప్రకారం)
    1) మహాభారతం 2) కుమార సంభవం
    3) ఆంధ్ర మహాభాగవతం
    4) నిర్వచనోత్తర రామాయణం
18. కింది వారిలో 'చండ చాళుక్యులు' అని ఎవరిని పిలిచేవారు ?
    1) వేంగీ చాళుక్యులు
    2) బాదామి చాళుక్యులు
    3) కళ్యాణి చాళుక్యులు 4) రెడ్డి రాజులు
19. కింది వాటిలో పాత రాతి యుగానికి చెందిన ప్రదేశం?
    1) పాతపాడు 2) కీసరపల్లి
    3) నందికనుమ 4) ఉట్నూరు
20. ఆంధ్ర దేశంలో అతి ప్రాచీన బౌద్ధ స్తూపం ఎక్కడ ఉంది?
    1) అమరావతి 2) నాగార్జున కొండ
    3) భట్టిప్రోలు 4) ఘంటసాల
21. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని వ్యాఖ్యానించినవారు?
    ఎ) నికోలో కొంటి బి) శ్రీకృష్ణదేవరాయలు
    సి) సి.పి. బ్రౌన్
    డి) వినుకొండ వల్లభామాత్యుడు
    1) ఎ,బి 2) బి,సి 3) బి,డి 4) ఎ,సి
22. మోటుపల్లి అభయవర్తక శాసనాన్ని అమలుపరచడానికి గణపతిదేవుడు ఎవరిని నియమించాడు?
    1) జాయపసేనాని 2) రేచర్ల రుద్రుడు
    3) గంగయ్య సేనాని 4) సిద్ధయ్య దేవుడు
23. 'సాగర గౌతమీ సవిల సంగమ సకల జలదుర్గ సాధన రఘురామ' బిరుదువహించిన రెడ్డి రాజు?
    1) ప్రోలయ వేమారెడ్డి
    2) అనవేమారెడ్డి 3) పెదకోమటి వేమారెడ్డి
    4) కొమరగిరి రెడ్డి
24. సవరం ఎల్లయ్య అనే రాజ్య బోరుడు ఏ రెడ్డి రాజును చంపాడు?
    1) రాచవేమారెడ్డి 2) కొమరగిరి రెడ్డి
    3) అనవోతారెడ్డి 4) ప్రోలయ వేమారెడ్డి
25. పెదకోమటి వేమభూపతి రచించిన గ్రంథం?
    1) నృత్య రత్నావళి 2) గీతా రత్నావళి
    3) వేమభూపాల చరితం
    4) శృంగార దీపిక
26. పల్నాటి యుద్ధంలో పాల్గొన్న కాకతీయ రాజు?
    1) గణపతి దేవుడు
    2) రెండో ప్రతాపరుద్రుడు
    3) రుద్రదేవుడు 4) ఎవరూ కాదు
27. నిమ్నకులాల వారికి ఆలయ ప్రవేశం కల్పించడం కోసం బ్రహ్మనాయుడు నిర్మించిన ఆలయం?
    1) రుద్రేశ్వర ఆలయం
    2) ప్రసన్న కేశవాలయం
    3) చెన్నకేశ్వర ఆలయం
    4) రామప్ప దేవాలయం
28. బ్రహ్మ సమాజ కార్యకలాపాల్లో మచిలీపట్నంలో ప్రముఖ పాత్ర వహించింది?
    1) కోకా వెంకటరత్నం
    2) కందుకూరి వీరేశలింగం
    3) రఘుపతి వెంకటరత్నం నాయుడు
    4) దేశిరాజు పెదబాపయ్య
29. 1898లో రాజా ఆర్.వి. కృష్ణారావు ప్రారంభించిన 'సరస్వతి' అనే పత్రిక కోసం కొంతకాలం పనిచేసిన వ్యక్తి?
    1) చిలకమర్తి లక్ష్మీనరసింహం
    2) న్యాపతి సుబ్బారావు
    3) కందుకూరి వీరేశలింగం
    4) కొక్కొండ వెంకటరత్నం
30. మహిళలకు సమానత్వం, శాస్త్రీయ విద్యా విధాన ఆవశ్యకత గురించి వివరించిన 'హిత సూచిని' గ్రంథ రచయిత?
    1) కందుకూరి వీరేశలింగం
    2) పరవస్తు వేంకట రంగాచార్యులు
    3) ఏనుగుల వీరాస్వామి
    4) స్వామినేని ముద్దు నరసింహం
31. రఘుపతి వెంకటరత్నం నాయుడు ఆంధ్ర బ్రహ్మోపాసన మందిరాన్ని ఎక్కడ నెలకొల్పాడు?
    1) మచిలీపట్నం 2) కాకినాడ
    3) రాజమండ్రి 4) సికింద్రాబాద్
32. దత్తమండలాలకు థామస్ మన్రోను ప్రధాన కలెక్టర్‌గా ఎప్పుడు నియమించారు?
    1) 1879 అక్టోబర్ 4
    2) 1800 అక్టోబర్ 4
    3) 1801 అక్టోబర్ 4
    4) 1807 అక్టోబర్ 4
33. కమ్యూనిస్ట్ పార్టీ మొదటిసారిగా 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే నినాదాన్ని ఇచ్చింది?
    1) 1952 2) 1950
    3) 1948 4) 1946
34. ఆంధ్రదేశంలో ప్రారంభించిన స్వరాజ్య పార్టీ శాఖ అధ్యక్షుడు?
    1) వి.రామదాసు
    2) ఉన్నవ లక్ష్మీనారాయణ
    3) మద్దూరి అన్నపూర్ణయ్య
    4) దర్శి చెంచయ్య
35. 'చెన్నపట్నం స్వదేశీ సంఘం' కింది ఏ శిస్తు వసూలు పద్ధతిని సూచించింది?
    1) శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి
    2) రైత్వారీ పద్ధతి 3) గ్రామవారీ పద్ధతి
    4) ఏదీకాదు
36. కింది వారిలో 1879లో జరిగిన రంపా తిరుగుబాటుకు నాయకత్వం వహించనివారు?
    1) రమాభూపతి దేవుడు
    2) తమ్మన్న దొర
    3) పులికంటి సాంబయ్య
    4) అంబుల్ రెడ్డి
37. బ్రిటిష్ వారు అనుసరించిన పన్నుల విధానాన్ని ఉద్దేశించి 'ఉప్పుకు పన్ను, పప్పుకు పన్ను' అని వ్యాఖ్యానించింది?
    1) కొండా వెంకటప్పయ్య
    2) గరిమెళ్ల సత్యనారాయణ
    3) బసవరాజు అప్పారావు
    4) త్రిపురనేని రామస్వామి చౌదరి
38. గాంధీజీ ఆస్థాన కవిగా ఎవరిని పేర్కొంటారు?
    1) పట్టాభి సీతారామయ్య
    2) తుమ్మల సీతారామమూర్తి
    3) వావిలాల గోపాలకృష్ణయ్య
    4) జమలాపురం కేశవరావు
39. ఆంగ్ల విద్యావ్యాప్తికి ఏర్పడిన అనువైన పరిస్థితుల గురించి దాసు శ్రీరామకవి ఏ కావ్యంలో పేర్కొన్నాడు?
    1) ఆంధ్రనాడు 2) తెలుగుదేశం
    3) ఆంధ్రదేశం 4) తెలుగునాడు
40. ఆంధ్రదేశంలో మొదటి బాలికా పాఠశాలగా దేనిని పేర్కొంటారు?
    1) విక్టోరియా బాలికా పాఠశాల
    2) రెవరెండ్ నోబెల్ పాఠశాల
    3) వివేకవర్ధిని బాలికా పాఠశాల
    4) రాజమండ్రి బాలికా పాఠశాల

సమాధానాలు

1) 3	2) 3	3) 4	4) 1	5) 2
6) 4	7) 4	8) 1	9) 3	10) 2
11) 1	12) 3	13) 4	14) 4	15) 2
16) 3	17) 2	18) 1	19) 3	20) 3
21) 3	22) 4	23) 2	24) 1	25) 4
26) 3	27) 3	28) 3	29) 1	30) 4
31) 2	32) 2	33) 4	34) 1	35) 3
36) 1	37) 2	38) 2	39) 4	40) 1

What is the total distance between..

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q.No.1-5): Study the following information carefully and answer the questions given below.

Certain number of people was seated in a linear row facing north. One of them was seated at the end. Information about some of them is known. There were not more than 13 people. At least six people were seated between P and U where P was to the right of U. V was to the immediate right of S. T was seated second from the right end of the row. The number of people to the left of Q was more than twice the number of people to the right of Q. Only one person was seated between R and S. There were not more than 5 people sitting between R and Q. R was not seated adjacent to U. No three people mentioned were sitting together.

1. How many people were seated in the row?
   a) 8 b) 12 c) 10 d) 11
   e) Cannot be determined
2. Who was seated second to the left of R?
   a) P b) Q c) U
   d) No body e) Data insufficient
3. How many people were seated between Q and S?
   a) 3 b) 5 c) 7 d) 8
   e) Cannot be determined
4. What is the position of T with respect to U?
   a) Second to the right
   b) Tenth to the right
   c) Fourth to the left
   d) Immediate right
   e) Immediate left
5. How many people were seated to the left of S?
   a) 6 b) 4 c) 9
   d) 3 e) 7

Directions (Q.No.6-10): Study the following information carefully and answer the questions given below.

Eight persons A, B, C, D, E, F, G and H went to a conclave. It was seen that each person was of a different age. The partial sequence of their ages is as follows:

___ > ___ > F > ___ > ___ > ___ > __
(39) (27)
(23) D > ___

They were seated in a straight row facing the North. The partial arrangement is shown below:

___ B ___ ___ ___ ___ ___ G
(25) (36)

The numbers shown in the brackets denote age.

» The person aged 31 was seated 3rd to the left of the one who was aged 27.
» B was aged more than G.
» The person who was 39 years old was seated 2nd to the left of F
» E was the 2nd eldest person and was seated to the immediate right of C.
» The person aged 23 was to the immediate right of the one who was aged 22
» A was seated 3rd to the left of the one who was 19 years old
» D was not the eldest.

6. What was the age of the person who was at the extreme left end of the row?
   a) 31 b) 19 c) 22
   d) 39 e) Cannot be determined
7. What was the difference between the age of A and C?
   a) 1 year b) 2 years
   c) 3 years d) 4 years
   e) 9 years
8. Who among the following was seated to the immediate left of D?
   a) A b) E c) F
   d) B e) H
9. Who among the following was the 3rd youngest person?
   a) D b) B c) C
   d) A e) F
10. If all the digits at odd positions in the number "324846237" are changed to previous digit in the number series and all the digits at even positions are changed to next digit in the number series, then which digit appears more than twice in the number thus formed?
    a) More than one such digit is there
    b) 7 c) 2 d) 3
    e) No such digit is there

Directions (Q.No.11-15): Study the information carefully and answer the questions given below.

Six people were born in different years with the current base is taken as 2018. None of them is older than 90 years old. They like different colours Red, Orange, Green, Blue, Black and Yellow.

A was born in the year 1981. The difference of age between A and C is 23 years. B's age is sum of the digits of the year in which C was born. The one who likes Blue colour is 6 years elder to B. The one who likes green colour is just younger than F. F's age is either the last two digits or reverse of the last two digits of the year in which the person who likes Blue colour was born. The difference between the age of D and the one who likes Green colour is 25 years. D is older than E. F is not the eldest. The one who likes Red colour is just elder than the one who likes Black colour. C does not like Orange colour.

Note - If mentioned the last two digits or reverse of the last two digits of the year in which a person is born can be the age of some other person. (Like A is born in 1943 and age of b is denoted by the last two digits of the birth year of A. Then B's age will be either 34 or 43).

11. Who among the following likes Orange colour?
    a) A b) D c) E
    d) B e) None of these
12. Who among the following is the eldest?
    a) A b) D c) C
    d) E e) None of these
13. Which of the following combination is true?
    a) A - 1981 - Black
    b) B - 2012 - Blue
    c) C - 2006 - Yellow
    d) F - 1958 - Black
    e) None of these
14. Which of the following statement is correct?
    a) A is three years younger than the one who likes Black
    b) C is the eldest
    c) E likes Blue colour
    d) E is born before A
    e) All are correct
15. In which of the following year F was born?
    a) 1995 b) 1958
    c) 1956 d) 2004
    e) None of these

Directions (Q.No.16-20): Study the following information carefully and answer the questions given below.

Eight persons P, Q, R, S, T, U, V, W are sitting around a rectangular table but not necessarily in the same order. Those who are sitting next to each have different distance from each other. Each of them facing towards the center. Some of them are sitting at the corners while some are sitting on the side of the table. The area of the rectangular table is 540m². The length of the table is 7m more than the breadth of the table. R sits at one of the corners of the table. T sits second to the left of R. P is sitting at a distance of 14m from T. Only two persons sit between P and Q. The distance between R and U is twice of the distance between R and V. W faces R. P sits immediate right of W and at a distance of 13m, Neither Q nor S is an immediate neighbour of R. The distance between R and U is 2m more than the distance between P and T. U is not an immediate neighbour of T. The distance between Q and W is equal to the distance between R and U. The distance between Q and S is half of the distance between V and T. T does not sit at the corner of the table.


16. What is the total distance between V and W?
    a) 40 m b) 15 m c) 24 m
    d) 39 m e) 49 m
17. Who among the following sits second to the left of Q?
    a) T b) W c) V
    d) P e) R
18. Which of the following is not true regarding U?
    a) U sits second to the left of S
    b) The distance between U and V is 24 m
    c) W sits third to the right of U
    d) P is an immediate neighbour of U
    e) All are correct
19. How many persons sits between T and U when counted from the left of U?
    a) Three b) One c) No one
    d) Four e) Two
20. What is the position of P with respect to S?
    a) Third from the right
    b) Second from the left
    c) Second from the right
    d) Fourth from the left
    e) None of these

Directions (Q.No.21-23): Study the following data carefully and answer the following given questions.

In a family, there are ten members A, B, J, K, L, N, P, Q, R and T. J is married to K. R is daughter of P. T is wife of N. A is paternal aunt of B. K is paternal aunt of R. Q is niece of A. N is son of J. T has two daughter. L is mother of R. Q and B are granddaughter of J. Each child has either both their parents alive or none alive.


21. How many female members are there in the family?
    a) 5 b) 6 c) 7 d) 3 e) 4
22. Which of the following is true?
    a) J is brother of R
    b) T is sister of R
    c) Q is mother of R
    d) A is sister of L
    e) R is niece of K
23. How many generations and couples are there in the family?
    a) 2, 3 b) 3,3 c) 3,2
    d) 1, 3 e) 2, 1

Directions (Q.No. 24- 25): Study the following example based on corresponding conditions:



i) If the box contains number
   a) And the number is even then multiply the number by 1.5
   b) And the number is odd then multiply the number by 3
ii) If the box contains letter/s then
   a) Replace vowel by its 2nd next letter as per English alphabets
   b. Replace consonant by its 2nd pervious letter as per English alphabets

Apply the conditions to the given input and answer the following questions.



24. 32 will be replaced by ?
    a) 64 b) 96 c) 16
    d) 48 e) 23
25. U and S will be replace by ____ respectively
    a) W and U b) S and U
    c) W and Q d) S and Q
    e) None of these

KEY

1) b	2) c	3) a	4) b	5) b
6) d	7) d	8) c	9) d	10) d
11) d	12) b	13) d	14) c	15) b
16) d	17) e	18) d	19) e	20) c
21) c	22) e	23) b	24) d	25) c